

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 359

శుక్రవారం 21-3-2025


SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ఒక్క టైటిల్ కోసం...



ఐపీఎల్‌లో టైటిల్ సాధించేందుకు ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ జట్లు సుదీర్ఘ పోరాటం చేస్తున్నాయి. ప్రతీ ఏటా ప్రతికూల ఫలితాలతో సతమతమవుతున్నాయి. ఐపీఎల్ మొదలైనప్పుడు ఉన్న ఎనిమిది జట్లలో ఐదు టీమ్‌లు ఎప్పుడో విజేతగా నిలిచాయి... బెంగళూరు ఒక్కసారి కూడా గెలవకపోయినా ఆ జట్టు మూడుసార్లు ఫైనల్‌కు వెళ్లింది. పైగా విరాట్ కోహ్లిలాంటి దిగ్గజం కారణంగా ఫలితాలతో సంబంధం లేకుండా ఆకర్షణ కోల్పోని జట్టుగా సాగుతోంది... కానీ ఢిల్లీ, పంజాబ్ జట్లు మాత్రం ప్రతీ సీజన్‌లో ఎన్నో ఆశలతో బరిలోకి దిగడం, సగం టోర్నీ ముగిసేవరకే పేలవ ప్రదర్శనతో చేతులెత్తేయడం దాదాపుగా రివాజుగా మారిపోయింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ఫలితం దక్కడం లేదు.

–స్పోర్ట్స్‌లో



ఒకకళ... కలకాలం మనుగడలో ఉండాలన్నా కళ కళకళలాడాలన్నా రాజపోషణ కావాలి. రాజ్యాలనేలే మహారాజులు లేని ఈ రోజులలో మనసున్న మహారాజులే కళను బతికించాలి.







అర్రోజు ధనలక్ష్మి

● ఫిలిగ్రీ కళ

ఇల్లే యూనివర్సిటీ

ఆభరణాలు, లోహపు వస్తువుల తయారీ వృత్తి సాధారణంగా మగ వారికే పరిమితం. ఇటీవల చాలామంది మహిళలు 'ఫలానా వృత్తిలో మహిళలు ఉండరు, అది మగవారి సామ్రాజ్యం' అనే 'హద్దు'లను చెరిపేస్తూ తాము ఎంచుకున్న రంగంలో రాణిస్తున్నారు. అవార్డులతో గౌరవాలు పొందుతున్నారు. ఫిలిగ్రీ కళలో జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు అర్రోజు ధనలక్ష్మి. మహిళా దినోత్సవం సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో స్వదేశ్ చేతివృత్తుల సంగమ పురస్కారం కూడా ఆమెను వరించింది. ఈ సందర్భంగా ధనలక్ష్మి అనేక ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు.

■ **భర్త నేర్పించాడు!**

ధనలక్ష్మి సొంతూరు కరీంనగర్ జిల్లా నర్సింగాపురం. తండ్రి తపాలా శాఖ ఉద్యోగి. టెన్త్ క్లాస్ తర్వాత చదువు మాన్పించి పెళ్లి చేశారు. పద్దెనిమిదేళ్ల వయసులో అత్తగారింట్లో అడుగుపెట్టిన ధనలక్ష్మికి తన భర్త, మామగారు చేస్తున్న కళాత్మకమైన పని మీద ఆసక్తి కలిగింది. ఆమె ఆసక్తిని గమనించి పని నేర్పించారు. ఆమెకి పని త్వరగానే పట్టుపడింది. మూడేళ్ల సాధన తర్వాత ఎవరి సహాయమూ లేకుండా సొంతంగా ఒక కుంకుమ భరిణె చేయగలిగారు ధనలక్ష్మి. ఆ తర్వాత రకరకాల కళాకృతుల తయారీ నేర్చుకున్నారు. ఫిలిగ్రీ కళకు గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో వినూత్నంగా ఒక థీమ్‌తో ఏదైనా చేయాలనుకున్నారు. రెండు తబలాలు, డోలు, సన్నాయి, పన్నీరు బుడ్డీ, అత్తర్ దాన్, కుంకుమ భరిణె, పసుపు పాత్ర, అక్షింతల గిన్నె ఇవన్నీ పెట్టడానికి ఒక పళ్లెం... ఇలా మ్యారేజ్ సెట్ తయారు చేశారామె. ఒకటిన్నర కేజీల వెండితో రెండు నెలలు శ్రమ పడితే ఇవన్నీ తయారయ్యాయి. ఆమె పనితనం నచ్చిన రాష్ట్ర హ్యాండీక్రాఫ్ట్స్ శాఖ జాతీయ స్థాయి అవార్డు ఎంపిక కోసం పంపింది. అంతకు ముందే 2008లో రాష్ట్రస్థాయి పురస్కారం, 2010లో జాతీయ పురస్కారం అందుకున్నారు.

జీఐ ట్యాగ్ వచ్చింది

మెసపటోమియా నాగరకత కాలంలో విలసిల్లిన కళ. క్రీ.పూ మూడవ శతాబ్దం నుంచి మనదేశంలోనూ విరాజిల్లింది. తెలుగు రాష్ట్రాల్లో కరీంనగర్ ఈ కళకు కేంద్రం. కరీంనగర్ పట్టణంతోపాటు పరిసర గ్రామాలలో ఈ కళతో జీవిస్తున్న కుటుంబాలు అనేకం ఉన్నాయి. ఆధునికత వెల్లువలో ఈ కళ కొంతకాలం కళ తప్పింది కానీ ఇప్పుడు సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా పుంజుకుంటోంది. సిల్వర్ ఫిలిగ్రీ క్రాఫ్ట్ క్లస్టర్‌కు 2007లో జీఐ (జియోగ్రాఫికల్ ఇండికేషన్) ట్యాగ్ వచ్చింది.

■ **మార్కెట్ బాగుంది!**

''హస్త కళలకు ఆదరణ లేని రోజుల్లో మా వృత్తి పెద్దగా ఉపాధినివ్వలేదు. చాలా మంది చదువుకుని ఉద్యోగాలకు వెళ్లారు. అలాంటి పరిస్థితిలో కూడా మా కుటుంబం ఈ కళను వదల్లేదు. ఇప్పుడు హస్తకళలకు మార్కెట్ బాగుంది. మెమెంటోలుగా పీకాక్ బొమ్మలు, గణేశ్, మ్యారేజ్ సెట్, పర్సులను ఎక్కువగా అడుగుతున్నారు. కొంతమంది తమ ఫొటో ఇచ్చి ఆ రూపాన్ని ఫిలిగ్రీ వర్క్‌లో చేయమని అడుగుతారు. సుమారు 200 గ్రాముల్లో తయారవుతుంది. మేకింగ్ చార్జ్ గ్రాముకు యాభై రూపాయలు తీసుకుంటాం.

■ **ప్రధాని ప్రశంస!**

జీ 20 సదస్సు తర్వాత మా విశ్వకర్మకారుల సమస్యలను తెలియచేయడానికి ప్రధాని మోదీని కలిశాం. అప్పుడు ఆయన మా కళాఖండాలను చూశారు. అనేక విషయాలను అడిగి తెలుసుకున్నారు. కళాత్మకమైన వృత్తి ఇది. ఒక్కొక్క కుటుంబం ఒక్కో యూనివర్సిటీతో సమానం. కాలేజీల్లో ఈ కోర్సులు పెట్టినా సరే, ఆ స్టూడెంట్స్ ప్రాక్టికల్స్ కోసం మా దగ్గరకు రావాల్సిందే. అందుకే మా పిల్లలిద్దరూ బీటెక్ చేసినా సరే వారికి కూడా ఫిలిగ్రీ వర్క్ నేర్పించాం. నాకు, మా వారికి ఈ కళలో నైపుణ్యం మాత్రమే తెలుసు. ఈ కళను విదేశాలకు విస్తరింపచేయడంలో మా పిల్లల చదువు ఉపయోగపడుతుంది. మా పిల్లలే కాదు వారి పిల్లలు కూడా ఇదే కళతో గుర్తింపు పొందాలని నా ఆకాంక్ష'' అన్నారు అర్రోజు ధనలక్ష్మి.

భద్రమైన కళ

ఫిలిగ్రీ... గొప్ప పనితనంతో కూడిన ఆభరణాల తయారీ నైపుణ్యం. ఫిలిగ్రీ డిజైన్‌లలో బంగారు, వెండి ఆభరణాలను తయారు చేస్తారు. వెండిలో ఆభరణాలతోపాటు కీ చైన్‌లు, ఆభరణాలు భద్రపరుచుకునే బాక్సులు, గిఫ్ట్ బాక్సులు, అలంకరణ వస్తువులు, కుంకుమ భరిణెలు, అత్తర్‌దాన్, పాన్‌దాన్, ట్రేలు, పూజ సామగ్రి, ఫ్లవర్ వేజ్‌లు, పాత్రలు, వాల్ ఫ్రేమ్‌లు, టేబుల్ టాప్ షో పీస్‌లు, జంతువులు, పక్షుల బొమ్మలు, దేవుని ప్రతిమలు చేస్తారు.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

న్యూస్ మేకర్

ఆమె వయసు 60... ఊరు కేరళ. టైలరింగ్‌తో పొట్టపోసుకునే సగటు స్త్రీ. కాని ఎవరెస్ట్ బేస్‌క్యాంప్‌కు ఎలాగైనా చేరాలని పట్టుదల. ట్రైనింగ్ లేదు... బృందాలతో కలవడం లేదు. కేవలం యూట్యూబ్‌ను గురువుగా పెట్టుకుంది. అడుగులో అడుగు వేస్తూ వయసును లెక్కచేయక గమ్యం చేరుకుంది. చిన్న మనుషులూ పెద్ద కలలు కనొచ్చు. వసంతి చెరువీట్టిల్ స్ఫూర్తి గాథ.




ఎవరెస్ట్‌ను 'కుట్టు'ముట్టింది

'అది ఆనందమో దుఃఖమో తెలియదు. త్రివర్ణ పతాకాన్ని చేత బట్టి, కేరళ సంప్రదాయ చీరలో నేను నిలుచుంటే రివ్వుమనే చల్లగాలిలో అందరూ చప్పట్లు కొడుతుంటే కళ్లలో నీళ్లు ఉబికి వచ్చాయి' అంటుంది వసంతి చెరువీట్టిల్.

సమున్నతంగా శ్వేత కిరీటాలతో నిలుచుని ఉండే హిమాలయాలను పలకరించడానికి కేరళలోని కన్నూరు నుంచి ఈమె బయలుదేరినప్పుడు తోడు ఎవరూ లేరు తనకు తాను తప్ప. భర్త చనిపోయాక ఇద్దరు కుమారులను పెంచి పెద్ద చేసి వారి జీవితానికి దారి చూపించాక ఈ ప్రపంచాన్ని చూడాలని చిన్న ఆశ కలిగింది వసంతికి. చేసే పని టైలరింగ్. ఆదాయం కొద్దిగా. కాని అందులోనే దాచి ఎంత వీలైతే అంత తిరిగి చూడాలనుకుంది. తన చుట్టూ ఉన్నది తనలాంటి వారే కాబట్టి 'అమ్మో అంత ఖర్చా? మేము నీతో రాము' అన్నారు. 'వెళితే నువ్వొక్కదానివే వెళ్లు' అన్నారు. 'వెళ్లలేనా?' అనుకుంది వసంతి. సాధారణంగా ఇలాంటి సమయంలో ఎవరో ఒకరు బ్రేక్ వేస్తారు. కాని వసంతి ఇద్దరు కొడుకులూ వెళ్లిరామ్మా అన్నారు. అలా ఆమె మొదట థాయ్‌ల్యాండ్ తిరిగి వచ్చింది ఒక్కత్తే. ఆ తర్వాత హిమాలయాలు కనీసం బేస్ క్యాంప్ అయినా చూడాలనుకుంది.



బేస్ క్యాంప్ వద్ద జాతీయ పతాకంతో వసంతి



ఎవరెస్ట్‌పై వసంతి చెరువీట్టిల్

● **యూట్యూబే ట్రెయినర్‌గా...**

ఎవరెస్ట్ అధిరోహించడంలో రెండు దశలు. ఒకటి బేస్ క్యాంప్‌కు చేరుకోవడం. రెండు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం. ఎవరెస్ట్ శిఖరం పై చేరడం చాలా కష్టం కాబట్టి కనీసం బేస్ క్యాంప్ అయినా చేరాలనుకుంటారు. అయితే సముద్ర మట్టానికి 5364 మీటర్ల ఎత్తున ఉన్న బేస్‌క్యాంప్ వరకూ వెళ్లడం కూడా సామాన్యమైన విషయం కాదు. 7 నుంచి 9 రోజులు పడుతుంది. ఇందుకు ప్రత్యేక శిక్షణ తీసుకోవాలి. వ్యాయామం చేయాలి. బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు ట్రెకింగ్ బూట్లతో నడవగలగడం ఇవన్నీ సాధన చేయాలి. ఆర్థిక వనరులు తక్కువగా ఉన్న వసంతి కేవలం యూట్యూబ్‌లో చూసి ఇవన్నీ నేర్చుకుంది. రోజూ వ్యాయామం చేసింది. నాలుగు గంటల పాటు వాకింగ్ చేసింది. ట్రెకింగ్ షూస్ వేసుకుని నడిచింది. హిమాలయాల్లో కమ్యూనికేషన్ ఇబ్బంది రాకుండా కాస్తో కూస్తో హిందీ కూడా నేర్చుకుంది. ఆ తర్వాత అందరికీ చెప్తే విస్తుపోయారు. చివరకు అభినందనలు తెలిపి సాగనంపారు.

● **ప్రతికూలతలు**

నేపాల్‌లోని లుల్కా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని అక్కడి నుంచి దశల వారీగా బేస్‌క్యాంప్ వెళ్లాలనుకుంది వసంతి. అయితే వాతావరణం సరిగా లేకపోవడం వల్ల ఆమె ఎక్కాల్సిన లుల్కా విమానం ఎగరలేదు. దాంతో చిక్కుబడిపోయింది. అప్పుడు ఒక జర్మన్ జంట లుల్కా నుంచి కాకుండా సుర్కె నుంచి వెళదామని సాయం చేశారు. ఫిబ్రవరి 15న సుర్కె నుంచి ఆమె ట్రెకింగ్ మొదలైంది. ఏమాత్రం అనువుగా లేని కాలిబాట దారుల్లో ఆమె ప్రతి ఐదు నిమిషాలకు దీర్ఘశ్వాస తీసుకుంటూ రోజుకు 7 గంటలు నడిచి విశ్రాంతి తీసుకుంటూ మొత్తం 9 రోజులు నడిచి చివరకు బేస్ క్యాంప్‌కు చేరుకోగలిగింది.

● **నా సంప్రదాయం నా గౌరవం**

వసంతి తనతో పాటు కేరళ సంప్రదాయ చీర తెచ్చుకుంది. ఎవరెస్ట్ బేస్ క్యాంప్ దగ్గర చేరాక దానిని కట్టుకుని ఫొటో దిగింది. తన సంప్రదాయ ఘనత చాటింది. వసంతిని ఇప్పుడు కేరళ మాత్రమే కాదు నెరవేరని ఆకాంక్షలు గల స్త్రీలందరూ అబ్బురంగా చూస్తున్నారు.





సేకరించిన దేశీ విత్తనాలు, తయారు చేసిన వరికుచ్చులతో డీఆర్డీఓ, మహిళా సంఘాల సభ్యులు

దేశీ విత్తనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, డీఆర్డీఓ విజయలక్ష్మి మహిళా సంఘాల సభ్యులు

విష రహిత విత్తనం కోసం...

బిడ్డ ఎదుగుదలకు తోడ్పడే పోషకాలన్నీ కలిపి అమ్మ చేతి గోరుముద్ద రూపంలో బుజ్జాయి బొజ్జలోకి వెళ్తాయి. అలాంటి అమ్మ చేతి ముద్దలో ఉండే ఆహారం రసాయనాలతో నిండితే.. భవిష్యత్తు తరం ఏమవుతుందోనన్న ఆలోచనే ఓ వినూత్న కార్యక్రమానికి పురుడు పోసింది. ఒకప్పటి విష రహిత దేశీ విత్తనాలను కాపాడుకుంటూ ముందు తరాలకు అందించాలన్న లక్ష్యంతో నిర్మల్ జిల్లాలో డీఆర్డీఓ విజయలక్ష్మి తమ కలెక్టర్ అభిలాష అభినవ్ సహకారంతో సరికొత్త కార్యక్రమాన్ని రూపొందించారు. గురువారం నిర్మల్ కలెక్టరేట్‌లో మహిళా అధికారులు, మహిళా రైతులు, మహిళా సంఘాల సభ్యులు అందరూ కలిసి కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు.

దేశీ విత్తనాలు కాపాడుకోవాలని...

ప్రస్తుత పరిస్థితులలో ఆర్గానిక్ ఆహారం పైన చాలామంది ఆసక్తి చూపిస్తున్నారు. కానీ అధిక ధరలు ఉండటంతో పాటు తక్కువ మొత్తంలో లభ్యమవుతుండటం ఇబ్బందిగా మారుతోంది. ఈ క్రమంలో మహిళా రైతులను ప్రోత్సహించడంతోపాటు మనవైన దేశీ విత్తనాలను ముందు తరాలకు అందించాలన్న ఉద్దేశంతో కలెక్టర్ అభిలాష అభినవ్‌గారి సహకారంతో ఈ కార్యక్రమాలను చేపడుతున్నాం.

– విజయలక్ష్మి, డీఆర్డీఓ, నిర్మల్

వాక్ ఫర్ దేశీ సీడ్...

'మన విత్తనం – మన భవిష్యత్తు' అన్న ట్యాగ్ లైన్‌తో 'వాక్ ఫర్ దేశీ సీడ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. పురాతన దేశీ విత్తనాలను సేకరించి, వాటిని భవిష్యత్ తరాలకు అందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం జిల్లా అధికారులు పశ్చిమ బెంగాల్, ఒడిశా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలలో ఇప్పటికీ సాగులో ఉన్న దేశీ విత్తనాలను సేకరించారు. వరి, పప్పు దినుసులతో పాటు కూరగాయలలోనూ అందుబాటులో ఉన్న దేశీ సీడ్ రకాలను తెప్పించారు. బహురూపి వంటి అరుదైన రకాలను సేకరించారు. జిల్లాలో ఆరువేల మంది సభ్యులుగా ఉన్న 'మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ'లో ఆధ్వర్యంలో వీటిని సాగు చేయించడం మరో ప్రత్యేకత. ముందుగా 20 ఎకరాలలో 200 మంది మహిళ రైతులతో దేశీ విత్తనాలతో సాగు చేయించాలని నిర్ణయించారు. ఇలా సాగుచేసిన పంటలను సైతం తిరిగి మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ కొనుగోలు చేస్తాయి. పెరటి తోటల పెంపకంపై ఆసక్తి గల వారికి సైతం దేశీ విత్తనాలు అందిస్తామని చెబుతున్నారు.

మిట్టి దీదీ...

ఎంతటి విత్తనమైనా మట్టి బాగుంటేనే బతికి బట్ట కడుతుంది. అందుకే ఈ మహిళా అధికారులు కేవలం దేశీ విత్తనాలనే కాకుండా.. మట్టిని సైతం పరీక్షించిన తర్వాతే సాగు చేయాలన్న మరో లక్ష్యాన్ని ముందుకు తీసుకొచ్చారు.

'భూసార పరీక్ష – నేలతల్లికి రక్ష' ట్యాగ్ లైన్ తో 'మిట్టి దీదీ' కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఇందులో ఏఐ టెక్నాలజీ కలిగిన ఫార్మోసిస్ యంత్రంతో భూసార పరీక్షలను చేసి అప్పటికప్పుడే అక్కడ ఎలాంటి పంటలు పండిస్తే బాగుంటాయో చెప్పేస్తారు. ఇలా భూసార పరీక్షలు చేయడం కూడా మహిళ రైతు ఉత్పత్తిదారుల సంఘాలే చేయనుండటం విశేషం.

– రాసం శ్రీధర్, సాక్షి, నిర్మల్

ఫ్యాషన్

పెళ్లిళ్ల సీజన్‌కు ముందు బుక్ మార్క్ చేసుకోదగిన అతిపెద్ద ఫ్యాషన్ ట్రెండ్స్ ఈ ఏడాది మనల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయం, ఆధునిక ధోరణులను కలబోసి మన ముందుకు తీసుకువచ్చాయి. వధువుల కోర్సెట్ చోళీలు, భారతీయ సంప్రదాయ నేత చీరలు, పలుచటి మేలి ముసుగులు, ఆకర్షణీయమైన ఎంబ్రాయిడరీ ప్రత్యేకంగా కనిపించాయి. పెళ్లిళ్లకు ముందే బుక్ మార్క్ చేసుకోదగిన పెళ్లికూతురు ట్రెండ్స్‌లో ప్రధానంగా కనిపించిన జాబితాను చెక్ చేద్దాం..

సుమనోహరం వెడ్డింగ్ ట్రెండ్స్

భారతీయ చేనేత

క్లాసిక్ ఇండియన్ చేనేత పునరుజ్జీవనాన్ని మనం గమనించి తీరాలి. వివాహ వేడుకలకు కాంజీవరం, బనారసి, చికంకారి వంటి చీరలకు మంచి డిమాండ్ ఉంది. ఈ కాలాతీత డిజైన్లు సంప్రదాయ రూపంలో ధరించినా లేదా ఆధునిక ట్విస్ట్‌తో మెరిపించినా, ఇవి మసకబారే సూచనలు కనిపించడం లేదన్నది నిజం.

కోర్సెట్ చోళీలు

కోర్సెట్‌లు ఫ్యాషన్ రంగాన్ని ఆక్రమించాయి అని చెప్పవచ్చు. వీటిని సంప్రదాయ వివాహ వేడుకలకు తీసుకురావడం ఎలా అనే అంశంపై పెద్ద కసరత్తే జరిగింది. అందుకు పెళ్లికూతుళ్లు కూడా తమ వివాహ సమయంలో ఆధునికంగా కనిపించడానికి కోర్సెట్ చోళీలను ఎంచుకుంటున్నారు. దాంతో దిగ్గజ డిజైనర్లు తమ డిజైన్స్‌కు ఆధునికతను జోడిస్తున్నారు. సాంప్రదాయ పెళ్లి బ్లౌజ్‌లకు ఇవి ఆకర్షణీయమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తున్నాయి. ఫిష్‌టైల్ లెహంగాతో కోర్సెట్ చోళీలు జతగా చేరి అద్భుతంగా కనిపిస్తున్నాయి. సంగీత్ నుంచి రిసెప్షన్ వరకు కోర్సెట్‌లు అంతటా రాజ్యమేలుతున్నాయి.








↑ **లాంగ్ వెయిల్స్**

పాశ్చాత్య వివాహాల నుంచి వీటిని స్ఫూర్తి పొందినట్లు అనిపిస్తుంది. కానీ ప్రస్తుతం వధువులలో ట్రైల్ లేదా వెయిల్ ఉన్న లెహంగాలను ధరించే ధోరణి పెరుగుతోంది. గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలనుకునే వధువులకు ఈ లుక్ ఒక గొప్ప ఎంపిక. లాంగ్ ట్రైల్స్ లేదా వెయిల్స్ ఉన్న లెహంగాలు ప్రిన్సెస్ లుక్‌తో అందంగా కనిపిస్తాయి.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 359
శుక్రవారం 21-3-2025
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'


చిన్న బ్రాండ్స్‌కు యువత జై
ఎలక్ట్రానిక్స్‌లో నయా ట్రెండ్.. రెండంకెల్లో వర్ధమాన బ్రాండ్స్ వృద్ధి
-11లో


తొలి మహిళా అధ్యక్షురాలు
ఐఓసీ పీఠంపై జింబాబ్వే మాజీ స్విమ్మర్ కిర్‌స్టీ కొవెంట్రీ
-11లో


భారత్‌పై 'ఎక్స్' పిటిషన్
సెన్సార్‌షిప్ పేరుతో భారత్ ఏకపక్షంగా వ్యవహరిస్తోందంటూ ఎలాన్‌మస్క్‌కు చెందిన 'ఎక్స్' కర్ణాటక హైకోర్టులో పిటిషన్ వేసింది.
- వివరాలు 6లో▶


మళ్లీ విరుచుకుపడ్డ ఇజ్రాయెల్
ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా 110 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు.
- వివరాలు 6లో▶


ఫిన్లాండ్ వెరీ వెరీ హ్యాపీ
ప్రపంచ ఆనందమయ దేశాల నివేదికలో ఫిన్లాండ్ అత్యంత సంతోషకర దేశంగా ఎనిమిదోసారి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.
- వివరాలు 6లో▶


మరో భారత్ విద్యార్థి అరెస్టు
హమాస్‌కు మద్దతిస్తున్నారంటూ భారతీయ పరిశోధక విద్యార్థి బదర్‌ఖాన్‌ను అమెరికా ఇమిగ్రేషన్ అధికారులు అరెస్టు చేశారు.
- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

డాక్టర్ నుంచి డేటా సైన్స్ వైపు..


'..గేట్‌లో విజయం సులభమే' అంటున్నారు గేట్-2025లో డేటా సైన్స్ ఏఐ పేపర్‌లో 96.33 మార్కులతో.. జాతీయ స్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించిన.. ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన సాదినేని నిఖిల్ చౌదరి.
- వివరాలు 2లో▶

నేటి నుంచి టెన్త్ పరీక్షలు



రాష్ట్రవ్యాప్తంగా పదోతరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. 5,09,403 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, 2,650 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈసారి ప్రత్యేకంగా ప్రశ్నపత్రంలో క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెడుతున్నారు.
- వివరాలు 2లో▶

న్యాక్‌కు దరఖాస్తు చేస్తే రూ. లక్ష



న్యాక్ గుర్తింపు కోసం దరఖాస్తు చేసేలా విద్యాసంస్థలను ప్రోత్సహించాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. అందుకు ముందుకొచ్చే కాలేజీలు, వర్సిటీలకు రూ.లక్ష పారితోషికం ఇస్తామని ప్రకటించింది.
- వివరాలు 2లో▶

రూ.119 కోట్లు పలికిన 'హుస్సేన్' పెయింటింగ్


14 అడుగుల కాన్వాస్‌పై 13 గ్రామీణ దృశ్యాలను వర్ణిస్తూ 'అన్‌టైటిల్డ్ (గ్రామ్ యాత్ర)' పేరిట ఎంఎఫ్ హుస్సేన్ గీసిన చిత్రం రికార్డు నెలకొల్పింది. న్యూయార్క్‌లో వేసిన వేలంలో దాదాపు రూ.119.15 కోట్లకు అమ్ముడైంది.
- వివరాలు 6లో▶

ఇదండీ వరస



మనకు శాంతి అంటేనే నమ్మకద్రోహం!


ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ నెత్తుటిధార

గంగలూరు ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను తరలిస్తున్న పోలీస్ బలగాలు

బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో వేర్వేరు ఎన్‌కౌంటర్లు
కనీసం 30 మంది మావోయిస్టుల మృతి
మావోల కాల్పుల్లో ఒక జవాను వీరమరణం

- ఘటనా స్థలాల్లో భారీగా ఆయుధాల స్వాధీనం
- మావోయిస్టుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యులు, డివిజన్ కమిటీ మెంబర్లు ఉన్నట్లు అనుమానం
- పశ్చిమ, ఉత్తర బస్తర్ డివిజన్ కమిటీలే లక్ష్యంగా దాడులు
- భద్రతా సిబ్బంది గొప్ప విజయం సాధించారంటూ అమిత్ షా హర్షం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/బీజాపూర్/కాంకేర్/న్యూఢిల్లీ: మావోయిస్టులకు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. వారికి కంచుకోట అయిన ఛత్తీస్‌గఢ్ మరోసారి రక్తమోడింది. బస్తర్ అడవుల్లో నెల రోజులుగా నిశ్శబ్ద వాతావరణం ఉండగా గురువారం ఒక్కసారిగా తుపాకులు గర్జించాయి. బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో కనీసం 30 మంది మావోయిస్టులు మరణించారు. దంతెవాడ, సుక్మా జిల్లాల సరిహద్దులోని బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పశ్చిమ బస్తర్ డివిజన్‌కు చెందిన మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో డీఆర్‌జీ, టాస్క్‌ఫోర్స్, సీఆర్‌పీఎఫ్‌కు చెందిన సుమారు 700 మంది భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఉదయం 7 గంటల సమయంలో మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. కాల్పుల అనంతరం ఘటనాస్థలిలో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టగా మధ్యాహ్నం సమయానికి 18 మంది మావోయిస్టుల మృతదేహాలు లభించగా, సాయంత్రం 6 గంటల సమయానికి ఈ సంఖ్య 26కు చేరింది. ఘటనా స్థలం నుంచి భారీ ఎత్తున ఏకే 47, ఆటోమేటిక్, సెమీ ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ ప్రకటించారు. మావోయిస్టుల కాల్పుల్లో ఒక జవాను వీరమరణం పొందినట్లు వెల్లడించారు. మావోల మృతదేహాలను జిల్లా కేంద్రమైన బీజాపూర్‌కు తరలించారు.

కాంకేర్-నారాయణపూర్ మధ్య..
మరో ఘటనలో కాంకేర్-నారాయణపూర్ జిల్లాల సరిహద్దులో ఉత్తర బస్తర్-మాడ్ డివిజన్ కమిటీ
మిగతా 8వ పేజీలో ▶

అదను చూపి... పదును పెట్టి
ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భద్రతా దళాల నిఘా.. మరోసారి భద్రతా దళాల కన్నుగప్పిన హిడ్మా
8 లో

మృతుల్లో అగ్రనేతలు?
బీజాపూర్, కాంకేర్ ఎన్‌కౌంటర్లలో కేంద్ర కమిటీ సభ్యులతోపాటు డివిజన్ కమిటీ మెంబర్లు మరణించి ఉండొచ్చని పోలీసు వర్గాలు అంచనా వేస్తున్నాయి. బడా నేతలతోపాటు ఈ రెండు కమిటీలకు రక్షణ కల్పించే పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ-2, పీఎల్‌జీ-5)కి చెందిన ప్లాటూన్ దళ సభ్యులు కూడా మృతుల్లో ఎక్కువ మంది ఉండే అవకాశముందని తెలుస్తోంది.

కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి సీతక్క, హైదరాబాద్ నగర మేయర్ విజయలక్ష్మి, సీఎస్ శాంతికుమారి తదితరులు


పేరు గొప్పగుంది.. అప్పు పుట్టకుంది

ప్రజాపాలన- కొలువుల పండుగ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

- ఎక్కడా అప్పు పుడత లేదు.. ఎవ్వడు మనల్ని నమ్మడం లేదు
- ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇచ్చేందుకు కూడా డబ్బుల్లేవు
- ఎన్నిరోజులు దాచిపెట్టుకోను.. ఉన్నదున్నట్లు చెపుతున్న..
- క్యాన్సర్ ఉంటే సిక్స్‌ప్యాక్ బాడీ అని చెప్పుకుంటే నమ్ముతరా?
- 922 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేత..

సాక్షి, హైదరాబాద్: 'గత పాలకులు రిటైర్డ్ ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాల కింద రూ.8 వేల కోట్లు బకాయిలు పెట్టి పోయారు. నెలకు కొంత మందికి అవసరానికి అనుగుణంగా సర్దుతున్నాం. మరోవైపు కొత్తగా నెలకు వెయ్యి మంది రిటైర్ అవుతున్నారు. వారికి బెనిఫిట్స్ ఇచ్చేందుకు కూడా డబ్బుల్లేవు. ఎక్కడా అప్పు పుడ్తలేదు.. ఎవ్వడు మనల్ని నమ్మడం లేదు. పేరు చూస్తే గొప్పగ ఉంది.. అప్పు పుట్టకొచ్చింది (పుట్టడం లేదు). ఎన్నిరోజులు దాచిపెట్టుకోను. క్యాన్సర్ ఉంటే
మిగతా 2వ పేజీలో ▶

బడే భాయ్.. చోటే భాయ్
ఇద్దరూ ఒక్కటే!

ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌పై ధ్వజమెత్తిన కేటీఆర్



- కాంగ్రెస్ వైఫల్యాలను బీజేపీ ప్రశ్నించదు
- ఢిల్లీకి మూటలు పంపే ధ్యాసలోనే రేవంత్
- సూర్యాపేటలో వరంగల్ బహిరంగ సభ సన్నాహక సమావేశం

సూర్యాపేట: కేంద్రంలో బడేభాయ్ మోదీ, రాష్ట్రంలో చోటే భాయ్ రేవంత్‌రెడ్డి ఇద్దరూ ఒక్కటేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను బీజేపీ ప్రశ్నించదని, రేవంత్ అవినీతిని ఆధారాలతో సహా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని మండిపడ్డారు. ఢిల్లీకి మూటలు పంపి పదవులు కాపాడుకునే ధ్యాస తప్ప సీఎం రేవంత్‌రెడ్డికి మరొకటి లేదని ధ్వజమెత్తారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ బహిరంగ సభ కోసం గురువారం సూర్యాపేటలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహించే వరంగల్ సభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రేవంత్‌కు పర్సంటేజీలపైనే దృష్టి
చిన్న వయసులో ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డికి పర్సనాలిటీ పెంచుకోవడం మీద కంటే పర్సంటేజీలు పెంచుకోవడం మీదనే ఎక్కువ ఆసక్తి ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ పాపమే రైతన్నకు శాపంలా మారిందన్నారు. రైతులకు రావాల్సిన రూ.37 వేల కోట్లు ఢిల్లీలో ఉన్న
మిగతా 3వ పేజీలో ▶



సెలబ్రిటీల చుట్టూ...
బెట్టింగ్ యాప్స్ ఉచ్చు

రానా, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండపై కేసు

- ప్రణీత, నిధి అగర్వాల్, మంచు లక్ష్మితోపాటు మరికొందరు యాంకర్లపై కూడా...
- 25 మందిపై మియాపూర్ ఠాణాలో నమోదు

సాక్షి, హైదరాబాద్/మియాపూర్: 'హ్యాష్ ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్'పేరుతో సీనియర్ ఐపీఎస్ అధికారి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేస్తున్న అవగాహన కార్యక్రమం ప్రకంపనలు పుట్టిస్తోంది. దీంతో స్ఫూర్తి పొందిన అనేక మంది సామాజిక కార్యకర్తలు బెట్టింగ్, గేమింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న సెలబ్రిటీలపై పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఉన్న పంజగుట్ట ఠాణాలో 11 మంది యాంకర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసు నమోదు కాగా... తాజాగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉన్న మియాపూర్ పోలీసుస్టేషన్‌లో 25 మందిపై రిజిస్టరైంది. ఇందులో సినీనటులు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్ తదితరులు నిందితులుగా ఉన్నారు. మియాపూర్‌కు చెందిన పీఎం ఫణీంద్ర శర్మ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు.

కాలక్రమంలో బానిసలుగా...: బెట్టింగ్, గేమింగ్, క్యాసినో యాప్స్‌కు వ్యతిరేకంగా ముమ్మర ప్రచారం జరుగుతున్న
మిగతా 3వ పేజీలో ▶

'దేవా'.. ఒక్క మోటారు!

ఒక్క మోటారుపై ఆధారపడి ఉన్న 50-65 వేల ఎకరాల్లోని పంటల భవితవ్యం

- దేవాదుల ఎత్తిపోతల కింద తీవ్ర నీటి కొరతతో పంటలు ఎండిపోయే ప్రమాదం
- దేవన్నపేట పంప్‌హౌస్‌లో మొత్తం 3 మోటార్లు.. సాంకేతిక అడ్డంకులు తొలగించేందుకు నిపుణుల కృషి
- కనీసం ఒక్క మోటారునైనా ప్రారంభించేందుకు ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు... నేడు సిద్ధమయ్యే చాన్స్.. అదే జరిగితే ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు


దేవన్నపేటలోని దేవాదుల పంప్‌హౌస్

సాక్షి, హైదరాబాద్: ఒక్క మోటార్‌పై 50 వేల నుంచి 65 వేల ఎకరాల్లోని పంటల మనుగడ ఆధారపడి ఉంది. దేవాదుల ప్రాజెక్టు కింద ప్రస్తుత యాసంగిలో సాగు చేస్తున్న ఈ పంటలు మరో రెండు వారాల్లో చేతికొచ్చే దశలో ఉండగా, తీవ్ర నీటి కొరత కారణంగా ఎండిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. దీంతో ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించింది. దేవాదుల ప్రాజెక్టు మూడో దశ కింద దేవన్నపేట వద్ద కొత్తగా నిర్మించిన పంప్‌హౌస్‌లో ఒక్కొక్కటి 31 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు మోటార్లుండగా.. కనీసం ఓ మోటారునైనా యుద్ధప్రాతిపదికన వినియోగంలోకి తేవడం ద్వారా ఆ పంటలకు గోదావరి జలాలను మళ్లించడానికి విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి గత 10 రోజులుగా అక్కడే ఉండి పంప్‌హౌస్‌ను సిద్ధం చేసే పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18న
మిగతా 8వ పేజీలో ▶



'గోల్డెన్ డేస్'..
ఆగని రేస్!

- అంచనాలకు అందకుండా పరుగు తీస్తున్న పుత్తడి రేటు
- 210 రోజుల్లో 500 డాలర్లు పెరిగిన ఔన్స్ బంగారం ధర
- గతంలో ఈ స్థాయి వృద్ధికి సగటున 1,708 రోజుల సమయం
- ఆశ్చర్యపరుస్తున్న వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజా గణాంకాలు

3 లో

జగదేక నగరానికి
అతిలోక సుందరి

మే 10న హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం

- గచ్చిబౌలి స్టేడియంలో తొలిరోజు ప్రోగ్రాం... మే 31న హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలే
- రానున్న 140 దేశాల సుందరీమణులు.. చార్మినార్‌లో షాపింగ్.. చౌమొహల్లాలో డిన్నర్
- పోచంపల్లి చీర కట్టి కనువిందు చేయనున్న విదేశీ వనితలు
- రాష్ట్రావతరణ దినోత్సవంలో పాల్గొననున్న మిస్ వరల్డ్-2025

సాక్షి, హైదరాబాద్

అప్పుడెప్పుడో ఓ సినిమాలో అంగుళీయకం కోసం అతిలోక సుందరి దివి నుంచి భువికి దిగొచ్చింది. ఇప్పుడు.. అంగుళీయకం పోకున్నా.. అతిలోక సుందరీమణులెందరో అందాల పోటీల కోసం భాగ్యనగరానికి తరలిరానున్నారు.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు చెందిన అందగత్తెలు పాల్గొనే అద్భుతమైన వేడుక 'మిస్ వరల్డ్ 2025' నిర్వహణకు హైదరాబాద్ సిద్ధమవుతోంది. మే 7 నుంచి 31 వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలి స్టేడియం, గచ్చిబౌలి ఐఎస్బీ, టీ-హబ్, శిల్పకళావేదిక.. ఇలా పలు వేదికల్లో సుందరీమణులు
మిగతా 9వ పేజీలో ▶



మిస్ వరల్డ్ పోటీల 'గ్రాండ్ ప్రీ-లాంచ్'లో మాట్లాడుతున్న మిస్ వరల్డ్ క్రిస్టినా పిష్కోవా. చిత్రంలో మంత్రి జూపల్లి, మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్మన్, సీఈఓ జూలియామోర్లీ

అందాల పోటీలతో తెలంగాణకు ప్రపంచవ్యాప్త గుర్తింపు

- తద్వారా పర్యాటక పెట్టుబడులకు ఊతం
- హైదరాబాద్ నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం: జూపల్లి
- తెలంగాణ సంస్కృతికి ముగ్ధురాలినయ్యా
- మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిష్కోవా

9 లో



హరీశ్‌పై ఎఫ్‌ఐఆర్
చట్టవిరుద్ధం

- ఫోన్ ట్యాపింగ్ కేసును కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు
- ఫిర్యాదు చేయడంలో చక్రధర్‌గౌడ్‌ది విపరీత జాప్యం
- దర్యాప్తు కొనసాగనిస్తే చట్ట ప్రక్రియ దుర్వినియోగం చేసినట్టే
- మరో నిందితుడు మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుకూ ఊరట

10 లో

డాక్టర్ నుంచి డేటా సైన్స్ వైపు



డేటా సైన్స్, ఏఐలో గేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన సాదినేని నిఖిల్

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రణాళిక మార్చినట్లు వెల్లడి

ఎంబీబీఎస్, ఏఐ నైపుణ్యాల కలయికతో ఉజ్వల భవిష్యత్తు!

హెల్త్‌కేర్‌లో ఏఐపై పరిశోధన చేయడమే లక్ష్యం

సాక్షి, ఎడ్యుకేషన్: 'ఎంబీబీఎస్ పూర్తయ్యాక నచ్చిన స్పెషలైజేషన్‌లో పీజీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులు చదవడం. ఆ వృత్తిలో కొనసాగడం.. సాధారణంగా.. ఎంబీబీఎస్ విద్యార్థుల ప్రణాళిక ఇదే. కానీ.. మారుతున్న కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కూడా హెల్త్‌కేర్ సెక్టార్‌లో కీలకంగా నిలుస్తుందని.. ఇందులో నైపుణ్యాలు సొంతం చేసుకుంటే.. ఎంబీబీఎస్, ఏఐ నైపుణ్యాల కలయికతో మరింత ఉన్నతంగా ఎదగొచ్చని భావించా. అందుకే ఎంబీబీఎస్ తర్వాత బీఎస్ డేటా సైన్స్‌లో చేరాను. ఏఐలో ఎంటెక్ చేయడం, హెల్త్‌కేర్‌లో ఏఐపై రీసెర్చ్ చేయడమే లక్ష్యం..'అంటున్నారు.. గేట్-2025లో డేటా సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పేపర్‌లో 96.33 మార్కులతో.. జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన..ఏపీలోని నెల్లూరు జిల్లా ఆమంచర్లకు చెందిన సాదినేని నిఖిల్ చౌదరి. పదో తరగతి నుంచి తాజాగా గేట్ ర్యాంకు వరకు అన్నిటా ముందు నిలిచిన నిఖిల్ చౌదరి.. ప్రస్తుతం ఎక్స్‌పర్ట్‌డాక్స్ అనే హెల్త్‌కేర్ ఏఐ సంస్థలో ఇన్ఫర్మాటిక్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్

ఇంటర్మీడియెట్ పూర్తయ్యాక.. 2017లో ఎయిమ్స్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్, నీట్–యూజీ రెండింటికీ హాజరయ్యా. ఎయిమ్స్ ఎంట్రన్స్‌లో 22వ ర్యాంకు, నీట్–యూజీలో 57వ ర్యాంకు వచ్చాయి. ఎయిమ్స్ వైపు మొగ్గుచూపి ఢిల్లీలో ఎంబీబీఎస్‌లో చేరా. చదువు పూర్తయ్యాక 2023లో ఆరు నెలల పాటు ఎయిమ్స్‌లోనే తాత్కాలిక ప్రాతిపదికన డాక్టర్‌గా విధులు నిర్వర్తించా.



అప్పుడే బీఎస్ డేటా సైన్స్

ఎంబీబీఎస్ చదువుతున్నప్పుడే.. డేటా సైన్స్.. హెల్త్‌కేర్ సెక్టార్‌లో దాని ప్రాధాన్యంపై అవగాహన ఏర్పడింది. ఆ కోర్సు చదవాలని భావించా. ఐఐటీ- చెన్నైలో ఆన్‌లైన్ విధానంలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్) ఇన్ డేటా సైన్స్ ప్రోగ్రామ్ గురించి తెలుసుకుని అందులో చేరా. 2021 నుంచి 2024 వరకు ఆన్‌లైన్‌లో ఈ కోర్సు చదివి సరిఫికెట్ సొంతం చేసుకున్నా. ఇప్పుడు ఇదే అర్హతతో గేట్‌లో డేటా సైన్స్ / ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పేపర్‌కు హాజరయ్యా.

హెల్త్‌కేర్ రంగంలో కీలకంగా ఏఐ

ప్రస్తుతం హెల్త్‌కేర్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంతో కీలకంగా నిలుస్తోంది. ఎంఆర్ఐ, కోడింగ్, మెడికల్ ఇమేజెస్ వంటి వాటిని కచ్చితత్వంతో విశ్లేషించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దోహదం చేస్తుంది. అంతే కాకుండా మెడికల్ కోడింగ్, బిల్లింగ్ వంటి ఇతర హెల్త్‌కేర్ సంబంధ వ్యవహారాల్లో కూడా ఏఐ టూల్స్ విస్తృతంగా వినియోగంలో ఉన్నాయి.

ఏఐలో ఎంటెక్.. తర్వాత రీసెర్చ్

గేట్‌లో వచ్చిన ర్యాంకుతో ఐఐటీలో ఎంటెక్ ఏఐ స్పెషలైజేషన్‌లో చేరతా. ఆ తర్వాత ఈ రంగానికే చెందిన సంస్థల్లో ఉద్యోగంలో చేరాలని భావిస్తున్నా. భవిష్యత్తులో అవకాశం ఉంటే స్టార్టప్ నెలకొల్పడంపై దృష్టి సారిస్తా. కానీ హెల్త్‌కేర్ ఏఐలో రీసెర్చ్ చేయడమే నా మొదటి ప్రాధాన్యం.

గేట్ అంటే భయపడక్కర్లేదు.. నేను ఉద్యోగం చేస్తూనే..

సిలబస్‌ను ఆసాంతం నిశితంగా పరిశీలించి బీటెక్ అకడమిక్స్‌పై పట్టు సాధిస్తే గేట్‌లో విజయం సులభమే. నేను బీఎస్ డేటా సైన్స్‌లో చదివిన అంశాలను సిలబస్‌తో బేరీజు వేసుకుంటూ చదివా. ప్రాక్టీస్ టెస్టులు, మోడల్ టెస్టులకు హాజరయ్యా. ప్రస్తుతం ఎక్స్‌పర్ట్‌డాక్స్ అనే సంస్థలో ఇన్ఫర్మాటిక్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నా. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే గేట్‌కు ప్రిపరేషన్ సాగించా. ప్రతీరోజు 3 నుంచి 4 గంటలు.. సెలవు రోజుల్లో ఏడెనిమిది గంటలు కేటాయించా. కొన్ని ఆన్‌లైన్ క్లాస్‌లకు కూడా హాజరయ్యా. ఇందులో ముఖ్యమైన అంశం టైమ్ మేనేజ్‌మెంట్. పరీక్ష రోజు మనకు అందుబాటులో ఉండే సమయాన్ని గుర్తుంచుకుని.. దానికి అనుగుణంగా ప్రిపరేషన్ దశ నుంచే ప్రణాళిక రూపొందించుకోవడం మంచిది.

నిఖిల్ అన్నింటిలోనూ టాపరే..

పదో తరగతి: 9.8 జీపీఏ

ఇంటర్మీడియెట్: 986 మార్కులు

ఎయిమ్స్ ఎంట్రన్స్ - 2017, ర్యాంకు: 22

నీట్ - 2017 ర్యాంకు: 57

2017-2023: ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్

2024: బీఎస్ డేటా సైన్స్ (ఐఐటీ - చెన్నై) 9.95 జీపీఏ

గేట్-2025లో డేటా సైన్స్, ఏఐ పేపర్‌లో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్

వైద్యసేవల బలోపేతానికి సమగ్ర ప్రణాళిక

మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్య సేవల బలోపేతానికి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. త్వరలోనే అన్ని ఆస్పత్రుల్లో సరిపడా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందిని నియమిస్తామన్నారు. వైద్యవిధాన పరిషత్‌ను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా మారుస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధునాతన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని వివరించారు. గురువారం ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా పరికరాలు, మౌలిక వసతులు, మందులు, శానిటేషన్‌లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. అన్ని రకాల డయాగ్నొస్టిక్ సేవలను పేద ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లా స్థాయిలోని ప్రభుత్వ హాస్పిటళ్లలోనే 90 శాతం వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తామని తెలిపారు. గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వంటి ఆస్పత్రులపై ఒత్తిడి తగ్గిస్తామని చెప్పారు.

'ఏప్రిల్‌లో పోలీసు స్కూల్ ప్రారంభం'



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా పోలీసు స్కూల్‌ను (వైపీఎస్) ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభిస్తారని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. మొదటి బ్యాచ్‌కు సంబంధించిన విద్యార్థులను ఎంపిక చేసేందుకు ఆయన గురువారం మంచిరేవులలోని స్కూల్ ప్రాంగణంలో డ్రా నిర్వహించారు. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులకు అడ్మిషన్ లెటర్లు అందించారు. ప్రాథమికంగా ఈ స్కూల్‌లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యాబోధన చేయనున్నారు. మొత్తం 200 సీట్లలో 100 పోలీసులకు, మరో 100 సాధారణ పౌరుల పిల్లలకు కేటాయించారు. ఈ విద్యార్థుల ఎంపికనూ ఐదు కేటగిరీలుగా నిర్వహిస్తున్నారు. మొదటి కేటగిరీలో అమరవీరులు, రెండో కేటగిరీలో హోంగార్డు నుంచి ఏఎస్సై వరకు, మూడో కేటగిరీలో ఎస్సై నుంచి ఏఎస్పీ వరకు, నాలుగో కేటగిరీలో ఎస్పీ ఆపై స్థాయి అధికారులు, ఐదో కేటగిరీలో సాధారణ పౌరుల పిల్లలకు అడ్మిషన్లు కల్పిస్తారు. ఇటీవల ముఖ్యమంత్రి ఆవిష్కరించిన వైపీఎస్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. దీంతో పారదర్శకంగా ఎంపిక చేయడం కోసం గురువారం రెండు, మూడు, నాలుగు కేటగిరీలకు సంబంధించి మంచిరేవులలోని స్కూల్ ప్రాంగణంలో లక్కీ డ్రా నిర్వహించారు. ఒక్కో క్లాసులోకి 20 మంది చొప్పున ఎంపిక చేయాల్సి ఉండగా... ఫస్ట్ క్లాస్‌లో 9 మంది, సెకండ్ క్లాస్‌లో 8 మంది, థర్డ్ క్లాస్‌లో 10 మంది, ఫోర్త్ క్లాస్‌లో 10 మంది, ఫిఫ్త్ క్లాస్‌లో 8 మంది చొప్పున మొత్తం 45 మందిని సెలెక్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీ ఎం.స్టీఫెన్ రవీంద్ర, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

న్యాక్‌కు దరఖాస్తు చేస్తే రూ.లక్ష

ప్రోత్సాహకం ప్రకటించిన ఉన్నత విద్యామండలి
- గుర్తింపు కోసం కాలేజీలు ముందుకొచ్చేలా చర్యలు
- వర్సిటీల వీసీలతో మండలి చైర్మన్ వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపు కోసం దరఖాస్తు చేసేలా విద్యా సంస్థలను ప్రోత్సహించాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. అందుకు ముందుకొచ్చే కాలేజీలు, విశ్వవిద్యాలయాలకు రూ.లక్ష పారితోషికం ఇస్తామని ప్రకటించింది. ఈ అంశంపై సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి గురువారం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల వైస్‌చాన్స్‌లర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉన్నత విద్యలో జాతీయ స్థాయి గుర్తింపు పొందేందుకు న్యాక్ గుర్తింపు అవసరమని, ఈ విషయాన్ని అన్ని సంస్థలకు అర్థమయ్యేలా చెప్పాలని వీసీలను కోరారు. త్వరలో ప్రతీ జిల్లాలోనూ కాలేజీలను గుర్తించి, న్యాక్‌కు దరఖాస్తు చేసేలా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని నిర్ణయించారు.

ముందుకు రాని సంస్థలు

విద్యా ప్రమాణాలను అంచనా వేసేందుకు న్యాక్ గుర్తింపును జాతీయ స్థాయిలో కొలమానంగా తీసుకుంటున్నారు. మౌలిక వసతులు, నిపుణులైన అధ్యాపకులు, సొంత భవనాలు, లేబొరేటరీలు, లైబ్రరీ, ఆ విద్యా సంస్థలో చదివిన విద్యార్థులకు లభిస్తున్న ఉద్యోగాలు, జాతీయ స్థాయిలో వారి ప్రతిభ మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకొని న్యాక్ గుర్తింపు ఇస్తారు. అయితే, న్యాక్ గుర్తింపుపై రాష్ట్ర విద్యా సంస్థలు ఆసక్తి చూడం లేదు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 362 వర్సిటీలు, 6,176 కళాశాలలకు న్యాక్ గుర్తింపు ఉంది. 695 వర్సిటీలు, 34,734 కళాశాలలకు గుర్తింపు లేదు. తెలంగాణలో 11,055 డిగ్రీ కాలేజీలు, 173 ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. 15 యూనివర్సిటీలు 293 కాలేజీలు కలిపి 298 ఉన్నత విద్యా సంస్థలకు న్యాక్ అక్రెడిటేషన్ ఉంది. అందులో 90 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. పునఃసమీక్ష చేసిన ప్రతీసారి మౌలిక వసతుల కల్పన, ఫ్యాకల్టీ కొరత కారణంగా న్యాక్ గుర్తింపు సంఖ్య తగ్గుతోంది.

న్యాక్ తప్పనిసరి కాబోతోందా?

న్యాక్ గుర్తింపును తప్పనిసరి చేయాలని యూజీసీ, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి భావిస్తున్నాయి. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలోనూ దీన్ని చేర్చారు. న్యాక్ గుర్తింపు విధానంలోనూ అనేక మార్పులు తేవాలని నిర్ణయించారు. ఏ, బీ, సీ, డీ గ్రేడ్ల స్థానంలో 1 నుంచి 5 అంచెలుగా గ్రేడ్లు ఇవ్వనున్నారు. 1 నుంచి 4 వరకు 'లెవల్' పొందిన సంస్థలను జాతీయ విశిష్ట విద్యా కేంద్రాలుగా పేర్కొంటారు. విద్య, పరిశోధనలో అంతర్జాతీయ స్థాయి సామర్థ్యమున్న సంస్థలకు 'ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ గ్లోబల్ ఎక్సలెన్స్ ఫర్ మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్'పేరుతో ఐదో లెవల్ గుర్తింపు ఇస్తారు. ఈ కొత్త విధానంపై యూజీసీ రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతోంది. అక్రెడిటెడ్ విద్యాసంస్థలకు మెచ్యూరిటీ బేస్డ్ గ్రేడెడ్ అక్రెడిటేషన్ (ఎంబీజీఏ) పేరిట 1 నుంచి 5 గ్రేడ్లు ఇస్తారు.

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

ప్రశ్నపత్రంలో ఈసారి క్యూఆర్ కోడ్
- ప్రతి పరీక్ష కేంద్రంలోనూ సీసీ కెమెరాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పదోతరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 4వ తేదీ వరకూ ఈ పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. సైన్స్ సబ్జెక్టును రెండు విభాగాలుగా విడగొట్టారు. ఈ కారణంగా ఫిజికల్, బయలాజికల్ పేపర్లు మాత్రం ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకూ జరుగుతాయి. టెన్త్ పరీక్షల కోసం 5,09,403 మంది రిజిస్టర్ చేసుకున్నారు. మొత్తం 2,650 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. ఈసారి ప్రత్యేకంగా ప్రశ్నపత్రంలో క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెడుతున్నారు. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే సీరియల్ నంబరు వస్తుంది. పేపర్ లీక్ అయితే అది ఎక్కడి నుంచి జరిగిందని వెంటనే గుర్తించే వీలుందని పాఠశాల విద్య డైరెక్టర్ నర్సింహారెడ్డి తెలిపారు. 28,100 మంది ఇన్విజిలేటర్లు, 2,650 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు పరీక్ష విధుల్లో ఉంటున్నట్టు ఆయన చెప్పారు. ప్రతీ పరీక్ష కేంద్రంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను కెమెరాల ఎదురుగానే ఓపెన్ చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రానికి తేవొద్దని సూచించారు. ఉదయం 9.35 దాటితే పరీక్షకు అనుమతించమని ఎస్సెస్సీ బోర్డు స్పష్టం చేసింది.

అనేక చోట్ల సమస్యలు

టెన్త్ పరీక్షల నేపథ్యంలో పలుచోట్ల అనేక సమస్యలు కనిపిస్తున్నాయి. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సమస్య ఉన్నట్టు ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులు డీఈవోలను ఆదేశించారు. ఆదిలాబాద్, కొత్తగూడెం జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లో రవాణా సౌకర్యం లేకపోవడాన్ని గుర్తించారు. ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీని ఆ జిల్లా కలెక్టర్లు ఆదేశించారు. అయితే, కొన్ని ప్రాంతాల్లో రోడ్డు సరిగ్గా లేకపోవడం, బస్సులు నడపలేని పరిస్థితి ఉందని ఆర్టీసీ అధికారులు అంటున్నారు. వేసవితీవ్రత కారణంగా విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదముందని జిల్లా అధికారులు చెబుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.

ఒకటే ఆన్సర్ షీటు.. భవితపై వేటు

బ్రిడ్జి కోర్సు పరీక్షకు.. ఒకే సమాధాన పత్రం

బెజ్జూర్(సిర్పూర్): రెండు ఆన్సర్ షీట్లు ఇవ్వాల్సిన బ్రిడ్జి కోర్సు పరీక్షకు.. ఒకే ఆన్సర్ షీట్ ఇవ్వడంతో విద్యార్థులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జరిగిన ఈ సంఘటనపై విద్యార్థులు తెలిపిన వివరాలివి. బెజ్జూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.. స్థానిక కేజీబీవీలో ఒకేషనల్ ఇంటర్ (మల్టీపర్పస్ హెల్త్ వర్కర్) విద్యార్థినులు వార్షిక పరీక్షలు రాస్తున్నారు. బ్రిడ్జికోర్సులో భాగంగా వీరంతా బయాలజీ (బాటనీ, జువాలజీ), ఫిజికల్ సైన్స్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ) పరీక్షలు రాయాలి. బుధవారం ప్రథమ సంవత్సరంలో 22 మంది, గురువారం ద్వితీయ సంవత్సరంలో 33 మంది బయాలజీ పరీక్షకు హాజరయ్యారు. వీరికి బాటనీ, జువాలజీకి వేర్వేరుగా రెండు సమాధాన పత్రాలు ఇవ్వాల్సి ఉండగా, ఒకటే ఇచ్చారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు కేజీబీవీ ప్రత్యేకాధికారి అరుణ ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కరిస్తామని డీఐఈవో కల్యాణి హామీ ఇచ్చారు. ఈ విషయమై బెజ్జూర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ సపన్ మండల్‌ను వివరణ కోరగా.. ఉన్నతాధికారులకు సమాచారం అందించామని తెలిపారు.

ఓయూ ఘటనలపై సమగ్ర విచారణ

ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలో కొనసాగుతున్న ఉద్రిక్తతపై ముఖ్యమంత్రి కార్యాలయం గురువారం ఆరా తీసింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశించింది. ఘటనపై నివేదిక ఇవ్వాలని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్‌కు సూచించింది. ఓయూ క్యాంపస్‌లో ఆందోళనలు, నిరసనలు, ప్రదర్శనలను నిషేధిస్తూ వైస్ చాన్స్‌లర్ ఉత్తర్వులు జారీ చేయడంపై బుధవారం విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. వీసీ ఆఫీసును దిగ్బంధించారు. నినాదాలు, ధర్నాలు, అరెస్టులతో క్యాంపస్ వేడెక్కింది. విద్యార్థి సంఘాలు పలు రాజకీయ పార్టీల నేతలను కలిశాయి. కాగా ఆందోళనల వెనుక కొన్ని రాజకీయ పార్టీల ప్రోద్బలం ఉందన్న సమాచారం ముఖ్యమంత్రికి చేరింది. అసెంబ్లీ సమావేశాలు నడుస్తుండటం, విపక్షాలు దీన్నో రాజకీయ అస్త్రంగా చేసుకునే అవకాశం ఉందనే ఉద్దేశంతో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది.

వైస్ చాన్సలర్‌పై సీరియస్!


ఓయూ వీసీపై ముఖ్యమంత్రి సీరియస్‌గా ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. పరిస్థితి ఇంత దూరం వస్తుందని ఎందుకు అంచనా వేయలేదని, ఇది వీసీ వైఫల్యమేనని సీఎం అన్నట్టు తెలిసింది. దీనిపై వివరణ తీసుకోవాలని ఓ ఉన్నతాధికారిని ఆదేశించినట్టు సమాచారం. మరోవైపు నిషేధాజ్ఞలు ఇచ్చే ముందు విద్యార్థి సంఘాల నేతలు, ఓయూలోని ఇతర ఉన్నతాధికారులతో వీసీ చర్చించలేదని, ఏకపక్ష నిర్ణయం వల్లే ఇంత దూరం వచ్చిందని సీఎంకు వివిధ వర్గాల నుంచి సమాచారం వచ్చినట్టు తెలిసింది. నిషేధాజ్ఞలు ఇచ్చిన తర్వాత, విద్యార్థులు ఆందోళన బాట పట్టినప్పుడైనా వీసీ వారితో చర్చించక పోవడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో సీఎంవోలోని ఓ కీలక అధికారి ఈ వ్యవహారంపై ఉన్నత విద్యా మండలి చైర్మన్‌తో చర్చించారు.

రంగంలోకి ఇంటెలిజెన్స్

ఓయూలో ఉద్రిక్తతలపై సమగ్ర సమాచారం సేకరించేందుకు ఇంటెలిజెన్స్ వర్గాలు రంగంలోకి దిగాయి. ఓయూ పోలీస్‌స్టేషన్ నుంచి, కమిషనరేట్‌లోని స్పెషల్ బ్రాంచి అధికారుల నుంచి ప్రాథమిక సమాచారం సేకరించాయి. నిషేధాజ్ఞలు ఇచ్చేందుకు రూపొందించిన సర్క్యులర్ వీసీ కార్యాలయం నుంచి ముందే ఇతర వ్యక్తులకు చేరడంపై ఆరా తీస్తున్నాయి.

ఓయూలో నిరసనలపై సర్క్యులర్ జారీ చేశారా?

రిజిస్ట్రార్‌ను ప్రశ్నించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలో ఆందోళన కార్యక్రమాలు చేయకుండా సర్క్యులర్ జారీ చేశారా అని రిజిస్ట్రార్‌ను హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణ ఏప్రిల్ 9కి వాయిదా వేసింది. ఓయూలో నిరసనలకు అనుమతి లేదంటూ రిజిస్ట్రార్ ఈ నెల 13న సర్క్యులర్ జారీ చేశారని, ఇది చట్టవిరుద్ధమని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1), 21ను ఉల్లంఘించడమేనని విద్యార్థి రఫీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ సర్క్యులర్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై గురువారం జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. వర్సిటీలో నిరసన కార్యక్రమాలను నిలిపివేస్తూ ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని స్టాండింగ్ కౌన్సిల్ తెలిపారు. అయితే, కాలేజ్ ఆవరణలో, డిపార్ట్‌మెంట్‌లో ఆందోళనలను నిలిపివేసినట్లు వెల్లడించారు. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిన న్యాయమూర్తి.. విచారణ వాయిదా వేశారు.

పేరు గొప్పగుంది.. అప్పు పుట్టకుంది

▶ మొదటి పేజీ తరువాయి

సిక్స్‌ప్యాక్ బాడీ అని చెప్పుకుంటే నమ్ముతరా? ఉన్న దున్నట్లు చెప్పుతున్న..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం సాయంత్రం 'ప్రజాపాలన..కొలువుల పండుగ' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో.. పంచాయతీరాజ్, పురపాలక శాఖల్లో 922 మందికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు ఆయన అందజేశారు. అలాగే రాష్ట్రంలో కొత్త భవన నిర్మాణాలకు సంబంధించి 'బిల్డ్ నౌ' పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఇందుకోసం 'ఆన్‌లైన్'లో దరఖాస్తు చేసుకున్న ముగ్గురికి అనుమతి పత్రాలు అందజేసిన అనంతరం ప్రసంగించారు.



బిల్డ్ నౌ పోర్టల్ ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, వీర్ల శంకర్, మంత్రి సీతక్క, మేయర్ విజయలక్ష్మి, సీఎస్ శాంతికుమారి, దానకిషోర్, విజయారెడ్డి

ఆ డబ్బే ఉండుంటే అద్భుతాలు చేసేవాణ్ణి..

'ఒక ప్రాజెక్టుకు డీపీఆర్ ఇచ్చి, పద్ధతి ప్రకారం అప్పు తీసుకుంటే 4 శాతం వడ్డీకి అప్పులు ఇచ్చేందుకు ఎన్నో సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. కానీ గుట్టుగా కమీషన్ల కోసం కాళేశ్వరానికి 11 శాతం వడ్డీతో అప్పు తెచ్చారు. దాన్ని 5 శాతం చేసేందుకు ప్రయత్నిస్తున్నా. అప్పటి పాలకులు తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టేందుకే నేను సీఎం అయ్యాక రూ.1.53 లక్షల కోట్లు అప్పులు తెచ్చిన. ఇందులో రూ.88వేల కోట్లు అసలు, రూ.66 వేల కోట్లు మిత్తి కింద కట్టిన. ఈ డబ్బు నాదగ్గర ఉండుంటే గంటలోనే రుణమాఫీ చేసేవాడిని. 25 లక్షల మందికి ఇళ్లు కట్టించి ఇచ్చేవాడిని. ఎన్నో అద్భుతాలు చేసేవాణ్ణి. అప్పట్లో రోజుకు లక్ష టన్నుల చొప్పున ఇసుక దోచుకున్నరు. రూ.7 వేల కోట్లు దోచుకున్నారు. ఇప్పుడు హైదరాబాద్‌లో రైతు బజార్‌ల తరహాలో ఇసుక బజార్‌లు పెట్టి మూడు ప్రాంతాల్లో అమ్ముతున్నం. అంతా ఆన్‌లైన్‌లోనే..' అని సీఎం చెప్పారు.

ముఖ్యమంత్రికి విజ్ఞత ఉండాలి

'ప్రజలు మాపై కోపంగా ఉన్నారని కొందరు మాట్లాడుతున్నారు. ఎందుకు మాపై కోపం?. నిరుద్యోగులకు ఉద్యోగ నియామకపత్రాలు అందిస్తున్నందుకా..? అదానీ, అంబానీలతో పోటీ పడేలా ఆడబిడ్డలకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసే అవకాశం కల్పించినందుకా? రేవంత్‌రెడ్డికి పాలనపై పట్టు రాలేదని మాట్లాడుతున్నారుం. రాజయ్య, ఈటల లాంటి బలహీనవర్గాల వారిని సస్పెండ్ చేస్తేనే పట్టు వచ్చినట్టాం? మేం గడీలలో పెరగలేదు. నల్లమల అడవుల్లో పేదలను చూస్తూ పెరిగాం. అందుకే మాకు మానవత్వం ఉంది.. మీకు లేదు. ముఖ్యమంత్రికి విజ్ఞత ఉండాలిం. మేం విజ్ఞత ప్రదర్శిస్తున్నాం. ఆ విజ్ఞత లేకపోవడం వల్లే ఆయన ఫామ్‌హౌస్ నుంచి బయటకు రాలేక పోతున్నారు..' అని రేవంత్ విమర్శించారు.

మిస్ వరల్డ్ పోటీలతో వందల కోట్ల ఆదాయం

'మిస్ వరల్డ్ పోటీలపై కూడా కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. పర్యాటక రంగానికి ఇదొక అద్భుతమైన అవకాశం. ప్రపంచం తెలంగాణ వైపు చూడబోతోంది. మే 7 నుంచి 31 వరకు ఈ పోటీలు ఇక్కడ జరగబోతున్నాయి. వేలాది మంది విదేశీయులు రాబోతున్నారు. వివిధ రంగాలకు ఉపాధి లభిస్తుంది. 3 వేల విదేశీ ఛానెల్స్, పత్రికలు రాబోతున్నాయి. వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులు తెలంగాణలో ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారు. భవిష్యత్‌లో వందల కోట్ల ఆదాయం రాబోతోంది. ఫార్ములా–ఈ రేస్ ముసుగులో మీరు ప్రభుత్వ సొమ్ము దోచుకున్నారు. మీకు, మాకూ పోలికా? పట్టింపులేకుండా వ్యవహరించిన విధానం మీదిం. పట్టుదలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పం మాది. త్వరలోనే యాదగిరిగుట్టను వైటీడీ బోర్డు ద్వారా విశ్వవ్యాప్తం చేయబోతున్నాం..' అని సీఎం తెలిపారు.

ఈ ఉద్యోగాలు మీ హక్కు

'ఈ కారుణ్య నియామకాలు మీ హక్కు. మీ కుటుంబసభ్యుల నుంచి వారసత్వంగా మీకు రావాల్సిన ఉద్యోగాలు ఇవి. గత పాలకులు ఈ నియామకాలను పట్టించుకోలేదంటే.. ఎంత నిర్లక్ష్యం వహించిందో ఆలోచించండి. అలాంటి నిర్లక్ష్యం ప్రజా ప్రభుత్వంలో ఉండకూడదనే ఈ నియామకాలు పూర్తి చేస్తున్నాం. మేం అధికారంలోకి రాగానే 57,924 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం. గ్రూప్ 1, 2, 3లలో 2 వేల పైచిలుకు ఉద్యోగాలకు మరికొన్ని రోజుల్లో నియామక పత్రాలు అందించబోతున్నాం..' అని రేవంత్ తెలిపారు.

ఉద్యోగ నియామకాలు ఇలా..
(2025 మార్చి 20 వరకు)

శాఖ	ఉద్యోగాల సంఖ్య
వ్యవసాయ, సహకారశాఖ	208
పశు సంవర్ధక, మత్స్య, డెయిరీ	173
బీసీ సంక్షేమ	5,578
ఇంధన	850
వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం	7,517
ఉన్నత విద్య, సాంకేతిక విద్యాశాఖ	3,893
హోంశాఖ	15,526
నీటిపారుదల	1,235
మైనారిటీ సంక్షేమం	1,584
పురపాలక, పట్టణాభివృద్ధి	3,148
రెవెన్యూ శాఖ	2,696
ఎస్సీ అభివృద్ధి	2,235
విద్యాశాఖ	10,209
రవాణా, రోడ్లు, భవనాలు	442
ఎస్టీ సంక్షేమం	1,290
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	722
ఉపాధి కార్మిక	128
ఇతర శాఖలు	512
పంచాయతీరాజ్, మున్సిపల్ (మార్చి20)	922
మొత్తం	58,868

అక్రమాలు అరికట్టేందుకే 'బిల్డ్ నౌ' పోర్టల్

'హైదరాబాద్ నగరంలో భవన నిర్మాణ అనుమతుల్లో అక్రమాలు అరికట్టేందుకే 'బిల్డ్ నౌ' పోర్టల్‌ను తీసుకొచ్చాం. ఎంతటివారైనా సరే ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాల్సిందే. ప్రజలకు పారదర్శక పరిపాలన అందించాలన్నదే మా ఉద్దేశం.. అదే గుడ్ గవర్నెన్స్.. ఇది తెలంగాణ మోడల్..' అని ముఖ్యమంత్రి చెప్పారు. మంత్రి ధనసరి అనసూయ, ఎమ్మెల్యేలు వీర్ల శంకర్, కాలె యాదయ్య, సీఎస్ శాంతికుమారి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, డీటీసీపీ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గోల్డెన్ డేస్' ఆగని రేస్!

అంచనాలకు అందకుండా పరుగు తీస్తున్న పుత్తడి రేటు

210 రోజుల్లో 500 డాలర్లు పెరిగిన ఔన్స్ బంగారం ధర

గతంలో ఈ స్థాయి వృద్ధికి సగటున 1,708 రోజుల సమయం

ఆశ్చర్యపరుస్తున్న వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజా గణాంకాలు



సాక్షి, స్పెషల్ డెస్క్: పుత్తడి సరికొత్త రికార్డులు నమోదు చేస్తుండడంతో ప్రపంచ వ్యాప్తంగా 'గోల్డెన్ డేస్'నడుస్తున్నాయి. తొలిసారిగా ఔన్స్ (31.1 గ్రాములు) బంగారం రేటు 3,000 డాలర్లు దాటింది. ఆశ్చర్య కరమైన విషయం ఏమిటంటే ఔన్స్ పసిడి ధర 2,500 డాలర్ల నుంచి 3,000 డాలర్లకు చేరుకోవడానికి కేవలం 210 రోజులు..అంటే కేవలం 7 నెలలు మాత్రమే పట్టడం. గత రికార్డులు చూస్తే బంగారం ధర 500 డాలర్లు పెరగడానికి సగటున 1,708 రోజుల సమయం తీసుకుంది. అంటే దాదాపు 4 సంవత్సరాల 8 నెలలు. దీనినిబట్టి పుత్తడి పరుగు ఏ స్థాయిలో వేగం అందుకుందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితిని చూస్తే తదుపరి రికార్డు ఎంతో దూరంలో లేదనిపిస్తోంది. 2025లోనే ఔన్స్ ధర 4,000 డాలర్లను తాకే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర గురువారం రూ.91,650 పలికింది. ఈ నెల 19న రూ.91,950కి చేరి సరికొత్త గరిష్టాన్ని నమోదు చేసింది.

రికార్డులే రికార్డులు..

వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యూజీసీ) తాజా గణాంకాల ప్రకారం.. 2024లో బంగారం 40 కంటే ఎక్కువసార్లు సరికొత్త ఆల్-టైమ్ గరిష్టాలను నమోదు చేసింది. ఈ సంవత్సరం ఇప్పటివరకు మరో 16 కొత్త గరిష్టాలను చేరుకుంది. అంతర్జాతీయంగా 2005 డిసెంబర్‌లో పసిడి ఔన్స్ ధర తొలిసారిగా 500 డాలర్ల మార్కును తాకింది. ఆ తదుపరి 500 డాలర్లకు.. అంటే 1,000 డాలర్ల స్థాయిని 2008 మార్చిలో చేరుకుంది. 2011 ఏప్రిల్‌లో 1,500 డాలర్లకు, 2020 ఆగస్టులో 2,000 డాలర్లు, 2024 ఆగస్టులో 2,500 డాలర్ల మార్కును తాకింది. 500 నుంచి 1,000 డాలర్లను చేరుకోవడానికి 834 రోజులు పట్టింది. అక్కడి నుంచి 1,500 డాలర్లకు 1,132 రోజులు, 1,500 నుంచి 2,000 డాలర్లకు 3,394 రోజుల సమయం తీసుకుంది. 2,000 నుంచి 2,500 డాలర్లను అందుకోవడానికి 1,473 రోజులు పట్టింది.

సురక్షితమైన ఆస్తిగా బంగారం

పుత్తడి 3,000 డాలర్ల కంటే అధిక ధర వద్ద స్థిరంగా ఉంటే అదనపు కొనుగోళ్ల ధరను మరింత ప్రేరేపించవచ్చని డబ్ల్యూజీసీ జోస్యం చెబుతోంది. కన్సాలిడేషన్‌కూ అవకాశం ఉందని మార్కెట్ అనలిస్టులు చెబుతున్నారని వివరించింది. గతంలో ప్రతి అదనపు 500 డాలర్ల మార్కును చేరుకున్న తరువాత సగటున తొమ్మిది రోజుల తరువాతే పుత్తడి ధర వెనక్కి వచ్చిందని, అయితే అయిదింటిలో నాలుగు సందర్భాల్లో కొన్ని రోజుల్లోనే బంగారం అదే స్థాయి కంటే పైకి పుంజుకుందని తెలిపింది. భౌగోళిక రాజకీయ, భౌగోళిక ఆర్థిక అనిశ్చితి, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, తక్కువ వడ్డీ రేట్లు, బలహీనమైన యూఎస్ డాలర్.. వెరసి పుత్తడిలో పెట్టుబడి డిమాండ్‌కు బలమైన ప్రోత్సాహకాలను అందిస్తూనే ఉందని డబ్ల్యూజీసీ అభిప్రాయపడింది.

బంగారం రికార్డులు ఇలా..

ఔన్స్ ధర డాలర్లలో	రికార్డు నమోదైన తేదీ	తదుపరి మైలురాయికి పట్టిన రోజులు
500	2005 డిసెంబర్ 1	834
1,000	2008 మార్చి 14	1,132
1,500	2011 ఏప్రిల్ 20	3,394
2,000	2020 ఆగస్టు 4	1,473
2,500	2024 ఆగస్టు 16	210
3,000	2025 మార్చి 17	--

ధర ఎగసినా డిమాండ్ తగ్గలేదు

అధిక పసిడి ధరలు ఆభరణాల డిమాండ్‌కు ప్రతికూలతలను సృష్టించవచ్చని డబ్ల్యూజీసీ అంటోంది. 'ఆభరణాల రీసైక్లింగ్ స్థాయిలను పెంచవచ్చు. పెట్టుబడిదారులలో కొంత లాభాల స్వీకరణకు దారితీయవచ్చు. ఈ అంశాలు బంగారం దీర్ఘకాలిక వృద్ధికి మద్దతు ఇచ్చే విస్తృత ఆర్థిక, ఆర్థిక చోదకాలను అధిగమించే అవకాశం లేదు'అని వివరించింది. 2024లో పుత్తడి ధర 27 శాతం ఎగిసినా డిమాండ్ తగ్గలేదు. భారత్‌లో 808.8 టన్నుల పసిడి కొనుగోళ్లు జరిగాయి.

అత్యంత శాస్త్రీయంగా సమగ్ర సర్వే

అభిప్రాయపడిన ఐఈడబ్ల్యూజీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం గతేడాది సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే–2024ను అత్యంత శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించిందని ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ వర్కింగ్ గ్రూప్ (ఐఈడబ్ల్యూజీ) అభిప్రాయపడింది. ఈ సర్వే ప్రక్రియను విశ్లేషించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఐఈడబ్ల్యూజీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గురువారం ఐఈడబ్ల్యూజీ మొదటి సమావేశం జరిగింది. చైర్మన్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కంచె ఐలయ్య, కన్వీనర్ ప్రవీణ్‌చక్రవర్తి, మరికొందరు వర్చువల్ పద్ధతిలో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు సర్వే తీరును అభినందించారు. ఈ సర్వేకు సంబంధించిన సమాచారాన్ని మరింత లోతుగా విశ్లేషించేందుకు సబ్ గ్రూపులుగా ఏర్పాటు చేసుకుని పరిశీలన చేపట్టాలని నిర్ణయించారు. వచ్చేనెల 7వ తేదీన ఈ కమిటీ మరోమారు భేటీ కానుంది.

సెలబ్రిటీల చుట్టూ... బెట్టింగ్ యాప్స్ ఉచ్చు

▶ మొదటి పేజీ తరువాయి

నేపథ్యంలో ఫణీంద్ర గత ఆదివారం తమ కాలనీకి చెందిన యువకులతో సంప్రదింపులు జరిపారు. ఈ నేపథ్యంలోనే వారిలో అత్యధికులు ఈ యాప్స్‌పై ఆసక్తి చూపడాన్ని గమనించారు. సోషల్‌మీడియా ద్వారా పలువురు సెలబ్రిటీలు, యాంకర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు చేస్తున్న ప్రచారమే దీనికి కారణమని ఫణీంద్ర గుర్తించారు. ఈ సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రచారం యువతను ప్రధానంగా డబ్బు అవసరం ఉన్న వారిని బెట్టింగ్ యాప్స్ ఉచ్చులోకి లాగుతోందని, అనేకమంది వాటిలో డబ్బు పెట్టి నిండా మునిగిపోతున్నారని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

ఎవరెవరు ఏ యాప్స్‌లో..

ఈ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న వాటిలో అత్యధికం సోషల్‌మీడియాలో పాప్‌అప్ యాడ్స్ రూపంలో వస్తున్నట్లు ఫణీంద్ర గుర్తించారు. రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్‌లు జంగిల్‌రమ్మీ.కామ్, విజయ్ దేవరకొండ ఏ23, మంచు లక్ష్మి యోలో247.కామ్, ప్రణీత ఫేర్‌ప్లే.లైవ్, నిధి అగర్వాల్ జీత్‌విన్ సైట్లు, యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నట్లు తెలుసుకున్నారు. సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యాంకర్లుగా ఉన్న అనన్య నాగెళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖి, వర్షిణి సౌందర్‌రాజన్, వసంతి కృష్ణన్, శోభా శెట్టి, అమృత చౌదరి, నాయని పావని, నేహా పఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్ ఖాన్, విష్ణుప్రియ, హర్షసాయి, బయ్యా సన్నియాదవ్, శ్యామల, టేస్టీ తేజ, రీతు చౌదరి, బీఎస్ సుప్రీత వివిధ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు పూర్తి వివరాలు సమర్పిస్తూ బుధవారం మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంజగుట్ట పోలీసులు గురువారం విష్ణు ప్రియని 10 గంటలు, రీతూ చౌదరిని ఆరు గంటలు విచారించారు. ఈ నెల 25న మరోసారి విచారణకు హాజరుకావాలని ఇరువురికి నోటీసులిచ్చారు.

ఈడీ కూడా రంగంలోకి..

పోలీసులు 25 మంది సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై బీఎన్‌ఎస్‌లోని 318 (4), 112 రెడ్ విత్ 49, గేమింగ్ యాక్ట్‌లోని 3, 3 (ఎ), 4, ఐటీ యాక్ట్‌లోని 66 డీ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ నిందితుల్లో కొందరు పంజగుట్టలో నమోదైన కేసులోనూ నిందితులుగా ఉన్నారు. ఈ కేసుల వివరాలను సేకరించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ప్రాథమిక విచారణ ప్రారంభించారు. మరోపక్క పంజగుట్ట కేసుకు సంబంధించి దర్యాప్తు అధికారులు మంగళ, బుధవారాల్లో టేస్టీ తేజ, హబీబ్‌నగర్ కానిస్టేబుల్ కిరణ్ గౌడ్‌ను ప్రశ్నించారు. గురువారం విష్ణు ప్రియ, రీతు చౌదరి విచారణకు హాజరయ్యారు. ఒక్కొక్కరిని 3 నుంచి 8 గంటలపాటు ప్రశ్నిస్తున్న అధికారులు కొందరి ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తాము కేవలం స్కిల్ గేమ్ అని చెప్పడంతోనో, తెలియకో ఆ యాప్స్‌ను ప్రమోట్ చేశామని కొందరు తమ వాంగ్మూలాల్లో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ క్యాంపెయిన్‌కు సంబంధించిన లావాదేవీలన్నీ యాప్స్ నిర్వాహకులతో బ్యాంకు ఖాతా ద్వారానే జరిగినట్లు వాళ్లు పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో తదుపరి విచారణకు బ్యాంకు స్టేట్‌మెంట్స్‌తో హాజరుకావాలని పోలీసులు వారికి స్పష్టం చేశారు. మిగిలిన ఇన్‌ఫ్లూయన్సర్లు ఒకటిరెండు రోజుల్లో విచారణకు రానున్నారు.

ఆ యాప్ చట్టానికి అనుగుణంగానే..

నైపుణ్యం ఆధారిత గేమ్‌లకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడానికి ఒక కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నా. దాని గడువు 2017లోనే ముగిసింది. చట్టబద్ధంగా అనుమతించిన నైపుణ్యం ఆధారిత గేమ్‌లకే ఆమోదం తెలిపాను. బ్రాండ్ అంబాసిడర్‌గా ఒప్పందాలు చేసుకునే ముందే లీగల్ సెల్ అన్ని భాగస్వామ్యాలను క్షుణ్ణంగా సమీక్షించింది. నేను ప్రమోట్ చేసిన యాప్ చట్టానికి అనుగుణంగానే ఉన్నట్లు తేలింది.

– రానా దగ్గుబాటి, నటుడు

ఒప్పందం గతేడాది ముగిసింది

నేను ఏ యాడ్ చేసినా, ఏ కంపెనీకి ప్రచారకర్తగా ఉన్నా... ఆ కంపెనీని చట్టపరంగా నిర్వహిస్తున్నారా? లేదా అనే విషయాలను నా టీమ్ క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. ఆ ఉత్పత్తులకు చట్టప్రకారంగా అనుమతులు ఉన్నాయని రూఢీ చేసుకున్నాకే ప్రచారకర్తగా ఉంటాను. అలాంటి అనుమతి ఉన్న ఏ23 అనే సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా పని చేశాను. ఆ కంపెనీతో నేను చేసుకున్న ఒప్పందం గతేడాది ముగిసింది. చట్టవిరుద్ధంగా పనిచేస్తున్న ఏ సంస్థకూ నేను ప్రచారకర్తగా వ్యవహరించ లేదు.

– విజయ్ దేవరకొండ, నటుడు–నిర్మాత

తప్పని తెలుసుకున్నా...

'నాపై బెట్టింగ్ యాప్ కేసు గురించి ఇప్పుడే తెలిసింది. 2016లో నేను ఓ యాడ్ చేసిన మాట వాస్తవమే. కానీ, ఆ యాడ్ చేయడం తప్పని కొన్ని నెలల్లోనే తెలుసుకున్నా. అది కేవలం ఏడాది పాటు మాత్రమే చేసుకున్న ఒప్పందం. 2017లోనూ ఒప్పందం పొడిగిస్తామని కంపెనీ వాళ్లు నన్ను కోరితే.. అందుకు నేను అంగీకరించలేదు. 2021లో ఆ సంస్థని ఇంకో కంపెనీకి విక్రయించారు. కొత్త కంపెనీ వాళ్లు సోషల్ మీడియాలో నా ప్రకటన వాడారు. ఇందుకు ఆ సంస్థకి నేను లీగల్ నోటీసులు కూడా పంపాను. ఇప్పటివరకు పోలీసుల నుంచి నాకు ఎలాంటి పిలుపు రాలేదు. ఒకవేళ వస్తే బాధ్యతగా వివరణ ఇస్తాను.

– 'ఎక్స్'లో ప్రకాశ్‌రాజ్, నటుడు

ప్రశ్నిస్తే కేసులు.. నిలదీస్తే దాడులు

మాజీ మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియాపై ఉక్కుపాదం మోపడమేమిటని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. గతంలో అధికారం కోసం అశోక్‌నగర్ గడప తొక్కి.. అధికారం దక్కిన తర్వాత నిరుద్యోగుల గొంతు నొక్కారని గురువారం ఆయన ట్వీట్ చేశారు. జాబ్ క్యాలెండర్ లేదు.. కొత్త ఉద్యోగాలు లేవు.. నిరుద్యోగ భృతి రాదని మండిపడ్డారు. న్యాయం కోసం నిలదీసిన దళిత రైతు వెంకటయ్యను అరెస్టు చేసి, ఆయన అభిప్రాయం తీసుకున్న జర్నలిస్టులు రేవతి, తన్వియాదవ్‌లను జైలుకు పంపి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇంటిపై దాడికి ప్రయత్నించారని ఆరోపించారు. ప్రశ్నిస్తే కేసులు.. నిలదీస్తే దాడులు, జైలు.. అన్న విధంగా కాంగ్రెస్ విధానం ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగం పట్టుకుని దేశంలో తిరిగే రాహుల్ గాంధీకి.. తెలంగాణలో జరుగుతున్న అరాచక కాంగ్రెస్ పాలన కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్, బీజేపీ ఆగర్భ శత్రువులని, తెలంగాణలో మాత్రం మంచి మిత్రులని కేటీఆర్ ఆరోపించారు.



ఉగాదికి 'బాహుబలి' గేటు ప్రారంభం

ఇకపై సచివాలయంలో ఈగేటు నుంచే సీఎం రాకపోకలు

సాక్షి, హైదరాబాద్: ఉగాది రోజున సచివాలయ ప్రధాన గేటు 'బాహుబలి'ద్వారాన్ని ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఇంకా పది రోజులే సమయం ఉండటంతో అధికారులు అన్ని పనులు పూర్తి చేశారు. ఇక నుంచి ఈ గేటు ద్వారానే సీఎం, మంత్రులు, సీఎస్ రాకపోకలు సాగించనున్నారు. గతంలో ఉన్న బాహుబలి గేటును వాస్తు పేరుతో మూసేశారు. దాన్ని పక్కనే నాలుగో గేటు దగ్గర నైరుతి వైపు ప్రధాన గేటును ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న ప్రధాన గేటు ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసి.. అక్కడ పౌంటేయిన్, లాన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

బడే భాయ్.. చోటే భాయ్ ఇద్దరూ ఒక్కటే!



సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

▶ మొదటి పేజీ తరువాయి

రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే ఖాతాల్లో టింగు టింగు అంటూ పడుతున్నాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌కు అధికారం మాత్రమే పోయిందని, ప్రజల్లో అభిమానం మాత్రం అలాగే ఉందని చెప్పారు. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని, గాడిదని చూస్తేనే కదా గుర్రం విలువ తెలిసేది.. అలాగే కాంగ్రెస్ కంచర గాడిదలను చూసిన తర్వాతనే ప్రజలకు కేసీఆర్ గొప్పతనం తెలిసి వచ్చిందన్నారు. సమావేశానికి ముందు సూర్యాపేటలో పార్టీ కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పునర్విభజనతో ఎంపీ సీట్ల సంఖ్యలో పెనుమార్పులు

సీఎం రేవంత్‌రెడ్డికి విశ్లేషకుడు రవికుమార్ నివేదిక

సాక్షి,హైదరాబాద్ : పునర్విభజన ప్రక్రియ వల్ల.. వివిధ రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాల సంఖ్యలో రానున్న పెనుమార్పులు, వాటి పరిణామాలపై సీఎం రేవంత్‌రెడ్డికి పునర్విభజన, రాజకీయ విశ్లేషకుడు ఎణుగంటి రవి కుమార్ నివేదిక సమర్పించారు. 2003 నుంచి 2008 వరకు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడులో జరిగిన పునర్విభజన ప్రక్రియల నుంచి నేటి ఎంపీ స్థానాల పెంపు వరకు చేసిన విశ్లేషణను ఇందులో పొందుపరిచారు. జనాభా శాతం లేదా ప్రోరేటా ప్రకారం లేదా 2011 జనాభా ప్రాతిపదికగా తీసుకున్నా, దక్షిణాది వాటా లోక్‌సభలో 24 నుంచి 19 శాతం, ఇంకా తగ్గే ప్రమాదం ఉందని గణాంకాలతో సహా వివరించినట్టు రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పంటలు ఎండిపోతే పట్టించుకున్నారా?

కేసీఆర్‌ను ప్రశ్నించిన జీవన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ ఎప్పుడైనా వ్యవసాయ కూలీల గురించి ఆలోచించారా?, పంటలు ఎండిపోతే ఒక్కరైనా పట్టించుకున్నారా? అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆయన గురువారం సీఎల్పీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఆడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో పంటలు ఎండిపోతే ఒక్కరు కూడా పట్టించుకోలేదని విమర్శించారు.

అత్యున్నత ఫలితాల సాధనకు ఆకాశ్ నూతన విద్యావిధానం

సాక్షి, హైదరాబాద్: అత్యున్నత ఫలితాల సాధనలో జాతీయ స్థాయిలో ప్రభావం చూపిస్తున్న ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్) మరింత మెరుగైన నాణ్యతతో కూడిన విద్యావిధానంతో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. సరళమైన, ఫలితాల ఆధారితంగా రూపొందించిన నూతన ఏఐ విధానంతో జాతీయ స్థాయి పరీక్షలలో మరింత మెరుగైన ఫలితాలను సాధించేందుకు వీలు కలుగుతోందని ఏఈఎస్ఎల్ ఎండీ, సీఈవో దీపక్ మెహ్రోత్రా వెల్లడించారు. ఈ విధానంలో సంస్థ ప్రత్యేకమైన డిజిటల్ విధానాన్ని అనుసరిస్తోందని చెప్పారు. కాగా, ఏఈఎస్ఎల్ తన విద్యాసంస్థలన్నింటినీ ఒకే గొడుకు కిందకు తీసుకువస్తోంది. దీని ద్వారా ఆన్‌లైన్ విద్యావిధానం, నీట్, జేఈఈ, ఒలింపియాడ్‌లలో మరింత నాణ్యత, ఫలితాల ఆధారిత శిక్షణ ఇచ్చేందుకు వీలుపడుతోందని సంస్థ వెల్లడించింది. దేశంలో ఎక్కడైనా విద్యార్థులు ఇంటినుంచే శిక్షణ పొందేలా ఏఐ ఆధారిత, ఇంటరాక్టివ్ శిక్షణా సాధనాలు, ఆయా రంగాల్లో నిపుణుల ద్వారా ఆన్‌లైన్ శిక్షణ ఇస్తూ విద్యార్థులు మరింత మెరుగ్గా రాణించేలా పాటుపడుతోందని సంస్థ వెల్లడించింది.

ఎవరైతే అల్లాహ్‌పై నమ్మకం ఉంచుతారో వారికి అల్లాహ్ చాలు!
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 21 మార్చి 2025

ట్రంప్ ద్వంద్వ ప్రమాణాలు

ద్విపాత్రాభినయం చేసే హీరోల సినిమాలకు ఒకప్పుడు జనాదరణ బాగుండేది. ఇద్దరూ ఒకరే అని తెలిసినా రెండు వేషాలతో మెప్పించే తీరు చూసి జనం ముచ్చటపడేవారు. ప్రపంచ యవనికపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అలాంటి పాత్రల్లోనే జీవిస్తున్నారు. యూరప్‌లో శాంతిమంత్రం పఠిస్తారు. రష్యా–ఉక్రెయిన్‌లు రాజీ పడాలంటారు. అందుకు షరతులు పెట్టిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని గెంటేసినంత పనిచేస్తారు. పశ్చిమాసియాలో ఇరాన్‌కు స్నేహ హస్తం అందిస్తారు. గాజాలో మారణహోమానికి ఇజ్రాయెల్‌ను ప్రోత్సహిస్తారు. యెమెన్‌లో వైమానిక దాడులకు తానే ఆదేశాలిస్తారు. ఒక అగ్రరాజ్యాధినేత ఏకకాలంలో ఇన్ని వైరుధ్యాలు ప్రదర్శించటం గతంలో ఎప్పుడూ లేదేమో! ఒకపక్క జెలెన్‌స్కీ మూడో ప్రపంచయుద్ధ ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నారని ఆరోపించిన ట్రంప్... వేరొకచోట అదే ప్రమాదానికి దారితీసే పోకడలకు ఎందుకు పాల్పడుతున్నారో అనూహ్యం. తన అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఉక్రెయిన్, గాజాల్లో శాంతి సాధిస్తానని పదే పదే ట్రంప్ చెప్పారు. కానీ దాని అర్థం ఇదా అని అమెరికా పౌరులే ఆశ్చర్యపోతున్నారు. రష్యా–ఉక్రెయిన్ లడాయి మూడేళ్లపాటు ఎడతెరిపి లేకుండా ఎందుకు కొనసాగిందో అందరికీ తెలుసు. జో బైడెన్ ఏలుబడిలోని అమెరికా... యూరప్ దేశాలతో చేతులు కలిపి ఉక్రెయిన్ ద్వారా రష్యాను చికాకుపరిచి, ఆ వంకన నాటోను తూర్పున విస్తరించే ప్రయత్న పర్యవసానమే ఆ యుద్ధం.

రష్యా–ఉక్రెయిన్‌ల విషయంలోనే ట్రంప్ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారు. తన కాల్పుల విరమణ ప్రతిపాదనకు జెలెన్‌స్కీ షరతులు పెట్టడాన్ని ఏమాత్రం సహించలేని ట్రంప్... అదే రకంగా వ్యవహరించిన పుతిన్‌తో సామ్యంగా ఉంటున్నారు. జెలెన్‌స్కీ తమ భద్రతకు గ్యారెంటీ ఇవ్వాలన్నారు. దురాక్రమించిన ప్రాంతాలను తిరిగి ఇప్పించాలని కోరారు. నాటో సభ్యత్వం కావాలని అడిగారు. కానీ పుతిన్ అసలు కాల్పుల విరమణకే అంగీకరించలేదు. మూడు రోజులక్రితం మళ్లీ రెండోసారి మాట్లాడాక పరిమిత కాల్పుల విరమణకు ఒప్పుకున్నారు. పరస్పరం ఇంధన గ్రిడ్‌లపైనా, ఇతర మౌలిక సదుపాయాలపైనా దాడులు చేసుకోవద్దన్నది ఆయన ప్రతిపాదన. ఉక్రెయిన్ ఏం చేయాలో ట్రంప్, పుతిన్‌లు నిర్ణయించారు. నల్లసముద్ర ప్రాంతంలో ఇరు నావికాదళాల దాడుల నిలిపివేతపై కూడా ఒక అంగీకారానికొచ్చాక శాంతి చర్చలు మొదలవు తాయంటున్నారు. ఇవన్నీ గమనిస్తూ కూడా తమ సార్వభౌమత్వం విషయంలో రాజీపడేదేలేదని ఇప్పటికీ జెలెన్‌స్కీ బడాయి పోతున్నారు. ఉక్రెయిన్ భూభాగంలోని క్రిమియాను రష్యా 2014లో ఆక్రమించగా, 2022లో యుద్ధం మొదలయ్యాక తూర్పు ఉక్రెయిన్‌లోని మరో నాలుగు ప్రాంతాల్లో భూభాగాన్ని సైతం అది సొంతం చేసుకుంది. మొత్తానికి ఉక్రెయిన్‌లోని అయిదోవంతు భూభాగం రష్యా అధీనంలో ఉంది. ఇందులో అంగుళం భూమిని కూడా వదలబోనని పుతిన్ పదే పదే చెబుతున్నారు.


పశ్చిమాసియాలో ట్రంప్ కనీసం ఈమాత్రం కూడా చేయటంలేదు. తమ బందీలను హమాస్ మిలిటెంట్లు విడుదల చేయలేదన్న సాకుతో గాజాలో ట్రంప్ అండతోనే ఇజ్రాయెల్ నరమేధం సాగిస్తోంది. మొన్న మంగళవారం వైమానిక దాడుల్లో 413 మంది పౌరులను హతమార్చగా గురువారం ఇజ్రాయెల్ సైన్యం నేరుగా విరుచుకుపడి 70 మందికి పైగా పౌరులను కాల్చిచంపింది. ఈ దాడుల తర్వాత ఇజ్రాయెల్ ఉపయోగించిన భాష కూడా అభ్యంతరకరంగా ఉంది. తమ బందీలను హమాస్ విడిచిపెట్టేవరకూ దాడులు తప్పవని, ఆ సంస్థకు ఆశ్రయం కల్పించినంతకాలమూ సాధారణ పౌరులు కనీవినీ ఎరుగని రక్తపాతం చవిచూడాల్సివస్తుందని రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ హెచ్చరించారు. బందీల అప్పగింత ప్రక్రియ పూర్తయ్యాక గాజా పౌరులను ప్రపంచంలో కోరుకున్న ప్రాంతాలకు తరలిస్తారట. లేనట్టయితే భారీ వినాశనం తప్పదట.

యెమెన్‌లో సైతం ట్రంప్ తీరుతెన్నులు అలాగే ఉన్నాయి. గతవారం ఆ దేశంలో హౌతీ మిలిటెంట్ల స్థావరాలుగా భావిస్తున్న ప్రాంతాల్లో 40 వైమానిక దాడులు జరిపించారు. గాజా వాసులను ఇజ్రాయెల్ బెదిరిస్తున్న మాదిరే హౌతీలనూ, వారికి మద్దతిస్తున్నదని భావిస్తున్న ఇరాన్‌నూ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌పై నేరుగా యుద్ధం చేసే అవసరాన్ని తప్పించుకోవటానికీ, ఆ దేశాన్ని అణు చర్చలకు ఒప్పించటానికీ హౌతీలపై విరుచుకుపడటమే మార్గమని ఆయన భావిస్తున్నట్టు కనబడుతోంది. కానీ హౌతీలు సులభంగా లొంగివచ్చే రకం కాదు. వారు ఎర్ర సముద్రంలో మాటుగాసి అంతర్జాతీయ నౌకా రవాణాను అడ్డుకుంటున్న మాట వాస్తవమే అయినా వారితో చర్చించి సమస్య పరిష్కారానికి ప్రయత్నించటమే తెలివైన పని. గాజాలో ఇజ్రాయెల్ దాడులను ట్రంప్ ఆపగలిగితే హౌతీలను చర్చలకు ఒప్పించటం సులభం.

అమెరికాలో వివిధ సంస్థలు నిర్వహించిన సర్వేల్లో తన రేటింగ్ శరవేగంగా పడిపోయిన వైనం ట్రంప్ గమనించాలి. మిత్రదేశాలపై సైతం సుంకాల మోత మోగించటం, ఉపాధి కల్పనకు సంబంధించి తీసుకుంటున్న చర్యలు పెద్దగా ఫలించకపోవటం ఇందుకు తక్షణ కారణం కావొచ్చుగానీ... యూరప్‌లో అరకొర శాంతి యత్నాలు, ఇజ్రాయెల్‌లో సాగుతున్న నరమేధం, హౌతీలను అదుపు చేయలేకపోవటం వంటివి కూడా ఆయనపై మరింత వ్యతిరేకత తీసుకొచ్చే అవకాశం ఉంది. అటు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ పలుకుబడి సైతం క్షీణిస్తోంది. అందువల్లే చిత్తశుద్ధితో శాంతికి యత్నించటమే ట్రంప్ ముందున్న ఏకైక మార్గం. అప్పుడే ఇంటా బయటా అన్నీ చక్కబడతాయి. లేనట్టయితే ముున్ముందు సమస్యలు మరింత ఉగ్రరూపం దాలుస్తాయి.

సిరియాను కుదుటపడనివ్వరా?

విశ్లేషణ


టంకశాల అశోక్

అరవై సంవత్సరాలపాటు అస్సాద్ వంశ నియంతృత్వంలో మగ్గి గత డిసెంబర్‌లో విముక్తి చెందిన సిరియా ప్రజలు కుదుటపడేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ అందుకు రెండు శక్తుల నుంచి సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రజల తిరుగుబాటుతో దేశం విడిచి పారిపోయిన బషార్ అల్– అస్సాద్, ఇజ్రాయెల్! అస్సాద్ సవాలు కనీసం పరోక్షమైనది, ఇజ్రాయెల్‌ది ప్రత్యక్షమైనది.

డిసెంబర్ మొదటి వారంలో అస్సాద్ పతనం తర్వాత సిరియాను మరిచిపోయిన ప్రపంచం, పది రోజుల క్రితం అకస్మాత్తుగా పెద్ద ఎత్తున సాయుధ ఘర్షణ వార్తలు రావటంతో ఉలిక్కిపడింది. ఆ విధంగా దృష్టి ఉక్రెయిన్ యుద్ధం నుంచి కొద్ది రోజులపాటు ఇటు మళ్లింది. వారం రోజులపాటు ఆ ఘటనలలో సుమారు 1,500 మంది చనిపోయినట్లు అంచనా. అస్సాద్ పతనానికి ముందు పది రోజులపాటు సాగిన తిరుగుబాటులోనూ అంతమంది చనిపోలేదు.



- సిరియాలో 1,500 మంది మరణానికి కారణమైన ఘర్షణలకు హేతువు – అస్సాద్‌కు చెందిన అలావైట్ తెగవారు తిరగబడటం! వారు తెగను బట్టే గాక, మతం రీత్యానూ మైనారిటీ. దేశంలో సున్నీలది మెజారిటీ కాగా వీరు షియాలు.


బషార్ అల్–అస్సాద్

- సున్నీలు, షియాలు, క్రైస్తవులు, కుర్దులు, డ్రూజ్‌లు మొదలైన తెగలతోపాటు ప్రాంతాల వారీగా కూడా చీలిపోయి ఉన్న దేశాన్ని ఏకం చేయటం సిరియా తాత్కాలిక అధ్యక్షుడు అల్ – షరారాకు సవాలే!


అహమద్ అల్–షరారా

తిరగబడిన అలావైట్ తెగ

ఈ ఘర్షణలకు కారణం, అస్సాద్‌కు చెందిన మైనారిటీ అలావైట్ తెగవారు తిరగబడటం! వారు ప్రధానంగా సిరియాలోని పశ్చిమ ప్రాంతాన మధ్యధరా సముద్ర తీరం వెంట నివసిస్తారు. వారు తెగను బట్టి మైనారిటీ మాత్రమేగాక, మతం రీత్యానూ మైనారిటీ. దేశంలో సున్నీలది మెజారిటీ కాగా వీరు షియాలు. షియా రాజ్యమైన ఇరాన్, అస్సాద్‌ను బలపరచటానికి గల కారణాలలో ఇది కూడా ఒకటి. తిరుగుబాటు విజయవంతమైనప్పటి నుంచి అలావైట్‌లలో సహజంగానే భయం ఏర్పడింది. వారు లెబనాన్‌కు తరలి పోవటం మొదలైంది. తిరుగుబాటు నాయకుడు అహమద్ అల్–షరారా, అటువంటి ఆందోళనలు అక్కర లేదనీ, దేశంలోని అన్ని తెగలు, మతాలు, వర్గాలను ఏకం చేసి దేశాన్ని ముందుకు తీసుకుపోవటం తన లక్ష్యమనీ మొదటి రోజునే ప్రకటించారు.

కానీ అలావైట్ షియాలకు, సున్నీలకు మధ్య స్థానికంగా కొన్ని కలహాలు జరగగా, ఉన్నట్లుండి అలావైట్ల పక్షాన సాయుధులు రంగంలోకి దిగారు. అనివార్యంగా ప్రభుత్వ సేనలు మోహరించగా ఘర్షణలు తీవ్ర రూపం తీసుకున్నాయి. వారం రోజులలో 1,500 మంది చనిపోయినట్లు అనధికార అంచనా కాగా, ప్రభుత్వం చేసిన ప్రకటనను బట్టి వారిలో సుమారు 200 మంది సైనికులున్నారు. మిగిలిన 1,300 మందిలో అలావైట్ పౌరులు ఎందరో, సాయుధ దళాల వారెందరో తెలియదు. అస్సాద్ సైన్యంలోని ఒక దళం తిరిగి ఒకచోట చేరి దాడులు ఆరంభించింది. అది స్థానికంగా జరిగిన పరిణామమా, లేక ప్రస్తుతం రష్యాలో తలదాచుకున్న అస్సాద్ ప్రమేయముందా అనేది తెలియదు. అందుకు అవకాశాలు తక్కువన్నది ఒక అభిప్రాయం. ఆయనకు రష్యా మొదటి నుంచి మద్దతునివ్వటం, ప్రస్తుతం ఆశ్రయాన్నివ్వటం నిజమే అయినా, సిరియా కొత్త ప్రభుత్వంతో సత్సంబంధాలకు ప్రయత్నిస్తున్నది. మధ్యధరా సముద్రపు తూర్పు తీరాన భౌగోళికంగా కీలకమైన ప్రాంతంలో గల సిరియాలో రష్యాకు ఒక నౌకా స్థావరం, ఒక వైమానిక స్థావరం ఉన్నాయి. యూరప్‌ను ఎదుర్కొనేందుకు అవి చాలా అవసరం. అందువల్ల సిరియా కొత్త ప్రభుత్వంతో సత్సంబంధాల ద్వారా ఆ స్థావరాలను కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారు. రష్యా ఇంతకాలం అస్సాద్‌కు పూర్తి మద్దతుగా ఉండినప్పటికీ, తమ కొత్త పరిస్థితులలో రష్యా సహాయం అనేక విధాలుగా అవసరం గనుక, అల్–షరారా కూడా అందుకు సుముఖత చూపుతున్నారు. ఇటువంటి పరిస్థితులలో అస్సాద్‌ను సిరియాలో తన పాత సైనిక దళాల ద్వారా ఘర్షణలకు రష్యా అనుమతించటం జరిగేది కాదు. పరోక్షంగానైనా అస్సాద్ ప్రోత్సాహం లేక ఇది జరిగేది కాదనే అభిప్రాయమూ ఉంది.

అందరినీ ఏకం చేసే దిశగా...

ఈ తర్కాన్ని బట్టి చూసినపుడు, ఘర్షణలకు కారణం అస్సాద్ సైన్యానికి చెందిన స్థానికమైన ఒక సైనిక దళమని భావించవలసి ఉంటుంది. అల్–షరారా ప్రకటించింది కూడా అదే. ఆ ఒక్క దళాన్ని చివరకు తుడిచి పెట్టామన్నారాయన. అయితే, ఇటువంటి పరిస్థితి తిరిగి తలెత్తబోదనే హామీ ఏమైనా ఉందా? దేశ నిర్మాణంలో అలావైట్లు కూడా భాగస్వాములని, వివిధ వర్గాల మధ్య ఎటువంటి తారతమ్యాలు ఉండబోవని తమ తిరుగుబాటు విజయవంతమైన మొదటిరోజునే స్పష్టం చేసిన తాత్కాలిక అధ్యక్షుడు అల్–షరారా, గమనార్హమైన పని ఒకటి చేశారు. అది – ఘర్షణలపై నియమించిన విచారణ కమిటీలో అలావైట్లను కూడా చేర్చటం! ఘర్షణలలో తమ వారి ప్రమేయం ఉన్నట్లు తేలితే వారిపైనా చర్యలుంటాయని ప్రత్యేకంగా చెప్పారు. ఈ వైఖరిలో రాజకీయమైన, పరిపాలనాపరమైన వివేకం కన్పిస్తాయి. సున్నీలు, షియాలు, క్రైస్తవులు, కుర్దులు, డ్రూజ్‌లు మొదలైన తెగలతోపాటు ప్రాంతాల వారీగా కూడా చీలిపోయి ఉన్న దేశాన్ని ఏకం చేయటం, ఒకటిగా ముందుకు నడిపించటం తేలిక కాదు. అగ్రస్థానాన గల నాయకుడు, తన పార్టీ, ప్రభుత్వం, సైన్యం అందరూ దార్శనికతతో ఏకోన్ముఖంగా పనిచేస్తే తప్ప ఆ లక్ష్యం ముందుకు సాగదు.

అటువంటి పరిణతిని అల్–షరారా మొదటినుంచి చూపుతుండటం విశేషం. తిరుగుబాటు ఇంకా విజయ వంతం కాక ముందు నుంచే ఈ అవసరాలు ఆయనకు అర్థమైనాయనుకోవాలి. అందువల్లనే ఇస్లామిక్ స్టేట్ సంస్థతో సంబంధాలను కొన్ని సంవత్సరాల ముందే తెంచి వేసుకున్నారు. అధికారానికి వచ్చిన మొదటి రోజునే తన పోరాట కాలపు అజ్ఞాతనామం అబూ మొహమ్మద్ జొలానీని, అసలు పేరు అహమద్ అల్–షరారాకు మార్చుకున్నారు. పౌర హక్కులు, మహిళల హక్కుల పరిరక్షణ చేయగలమన్నారు. అస్సాద్ కాలపు ఖైదీలందరినీ వెంటనే విడుదల చేశారు. ఆర్థికాభివృద్ధి, దేశాభివృద్ధి మొదటి ప్రాధాన్యాలని ప్రకటించారు.

ఈ ప్రకటనలన్నీ మొదటి 24 గంటలలోనే వెలువడ్డాయి. అసద్‌పై వేర్వేరు ప్రాంతాలలో తిరుగుబాట్లు చేస్తుండిన వర్గాలు ముందుకు వచ్చి తమ దళాలను ప్రభుత్వ సైన్యంలో విలీనం చేయాలన్న విజ్ఞప్తికి కుర్దులు మొదలైన కొందరు సానుకూలంగా నిర్ణయించారు. షరారాను తీవ్రవాదిగా, తన సంస్థ హయాత్ తహరీర్ అల్–షామ్‌ను ఇస్లామిస్టు తీవ్రవాద సంస్థగా ప్రకటించిన వివిధ దేశాలు ఆ ముద్రను తొలగించటం, డమాస్కస్‌లోని తమ రాయబార కార్యాలయాలను తిరిగి తెరవటం, షరారాతో సమావేశానికి ప్రతినిధులను పంపటం వంటి ప్రక్రియలు మొదలయ్యాయి. ఇక ప్రధానంగా మిగిలింది అమెరికా. వారి ప్రతినిధులు కూడా కలిసి సానుకూలంగా స్పందించటం, ఆంక్షలు ఎత్తివేయగలమనటం చేశారుగానీ, ట్రంప్ అధికారానికి రావటంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

ఇజ్రాయెల్ ముప్పు

ఇదిట్లుండగా షరారా ఈ నెల 13న చాలా ముఖ్యమైన చర్య ఒకటి తీసుకున్నారు. అది – దేశానికి కొత్త రాజ్యాంగ రచన కోసం ఒక కమిటీని నియమిస్తూ, తాత్కాలిక రాజ్యాంగం ఒకటి ప్రకటించటం! అందులోని అంశాలలో తను మొదట పేర్కొన్న అన్ని విధాలైన హక్కులు ఉన్నాయి. అయితే, సిరియన్ తిరుగుబాటు విజయవంతమైన రోజునే సిరియాకు చెందిన గోలన్ కనుమలను ఇజ్రాయెల్ ఆక్రమించింది. అక్కడి నుంచి ఖాళీ చేయబోమని, అక్కడ ఇజ్రాయెలీల సెటిల్మెంట్లు పెంచగలమని ప్రకటించింది. సిరియా దక్షిణ ప్రాంతం యావత్తును నిస్సైనిక మండలంగా మార్చగలమని హెచ్చరించింది. పాశ్చాత్య దేశాలతోపాటు, ఐక్యరాజ్యసమితి ఖండించినా వెనుకకు తగ్గటం లేదు. సిరియాకు ఈ ముప్పు ఎట్లా పరిణమించ వచ్చునన్నది పెద్ద ప్రశ్న అవుతున్నది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

కలిసి నడవాలి



ఇండియా వంటి బహుళ సాంస్కృతిక, బహుళ మత, బహుళ జాతుల దేశానికి తప్పుడు సమాచారం, అంతర్గత కలహాలు పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. ఆ సవాలును తలెత్తనీయకుండా చేయగలిగింది 'భిన్నత్వంలోని ఏకత్వం' మాత్రమే!

– జనరల్ అనిల్ చౌహాన్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్

తీవ్ర 'స్వరాలు'



'యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ గ్లోబల్ మీడియా'ను మూసివేయాలని ట్రంప్ ఆదేశించారు. దీని పర్యవేక్షణలో వాయిస్ ఆఫ్ అమెరికా, రేడియో ఫ్రీ యూరప్, రేడియో ఫ్రీ ఆసియా, మిడిల్ ఈస్ట్ బ్రాడ్‌కాస్టింగ్ నెట్‌వర్కులు ఉన్నాయి. మంచి పని! ఈ రేడియో స్టేషన్లు తీవ్ర వామపక్ష ప్రచార వ్యాప్తికి తప్ప దేనికీ పనికి రాలేదు.

– ఇయాన్ మైల్స్ చియాంగ్, అదర్ వ్యూ పాడ్‌కాస్ట్ కో–హోస్ట్

నిలిచేది న్యాయమే!



అంతర్జాతీయ నియమాలను గౌరవించే న్యాయమైన వాణిజ్యం ప్రతి ఒక్కరి శ్రేయస్సుకూ మంచిది. ఇది, సుంకాలను విధించటం కంటే కూడా కచ్చితంగా ప్రభావవంతంగా ఉంటుంది (ప్రపంచ దేశాల వాణిజ్య ఉత్పత్తులపై సుంకాలను పెంచేస్తున్న ట్రంప్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి).

– ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు

బ్రహ్మాస్త్రాలు వద్దు



మౌనం ఒక ఎంపిక కాకూడదు. మన జీవితాలకు ఆనందాన్ని కలిగించే చిన్ని చిన్ని స్వరాల కోసం మన గొంతులను పెంచుదాం. పిచ్చుకలను కాపాడుకోవటం అంటే మన గ్రహాన్ని రక్షించుకోవటమే! హ్యాపీ వరల్డ్ స్పారో డే (20 మార్చ్).

– భాస్కర్ శర్మ, అస్సాం ఎమ్మెల్యే

అంతా ఒకటయ్యారు



ట్రంప్ అనేక మంది ఉద్యోగులను చట్టవిరుద్ధంగా తొలగిస్తున్నారు. వారందరికీ మస్క్, జుకర్‌బర్గ్, బెజోస్ జవాబుదారీగా ఉండాలి. టన్నుల కొద్దీ నగదును ఇచ్చిన ఈ బిలియనీర్ల కోసం ట్రంప్ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు. ఆ ముగ్గురూ కార్మికులను రోడ్డుమీద పడేస్తున్నారు.

– గ్రెగ్ కాసర్, అమెరికా నాయకుడు

ఇన్ బాక్స్



కావ్యం

మనసుకు అలసటతో చెమట పట్టినపుడో
దేహంలోని నెత్తురు మరిగినపుడో
గొంతు అక్షరాల సాయం తీసుకుంటుంది

వేదన కళగా మారి
సృజనాత్మకతను
లేపనంగా అద్దుకుంటుంది

శిశిరాలు వెంటపడి
అదేపనిగా తరుముతున్నప్పుడు
వసంతం కోసం చేసే తపస్సు

పెనవేసుకున్న శీతగాలి
ఖాళీతనపు భావాగ్నిని అల్లుకున్నపుడు
తుపాన్లతో చైతన్య పరిచేది

చందమామ మాగన్నుగా నిద్రిస్తున్నపుడు
కళ్ళు మూసుకున్న ప్రపంచాన్ని
వేకువ గీతాలై నిద్రలేపేది

ఎప్పటికీ కాలని, విడగొట్టినా చీలని
అనంతం నిండా వ్యాపించిన
అక్షయం కాని అక్షర సముదాయం
ఒకానొక మహావాక్యమై
అద్వితీయ కావ్యమై నిలుస్తుంది.

– ర్యాలి ప్రసాద్
(నేడు ప్రపంచ కవితా దినోత్సవం)

దక్షిణాది హక్కుల శంఖారావం

అభిప్రాయం


గార శ్రీరామమూర్తి

కేంద్రానికీ, దక్షిణాది రాష్ట్రాలకూ మధ్య ఏకీభావ, సానుకూల వాతావరణం రోజురోజుకీ చెదిరిపోతున్నది. ఈ నేపథ్యంలో – తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఈ నెల 22న చెన్నైలో దక్షిణాది ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయటం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. బీజేపీ సారథ్యంలోని జాతీయ ప్రజాస్వామిక కూటమి (ఎన్డీయే)లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా దేశంలోని తక్కిన దక్షిణాది రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ ఆహ్వాన పత్రాలు పంపారు. నూతన విద్యా విధానం పేరుతో హిందీ బోధనను తప్పనిసరి చేయాలని చూడటం, నియోజకవర్గాల పునర్విభజనకు రంగం సిద్ధం చెయ్యటం వంటి కేంద్ర ప్రభుత్వ విధానాలను అడ్డుకోవటం కోసం మద్దతును సమీకరించుకునేందుకు స్టాలిన్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు కనిపిస్తోంది. సమావేశానికి పశ్చిమ బెంగాల్, పంజాబ్ ముఖ్యమంత్రులనూ, ఇతర రాష్ట్రాల పార్టీ నాయకులనూ స్టాలిన్ ఆహ్వానించారు.

2056 వరకు వాయిదా వేయాలి!

నియోజకవర్గాల పునర్విభజన విషయానికొస్తే, లోక్ సభలో ప్రస్తుతమున్న 543 స్థానాల సంఖ్యను 1973లో ఏర్పాటైన మూడవ డీలిమిటేషన్ కమిషన్ 1971 జనగణన ప్రకారం నిర్ణయించింది. కుటుంబ నియంత్రణ అన్ని రాష్ట్రాల్లో పకడ్బందీగా అమలయ్యేలా చూడటం కోసం ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ ప్రక్రియను 2001 జనాభా లెక్కల నాటి వరకు స్తంభింపజేసింది. జనాభాను తగ్గించుకుంటే దేశ ప్రజలు పరిమిత వనరులతో సుఖంగా బతకగలరనే ఉద్దేశంతో ఉత్తరాదిలో కూడా దానిని సాధించేవరకు పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనను వాయిదా వేయాలని నిర్ణయించారు. కానీ, 2001 లెక్కల తర్వాత కూడా ఉత్తరాది పరిస్థితిలో మార్పు కనిపించకపోవడంతో అప్పటి వాజపేయి ప్రభుత్వం ఈ ప్రక్రియను 2026 వరకు స్తంభింపజేసింది. ఇప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. ఇక ఇప్పుడు నియోజక వర్గాల విభజనను చేపడితే దక్షిణాది రాష్ట్రాలు 20 స్థానాలకు పైగా కోల్పోయే అవకాశం ఉందన్న ఆందోళనలు ఉన్నాయి. పునర్విభజన వల్ల ఒక్క ఉత్తర ప్రదేశ్ రాష్ట్రమే అదనంగా 60 స్థానాలు పొందుతుందని అంచనా. అంతేకాదు, లోక్‌సభ స్థానాల్లో దక్షిణాది వాటా 19 శాతం తగ్గిపోయి, హిందీ మాట్లాడే రాష్ట్రాల వాటా 60 శాతం పెరిగే అవకాశం ఉందంటున్నారు. ఈ అన్యాయాన్ని తొలగించడం కోసం నియోజక వర్గాల పునర్విభజన ప్రక్రియను 2056 వరకు వాయిదా వేయాలని స్టాలిన్ కోరుతున్నారు. అందుకే ఈ 'జాయింట్ యాక్షన్ కమిటీ' సమావేశం.


తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్

ఇప్పటికే కేంద్రం నుంచి అందుతున్న నిధుల వాటాలో దక్షిణాది రాష్ట్రాలు వివక్షకు గురవుతుండటం స్పష్టంగానే కనిపిస్తోంది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల నుంచి 2024లో ప్రత్యక్ష పన్నుల ద్వారా 25 శాతం, సెంట్రల్ జీఎస్టీ ద్వారా 27 శాతం నిధులు కేంద్రానికి అందగా, వాటి నుంచి ఈ రాష్ట్రాలకు 15 శాతం నిధులే వచ్చాయి. అదే సమయంలో ఉత్తర ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు కేంద్రం నుంచి 36 శాతం నిధులు పొందాయి. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వమే ఇటీవల పార్లమెంటులో తెలియజేసింది.

ఆంగ్లమే కొనసాగుతుందన్న హామీ!

ఇక తమిళనాడు పాటిస్తున్న ద్విభాషా విధానానికి చాలా చరిత్రే ఉంది. 1937లో, 1968లో త్రిభాషా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించి ఆ రాష్ట్రం దానిని వదిలించుకుంది. 1937లో, అంటే బ్రిటిష్ హయాంలోనే మద్రాస్ ప్రెసిడెన్సీని పాలించిన సి.రాజగోపాలాచారి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల్లో హిందీ బోధనను తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దానిని పెరియార్ రామస్వామి సహా పలువురు పెద్దలు, ప్రతిపక్ష జస్టిస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించడంతో మూడేళ్ల పాటు తమిళనాట హిందీ వ్యతిరేక ఉద్యమం సాగింది. దానితో హిందీ తప్పనిసరి అనే ఉత్తర్వును ఉపసంహరించుకున్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా అధికార భాషపై రాజ్యాంగ సభలో వాడి, వేడి చర్చ జరిగింది. ఫలితంగా 1950 (రాజ్యాంగ అవతరణ సంవత్సరం) నుంచి 15 ఏళ్ల కాలం హిందీని అధికార భాషగా, ఆంగ్లాన్ని అసోసియేట్ అధికార భాషగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. దాంతో 1965 తర్వాత దేశానికి హిందీ ఏకైక అధికార భాష కాబోవడాన్ని హిందీయేతర రాష్ట్రాలు వ్యతిరేకించాయి. ఆ కారణంగా 1965 తర్వాత సైతం ఆంగ్లాన్ని కొనసాగించడానికి నిర్ణయిస్తూ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 1963లో అధికార భాషా చట్టాన్ని తెచ్చారు. అయినా దక్షిణాదికి హిందీ భయం వదల్లేదు. 1965 దగ్గరపడటంతో మద్రాస్ రాష్ట్రంలో హిందీ వ్యతిరేక ఉద్యమం తిరిగి పుంజుకున్నది. 70 మంది ఆందోళనకారులు ప్రాణాలర్పించారు. దానితో హిందీయేతర రాష్ట్రాలు కోరుకున్నంత కాలం ఆంగ్లం అధికార భాషగా కొనసాగుతుందని అప్పటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి హామీ ఇచ్చి పరిస్థితిని సద్దుమణిగించారు.

ఆధునిక తమిళనాడు రూపశిల్పి సి.ఎన్. అన్నా దురై 1963లో పార్లమెంటులో అధికార భాషల బిల్లుపై చర్చలో మాట్లాడారు. 42 శాతం భారత ప్రజలు మాట్లాడుతున్న భాష గనుక హిందీని జాతీయభాషగా చేయాలనే డిమాండ్‌ను తన సహేతుక వాదనతో తిప్పికొట్టారు. హిందీ మాట్లాడే ప్రజలంతా ఇరుగు పొరుగు రాష్ట్రాల్లో ఒకే చోట కేంద్రీకృతమయ్యారని, దేశమంతటా విస్తరించి లేరని, అందుచేత హిందీ జాతీయభాష కాజాలదని స్పష్టం చేశారు. ఈ వాదన ఇప్పటికీ వర్తిస్తుంది.

దక్షిణాది ప్రయోజనాలు పట్టని టీడీపీ

వెనుక ఇంత చరిత్ర ఉండగా, ఎన్నికల్లో లబ్ధి కోసం స్టాలిన్ ఈ సమావేశం పెడుతున్నారనటం రాజకీయమే అవుతుంది. కేంద్రం అవలంబిస్తున్న ఫెడరల్ వ్యతిరేక విధానాలపై రాష్ట్రాలను సమైక్యం, సంఘటితం చేయడానికే స్టాలిన్ సారథ్య పాత్ర వహిస్తున్నారు. 'తెలుగుదేశం' మూల పురుషుడు ఎన్టీ రామారావు ఏనాడో 'కేంద్రం మిథ్య' అన్నారు. రాష్ట్రాల స్వేచ్ఛకు, స్వతంత్ర మనుగడకు ప్రాధాన్యమిచ్చే ఫెడరల్ వ్యవస్థను ఆయన గౌరవించారు. ఈ విషయంలో కేంద్రాన్ని సైతం ఢీకొన్నారు. కానీ ఇప్పటి ఆ పార్టీ నేతలు హిందీని జాతీయ భాషగా అంగీకరించని రాష్ట్రాల హక్కును, ఆ యా భాషల స్వతంత్రాన్ని హరించే ప్రయత్నాలకు అడ్డుచెప్పకపోగా అదే భారతీయత అనే పోకడలను అనుసరిస్తున్నారు. కూటమి భాగస్వాములుగా ఉంటున్నారే తప్ప, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల గురించి ఆలోచించటం లేదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

ఘనమైన ఆరాధన

సంవత్సరంలోని పన్నెండు నెలల్లో అత్యంత మంగళప్రదమైన, విశిష్టమైన నెల రమజాన్. ఏడాది మొత్తం మీద రమజానుకు ఎంతటి ప్రాముఖ్యం ఉందో, ఈ నెలలోని చివరి పది రోజులకు అలాంటి ప్రాముఖ్యం ఉంది. ఈ చివరి పదిరోజుల్లోని ఒక రాత్రిని సాధారణ భాషలో 'జగ్నే కీ రాత్' అనీ, కొన్ని ప్రాంతాల్లో 'బడీ రాత్' అనీ అంటారు. కానీ ఖురాన్ పరిభాషలో ఇది 'లైలతుల్ ఖద్ర్, షబేఖద్ర్ అనీ అనొచ్చు. అంటే ఘనతగల రాత్రి. ఈ రాత్రిలోనే పవిత్ర ఖురాన్ అవతరించింది.


రుజుమార్గం

ఈ విషయాన్ని దైవం ఇలా ప్రకటించాడు: 'మేము దీన్ని (ఖురాన్ గ్రంథం) ఘనమైన రాత్రిన అవతరింపజేశాము. ఆ రాత్రి ఘనత ఏమిటో మీకు తెలుసా? ఆ మహా రాత్రి వెయ్యి నెలలకన్నా ఎంతో శ్రేష్ఠమైనది... అది ఉషోదయం వరకూ పూర్తిగా శుభవంతమైన రాత్రి.' ఈ ఒక్కరాత్రి చేసే ఆరాధన వెయ్యి నెలల కంటే ఎక్కువగా చేసిన ఆరాధనతో సమానం. అంటే సగటు మనిషి జీవితకాలం కంటే కూడా ఎక్కువ. అందుకే రమజాన్ చివరి పదిరోజుల్లోని తాఖ్ (బేసి) రాత్రుల్లో ఆరాధనలు అధికంగా చెయ్యాలని ప్రవక్త వారు ఉపదేశించారు. అంటే 21, 23, 25, 27, 29 రాత్రులన్నమాట! ఎవరైతే ఆత్మ సంతోషంతో, పరలోక పుణ్యఫలాపేక్షతో 'ఖియాముల్లైల్' (రాత్రి ఆరాధన) చేస్తారో వారు నిజంగా ధన్యులు.

'ఏతెకాఫ్' (ఏకాంత ప్రార్థన) 'ఫిత్రా'(దానం)లకు కూడా ఇదే అనువైన కాలం. చివరి పది రోజులు ఏతెకాఫ్ పాటించాలి. పండుగకు కొన్ని రోజుల ముందు ఫిత్రాలు కూడా చెల్లిస్తే, పేదసాదల పండుగ అవసరాలు తీరతాయి. వారు కూడా సంతోషంగా పండుగ జరుపుకోగలుగుతారు. కొందరి సంతోషం కాకుండా అందరి ఆనందమే పండుగ. దైవం అందరికీ ఈ చివరి రోజుల్లో ఇతోధికంగా పుణ్యకార్యాలు ఆచరించే సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకుందాం.

– యండి. ఉస్మాన్ ఖాన్
(నేటి నుండి తాఖ్ రాత్రులు ప్రారంభం)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.సప్తమి రా.11.51 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.9.44 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.30 నుండి 9.20 వరకు, తదుపరి ప.12.30 నుండి 1.20 వరకు, **అమృత ఘడియలు:** ప.12.16 నుండి 2.01 వరకు ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.08, **సూర్యాస్తమయం:** 6.07.

ఇఫ్తార్ విందులో కేటీఆర్



కుత్బుల్లాపూర్: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్‌నగర్‌లోని ఎంజే గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

దుబాయ్ పబ్‌లో హైదరాబాదీ డ్యాన్సర్‌కు వేధింపులు..

బంజారాహిల్స్: దుబాయ్‌లో ఓ పబ్‌లో డ్యాన్సర్‌గా పనిచేస్తున్న హైదరాబాదీ యువతికి అక్కడే పరిచయమైన యువకుడు మానసిక వేధింపులకు గురిచేయడంతో పాటు ఆమె భర్త, కుటుంబ సభ్యులకు వ్యక్తిగత వీడియోలు షేర్ చేస్తూ బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత డ్యాన్సర్ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు దుబాయ్‌కు చెందిన నౌషాద్ అబూ బాకర్‌పై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లో నివసించే యువతి (38) 2018 అక్టోబర్ 6వ తేదీన ఉపాధి నిమిత్తం దుబాయ్‌కు వెళ్లింది. దుబాయ్‌లోని సౌత్ ఇండియా పబ్‌లో డ్యాన్సర్‌గా చేరింది. పబ్ సూపర్‌వైజర్ ఆమెకు ఏదైనా పని ఉంటే నౌషాద్ అబూబాకర్‌ను సంప్రదించాలని నెంబర్ ఇచ్చాడు. అప్పటి నుంచి తరచూ నౌషాద్ ఆమెతో ఫోన్‌లో మాట్లాడేవాడు. అయితే వీడియోలు తీసుకుని కొంతకాలంగా బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నాడు. 2020లో ఆమె హైదరాబాద్‌కు తిరిగివచ్చింది. ఆ సమయంలోనే అబూబాకర్ ఆమెతో ఫోన్‌లో మాట్లాడుతూ తిరిగి దుబాయ్ పబ్‌కు రావాలని, లేకపోతే వీడియోలు, ఫోటోలు కుటుంబసభ్యులకు షేర్ చేస్తానంటూ బెదిరించడంతో ఆమె తిరిగి దుబాయ్‌కు వెళ్లింది. ఇద్దరి మధ్య వీడియోల విషయంలో గొడవ జరిగింది. ఫోన్‌లో నుంచి వీడియోలు, ఫోటోలు డిలీట్ చేయాలని సూచించి తిరిగి హైదరాబాద్‌కు వచ్చింది. ఆరు నెలల తర్వాత అబూబాకర్ దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చి ఆమెకు ఫోన్ చేశాడు. ఇంటి నుంచి బయటకు రావాలని లేకపోతే భర్తతో పాటు కుటుంబ సభ్యులకు వీడియోలు పంపిస్తానని బెదిరించాడు. అయినా ఆమె వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయింది. ఇదే అదునుగా నిందితుడు ఆమె ఫోటోలు, వీడియోలను భర్తకు, కుటుంబ సభ్యులకు పంపించాడు. తాను ఆమెను పెళ్లి చేసుకున్నానని, వదిలిపెట్టాలంటూ భర్తను హెచ్చరించాడు. ఈ వేధింపులు తట్టుకోలేక, అబూబాకర్ బ్లాక్‌మెయింలింగ్ భరించలేక బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

కొట్టి చంపారని బంధువుల ఆరోపణ



హేమంత్ (ఫైల్)

రాంగోపాల్‌పేట్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు.. నిజామాబాద్‌కు చెందిన దుద్దోళ్ల హేమంత్ (25) రెజిమెంటల్ బజార్‌లోని గోపాల్ అనే ఏఆర్ కానిస్టేబుల్‌కు చెందిన మ్యాన్ పవర్ సరఫరా చేసే సంస్థలో పనిచేస్తున్నాడు.గోపాల్‌కు స్నేహితుడైన హన్మంతు హేమంత్‌ను ఉద్యోగంలో చేర్పించాడు. ఇదిలా ఉండగా సంస్థలో ఉద్యోగుల జీతాలకు ఇవ్వాల్సిన రూ.1.20 లక్షలు సొంత అవసరాలకు హేమంత్ వాడుకున్నాడు. దీంతో హన్మంతు మరో వ్యక్తితో వచ్చి బుధవారం రాత్రి డబ్బు కోసం కొట్టాడు. సంస్థ కార్యాలయానికి వచ్చి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడం పాటు మరో వ్యక్తితో కలిసి కొట్టాడు. గురువారం ఉదయం సంస్థకు చెందిన ఉద్యోగులు తలుపులు తెరిచి చూడగా ఉరివేసుకుని కనిపంచారు. సమాచారం అందుకున్న గోపాలపురం అక్కడికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు వచ్చే సరికి ఉరివేసుకున్న తాడు లేకపోవడం, నేల మీద మృతుడుని పడుకుని పెట్టి ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై హేమంత్ తల్లి మాట్లాడుతూ.. ఐదు రోజుల్లో డబ్బులిస్తానని చెప్పినా తన కుమారుడిని కొట్టారని వాపోయింది. తనకు ఫోన్ చేసి బాధపడ్డాడని పేర్కొంది. హేమంత్ సోదరుడు ప్రకాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారీ అగ్నిప్రమాదం..

నిర్మాణంలో ఉన్న కన్వెన్షన్ దగ్ధం

సుమారురూ. ఏడుకోట్ల ఆస్తినష్టం



అగ్నిప్రమాదం జరిగిన ఈకేఏఎం కన్వెన్షన్

శంషాబాద్ : మరో 15 రోజుల్లో ప్రారంభిచేందుకు సిద్ధమవుతున్న కన్వెన్షన్ అగ్నికి ఆహుతైంది. ఈ సంఘటన శంషాబాద్ పట్టణంలోని తొండుపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. తొండుపల్లి నుంచి హమీదుల్లానగర్ వెళ్లే రహదారిలో బాలాపూర్‌కు చెందిన శ్రీధర్ కన్వెన్షన్ నిర్మాణం చేపట్టాడు. ఏప్రిల్ 4 తేదీన ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో వెల్డింగ్ పనులు జరుగుతుండగా నిప్పురవ్వలు పడి మంటలంటుకున్నాయి. కొద్ది సమయంలోనే మెటీరియల్ మొత్తం అగ్నికి ఆహుతైంది. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రెండు ఫైరింజన్‌లతో మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ప్రమాదం జరిగిన సమయంలో లోపల 20 మందికి పైగా కార్మికులు ఉన్నప్పటికి ఎలాంటి ప్రాణాపాయం చోటు చేసుకోలేదు. సుమారు ఏడు కోట్ల రూపాయల మేర ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్



పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

అఫ్జల్‌గంజ్: గంజాయి తరలించే ముఠాను పట్టుకుని వారి వద్ద నుండి రూ.2.45 లక్షల విలువ గల 7 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. దక్షిణ, తూర్పు జోన్ టాస్క్‌ఫోర్స్ బృందంలోని ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదాబాబు, అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ నునావత్ రవి తెలిపిన మేరకు.. గౌలిగూడలోని శ్రీరామ్‌ఘర్ హనుమాన్ మందిర్ సమీపంలోని బస్ పార్కింగ్ స్థలంలో గంజాయి కలిగి ఉన్న ముగ్గురు ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో వారిని అరెస్టు చేసి 7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బైజయంతి తక్రీ అలియాస్ చాందిని టక్రి(36), గౌరీ జురా(35) , ధనర్జయ ఖిలా అలియాస్ ధనుఖరా(22)లను అదుపులోకి తీసుకున్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
జిల్లా కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా వారి ప్రాథమిక ప్రకటన
ఫారం-6

(చట్టం - 30/2013లోని సెక్షన్ 11(1) లోని సబ్ రూల్ 1 రూల్ 19 ప్రకారం)

ఆర్ సి నెం. బి/46/2024 — తేది. 04-03-2025
జయశంకర్ భూపాలపల్లి జిల్లా రాజ పత్రం నెం.
జె.ఎస్.జె./బి.హెచ్.పి.ఎల్/ఎల్.ఎ./ 12/2025 — దిన. 15-03-2025.
శ్రీయుత జిల్లా కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి వారి ఉత్తర్వులు నెం.
జి/461/2024 — దిన. 11-03-2025.

ఈ దిగువన నిర్దిష్టపరిచిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహదేవ్‌పూర్ మండలం, కొత్తపేట (ఎ.0-32 గుం), మహదేవ్‌పూర్ (ఎ.10-20 గుం), బ్రాహ్మణపల్లి (ఎ.04-01 గుం), ఎడపల్లి (ఎ.01-03 గుం), కొత్తపేట (ఎ.0-27 గుం), మహదేవ్‌పూర్ (ఎ.0-05 గుం), బ్రాహ్మణపల్లి (ఎ.01-03 గుం), కొత్తపేట (ఎ.01-19 గుం), ఎడపల్లి (ఎ.01-23 గుం), మహదేవ్‌పూర్ (ఎ.02-30 గుం), కొత్తపేట (ఎ.05-21 గుం), మహదేవ్‌పూర్ (ఎ.03-18 గుం), మహదేవ్‌పూర్ (ఎ.03-04 గుం) మరియు బ్రాహ్మణపల్లి (ఎ.02-23 గుం) గ్రామముల శివారులోని విస్తీర్ణం ఎ.38-29 గుంటల గల భూమి ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం (మహదేవ్‌పూర్ (మం.) పరిధిలోని ఎర్ర చెరువు డిస్ట్రిబ్యూటరీలు మరియు మైనర్ల తవ్వకం) అవసరమైయున్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి గారు భావించినందున భూ సేకరణ సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస హక్కు, పునరావాస చట్టం 2013 మరియు సవరణ చట్టం 2016 వని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీ చేయనైనది.

తదనుగుణముగా జిల్లా కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి గారు ఈ దిగువ నిర్దిష్ట పరిచిన విధంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్‌పూర్ మండలం, కొత్తపేట (ఎ.0-32 గుం), మహదేవ్‌పూర్ (ఎ.10-20 గుం), బ్రాహ్మణపల్లి (ఎ.04-01 గుం), ఎడపల్లి (ఎ.01-03 గుం), కొత్తపేట (ఎ.0-27 గుం), మహదేవ్‌పూర్ (ఎ.0-05 గుం), బ్రాహ్మణపల్లి (ఎ.01-03 గుం.), కొత్తపేట (ఎ.01-19 గుం), ఎడపల్లి (ఎ.01-23 గుం), మహదేవ్‌పూర్ (ఎ.02-30 గుం), కొత్తపేట (ఎ.05-21 గుం.), మహదేవ్‌పూర్ (ఎ.03-18 గుం), మహదేవ్‌పూర్ (ఎ.03-04 గుం.) మరియు బ్రాహ్మణపల్లి (ఎ.02-23 గుం.) గ్రామములలోని పట్టా మరియు ప్రభుత్వ భూముల విస్తీర్ణము ఎ. 38-29 గుంటల భూమి ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణము చేయుట కొరకు చేపట్టబడిన భూసేకరణ ప్రక్రియ ద్వారా ఈ క్రింది ప్రభావితమైన పట్టా మరియు ప్రభుత్వ భూమి/అసైన్ పట్టాకు నష్టము వాటిల్లినదాని నిమిత్తం ఈ దిగువ చూపిన భూమి అవసరము ఉన్నదని భావించినందున ప్రతిపాదిత భూమిని సేకరించు నిమిత్తము ప్రభుత్వముచే రూపొందించబడి, శాసనము ద్వారా ఆమోదించబడిన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో, చట్టం పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు-2013 ననుసరించి ఈ క్రింది ప్రకటన జారీ చేయనైనది.

ఇట్టి భూసేకరణలో భాగముగా చేపట్టదలచిన సామాజిక ప్రభావ అధ్యయన నివేదిక మరియు ఛాప్టర్ -2 ఆహార భద్రత పరిరక్షణ కొరకు మినహాయించుటకుగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం (3) సవరణ చట్టం ఆర్.ఎఫ్.సి.టి.ఎల్.ఎ., ఆర్ మరియు ఆర్, యాక్టు, 2016 (నం. 21 ఆఫ్ 2017) ద్వారా నోటిఫై చేయనైనది. కావున ఆర్.ఎఫ్.సి.టి.ఎల్.ఎ., ఆర్ మరియు ఆర్, యాక్టు 2013 లోని సెక్షన్ 10ఎ చట్టం పరిధిలో (ఇ)ని ఛాప్టర్-2 మరియు 3లోని అంశములను సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక నుండి మినహాయించుటకు జి.వో.ఎం.ఎస్. నెం.47, తేది:25-07-2017, ఇరిగేషన్ అండ్ సి.ఏ.డి (ఎల్.ఏ.ఆర్ అండ్ ఆర్/2) డిపార్ట్‌మెంట్ ద్వారా జారీ చేయనైనది.

కావున జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్‌పూర్ మండలం, కొత్తపేట (ఎ.0-32 గుం), మహదేవ్‌పూర్ (ఎ.10-20 గుం), బ్రాహ్మణపల్లి (ఎ.04-01 గుం), ఎడపల్లి (ఎ.01-03 గుం), కొత్తపేట (ఎ.0-27 గుం), మహదేవ్‌పూర్ (ఎ.0-05 గుం), బ్రాహ్మణపల్లి (ఎ.01-03 గుం), కొత్తపేట (ఎ.01-19 గుం), ఎడపల్లి (ఎ.01-23 గుం), మహదేవ్‌పూర్ (ఎ.02-30 గుం), కొత్తపేట (ఎ.05-21 గుం), మహదేవ్‌పూర్ (ఎ.03-18 గుం), మహదేవ్‌పూర్ (ఎ.03- 04 గుం) మరియు బ్రాహ్మణపల్లి (ఎ.02-23 గుం.) గ్రామములోని భూముల విస్తీర్ణము ఎ. 38-29 గుంటల భూమి యొక్క వివరములు, ఈ క్రింద చూపిన వానిని భూసేకరణ పనుల ప్రారంభ నిమిత్తం ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకటన జారీ చేయనైనది.

భూముల షెడ్యూల్

గ్రామం : కొత్తపేట — మండలం : మహదేవ్‌పూర్ — జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

క్ర. సంఖ్య	సర్వే నెం.	భూమి స్వభావం (పట్టా/ ఇనాం/ ప్రభుత్వ)	ఎస్టిఆర్ విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారుని పేరు ధరణి రికార్డు/ ప్రకారంగా (తండ్రి/భర్త)	అనుభవదారు పేరు (తండ్రి/భర్త)	సర్వే విస్తీర్ణం సర్వే మెజా ప్రకారంగా (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9
1	51/1	ప్రభుత్వం	0-32	నుంజె వెంకయ్య (బాల నమ్మయ్య)	నుంజె వెంకయ్య (బాల నమ్మయ్య)	0-32	-	-
		మొత్తం	0-32					

గ్రామం : మహదేవ్‌పూర్ — మండలం : మహదేవ్‌పూర్ — జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

క్ర. సంఖ్య	సర్వే నెం.	భూమి స్వభావం (పట్టా/ ఇనాం/ ప్రభుత్వ)	ఎస్టిఆర్ విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారుని పేరు ధరణి రికార్డు/ ప్రకారంగా (తండ్రి/భర్త)	అనుభవదారు పేరు (తండ్రి/భర్త)	సర్వే విస్తీర్ణం సర్వే మెజా ప్రకారంగా (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9
1	3	పట్టా	0-11	జమీరున్నీసా (మహమూద్ ఖాన్)	జమీరున్నీసా (మహమూద్ ఖాన్)	0-11	-	-
2	4	పట్టా	0-13	నుంజె రాజన్న (చిన్న రామయ్య) నుంజె సుశీల (నాగయ్య)	నుంజె రాజన్న (చిన్న రామయ్య) నుంజె సుశీల (నాగయ్య)	0-13	-	-
3	6	పట్టా	0-24	పోతల సుశీల (మల్లయ్య) అల్లం హారిక (అల్లం శ్రీనివాస్)	పోతల సుశీల (మల్లయ్య) అల్లం హారిక (అల్లం శ్రీనివాస్)	0-24	-	-
4	7	పట్టా	0-07	పోత సతక్క (చిన్న మల్లయ్య) పోత సతక్క (చిన్న మల్లయ్య) పోత రాజయ్య (మల్లయ్య)	పోత సతక్క (చిన్న మల్లయ్య) పోత సతక్క (చిన్న మల్లయ్య) పోత రాజయ్య (మల్లయ్య)	0-07	-	-
5	168	పట్టా	0-16	ఆకుతోట నారాయణ (రామచంద్రం) పిడుగు రమేష్ (చంద్రయ్య) పిడుగు సంపత్ (పిడుగు నారాయణ)	ఆకుతోట నారాయణ (రామచంద్రం) పిడుగు రమేష్ (చంద్రయ్య) పిడుగు సంపత్ (పిడుగు నారాయణ)	0-16	-	-
6	169	పట్టా	0-13	ఆకుతోట రామచంద్రం (వెంకయ్య) ఆకుతోట నారాయణ (రామచంద్రం)	ఆకుతోట రామచంద్రం (వెంకయ్య) ఆకుతోట నారాయణ (రామచంద్రం)	0-13	-	-
7	174	పట్టా	0-08	ఆకుతోట నారాయణ (రామచంద్రం)	ఆకుతోట నారాయణ (రామచంద్రం)	0-08	-	-
8	177	పట్టా	0-09	దేవరనేని ప్రసన్న కుమార్ (రామచంద్రరావు) కొరిపెల్లి నారాయణరావు (వెంకయ్య) తడకల లక్ష్మీ (తడకల రాజయ్య)	దేవరనేని ప్రసన్న కుమార్ (రామచంద్రరావు) కొరిపెల్లి నారాయణరావు (వెంకయ్య) తడకల లక్ష్మీ (తడకల రాజయ్య)	0-09	-	-
9	180	పట్టా	0-10	దేవరనేని ప్రసన్న కుమార్ (రామచంద్రరావు) తూముల స్వజన (వెంకటలక్ష్మి నరసింహారావు)	దేవరనేని ప్రసన్న కుమార్ (రామచంద్రరావు) తూముల స్వజన (వెంకటలక్ష్మి నరసింహారావు)	0-10	-	-
10	181	పట్టా	0-06	దేవరనేని ప్రసన్న కుమార్ (రాంచెందర్‌రావు)	దేవరనేని ప్రసన్న కుమార్ (రాంచెందర్‌రావు)	0-06	-	-
11	222	పట్టా	0-10	ఆకుల బుచ్చక్క (ఆకుల రామయ్య)	ఆకుల బుచ్చక్క (ఆకుల రామయ్య)	0-10	-	-
12	223	పట్టా	0-12	పన్నాల కిషన్ (హరి) పన్నాల లీలాబాయి (కిషన్) సయ్యద్ భాజా మొయినుద్దీన్ (అఫ్రోజ్ అలీ)	పన్నాల కిషన్ (హరి) పన్నాల లీలాబాయి (కిషన్) సయ్యద్ భాజా మొయినుద్దీన్ (అఫ్రోజ్ అలీ)	0-12	-	-
13	233	పట్టా	0-09	ఆకుతోట సుధాకర్ (వెంకయ్య) ఆకుతోట రామచంద్రం (వెంకయ్య)	ఆకుతోట సుధాకర్ (వెంకయ్య) ఆకుతోట రామచంద్రం (వెంకయ్య)	0-09	-	-
14	234	పట్టా	0-13	ఆకుతోట సుధాకర్ (వెంకయ్య) ఆకుతోట రామచంద్రం (వెంకయ్య)	ఆకుతోట సుధాకర్ (వెంకయ్య) ఆకుతోట రామచంద్రం (వెంకయ్య)	0-13	-	-
15	236	పట్టా	0-08	దేవరకొండ రామక్క (మల్లయ్య)	దేవరకొండ రామక్క (మల్లయ్య)	0-08	-	-
16	238	కేకే	0-09	మహమ్మద్ ముజమ్మిల్ (మహమ్మద్ ఫాజిల్) మహమ్మద్ వజీద్ (మహమ్మద్ ఫాజిల్)	మహమ్మద్ ముజమ్మిల్ (మహమ్మద్ ఫాజిల్) మహమ్మద్ వజీద్ (మహమ్మద్ ఫాజిల్)	0-09	-	-
17	240	కేకే	0-04	దిబిముల సంపత్ (చంద్రయ్య)	దిబిముల సంపత్ (చంద్రయ్య)	0-04	-	-
18	242	పట్టా	0-07	పెంట పద్మ (శంకరయ్య)	పెంట పద్మ (శంకరయ్య)	0-07	-	-
19	243	పట్టా	0-08	కవ్వల రమేష్ (నర్సయ్య) కవ్వల మహేష్ (నర్సయ్య)	కవ్వల రమేష్ (నర్సయ్య) కవ్వల మహేష్ (నర్సయ్య)	0-08	-	-
20	246	పట్టా	0-07	కవ్వల రమేష్ (నర్సయ్య) కవ్వల మహేష్ (నర్సయ్య)	కవ్వల రమేష్ (నర్సయ్య) కవ్వల మహేష్ (నర్సయ్య)	0-07	-	-
21	247	పట్టా	0-12	అదప లక్ష్మీనారాయణ (రాజం)	అదప లక్ష్మీనారాయణ (రాజం)	0-12	-	-
22	248	కేకే	0-09	మాకల బాపు (రాజం) వెన్నపురెడ్డి మల్లయ్య (లచ్చిరెడ్డి) ఎర్రబెల్లి మంజుల (రవీందర్‌రావు) మాకల పార్వతి (మాకల శంకరయ్య) కొరిపెల్లి భాగ్యలక్ష్మి (రాజేశ్వరరావు)	మాకల బాపు (రాజం) వెన్నపురెడ్డి మల్లయ్య (లచ్చిరెడ్డి) ఎర్రబెల్లి మంజుల (రవీందర్‌రావు) మాకల పార్వతి (మాకల శంకరయ్య) కొరిపెల్లి భాగ్యలక్ష్మి (రాజేశ్వరరావు)	0-09	-	-
23	249	పట్టా	0-06	మహమ్మద్ ముజమ్మిల్ (మహమ్మద్ ఫాజిల్) మహమద్ వజీద్ (మహమ్మద్ ఫాజిల్)	మహమ్మద్ ముజమ్మిల్ (మహమ్మద్ ఫాజిల్) మహమద్ వజీద్ (మహమ్మద్ ఫాజిల్)	0-06	-	-
24	250	పట్టా	0-09	సయ్యద్ నబీబర్ (అబ్దుల్ రెహమాన్) సయ్యద్ ముజీబర్ (సయ్యద్ మహబూబ్) మొహమ్మద్ ఖైరున్నీసా (మహమ్మద్ ఇద్రిస్)	సయ్యద్ నబీబర్ (అబ్దుల్ రెహమాన్) సయ్యద్ ముజీబర్ (సయ్యద్ మహబూబ్) మొహమ్మద్ ఖైరున్నీసా (మహమ్మద్ ఇద్రిస్)	0-09	-	-
25	251	పట్టా	0-19	మూశా మదునమ్మ (నమ్మయ్య) ఆకుతోట నారాయణ (రామచంద్రం) ఆకుతోట సతీష్‌కుమార్ (లింగయ్య) ఆకుతోట సమ్మయ్య (వెంకయ్య)	మూశా మదునమ్మ (నమ్మయ్య) ఆకుతోట నారాయణ (రామచంద్రం) ఆకుతోట సతీష్‌కుమార్ (లింగయ్య) ఆకుతోట సమ్మయ్య (వెంకయ్య)	0-19	-	-
26	252	పట్టా	0-04	ఆకుతోట సుధాకర్ (వెంకయ్య) కొఱతం సూర్య (నమ్మయ్య) మూశా మదునమ్మ (నమ్మయ్య)	ఆకుతోట నారాయణ (రామచంద్రం) కొఱతం సూర్య (నమ్మయ్య) మూశా మదునమ్మ (నమ్మయ్య)	0-04	-	-
27	260	పట్టా	0-01	జాగరి రామయ్య (అశయ్య)	జాగరి రామయ్య (అశయ్య)	0-01	-	-
28	262	పట్టా	0-10	మొహమ్మద్ బాలొద్దీన్ (భాషం)	మొహమ్మద్ బాలొద్దీన్ (భాషం)	0-10	-	-
29	263	పట్టా	0-12	పోత సతక్క (చిన్న మల్లయ్య) పోత రాజయ్య (మల్లయ్య) అరుట్ల కృష్ణమాచారి (రామాచారి)	పోత సతక్క (చిన్న మల్లయ్య) పోత రాజయ్య (మల్లయ్య) అరుట్ల కృష్ణమాచారి (రామాచారి)	0-12	-	-
30	270	పట్టా	0-15	పెజ్జెని సంపత్‌కుమార్ (పోచయ్య) కుర్ర అమృత (వెంకటి) పెజ్జెని సందీప్ కుమార్ (పోచయ్య) పిడుగు సంపత్ (పిడుగు నారాయణ) వీరమల్ల వెంకటేష్ (లక్ష్మణ్)	పోత సతక్క (చిన్న మల్లయ్య) కుర్ర అమృత (వెంకటి) పెజ్జెని సందీప్ కుమార్ (పోచయ్య) పిడుగు సంపత్ (పిడుగు నారాయణ) వీరమల్ల వెంకటేష్ (లక్ష్మణ్)	0-15	-	-
31	273	పట్టా	0-04	ఠాకూర్ హేమలత (దుర్గాసింగ్) ఠకుర్ రూప్సింగ్ (దుర్గాసింగ్)	ఠాకూర్ హేమలత (దుర్గాసింగ్) ఠకుర్ రూప్సింగ్ (దుర్గాసింగ్)	0-04	-	-
32	274	పట్టా	0-23	మానేం సంఅలక్ష్మి (శంకర్) ఠాకూర్ హేమలత (దుర్గాసింగ్) ఠాకూర్ రూప్సింగ్ (దుర్గాసింగ్) వెన్నపురెడ్డి మల్లయ్య (లచ్చిరెడ్డి) వెన్నపురెడ్డి రమేష్ (లచయ్య)	మానేం సంఅలక్ష్మి (శంకర్) ఠాకూర్ హేమలత (దుర్గాసింగ్) ఠాకూర్ రూప్సింగ్ (దుర్గాసింగ్) వెన్నపురెడ్డి మల్లయ్య (లచ్చిరెడ్డి) వెన్నపురెడ్డి రమేష్ (లచయ్య)	0-23	-	-
33	633	పట్టా	0-01	తిరుపతి లక్ష్మణస్వామి (శాల్తాపిల్ల స్వామి) పిడుగు కిష్టయ్య (ఓదేలు)	తిరుపతి లక్ష్మణస్వామి (శాల్తాపిల్ల స్వామి) పిడుగు కిష్టయ్య (ఓదేలు)	0-01	-	-
34	646/1	బీడకల	0-01	బిబిపెట్టల కిష్టయ్య (లచ్చయ్య)	బిబిపెట్టల కిష్టయ్య (లచ్చయ్య)	0-01	-	-
35	646/2	బీడకల	0-09	-	-	0-09	-	-
36	647/4	బీడకల	0-04	తుంగళ మధుకర్ (రాజయ్య) తుంగళ రామయ్య (కిష్టయ్య) తుంగళ సమ్మయ్య (రాజయ్య)	తుంగళ మధుకర్ (రాజయ్య) తుంగళ రామయ్య (కిష్టయ్య) తుంగళ సమ్మయ్య (రాజయ్య)	0-04	-	-
37	648/1	పట్టా	0-10	అమర్ ఖాన్ (అఫ్రోజ్ ఖాన్)	అమర్ ఖాన్ (అఫ్రోజ్ ఖాన్)	0-10	-	-
38	648/2	పట్టా	0-20	-	-	0-20	-	-
39	649	పట్టా	0-05	నరిశెట్టి నర్సయ్య (వెంకయ్య)	నరిశెట్టి నర్సయ్య (వెంకయ్య)	0-05	-	-
40	650	పట్టా	0-08	తుంగళ మధుకర్ (రాజయ్య) ఆకుల లింగయ్య (రామయ్య)	తుంగళ మధుకర్ (రాజయ్య) ఆకుల లింగయ్య (రామయ్య)	0-08	-	-
41	651	పట్టా	0-06	ఎండీ హబీబ్ ఉన్నీసా బేగం (ఎండీ ఇస్మాయిల్ ఖాన్)	ఎండీ హబీబ్ ఉన్నీసా బేగం (ఎండీ ఇస్మాయిల్ ఖాన్)	0-06	-	-
42	700	పట్టా	0-15	పిడుగు పోచమల్లు (ఓదేలు) పిడుగు కిష్టయ్య (లక్ష్మణ్ సింగ్)	పిడుగు పోచమల్లు (ఓదేలు) పిడుగు కిష్టయ్య (లక్ష్మణ్ సింగ్)	0-15	-	-
43	701	బీడకల	0-02	టి. రాజన్ సింగ్ (లక్ష్మణ్ సింగ్)	టి. రాజన్ సింగ్ (లక్ష్మణ్ సింగ్)	0-02	-	-
44	702	పట్టా	0-08	పోతా సతక్క (చిన్నమల్లయ్య) తుంగళ మధుకర్ (రాజయ్య) తుపాకుల రాములు (మల్లయ్య) తుంగలా చిన్న శంకరయ్య (రాజయ్య) నుంజే చంద్రయ్య (పాపయ్య)	పోతా సతక్క (చిన్నమల్లయ్య) తుంగళ మధుకర్ (రాజయ్య) తుపాకుల రాములు (మల్లయ్య) తుంగలా చిన్న శంకరయ్య (రాజయ్య) నుంజే చంద్రయ్య (పాపయ్య)	0-08	-	-
45	రోడ్డు-1	పట్టా	0-01	-	-	0-01		
46	రోడ్డు-1	పట్టా	0-02	-	-	0-02		
		మొత్తం	10-20					

గ్రామం : బ్రాహ్మణపల్లి — మండలం : మహదేవ్‌పూర్ — జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

క్ర. సంఖ్య	సర్వే నెం.	భూమి స్వభావం (పట్టా/ ఇనాం/ ప్రభుత్వ)	ఎస్టిఆర్ విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారుని పేరు ధరణి రికార్డు/ ప్రకారంగా (తండ్రి/భర్త)	అనుభవదారు పేరు (తండ్రి/భర్త)	సర్వే విస్తీర్ణం సర్వే మెజా ప్రకారంగా (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9
1	36	పట్టా	0-31	బెజ్జెనీ లక్ష్మి(ముత్యాలు) దేవరనేని రాజయ్య (వెంకయ్య)	బెజ్జెనీ లక్ష్మి(ముత్యాలు) దేవరనేని రాజయ్య (వెంకయ్య)	0-31	-	-
2	37	పట్టా	0-25	పెంద్యాల లక్ష్మీ నారాయణ (నర్సయ్య) కొరిపెల్లి పూర్ణచందర్ (లక్ష్మీనారాయణ) పిట్టల రాములు (రాజయ్య) కొరిపెల్లి ప్రదీప్‌రావు (లక్ష్మీ రాజయ్య) శీలం శ్రీలత (లాస్యయ్య) శ్యామల వెంకటి (మల్లయ్య)	పెంద్యాల లక్ష్మీ నారాయణ (నర్సయ్య) కొరిపెల్లి పూర్ణచందర్ (లక్ష్మీనారాయణ) పిట్టల రాములు (రాజయ్య) కొరిపెల్లి ప్రదీప్‌రావు (లక్ష్మీ రాజయ్య) శీలం శ్రీలత (లాస్యయ్య) శ్యామల వెంకటి (మల్లయ్య)	0-25		
3	42/1	పట్టా	0-04	ఆకుతోట నారాయణ (రామచంద్రం) పెంద్యాల కావ్య (నరసింహా స్వామి) పరాల రామలచ్మ (దుర్గయ్య) కొరిపెల్లి ప్రశాంత్ (రాఘవరావు)	ఆకుతోట నారాయణ (రామచంద్రం) పెంద్యాల కావ్య (నరసింహా స్వామి) పరాల రామలచ్మ (దుర్గయ్య) కొరిపెల్లి ప్రశాంత్ (రాఘవరావు)	0-04		
4	43/1	పట్టా	0-19	తడకల చిన రాజయ్య (నాగయ్య) తడకల జగదీశ్వర్ (రాజయ్య) కొరిపెల్లి నారాయణరావు (వెంకయ్య) సముద్రాల సంజీవరావు (రామారావు)	తడకల చిన రాజయ్య (నాగయ్య) తడకల జగదీశ్వర్ (రాజయ్య) కొరిపెల్లి నారాయణరావు (వెంకయ్య) సముద్రాల సంజీవరావు (రామారావు)	0-19		
5.	43/2	పట్టా	0-2	-	-	0-02		
6.	43/3	పట్టా	0-14	-	-	0-14		
7.	46	పట్టా	0-29	ఆకుల రంగయ్య (నరహరి) ఆకుల శ్రీమన్నారాయణ (రంగయ్య)	ఆకుల రంగయ్య (నరహరి) ఆకుల శ్రీమన్నారాయణ (రంగయ్య)	0-29		
8.	47	పట్టా	0-20	తడకల శ్యామల (మహేష్) తడకల రాములు (చిన్న రాజయ్య)	తడకల శ్యామల (మహేష్) తడకల రాములు (చిన్న రాజయ్య)	0-20		
9.	90	పట్టా	0-16	మేడిసేని కృష్ణారావు (కేశవరావు) మేడిసేని రాజేశ్వరరావు (కేశవరావు)	మేడిసేని కృష్ణారావు (కేశవరావు) మేడిసేని రాజేశ్వరరావు (కేశవరావు)	0-16		
10.	92	పట్టా	0-01	పొలుసాని వంశ వర్ధన్ రావు (శ్రీనివాసరావు)	పొలుసాని వంశ వర్ధన్ రావు (శ్రీనివాసరావు)	0-01		
	మొత్తం		04-01			04-01		

గ్రామం : ఎడపల్లి — మండలం : మహదేవ్‌పూర్ — జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

క్ర. సంఖ్య	సర్వే నెం.	భూమి స్వభావం (పట్టా/ ఇనాం/ ప్రభుత్వ)	ఎస్టిఆర్ విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారుని పేరు ధరణి రికార్డు/ ప్రకారంగా (తండ్రి/భర్త)	అనుభవదారు పేరు (తండ్రి/భర్త)	సర్వే విస్తీర్ణం సర్వే మెజా ప్రకారంగా (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9
1	52/1	ట్రైబలుబంధి	0-11	గోరెంట్ల వీరయ్య (రాజన్న) గోరెంట్ల మల్లయ్య (వీరయ్య) కుమ్మరి పెద లచ్చయ్య (వీరయ్య) కుమ్మరి చిన్న లచ్చయ్య (పోచం) కుమ్మరి రోషయ్య (లచయ్య) బైరి బతుకయ్య (వీరయ్య) తుంగళ మల్లయ్య కుమ్మరి సమ్మయ్య (బాలయ్య) కుమ్మరి మల్లయ్య (వీరయ్య) గొర్రె లక్ష్మి (రాజయ్య) గొందుగ సుగుణ (రాజయ్య) చేకుర్తి బసయ్య (దుర్గయ్య) దుర్గం మల్లయ్య (రాజం) నల్లా శ్రీనివాస్ (బొందయ్య) గొర్రె శివశంకర్ (రాజయ్య)	గోరెంట్ల వీరయ్య (రాజన్న) గోరెంట్ల మల్లయ్య (వీరయ్య) కుమ్మరి పెద లచ్చయ్య (వీరయ్య) కుమ్మరి చిన్న లచ్చయ్య (పోచం) కుమ్మరి రోషయ్య (లచయ్య) బైరి బతుకయ్య (వీరయ్య) తుంగళ మల్లయ్య కుమ్మరి సమ్మయ్య (బాలయ్య) కుమ్మరి మల్లయ్య (వీరయ్య) గొర్రె లక్ష్మి (రాజయ్య) గొందుగ సుగుణ (రాజయ్య) చేకుర్తి బసయ్య (దుర్గయ్య) దుర్గం మల్లయ్య (రాజం) నల్లా శ్రీనివాస్ (బొందయ్య) గొర్రె శివశంకర్ (రాజయ్య)	0-11		
2	59	పట్టా	0-10	బుడే కిషన్ (రామాచారి)	బుడే కిషన్ (రామాచారి)	0-10		పహాణీ 2015-16 ప్రకారం
3	60/1	పిపి	0-04	బొగద సత్తయ్య (బతుకయ్య) బోగద రాజు (బతుకయ్య) గోగుల చిన్న మల్లయ్య (మల్లయ్య)	బొగద సత్తయ్య (బతుకయ్య) బోగద రాజు (బతుకయ్య) గోగుల చిన్న మల్లయ్య (మల్లయ్య)	0-04		
4.	60/2	పిపి	0-08	-	-	0-08	-	-
5.	60/3	పిపి	0-02	-	-	0-02	-	-
6.	63/1	ట్రైబలుబంధి	0-08	రెడ్డి బతుకమ్మ (చిన్నమల్లు) కురుకు లావణ్య (శివాజీ)	రెడ్డి బతుకమ్మ (చిన్నమల్లు) కురుకు లావణ్య (శివాజీ)	0-08	-	-
	మొత్తం		01-03					

గ్రామం : కొత్తపేట — మండలం : మహదేవ్‌పూర్ — జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

క్ర. సంఖ్య	సర్వే నెం.	భూమి స్వభావం (పట్టా/ ఇనాం/ ప్రభుత్వ)	ఎస్టిఆర్ విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారుని పేరు ధరణి రికార్డు/ ప్రకారంగా (తండ్రి/భర్త)	అనుభవదారు పేరు (తండ్రి/భర్త)	సర్వే విస్తీర్ణం మెజా సర్వే ప్రకారంగా (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9
1	52/1	ప్రభుత్వం	0-27	దుర్గం సోమయ్య (పోచం)	దుర్గం సోమయ్య (పోచం)	0-27	-	-
	మొత్తం		0-27					

గ్రామం : మహదేవ్‌పూర్ — మండలం : మహదేవ్‌పూర్ — జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

క్ర. సంఖ్య	సర్వే నెం.	భూమి స్వభావం (పట్టా/ ఇనాం/ ప్రభుత్వ)	ఎస్టిఆర్ విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారుని పేరు ధరణి రికార్డు/ ప్రకారంగా (తండ్రి/భర్త)	అనుభవదారు పేరు (తండ్రి/భర్త)	సర్వే విస్తీర్ణం మెజా సర్వే ప్రకారంగా (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9
1	151/1	పట్టా	0-05	కొమ్ము హారిక (మధుకర్) కవ్వల చంద్రశేఖర్ (మల్లయ్య)	కొమ్ము హారిక (మధుకర్) కవ్వల చంద్రశేఖర్ (మల్లయ్య)	0-05	-	-
	మొత్తం		0-05					

గ్రామం : బ్రాహ్మణపల్లి — మండలం : మహదేవ్‌పూర్ — జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

క్ర. సంఖ్య	సర్వే నెం.	భూమి స్వభావం (పట్టా/ ఇనాం/ ప్రభుత్వ)	ఎస్టిఆర్ విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారుని పేరు ధరణి రికార్డు/ ప్రకారంగా (తండ్రి/భర్త)	అనుభవదారు పేరు (తండ్రి/భర్త)	సర్వే విస్తీర్ణం మెజా సర్వే ప్రకారంగా (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9
1	41	పట్టా	0-16	పెంద్యాల నరసింహస్వామి (సమ్మయ్య) పెంద్యాల కావ్య (నరసింహస్వామి) కొరిపెల్లి శారద (మాధవరావు)	పెంద్యాల నరసింహస్వామి (సమ్మయ్య) పెంద్యాల కావ్య (నరసింహస్వామి) కొరిపెల్లి శారద (మాధవరావు)	0-16	-	-
2	42/3	పట్టా	0-14	పెంద్యాల నరసింహస్వామి (సమ్మయ్య)	పెంద్యాల నరసింహస్వామి (సమ్మయ్య)	0-14	-	-
3	43/3/3	పట్టా	0-07	తడకల చిన రాజయ్య (నాగయ్య) తడకల జగదీశ్వర్ (రాజయ్య) కొరిపెల్లి నారాయణరావు (వెంకయ్య) సముద్రాల సంజీవరావు (రామారావు)	తడకల చిన రాజయ్య (నాగయ్య) తడకల జగదీశ్వర్ (రాజయ్య) కొరిపెల్లి నారాయణరావు (వెంకయ్య) సముద్రాల సంజీవరావు (రామారావు)	0-07	-	-
4	44	పట్టా	0-03	తాటికొండ వెంకయ్య (చిన్నయ్య)	తాటికొండ వెంకయ్య (చిన్నయ్య)	0-03	-	-
5	53	పట్టా	0-01	ఆకుతోట రాజకుమార్ (సుధాకర్) పూసల లక్ష్మీ నారాయణ (రామచంద్రం) బోనాల శారద (బాపు)	ఆకుతోట రాజకుమార్ (సుధాకర్) పూసల లక్ష్మీ నారాయణ (రామచంద్రం) బోనాల శారద (బాపు)	0-01	-	-
6	54	పట్టా	0-02	ఆకుతోట రాకేష్ (రాజగోళి) మహేష్ లలితా దేవి (లింగారావు) పరాల రాధమ్మ (మల్లయ్య) పరాల శ్రవణ్ (శ్రీనివాస్)	ఆకుతోట రాకేష్ (రాజగోళి) మహేష్ లలితా దేవి (లింగారావు) పరాల రాధమ్మ (మల్లయ్య) పరాల శ్రవణ్ (శ్రీనివాస్)	0-02	-	-
	మొత్తం		01-03					

గ్రామం : కొత్తపేట — మండలం : మహదేవ్‌పూర్ — జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

క్ర. సంఖ్య	సర్వే నెం.	భూమి స్వభావం (పట్టా/ ఇనాం/ ప్రభుత్వ)	ఎస్టిఆర్ విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారుని పేరు ధరణి రికార్డు/ ప్రకారంగా (తండ్రి/భర్త)	అనుభవదారు పేరు (తండ్రి/భర్త)	సర్వే విస్తీర్ణం మెజా సర్వే ప్రకారంగా (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9
1	32	పట్టా	0-17	నీలారపు లింగయ్య (రాజయ్య)	నీలారపు లింగయ్య (రాజయ్య)	0-17	-	-
2	33	పట్టా	0-17	తాతా మల్లయ్య (ఓదేలు)	తాతా మల్లయ్య (ఓదేలు)	0-17	-	-
3	34	పట్టా	0-24	తాతా సమ్మయ్య (ఓదేలు) ఇమ్మడి నవశ్ కుమార్ (జగదీశ్వర్) బండి కృష్ణవేణి (బండి సురేష్)	తాతా సమ్మయ్య (ఓదేలు) ఇమ్మడి నవశ్ కుమార్ (జగదీశ్వర్) బండి కృష్ణవేణి (బండి సురేష్)	0-24	-	-
4	41	పట్టా	0-01	తనుగుల సుధాకర్ (రాజలింగు) తుంగల రాజశేఖర్ (తుంగల రాజశేఖర్)	తనుగుల సుధాకర్ (రాజలింగు) తుంగల రాజశేఖర్ (తుంగల రాజశేఖర్)	0-01	-	-
		మొత్తం	01-19					

గ్రామం : ఎడపల్లి — మండలం : మహదేవ్‌పూర్ — జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

క్ర. సంఖ్య	సర్వే నెం.	భూమి స్వభావం (పట్టా/ ఇనాం/ ప్రభుత్వ)	ఎస్టిఆర్ విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారుని పేరు ధరణి రికార్డు/ ప్రకారంగా (తండ్రి/భర్త)	అనుభవదారు పేరు (తండ్రి/భర్త)	సర్వే విస్తీర్ణం సర్వే మెజా ప్రకారంగా (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9
1	44	పట్టా	0-38	పెంద్యాల నర్సింహస్వామి (సమ్మయ్య) గోగుల రాజయ్య (దుర్గయ్య) భామర్ రాజేందర్ (శంకర్‌సింగ్) అరుట్ల కృష్ణమాచారి (రామాచారి) పోత రాజబాపు (జిగ్గయ్య) సన్నారి రాజేకుమార్ (ఐక్కయ్య)	పెంద్యాల నర్సింహస్వామి (సమ్మయ్య) గోగుల రాజయ్య (దుర్గయ్య) భామర్ రాజేందర్ (శంకర్‌సింగ్) అరుట్ల కృష్ణమాచారి (రామాచారి) పోత రాజబాపు (జిగ్గయ్య) సన్నారి రాజేకుమార్ (ఐక్కయ్య)	0-38	-	-
2	49	పట్టా	0-25	సన్నారి ఐక్కయ్య (రాజయ్య) కుమ్మరి చిన్నమల్లయ్య (చిన్నయ్య) బడిసె రాజబాపు (బోమయ్య) అరుట్ల కృష్ణమాచారి (రామాచారి) భామర్ రామ్‌చరణ్‌సింగ్ (రాజేందర్) యండి.అబ్దుల్ రెహమాన్ ఖాన్ (అతౌర్ రెహమాన్‌ఖాన్)	సన్నారి ఐక్కయ్య (రాజయ్య) కుమ్మరి చిన్నమల్లయ్య (చిన్నయ్య) బడిసె రాజబాపు (బోమయ్య) అరుట్ల కృష్ణమాచారి (రామాచారి) భామర్ రామ్‌చరణ్‌సింగ్ (రాజేందర్) యండి.అబ్దుల్ రెహమాన్ ఖాన్ (అతౌర్ రెహమాన్‌ఖాన్)	0-25	-	-
		మొత్తం	01-23					

గ్రామం : మహదేవ్‌పూర్ — మండలం : మహదేవ్‌పూర్ — జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

క్ర. సంఖ్య	సర్వే నెం.	భూమి స్వభావం (పట్టా/ ఇనాం/ ప్రభుత్వ)	ఎస్టిఆర్ విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారుని పేరు ధరణి రికార్డు/ ప్రకారంగా (తండ్రి/భర్త)	అనుభవదారు పేరు (తండ్రి/భర్త)	సర్వే విస్తీర్ణం సర్వే మెజా ప్రకారంగా (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9
1	77	పట్టా	0-10	రాగి ప్రభాకర్ చారి (రాజగోళి) చీలం మల్లక్క (లాస్యయ్య) పోత లక్ష్మి (రాజబాపు) జాడి అర్చన (శ్రీశైలం) రాగి కరుణాకర్‌చారి (ప్రభాకర చారి) జాడి శ్రీశైలం (రామయ్య)	రాగి ప్రభాకర్ చారి (రాజగోళి) చీలం మల్లక్క (లాస్యయ్య) పోత లక్ష్మి (రాజబాపు) జాడి అర్చన (శ్రీశైలం) రాగి కరుణాకర్‌చారి (ప్రభాకర చారి) జాడి శ్రీశైలం (రామయ్య)	0-10	-	-
2	79	పట్టా	0-23	పోతా రామకృష్ణ (వెంకటస్వామి)	పోతా రామకృష్ణ (వెంకటస్వామి)	0-23	-	-
3	83	పట్టా	0-20	పోతా వెంకటస్వామి (లచ్చయ్య) పోత శ్రీనివాస్ (వెంకయ్య) పోతా రామచంద్రం (లచ్చయ్య) పిడుగు దేవేంద్ర (మల్లయ్య)	పోతా వెంకటస్వామి (లచ్చయ్య) పోత శ్రీనివాస్ (వెంకయ్య) పోతా రామచంద్రం (లచ్చయ్య) పిడుగు దేవేంద్ర (మల్లయ్య)	0-20	-	-
4	84	పట్టా	0-28	పోతా బాపు (పోచం) భూసనబోయిన సమ్మయ్య (రామయ్య) పోతా రమేష్ (మల్లయ్య) పోతా రామకృష్ణ (పోచం) బైరి రజిత (బైరి వేణుమాధవ్) పోతా సమ్మయ్య (మల్లయ్య)	పోతా బాపు (పోచం) భూసనబోయిన సమ్మయ్య (రామయ్య) పోతా రమేష్ (మల్లయ్య) పోతా రామకృష్ణ (పోచం) బైరి రజిత (బైరి వేణుమాధవ్) పోతా సమ్మయ్య (మల్లయ్య)	0-28	-	-
5	85	కేకే	0-14	కొప్పుల పద్మ (సమ్మయ్య) చిన్నపోత వెంకటస్వామి (పోచం) వేముపూరి వెంకటరెడ్డి (లింగయ్య)	కొప్పుల పద్మ (సమ్మయ్య) చిన్నపోత వెంకటస్వామి (పోచం) వేముపూరి వెంకటరెడ్డి (లింగయ్య)	0-14	-	-
6	86	పట్టా	0-15	నుంజే కృష్ణమూర్తి (పోచం) తుంగళ సమ్మయ్య (పోచం)	నుంజే కృష్ణమూర్తి (పోచం) తుంగళ సమ్మయ్య (పోచం)	0-15	-	-
		మొత్తం	02-30					

గ్రామం : కొత్తపేట — మండలం : మహదేవ్‌పూర్ — జిల్లా : జయశంకర్ భూపాలపల్లి

క్ర. సంఖ్య	సర్వే నెం.	భూమి స్వభావం (పట్టా/ ఇనాం/ ప్రభుత్వ)	ఎస్టిఆర్ విస్తీర్ణం (ఎ.-గుం.)	పట్టాదారుని పేరు ధరణి రికార్డు/ ప్రకారంగా (తండ్రి/భర్త)	అనుభవదారు పేరు (తండ్రి/భర్త)	సర్వే విస్తీర్ణం సర్వే మెజా ప్రకారంగా (ఎ.-గుం.)	చెట్లు/ నిర్మాణాలు	రిమార్కులు
1	2	3	4	5	6	7	8	9
1	16	పట్టా	0-04	సోహెరా భాను (ఎండి భాషం)	సోహెరా భాను (ఎండి భాషం)	0-04	-	2015-16 పహాణీ ప్రకారం

(మిగతా 7వ పేజీలో...)

భారత్‌పై 'ఎక్స్' పిటిషన్

బెంగళూరు: చట్ట వ్యతిరేక కంటెంట్, సెన్సార్ షిప్ పేరుతో భారత ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందంటూ ఎలాన్ మస్క్‌కు చెందిన 'ఎక్స్' కర్ణాటక హైకోర్టులో పిటిషన్ వేసింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టానికి ముఖ్యంగా సెక్షన్ 79(3)(బీ) విషయంలో 2015 నాటి శ్రేయా సంఘాల్ కేసులో సుప్రీం కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తోందని, ఆన్‌లైన్‌లో భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తోందని ఆరోపించింది. జ్యుడీషియల్ ప్రక్రియకు లోబడి కంటెంట్‌ను బ్లాక్ చేయడం లేదా సెక్షన్ 69 ఏ ప్రకారం చట్ట ప్రకారం చర్య తీసుకోవాలన్న నిబంధనలను భారత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొంది. కాగా, ప్రభుత్వ



నోటిఫికేషన్ లేదా కోర్టు ఉత్తర్వుతో అక్రమ కంటెంట్‌ను ఆన్‌లైన్ వేదికలు తొలగించడం తప్పనిసరని ఐటీ చట్టంలోని 79(3)(బీ) చెబుతోంది. 36 గంటల్లోగా ఆ విధంగా చేయకుంటే, సంబంధిత వేదికలకు సెక్షన్ 79(1) ప్రకారం రక్షణలను కోల్పోతుంది. ఐపీసీ తదితర చట్టాల ప్రకారం ఆ వేదికలపై చర్యలు తీసుకునే అవకాశమేర్పడుతుంది. అయితే, ఈ నిబంధనను వాడుకుంటూ స్వతంత్రంగా కంటెంట్‌ను బ్లాక్ చేసే అధికారం ప్రభుత్వానికి లేదన్నది ఎక్స్ వాదన. తగు ప్రక్రియను అనుసరించకుండా అధికారులు ఏకపక్షంగా కంటెంట్ సెన్సార్ షిప్ విధిస్తూ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తోంది. అదేవిధంగా, సామాజిక మాధ్యమ వేదికలు, పోలీసులు, దర్యాప్తు విభాగాల మధ్య సమన్వయం కోసం హోం శాఖ పర్యవేక్షణలో ఏర్పాటైన సహయోగ్ పోర్టల్‌ను ఎక్స్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. న్యాయపరమైన సమీక్ష లేకుండానే ఫలానా కంటెంట్‌ను తొలగించాలంటూ 'సహయోగ్'నేరుగా తమపై ఒత్తిడి చేస్తోందని కూడా 'ఎక్స్'అంటోంది.



ఫిన్లాండ్ వెరీ వెరీ హ్యాపీ

ఉక్రెయిన్, పాలస్తీనాల కన్నా వెనుకబడ్డ భారత్

వాషింగ్టన్/ లండన్: రోజువారీ జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురైనాసరే వాటిని సమర్థవంతంగా పరిష్కరించుకుంటూ ముందుకుసాగే పౌరులున్న దేశంలో నిరంతరం ఆనందం వెల్లివిరుస్తుంది. ఫిన్లాండ్‌లో ప్రజలు ఆనందమయ జీవితాన్ని గడుపుతున్నారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. గురువారం విడుదలైన ప్రపంచ ఆనందమయ దేశాల నివేదిక–2025లో ఫిన్లాండ్ అత్యంత సంతోషకర దేశంగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. నంబర్‌వన్ ర్యాంక్‌ను ఫిన్లాండ్ సాధించడం ఇది వరసగా ఎనిమిదోసారి కావడం విశేషం. డెన్మార్క్, ఐస్‌లాండ్, స్వీడన్ ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. భారత్ 118వ ర్యాంక్ సాధించింది. ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలోని వెల్‌బీయింగ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ వార్షిక నివేదికను రూపొందించారు. ఆయా దేశాల పౌరుల ఆదాయాల వ్యయాలు, వృద్ధి మాత్రమే కాకుండా వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాలు, పరస్పర నమ్మకం, సామాజిక మద్దతు, ఆత్మ సంతృప్తి, ఆయుర్దాయం, స్వేచ్ఛ, దానగుణం, అవినీతి స్థాయి తదితర అంశాలను బేరీజు వేసుకుని ఈ నివేదికకు తుదిరూపునిచ్చారు. మీ జీవితాలకు మీరు ఎంత రేటింగ్ ఇచ్చుకుంటారు? వంటి విభిన్నమైన ప్రశ్నలకు ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాల ప్రజల సమాధానాలు రాబట్టి నివేదికను తయారుచేశారు. విశ్లేషణ సంస్థ గాలప్, అమెరికా సుస్థిరాభివృద్ధి పరిష్కారాల నెట్‌వర్క్‌లతో కలిసి ఈ నివేదికను సిద్ధంచేశారు. అంతర్జాతీయ ఆనందమయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఈ జాబితాను విడుదల చేశారు.

భారత్ కంటే మెరుగైన స్థానంలో పొరుగుదేశాలు

గత ఏడాది 126వ ర్యాంక్‌తో పోలిస్తే భారత్ ఈసారి మెరుగ్గా 118వ ర్యాంక్ సాధించింది. అయితే భారత్‌కు పొరుగున ఉన్న దేశాలు అంతకంటే మెరుగైన స్థానాల్లో నిలిచాయి. చైనా 68వ ర్యాంక్, నేపాల్ 92 ర్యాంక్, పాకిస్తాన్ 109వ ర్యాంక్ సాధించాయి. యుద్ధంలో మునిగిపోయిన పాలస్తీనా ప్రాంతం, ఉక్రెయిన్ సైతం భారత్ కంటే మెరుగైన ర్యాంక్‌లు పొందటం విశేషం. పాలస్తీనా ప్రాంతం 108వ ర్యాంక్, ఉక్రెయిన్ 111వ ర్యాంక్ సాధించాయి. అయితే శ్రీలంక 133వ ర్యాంక్, బంగ్లాదేశ్ 134వ ర్యాంక్‌తో సరిపెట్టుకున్నాయి. బ్రిటన్‌కు 23 ర్యాంక్ దక్కింది. మొత్తం జాబితాలో అఫ్గానిస్తాన్ చిట్టచివరన నిలిచింది. గత ఏడాది అఫ్గానిస్తాన్‌కు 143వ ర్యాంక్ వస్తే ఈఏడాది 147వ ర్యాంక్ వచ్చింది.

అమెరికాకు 24వ ర్యాంక్

ప్రపంచ పెద్దన్నగా అన్ని దేశాలపై అమెరికా ఆధిపత్యం చెలాయిస్తోందిగానీ ఆ దేశ ప్రజలు ఆనంద విషయంలో అంతేస్థాయిలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకోలేకపోయారు. అమెరికా కేవలం 24వ ర్యాంక్‌తో సరిపెట్టుకుంది. 13 ఏళ్ల క్రితం 11వ స్థానంలో ఉన్న అమెరికా ఇప్పుడు 24వ ర్యాంక్‌కు పడిపోయింది. ఇక హమాస్ యుద్ధంతో ఇజ్రాయెల్ పౌరులు విసిగిపోయారని వార్తలొస్తున్నా వ్యక్తిగత, సమాజ జీవితంలో వాళ్లు మెరుగ్గా ఉన్నారని నివేదిక ప్రకటించింది. జాబితాలో ఇజ్రాయెల్ 8వ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. నెదర్లాండ్స్ (5), కోస్టారికా (6), నార్వే (7), ఇజ్రాయెల్ (8), లక్సెంబర్గ్ (9), మెక్సికో (10) తొలి 10 ఆనందమయ దేశాల జాబితాలో చోటు దక్కించుకున్నాయి. కోస్టారికా, మెక్సికోలు టాప్–10లో నిలవడం ఇదే తొలిసారి.

మిత్ర దేశమే..కానీ టారిఫ్‌లే

ఇండియాతో అదే ఏకైక సమస్య ● డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి

వాషింగ్టన్: ఇండియాతో తమకు చక్కటి స్నేహ సంబంధాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. కానీ, ఇండియాలో టారిఫ్‌లు అధికంగా విధిస్తున్నారని మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అత్యధిక టారిఫ్‌లు విధిస్తున్న దేశాల్లో ఇండియా కూడా ఉందని, ఆ దేశంతో అదే ఏకైక సమస్య అని పేర్కొన్నారు. విదేశీ ఉత్పత్తులపై ఏప్రిల్ 2వ తేదీ నుంచి టారిఫ్‌లు వసూలు చేయబోతున్నట్లు ట్రంప్ పునరుద్ఘాటించారు. ఈ నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదన్నారు. అమెరికా ఉత్పత్తులపై అధిక టారిఫ్‌లు విధిస్తున్న దేశాల ఉత్పత్తులపైనా తాము అలాంటి చర్య తీసుకోబోతున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. అమెరికా–ఇండియా సంబంధాలపై చర్చించారు. అమెరికా ఉత్పత్తులపై ఇండియాలో సుంకాలను క్రమంగా తగ్గిస్తారన్న విశ్వాసం తనకు ఉందని వ్యాఖ్యానించారు. ఇండియాతో తనకున్న ఏకైక సమస్య ఆ విధంగా పరిష్కారమవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఇండియాలో అమెరికా ఉత్పత్తులపై ఎలాంటి టారిఫ్‌లు ఉన్నాయో ఏప్రిల్ 2 నుంచి ఇండియా ఉత్పత్తులపై తమ దేశంలో అలాంటి టారిఫ్‌లే అమల్లోకి తీసుకొస్తామని స్పష్టంచేశారు. ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరప్–ఎకనామిక్ కారిడార్(ఐమెక్)ను సానుకూల చర్యగా అభివర్ణించారు. ఇది అద్భుతమైన దేశాల కూటమి అని చెప్పారు. వ్యాపారం, వాణిజ్యంలో దెబ్బతీయాలని చూస్తున్న ప్రత్యర్థి దేశాలకు వ్యతిరేకంగా కూటమిగా ఏర్పడ్డాయని అన్నారు. తమ శత్రువులను మర్చిపోయే ప్రసక్తే లేదన్నారు. వారికి ఎలాంటి మర్యాద చేయాలో తమకు బాగా తెలుసని డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు. మిత్రుల కంటే శత్రువులపైనే ఎక్కువగా దృష్టి పెడతామన్నారు.



గ్రోక్ కంటెంట్‌కు 'ఎక్స్'దే బాధ్యత!

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ) టూల్ గ్రోక్‌తో రూపుదిద్దుకున్న కంటెంట్‌కు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' బాధ్యత వహించాల్సి రావచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో న్యాయపరమైన స్పష్టత త్వరలోనే రానుందని వెల్లడించాయి. ఎక్స్ యూజర్లు కొందరు ఇటీవల భారత రాజకీయ నాయకులకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు ఏఐ టూల్ 'గ్రోక్' మొరటుగా సమాధానిచ్చింది. దీనిపై ఓ అధికారి స్పందిస్తూ..'ఈ కేసులో 'ఎక్స్' ను బాధ్యునిగా చేయాలన్నది నా వ్యక్తిగత అభిప్రాయం. దీనిపై ప్రభుత్వం న్యాయ కోణంలో పరిశీలనతోపాటు 'ఎక్స్'తో చర్చలు జరుపుతోంది'అని ఆ అధికారి వివరించారు. గతేడాది గూగుల్‌కు చెందిన ఏఐ టూల్ జెమిని కూడా కొన్ని ప్రధాని మోదీకి సంబంధించిన ప్రశ్నలకు కొన్ని తిక్క సమాధానాలివ్వడంతో తక్షణమే కేంద్రం ఏఐ వినియోగంపై మార్గదర్శకాలను జారీ చేసింది.



నినాదాల టీ షర్టులు ధరించి నిరసన తెలుపుతున్న తమిళనాడు ఎంపీలు



బ్యానర్ ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న డీఎంకే మహిళా ఎంపీలు

పార్లమెంట్‌లో టీ–షర్టుల రగడ

నియోజకవర్గాల పునర్విభజనపై విపక్ష ఎంపీల నిరసన ● నినాదాలు రాసిన టీ–షర్టులు ధరించిన డీఎంకే ఎంపీలు

న్యూఢిల్లీ: లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై విపక్ష సభ్యులు గొంతెత్తారు. గురువారం లోక్‌సభలో తీవ్ర అలజడి సృష్టించారు. ప్రభుత్వాన్ని నిలదీయడానికి ప్రయత్నించారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు. తమిళనాడుకు చెందిన డీఎంకే సభ్యులు సభలో టీ–షర్టులు ధరించి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. దీంతో సభను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. నియోజకవర్గాల పునర్విభజనపై చర్చకు అనుమతి ఇవ్వాలని విపక్ష సభ్యులు కోరగా, స్పీకర్ ఓం బిర్లా తిరస్కరించారు. ప్రస్తుతానికి ఆ అంశం ప్రభుత్వ పరిశీలనలో లేదని, దానిపై ఇప్పుడు చర్చ అక్కర్లేదని తేల్చిచెప్పారు. నినాదాలు రాసి ఉన్న టీ–షర్టులు ధరించి సభకు వచ్చిన డీఎంకే ఎంపీలపై ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తంచేశారు. నిబంధనలు అతిక్రమించడం ఏమిటని మండిపడ్డారు. ఎవరైనా సరే సభా సంప్రదాయాలు పాటించాల్సిందేనని తేల్చిచెప్పారు. సభ గౌరవాన్ని కాపాడాలని అన్నారు. బయటకు వెళ్లి దుస్తులు మార్చుకొని రావాలని డీఎంకే సభ్యులకు సూచించారు. ఎంపీలకు గౌరవప్రదమైన వేషధారణ అవసరమని హితవు పలికారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. విపక్ష ఎంపీలు నినాదాలు కొనసాగించారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణ ప్రసాద్ పదేపదే కోరినా విపక్ష సభ్యులు శాంతించలేదు. దీంతో సభను శుక్రవారానికి కృష్ణ ప్రసాద్ వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ అదే తీరు

పార్లమెంట్ ఎగువ సభలోనూ టీ–షర్టుల రభస చోటుచేసుకుంది. డీఎంకే ఎంపీలు నినాదాలు రాసిన టీ–షర్టులు ధరించి సభకు వచ్చారు. నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా బిగ్గరగా నినాదాలు చేశారు. ''పునర్విభజన–తమిళనాడు పోరాటం సాగిస్తుంది. కచ్చితంగా విజయం సాధిస్తుంది'' అని ఆ టీ–షర్టులపై రాసి ఉంది. 'అనాగరికులు' అంటూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలను డీఎంకే ఎంపీలు తప్పుపట్టారు. తమ టీ–షర్టులపై 'అన్‌సివిలైజ్' అని రాసుకున్నారు. నినాదాలు ఆపేసి సభా కార్యకలాపాలకు సహకరించాలని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పలుమార్లు కోరినా, డీఎంకే ఎంపీలు వెనక్కి తగ్గలేదు. దాంతో సభ పలుమార్లు వాయిదా పడింది. మధ్యాహ్నం పునఃప్రారంభమైన తర్వాత కూడా సభ అదుపులోకి రాకపోవడంతో చైర్మన్ మరుసటి రోజుకి వాయిదా వేశారు. రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో సభ నిష్ప్రయోజనంగా మారడం ఇదే మొదటిసారి. అంతకుముందు వివిధ పార్టీల సభా నాయకులతో చైర్మన్ ధన్‌ఖడ్ తన చాంబర్‌లో భేటీ అయ్యారు. సభలో టీ–షర్టులు ధరించకూడదని డీఎంకే సభ్యులకు సూచించారు. అలాంటి దుస్తులతో పార్లమెంట్‌కు రావడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టంచేశారు. అయితే, సభలో టీ–షర్టులు కచ్చితంగా ధరిస్తామని, నిరసన తెలియజేస్తామని డీఎంకే ఎంపీలు బదులిచ్చారు. సభ నుంచి సస్పెండ్ చేసినా తమకు అభ్యంతరం లేదని తేల్చిచెప్పారు.

గాజాపై మళ్లీ విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

నివాసాలపై దాడుల్లో 110 మంది మృతి

డెయిర్ అల్–బలాహ్: గాజాలోని పాలస్తీనియన్లకు బుధవారం రాత్రి కాళరాత్రే అయ్యింది. అంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఇజ్రాయెల్ మరోమారు వైమానిక దాడులకు పాల్పడింది. దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా కనీసం 110 మంది ప్రాణాలు కోల్పోయారు. పెద్ద సంఖ్యలో గాయాలపాలయ్యారు. సరిహద్దులకు సమీపంలోని ఖాన్‌యూనిస్ నగర వెలుపల అబసన్ అల్–కబీర్ గ్రామంపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 16 మంది చనిపోయినట్లు అక్కడున్న యూరోపియన్ ఆస్పత్రి తెలిపింది. మృతుల్లో తండ్రి, అతడి ఏడుగురు కుమారులు ఉన్నారు. వీరితోపాటు దంపతులు, వారి కుమారుడు చనిపోగా నెలల చిన్నారి, ఇద్దరు వృద్ధ దంపతులు సురక్షితంగా బయటపడ్డారు. సరిహద్దులకు సమీపంలోని బెయిట్ లహియాపై జరిగిన మరో దాడిలో 19 మంది మృత్యువాతపడ్డారని ఇండోనేసియన్ ఆస్పత్రి వివరించింది. ఇప్పటికే తీవ్రంగా ధ్వంసమైన బెయిట్ లహియాలో తాజా దాడితో పరిస్థితులు మరింత భీతావహంగా మారాయని ఆరోగ్య విభాగం తెలిపింది. రఫాలో 36 మంది చనిపోయినట్లు అక్కడి యూరోపియన్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అదేవిధంగా, ఖాన్ యూనిస్‌లో ఏడుగురు మృతి చెందినట్లు నాసర్ ఆస్పత్రి తెలిపింది. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారి కోసం గాలిస్తున్నామని ఆయా ప్రాంతాలకు చెందిన స్థానికులు తెలిపారు.

మృతుల్లో 200 మంది చిన్నారులు..

కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన తర్వాత మొదటిసారిగా ఇజ్రాయెల్ మంగళవారం ఉదయం గాజాపై జరిపిన దాడుల్లో కనీసం 400 మంది చనిపోవడం తెలిసిందే. మంగళవారం నుంచి గురువారం వరకు జరిగిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారిలో 200 మంది చిన్నారులే ఉన్నారని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. మరో 909 మంది క్షతగాత్రులుగా మారారని పేర్కొంది. కాగా, మిలిటెంట్లే లక్ష్యంగా తాము దాడులు చేపట్టినట్లు ఇజ్రాయెల్ మిలటరీ ప్రకటించుకుంది. డజన్ల కొద్దీ లక్ష్యాలపై జరిగిన ఈ దాడుల్లో మిలిటెంట్లతో పాటు వారి సైనిక వసతులు దెబ్బతిన్నాయని తెలిపింది. గురువారం ఉదయం యెమెన్‌లోని ఇరాన్ అనుకూల హౌతీ రెబల్స్ ప్రయోగించిన క్షిపణిని గగనతలంలోనే అడ్డుకున్నట్లు ఇజ్రాయెల్ మిలటరీ ప్రకటించింది. ఆ క్షిపణిని కూల్చి వేశామని, ఎవరికీ ఎటువంటి గాయా లు కాలేదని తెలిపింది. అదే విధంగా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా టెల్ అవీవ్‌పైకి తాము రాకెట్లను ప్రయోగించినట్లు హమాస్ తెలిపింది. దీంతో, బెన్ గురియె న్ విమానాశ్రయంలో రాకపో కలకు అంతరాయం ఏర్పడింది. పలు ప్రయాణికుల విమానాలను దారి మళ్లించారు.

ఖాన్‌యూనిస్‌లో ప్రాణాలతో బయటపడిన 25 రోజుల పసికందు ఎల్లా ఓసామా అబూ దగ్గా



నుసేరత్‌పై దాడిలో కుప్పకూలిన భవనాలు

దిగ్బంధంలో ఉత్తర గాజా

గాజా నగరం సహా ఉత్తర గాజా ప్రాంతాన్ని బుధవారం తిరిగి ఇజ్రాయెల్ ఆర్మీ దిగ్బంధించింది. సుమారు ఐదు మైళ్ల పొడవైన నెట్‌జరిమ్ కారిడార్‌ను స్వాధీనం చేసుకుంది. ఉత్తర గాజా ప్రాంతాన్ని విడిచి వెళ్లరాదని, ప్రధాన రహదారిపైకి రావద్దని పాలస్తీనా వాసులకు ఆర్మీ హెచ్చరికలు చేసింది. దక్షిణ ప్రాంతానికి వెళ్లే వారు తీరం వెంబడి ఉన్న రహదారిని మాత్రమే వాడుకోవాలని స్పష్టం చేసింది. బెయిట్ లహియా పట్టణంలోకి అదనంగా బలగాలను పంపిస్తున్నట్లు తెలిపింది. తమ ప్రతిపాదనకు హమాస్ అంగీకరించనందునే పోరాటం మళ్లీ ప్రారంభించినట్లు ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఇప్పటికే గాజా ప్రాంతంలోని 20 లక్షల మంది పాలస్తీనియన్లకు ఆహారం, ఇంధనం, ఇతర మానవీయ సాయాన్ని నిలిపివేసిన ఇజ్రాయెల్..మిగతా 59 మంది బందీలను హమాస్ విడుదల చేసేదాకా దాడులను తీవ్రతరం చేస్తామని హెచ్చరించింది.

ఆయుధాలు వీడే ప్రసక్తే లేదు: హమాస్

శాశ్వత కాల్పుల విరమణతో పాటు ఇజ్రాయెల్ ఆర్మీని గాజా నుంచి పూర్తిగా ఉపసంహరించుకుంటేనే మిగతా బందీలను విడిచిపెడతామని హమాస్ స్పష్టం చేసింది. గాజాలో ఇజ్రాయెల్ ఉనికిని తాము అంగీకరించే ప్రసక్తే లేదని కుండబద్దలు కొట్టింది. ఇజ్రాయెల్ ఆర్మీ పూర్తిగా వైదొలిగాకే పశ్చిమ దేశాల మద్దతున్న పాలస్తీనా అథారిటీకి లేదా స్వతంత్ర రాజకీయ నేతల కమిటీకి అధికారం బదిలీ చేస్తామని తేల్చి చెప్పింది. అప్పటి వరకు ఆయుధాలను వీడబోమని తెలిపింది.

నెతన్యాహూ నివాసం వద్ద ఉద్రిక్తత

బందీల విడుదల విషయంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వందలాది మంది పశ్చిమ జెరూసలేంలోని ప్రధాని నెతన్యాహూ నివాసాన్ని చుట్టుముట్టారు. బారికేడ్లను దాటుకుని ముందుకు వెళ్లేందుకు నిరసనకారులు ప్రయత్నించగా పోలీసులు వాటర్ కెనన్లను ప్రయోగించి వారిని చెదరగొట్టారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య బాహాబాహీ చోటుచేసుకుంది. గాజాపై మళ్లీ దాడులు ప్రారంభిస్తే హమాస్ వద్ద బందీలుగా ఉన్న తమ సంబంధీకుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

మరో భారత విద్యార్థి అరెస్ట్

వాషింగ్టన్: అమెరికాలో మరో భారతీయ విద్యార్థి బహిష్కరణకు గురయ్యారు. హమాస్‌కు మద్దతు ఇస్తున్నారంటూ అమెరికాలోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీలో చదువుతున్న పరిశోధక విద్యార్థిని ఇమ్మిగ్రేషన్ అధికారులు అరెస్టు చేశారు. పోస్ట్ డాక్టోరల్ ఫెలో అయిన బదర్ ఖాన్ సూరిని సోమవారం రాత్రి వర్జీనియాలోని అతని ఇంటి బయట 'ముసుగులు ధరించిన ఏజెంట్లు' అదుపులోకి తీసుకున్నారు. తాము డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సిబ్బందిగా చెప్పుకున్న ఏజెంట్లు.. వీసాను ప్రభుత్వం రద్దు చేసిందని సూరికి చెప్పారు. 'సూరి.. జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయంలో ఫారిన్ ఎక్స్ఛేంజ్ విద్యార్థి. హమాస్ తరఫున ప్రచారం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో యూదు వ్యతిరేకతను ప్రోత్సహిస్తున్నారు. అతనికి అనుమానిత ఉగ్రవాదితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి' అని హోంల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ సహాయ మంత్రి ట్రిసియా మెక్లాఫ్లిన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆయనను బహిష్కరించినట్లు సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్చి 15న ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ బదర్ ఖాన్ సూరి.. వాషింగ్టన్‌లోని జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయంలో ఎడ్మండ్ ఎ. వాల్ష్ స్కూల్ ఆఫ్ ఫారిన్ సర్వీస్‌లో.. అల్వలీద్ బిన్ తలాల్ సెంటర్ ఫర్ ముస్లిం–క్రిస్టియన్ అండర్‌స్టాండింగ్‌లో పోస్ట్ డాక్టోరల్ ఫెలో.



భార్య వారసత్వం కారణంగానే..: సూరి న్యాయవాది

అయితే.. అమెరికా పౌరురాలైన అతని భార్య పాలస్తీనా వారసత్వం కారణంగా సూరిని శిక్షిస్తున్నారని అతని తరఫు న్యాయవాది హసన్ అహ్మద్ వాదిస్తున్నారు. సూరి భార్య మఫాజ్ అహ్మద్ యూసఫ్ గాజాకు చెందినప్పటికీ ప్రస్తుతం అమెరికా పౌరురాలు. జనవరి 1, 2014న వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. ఢిల్లీ వాసి, జామియా విద్యార్థి అయిన సూరి అంతర్జాతీయ సహాయక బృందంలో 2011లో గాజాకు వెళ్లినప్పుడు యూసఫ్‌ను కలిశారు. సూరి మామ అహ్మద్ యూసఫ్ గాజాలోని హమాస్ ప్రభుత్వంలో ఉప విదేశాంగ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత సంఘర్షణ పరిష్కారం కోసం హౌస్ ఆఫ్ విజ్‌డమ్ ఇన్‌స్టిట్యూట్ (హెచ్‌ఓడబ్ల్యూఐ)కి నాయకత్వం వహించారు. సూరి, మఫాజ్ దంపతులకు ఒక కొడుకు. పేరు అరాఫత్. 'నేను నా కొడుకుకి గాంధీ లేదా అరాఫత్ అని పేరు పెట్టాలనుకున్నాను. కానీ చివరికి అరాఫత్‌ను ఎంచుకున్నాను' అని యూసఫ్ గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

రూ.119 కోట్లు పలికిన ఎంఎఫ్ హుస్సేన్ పెయింటింగ్

న్యూఢిల్లీ: ప్రముఖ భారతీయ చిత్రకారుడు ఎంఎఫ్ హుస్సేన్ కుంచె నుంచి జాలువారిన చిత్రరాజమొకటి తాజాగా రికార్డ్ నెలకొల్పింది. ఆధునిక భారతీయ చిత్రకళలో అత్యంత అధిక ధరకు అమ్ముడుపోయిన పెయింటింగ్‌గా కొత్త చరిత్ర సృష్టించింది. దాదాపు 14 అడుగుల పొడవైన ఒకే కాన్వాస్‌పై 13 గ్రామీణ దృశ్యాలను వర్ణిస్తూ 'అన్‌టైటిల్డ్(గ్రామ్ యాత్ర)' పేరిట ఒక చిత్రాన్ని హుస్సేన్ గీశారు. దీనిని అమెరికాలోని న్యూయార్క్‌లో మార్చి 19వ తేదీన క్రిస్టీ వేలంపాట సంస్థ 'దక్షిణాసియా ఆధునిక, సమకాలీన కళ' పేరిట వేలం వేసింది. ఈ వేలంపాటలో ఇది 13.8 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.119.15 కోట్ల)కు అమ్ముడుపోయింది. గతంలో అమృత షేర్‌గిల్ అనే భారతీయ చిత్రకారిణి 1937 'ది స్టోరీ టెల్లర్' పేరిట వేసిన ఒక పెయింటింగ్ 2023 ముంబైలో వేలంపాటలో దాదాపు రూ.61.8 కోట్లకు అమ్ముడుపోయింది. భారతీయ చిత్రకారుడి పెయింటింగ్ ఇంతటి భారీ ధరకు అమ్ముడుపోవడం అప్పట్లో అదే తొలిసారి. ఆ పెయింటింగ్ ధరతో పోలిస్తే తాజాగా హుస్సేన్ చిత్రం దాదాపు రెట్టింపు ధర పలకడం విశేషం. '' మఖ్బూల్ ఫిదా హుస్సేన్ వేసిన చిత్రాలు వేలంపాటల్లో అత్యధిక ధరల మైలురాళ్లను చేరుకునే ప్రక్రియలో మేం కూడా భాగస్వాములమైనందుకు సంతోషిస్తున్నాం'' అని క్రిస్టీస్‌లో ఈ వేలంపాటకు సారథ్యం వహించిన నిషాద్ అవారీ వ్యాఖ్యానించారు. 1954లో వేసిన ఈ పెయింటింగ్‌ను ఉక్రెయిన్‌లో జన్మించి నార్వేలో స్థిరపడిన లియోన్ ఎలియాస్ వాలోదర్‌స్కీ అనే వైద్యుడు అదే ఏడాది కొనుగోలుచేశారు. ప్రపంచ ఆరోగ్యసంస్థకు చెందిన థోరాసిక్ సర్జరీ శిక్షణా కేంద్రాన్ని నిర్మించేందుకు ఢిల్లీలో ఏర్పాటుచేసేందుకు వచ్చిన సందర్భంగా ఆయన ఈ పెయింటింగ్‌ను కొన్నారు. తర్వాత దీనిని నార్వేలోని ఓస్లో యూనివర్సిటీ ఆస్పత్రికి ఇచ్చేశారు. ఇప్పుడు పెయింటింగ్‌ను అమ్మడం ద్వారా వచ్చే నగదును ఆ వర్సిటీలో భావి మెడికల్ విద్యార్థుల కోసం వినియోగించనున్నారు. హుస్సేన్ వేసిన అన్‌టైటిల్డ్ రీఇన్‌కార్నేషన్ అనే పెయింటింగ్ గతంలో రూ.25.7 కోట్లకు అమ్ముడుపోయింది. ఈయన వేసిన వాటిల్లో ఇదే గతంలో అత్యధిక ధర పలికింది.



మంత్రులు, ఎమ్మెల్యేలపై వలపు వల!

- కర్ణాటకలో తీవ్ర కలకలం
- 48 మంది హనీట్రాప్‌లో చిక్కుకున్నారు
- పలువురు కేంద్ర మంత్రులు సైతం బాధితులే
- అసెంబ్లీలో మంత్రి కె.ఎన్.రాజన్న వెల్లడి



బెంగళూరు: మంత్రులు, ఎమ్మెల్యేలపై కొందరు వలపు వల(హనీ ట్రాప్) విసిరినట్లు ఆరోపణలు రావడం కర్ణాటకలో సంచలనాత్మకంగా మారింది. రాష్ట్ర సహకార శాఖ మంత్రి కె.ఎన్.రాజన్న గురువారం అసెంబ్లీలో ఈ విషయం వెల్లడించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సహా మొత్తం 48 మంది రాజకీయ నాయకులు వలపు వల బాధితులుగా మారారని ఆయన చెప్పారు. బాధితులతో అసభ్యకర వీడియోలు చిత్రీకరించారని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసమే ఇదంతా చేశారని పేర్కొన్నారు. కర్ణాటకలో సీడీలు, పెన్‌డ్రైవ్‌ల ఫ్యాక్టరీ ఉన్నట్లు చెబుతున్నారని, నిజానికి 48 మంది నేతలకు సంబంధించిన సీడీలు, పెన్‌డ్రైవ్‌లు ఉన్నట్లు తనకు తెలిసిందని వివరించారు. పార్టీలకు అతీతంగా అధికార, విపక్ష సభ్యులు బాధితులుగా మారారని అన్నారు. ఈ హనీ ట్రాప్ నెట్‌వర్క్ కేవలం కర్ణాటకకే పరిమితం కాలేదని, దేశమంతటా విస్తరించిందని వ్యాఖ్యానించారు. పలువురు కేంద్ర మంత్రులు సైతం వలపు వలలో చిక్కుకున్నట్లు చెప్పారు. కర్ణాటక ప్రజా పనులు శాఖ మంత్రి సతీశ్ జార్కిహోళీ సైతం అసెంబ్లీలో ఈ వ్యవహారంపై స్పందించారు. మంత్రివర్గంలోని ఒక సీనియర్ సహచరుడిపై హనీ ట్రాప్ ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి సఫలం కాలేదని అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నల్ మాట్లాడుతూ... రాజకీయ ప్రత్యర్థులను అడ్డు తొలగించుకోవడానికి బ్లాక్‌మెయిల్ మార్గాలు ఎంచుకుంటున్నారని, ఇందులో భాగంగా హనీ ట్రాప్‌లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మరో బీజేపీ ఎమ్మెల్యే వి.సునీల్ కుమార్ కూడా ఈ అంశంపై మాట్లాడారు. ప్రత్యర్థులను ఓడించలేక అనైతిక చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. హనీ ట్రాప్ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హనీ ట్రాప్ ఫ్యాక్టరీ నడిపిస్తోందని ధ్వజమెత్తారు. అనంతరం బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న మాట్లాడారు. అత్యాచారం కేసులో తనను ఉద్దేశపూర్వకంగా ఇరికించారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు.

ఉన్నత స్థాయి దర్యాప్తు: హోంమంత్రి

హనీ ట్రాప్ ఆరోపణలపై కర్ణాటక హోంశాఖ మంత్రి జి.పరమేశ్వర సభలో స్పందించారు. ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపిస్తామని హామీ ఇచ్చారు.

యుద్ధంతో అల్లకల్లోలం..అయినా కలల సాకారం

- ఉజ్బెకిస్థాన్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన 150 మంది భారతీయ విద్యార్థులు
- స్నాతకోత్సవానికి హాజరైన ఏఐజీ ఆస్పత్రి వ్యవస్థాపకులు డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

రాయదుర్గం: రష్యా – ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధంతో అల్లకల్లోలం సాగుతున్నా ఎంబీబీఎస్ విద్యార్థుల కలలు సాకారమయ్యాయి. ఉజ్బెకిస్థాన్‌లో విజయవంతంగా ఎంబీబీఎస్ పూర్తి చేసిన భారతీయ విద్యార్థుల స్నాతకోత్సవ కార్యక్రమాన్ని గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో గురువారం ఘనంగా నిర్వహించారు. నియో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియో విద్యార్థుల గ్రాడ్యుయేషన్ ఏఐజీ ఆస్పత్రిలో మూడో సంవత్సరం నిర్వహించడం విశేషం. అత్యంత నైపుణ్యం కలిగిన వైద్య విద్యార్థులను తీర్చిదిద్దడంలో నియో ఖ్యాతి మరోసారి రుజువైనట్లయ్యింది.

- రష్యా –ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం మొదలయ్యాక వీరందరినీ ఉక్రెయిన్ నుంచి ఉజ్బెకిస్థాన్‌కు తరలించారు. ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ)లో నియో విద్యార్థుల అసాధారణ విజయం ఈ కార్యక్రమంలో అందరినీ ఆకట్టుకుంది. గ్రాడ్యుయేషన్‌లో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు ఏఐజీ ఆస్పత్రి ఆడిటోరియంలో సందడి చేశారు. అంతా ఉత్సాహంగా గడిపి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉజ్బెకిస్థాన్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన 150 మంది విద్యార్థుల్లో 114 మంది(76శాతం) విద్యార్థులు తమ తొలి ప్రయత్నంలోనే ఎఫ్ఎంజీఈలో ఉత్తీర్ణులయ్యారు.



ఉజ్బెకిస్థాన్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి

డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి అవిసెన్నా అవార్డు, గౌరవ ప్రొఫెసర్ పదవితో సత్కారం

ప్రపంచ వైద్య, విద్య, ఆరోగ్య సంరక్షణకు చేసిన కృషిని గుర్తిస్తూ ఏఐజీ ఆస్పత్రి వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి అవిసెన్నా అవార్డు, గౌరవ ప్రొఫెసర్ పదవితో ఆయనను సత్కరించారు. ఉజ్బెకిస్థాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ద్వారా ఆయనను సత్కరించారు. అంతేకాకుండా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, ఆర్టీఐ మాజీ కమిషనర్ విజయ్‌బాబు గౌరవ డాక్టరేట్లు ప్రకటించగా డాక్టర్ సందీప్‌కు గౌరవ ప్రొఫెసర్ పదవిని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉజ్బెకిస్థాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు, బుఖారా స్టేట్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు, ఉజ్బెకిస్థాన్ రాయబార కార్యాలయ సభ్యులు పాల్గొన్నారు.

'రేడియల్ రోడ్' టెండర్లపై యథాతథ స్థితి

- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్ నుంచి రీజినల్ రింగ్ రోడ్ కలిపేలా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి జారీ చేసిన టెండర్లపై హైకోర్టు యథాతథ స్థితి కొనసాగించాలని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ తదితరులకు ఆదేశాలు జారీ చేసింది. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్‌ను కలిపేలా ఈ రేడియల్ రోడ్లను సర్కార్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఫేజ్–1లో రావిర్యాల్ వద్ద ఓఆర్ఆర్ ఇంటర్‌చేంజ్ (ఎగ్జిట్ –13) నుంచి మీర్ఖాన్‌పేట మీదుగా ఆమనగల్ వద్ద ఆర్ఆర్ఆర్ వరకు గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డును నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ రోడ్డు 41.5 కి.మీ. పొడవు ఉంటుంది. దీనికి 477.38 హెక్టార్ల భూమి అవసరం. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, కడ్తాల్ ఆమనగల్ మరియు యాచారం మండలాల్లోని 15 గ్రామాల గుండా వెళుతుంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి జారీ చేసిన టెండర్ నోటీసులను సవాల్ చేస్తూ నీరటి రవీందర్‌తోపాటు మరో తొమ్మిది మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకముందే నోటిఫికేషన్ జారీ చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది సీహెచ్ రవికుమార్ వాదనలు వినిపిస్తూ.. 'ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసింది. కానీ నోటీస్‌పై చేసిన భూ యజమానుల వ్యక్తిగత విచారణను నిర్వహించలేదు. భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని అధికారులు భావిస్తున్నట్టుంది..లేదా, భూసేకరణకు వ్యక్తిగత విచారణ అవసరం లేదని అభిప్రాయపడుతున్నారని తెలుస్తోంది. అందుకే సేకరించాల్సిన భూముల్లో రోడ్డు వేయడానికి ఇప్పటికే టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు'అని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. భూసేకరణ ప్రక్రియ పూర్తి కాలేదన్న వాదనలను పరిగణనలోకి తీసుకున్నారు. తదుపరి ఆదేశాలిచ్చే వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేశారు. ఆలోగా దీనిపై వివరాలు అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

నేను బుల్లెట్‌పైనే తిరుగుతా

పోలీసులకు సమాధానం ఇచ్చిన ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: బుల్లెట్ ప్రూఫ్ వాహనంతోపాటు భద్రతా సిబ్బందిని ఉపయోగించుకోవాలని మంగళ్‌హాట్ పోలీసులు రాజాసింగ్‌కు నోటీసులు జారీ చేశారు. అయితే తాను మాత్రం బుల్లెట్ పైనే తిరుగుతానంటూ పోలీసులకు రాజాసింగ్ సమాధానం ఇచ్చారు. ఇటీవల రాజాసింగ్‌కు బెదిరింపు కాల్స్ రావడంతో అప్రమత్తంగా ఉండాలని గురువారం పోలీసులు ఆయనకు మరోసారి సూచించారు. ఎక్కడికైనా వెళ్తే ప్రభుత్వం కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం, వన్ ప్లస్ ఫోర్ సెక్యూరిటీని వినియోగించుకోవాలని, ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. రాజాసింగ్ ఉగ్రవాదుల హిట్ లిస్ట్‌లో ఉన్న సంగతిని వారు గుర్తు చేశారు. అయితే ప్రజల వద్దకు తన బుల్లెట్ వాహనాన్ని వాడుతున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..... గోషామహల్ నియోజకవర్గంలో నిరుపేద రోడ్లు ఉన్నాయని తాను ప్రజలను కలవాలంటే బుల్లెట్ వాహనం, బైక్‌పై వెళ్లాల్సి వస్తుందన్నారు. భద్రతా కారాణాల వల్ల తాను గతంలో గన్‌లైసెన్స్ కోసం అప్లయ్ చేస్తే తనపై కేసులు ఉన్నాయని పోలీసు శాఖ తన దరఖాస్తును తిరస్కరించిందని ఎమ్మెల్యే రాజాసింగ్ వివరించారు.

తడి లేదు.. దిగుబడి రాదు





అత్యధిక ఉష్ణోగ్రతలతో భూగర్భ జలాలు అడుగంటడం, తడిలేక పంటలు ఎండిపోవడం, రైతులను నిర్వేదానికి గురిచేస్తోంది. ప్రధానంగా కరీంనగర్ జిల్లాలోని రామడుగు, గంగాధర, చొప్పదండి మండలాల్లో నీటి కొరత ఎక్కువ కాగా.. కూరగాయలు, వరి, వాణిజ్య పంటలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. దీంతో కొందరు కూరగాయల రైతులు పంటలను పశుగ్రాసంగా వదిలేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్లుప్తంగా...

క్రీడలకు భారీ కేటాయింపులు భేష్

● శాట్ చైర్మన్ శివసేనారెడ్డి



డిప్యూటీ సీఎం భట్టిని కలసి కృతజ్ఞతలు తెలుపుతున్న శాట్ చైర్మన్ శివసేనారెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న పట్టుదలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడారంగానికి రూ.465 కోట్లు కేటాయించారని శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి తెలిపారు. బడ్జెట్‌లో క్రీడలకు భారీ కేటాయింపులు చేయడంపై క్రీడాకారులు, కోచ్‌లు, శాట్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఎల్బీ స్టేడియంలో బాణసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పన, నూతన స్టేడియాల నిర్మాణం, స్టేడియాల ఆధునీకరణపై క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) దృష్టి పెట్టనుందన్నారు. ఈ ఏడాది కొత్త స్టేడియాల నిర్మాణం కోసం రూ.81.81 కోట్లు, రాష్ట్ర క్రీడా సంఘాల గ్రాంట్, ప్రతిభావంతులైన క్రీడాకారుల నగదు ప్రోత్సాహకాలకు రూ.16.6 కోట్లు, స్పోర్ట్స్ స్కూళ్ల అభివృద్ధికి రూ.51.68 కోట్లు సహా.. శాట్ నూతనంగా చేపట్టబోతున్న క్రీడాభివృద్ధి కార్యక్రమాలకు రూ.275 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు.

ఇంధన శాఖకు బడ్జెట్ పెంపుపై హర్షం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో ఇంధన శాఖకు కేటాయింపులను రూ.21,221 కోట్లకు పెంచడంపై.. తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.రత్నాకర్, సదానందంతో పాటు 1,104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. గతేడాదితో పోల్చితే.. ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు రూ.4811 కోట్లు పెంచడంతో విద్యుత్ సంస్థలకు ఉపశమనం లభిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.

వేధింపులు భరించలేక..

● మద్యానికి బానిసైన కుమారుడికి ఉరేసిన తల్లి

కొత్తగూడెంఅర్బన్: మద్యానికి బానిసైన కుమారుడు తనతో పాటు కోడలు, మనవడిని కొన్నేళ్లుగా ఇబ్బంది పెడుతుండటంతో కన్నతల్లే ఉరివేసి హతమార్చింది. కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ గ్రామంలో గురువారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన ఎల్కపల్లి రాజ్‌కుమార్ (40) తరచూ మద్యం తాగుతూ ఇంట్లో గొడవ చేసేవాడు. ఇదేంటని మందలిస్తే అందరినీ మానసికంగా వేధించడంతో పాటు కొట్టేవాడు. కాగా, గురువారం కూడా మద్యంతాగిన రాజ్‌కుమార్, మళ్లీ తాగేందుకు డబ్బులు కావాలని వేధిస్తుండటంతో తల్లి దూడమ్మ కొడుకు కాళ్లు, చేతులు కట్టేసి ఉరివేసి హతమార్చింది. ఈ విషయం తెలిసిన పొరుగువారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల జోలికొస్తే ఖబడ్దార్'

సాక్షి, హైదరాబాద్: హక్కుల కోసం ఎవరైనా పోరాటం చేయొచ్చని, అదే సమయంలో ఇతరులను దూషించడం చట్ట విరుద్ధమని రెడ్డి జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి తెలిపారు. కులాల మధ్య చిచ్చు పెట్టడం టెర్రరిజం కంటే ప్రమాదమని గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అగ్రవర్ణ పేదలకు ఇచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల జోలికొస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు.

'యూజీసీ బిల్‌ను వెంటనే వెనక్కు తీసుకోవాలి'

సాక్షి, హైదరాబాద్: మోదీ ప్రభుత్వం యూజీసీ బిల్‌ను వెంటనే వెనక్కు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గాంధీభవన్‌లో మార్చి 24న నిర్వహించనున్న పార్లమెంట్ ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ యూజీసీని తన చేతుల్లో పెట్టుకోవాలని చూస్తోందని ఆరోపించారు. కులగణన జరిగిన తర్వాత రాష్ట్రంలో అట్టడుగు వర్గాలకు న్యాయం జరుగుతుందని వెంకటస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు.

కారుణ్య నియామకాలపై సర్కారుకు కృతజ్ఞతలు

● పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 582 మంది అభ్యర్థులకు కారుణ్య నియామక పత్రాలు అందజేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల పక్షాన.. సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎ.సత్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ నియామక పత్రాలు అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

అదను చూసి.. పదును పెట్టి..

● ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భద్రతా దళాల నిఘా
● మావోయిస్టులే లక్ష్యంగా వ్యూహాలు
● మరోసారి భద్రతా దళాల కన్నుగప్పిన డేంజరస్ హిడ్మా

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఎన్‌టీఆర్‌ఓ).. కేంద్రప్రభుత్వ ఆధీనంలో పని చేసే ఇంటెలిజెన్స్ సంస్థ ఇది. దేశ అంతర్గత భద్రతా వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి వివరాలు కేంద్రానికి అందిస్తుంది. ఇందుకోసం భూమి నుంచి 15వేల అడుగుల ఎత్తులో సంచరించే శాటిలైట్లు, డ్రోన్ల ద్వారా ఛాయాచిత్రాలను తీస్తూ ఎప్పటికప్పుడు విశ్లేషిస్తుంటుంది. ఆపరేషన్ కగార్‌లో భాగంగా ప్రస్తుతం ఎన్‌టీఆర్‌ఓ సహాయ సహకారాలను యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో పాల్గొంటున్న భద్రతా దళాలు తీసుకుంటున్నాయి. ఒడిశా–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఘరియాబంద్ దగ్గర జనవరిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి మరణించాడు. అప్పుడే యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో ఎన్‌టీఆర్‌ఓ పాత్రకు సంబంధించిన సమాచారం తొలిసారి బయటకొచ్చింది.

టీసీఓఏకు కౌంటర్‌గా..

ప్రతీ వేసవిలో అడవుల్లో భద్రతాదళాల దూకుడుకు అడ్డుకట్ట వేసేలా మావోయిస్టులు ట్యాక్టికల్ కౌంటర్ అఫెన్సివ్ క్యాంపెయిన్ (టీసీఓఏ – వ్యూహాత్మక ఎదురుదాడులు) పేరుతో ఎదురుదాడులు చేస్తుంటారు. అడవుల్లో కూంబింగ్‌కు వచ్చే భద్రతా దళాలపై ఆంబుష్ దాడులు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడటం ద్వారా తమకు పట్టున్న ప్రాంతాల్లోకి పోలీసులను రప్పించి మెరుపుదాడులు చేయడం ఇందులో భాగం. అయితే, ఇటీవల వరుస ఎదురుదెబ్బలు తింటున్న మావోలు ఈసారి భారీగా ప్రతీకార దాడులకు ప్లాన్ చేసే అవకాశముందనే అనుమానంతో భద్రతా దళాలు తమ పంథా మార్చాయి. కూంబింగ్ ఆపరేషన్లకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం జోడించాయి. ఎన్‌టీఆర్‌ఓ సహకారంతో 'శాటిలైట్–డ్రోన్'డేటా ఉపయోగించుకుంటూ మావోల కదలికలను పసిగడుతున్నాయి. అదను చూసి పదును పెట్టి దాడులు చేస్తున్నట్టు తాజా ఎన్‌కౌంటర్లతో తెలుస్తోంది.

హిడ్మా మరోసారి



తెలంగాణతో సరిహద్దు పంచుకునే ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుక్మా జిల్లాలు దక్షిణ బస్తర్ పరిధిలోకి వస్తాయి. మావోయిస్టులు జనతన సర్కార్ విజయవంతంగా నడిపింది ఇక్కడే. ఈ ప్రాంతంలోనే మావోయిస్టుల సాయుధ శిక్షణ శిబిరం, ఆయుధ కర్మాగారాలు, నేలమాళిగలు వెలుగు చూశాయి. మోస్ట్ వాంటెడ్ మిలిటెంట్, పీఎల్‌జీఏ కంపెనీ–1 కమాండర్ హిడ్మా కార్యక్షేత్రం ప్రధానంగా ఈ రెండు జిల్లాలే. హిడ్మా రక్షణలోనే సెంట్రల్ రీజనల్ కమిటీ, తెలంగాణ కమిటీ, దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీలున్నాయి. దీంతో హిడ్మాను టార్గెట్ చేసేందుకు ఏడాది కాలంగా భద్రతా దళాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. హిడ్మా ఆచూకీ కనుగొనేందుకు అన్ని అవకాశాలనూ వినియోగించుకుంటున్నాయి. గురువారం జరిగిన ఆపరేషన్ సైతం హిడ్మానే లక్ష్యంగా చేసుకోగా పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ, పీఎల్‌జీఏ కంపెనీ–2లు పోలీసులకు టార్గెట్ అయ్యాయి. ఆధునిక పరిజ్ఞానం వాడినా మరోసారి హిడ్మా భద్రతా దళాల కన్నుగప్పినట్టయింది.

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ నెత్తుటిధార



ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో భద్రతా దళాలు

▶ మొదటి పేజీ తరువాయి

సమావేశమైందనే సమాచారంతో రెండు జిల్లాల భద్రతా దళాలు కూంబింగ్ చేపట్టాయి. ఉదయం 8 గంటల సమయంలో మావోయిస్టులు తారసపడటంతో కాల్పులు జరిపాయి. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతిచెందినట్లు కాంకేర్ ఎస్పీ ఇందిరా కల్యాణ్ ప్రకటించారు. భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్ మృతులను నారాయణ్‌పూర్ జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ రెండు చోట్లా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాగా, నారాయణపూర్ జిల్లాలో తుల్‌తులీ వద్ద మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు.

టీసీఓఏను దాటుకుని..: ఛత్తీస్‌గఢ్‌లో గతేడాది చివరి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు భద్రతా దళాలు ఉధృతంగా దాడులు చేశాయి. ఈ దాడుల్లో జనవరిలో 50 మంది, ఫిబ్రవరిలో 40 మంది మావోయిస్టులు చనిపోయారు. అయితే మార్చిలో వేసవి రావడంతో ట్యాక్టికల్ కౌంటర్ ఆఫెన్సివ్ క్యాంపెయిన్ (వ్యూహాత్మక ఎదురుదాడులు, టీసీఓఏ) పేరుతో మావోలు ఎదురుదాడికి సిద్ధమయ్యారు. దీంతో గత నెల రోజులుగా నెమ్మదించిన భద్రతా దళాలు గురువారం దూకుడు కనబరిచాయి. దీంతో రెండు ఎన్‌కౌంటర్లలో 30 మంది మావోలు చనిపోయారు. మొత్తంగా ఈ ఏడాదిలో 120 మంది మావోయిస్టులు చనిపోవడం గమనార్హం.

ఏడాదిలోగా మావోయిస్టురహిత భారత్: అమిత్ షా

'నక్సల్ ముక్త్ భారత్ అభియాన్' దిశగా భద్రతా బలగాలు మరో గొప్ప విజయం సాధించాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హర్షం వ్యక్తంచేశారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు హతమయ్యారని గురువారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. నిషేధిత సీపీఐ(మావోయిస్టు) సభ్యులపై మోదీ ప్రభుత్వం అత్యంత కఠిన వైఖరి అవలంబిస్తోందని స్పష్టంచేశారు. లొంగిపోతే అన్ని రకాల వసతులు కల్పిస్తామని హామీ ఇస్తున్నా.. కొందరు లెక్కచేయడం లేదన్నారు. అలాంటి వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని, తగిన చర్యలు కచ్చితంగా ఉంటాయని హెచ్చరించారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి భారత్.. మావోయిస్టురహిత దేశంగా మారడం తథ్యమని అమిత్ షా పునరుద్ఘాటించారు. మరో ఏడాదిలోగా మావోయిస్టులను పూర్తిగా అంతం చేయబోతున్నట్లు సంకేతాలిచ్చారు.

మోదీ పాలనలో మావోయిస్టులకు చావుదెబ్బ

2025లో ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 104 మంది మావోయిస్టులను అరెస్టు చేసినట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. మరో 164 మంది లొంగిపోయారని పేర్కొంది. 2024లో 290 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో మరణించగా, 1,090 మంది అరెస్టయ్యారని, 881 మంది లొంగిపోయారని తెలిపింది. 2004 నుంచి 2014 వరకు 16,463 మావోయిస్టు హింసాత్మక ఘటనలు చోటుచేసుకోగా, మోదీ సర్కారు వచ్చిన తర్వాత 2014 నుంచి 2024 దాకా వీటి సంఖ్య 53 శాతం తగ్గిపోయిందని, పదేళ్లలో కేవలం 7,744 హింసాత్మక ఘటనలు జరిగాయని హోంశాఖ స్పష్టంచేసింది. అదే సమయంలో మావోయిస్టుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన భద్రతా సిబ్బంది సంఖ్య 1,851 నుంచి 509కు పడిపోయినట్లు తెలిపింది. సాధారణ పౌరుల మరణాల సంఖ్య 4,766 నుంచి 1,495కు తగ్గిపోయినట్లు పేర్కొంది. 2004–14తో పోలిస్తే 2014–24లో భద్రతా సిబ్బంది మరణాలు 73%, పౌరుల మరణాలు 70% పడిపోయాయని తెలిపింది. 2014లో దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 126 ఉండగా, 2024లో కేవలం 12 మాత్రమే ఉన్నాయని ప్రకటించింది. మావోయిస్టుల నియంత్రణ కోసం గత ఐదేళ్లలో కొత్తగా 302 సెక్యూరిటీ క్యాంప్‌లు, 68 నైట్ ల్యాండింగ్ హెలిప్యాడ్లు ఏర్పాటు చేసినట్లు హోంశాఖ వివరించింది.

ఉగాది నుంచి పేదలకు సన్న బియ్యం

● పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

మఠంపల్లి: ఉగాది పర్వదినం నుంచి రాష్ట్రంలోని పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. కార్యక్రమాన్ని సూర్యాపేట జిల్లా మఠంపల్లిలోని మట్టపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఆయన గురువారం మట్టపల్లిలో పర్యటించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటన అధికారికంగా ఖరారు కావలసి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారైతే.. తీసుకోవలసిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉగాది పంచాంగ శ్రవణంలో.. సీఎం అధికారికంగా పాల్గొంటే.. కార్యక్రమం నిర్వహణ సాధ్యాసాధ్యాలపై అర్చకులతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షించారు. ఇందుకోసం వేదిక స్థలాన్ని పరిశీలించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ప్రతి మండలం నుంచి ప్రజలను, ముఖ్యంగా అధిక సంఖ్యలో మహిళలను తరలించి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని నేతలకు సూచించారు. అనంతరం మంత్రి ఉత్తమ్.. మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేశారు. మంత్రి వెంట మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఐజీ సత్యనారాయణ, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ ఉన్నారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి తీవ్రగాయాలు



గాయపడిన నందిని

పెద్దవంగర: వీధి కుక్కల దాడిలో ఒక చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలో గురువారం జరిగిన ఈ సంఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. పెద్దవంగరకు చెందిన చిలుక వెన్నెల, మహేశ్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కూతురు నందిని (4) బంధువుల ఇంటికి వెళ్తుండగా.. వీధి కుక్కలు ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. చికిత్స నిమిత్తం చిన్నారిని 108 వాహనంలో వరంగల్ లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

భోజన సరుకులకు సెంట్రలైజ్డ్ టెండర్స్

● సంక్షేమ విద్యాసంస్థల్లో సరుకుల పంపిణీకి సరికొత్త విధానం
● నాణ్యత, సమయపాలనే లక్ష్యంగా రూపొందుతున్న కార్యాచరణ
● రాష్ట్రం యూనిట్‌గా టెండర్ల ద్వారా కాంట్రాక్టర్ల ఎంపికపై దృష్టి
● జిల్లా స్థాయి కొనుగోలు కమిటీలను తప్పించే యోచన
● వచ్చే విద్యా సంవత్సరం నుంచి సెంట్రలైజ్డ్ టెండర్లకు కసరత్తు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు అవసరమైన వస్తువులు, భోజన ము డి సరుకుల కొనుగోలు ప్రక్రియలో సరికొత్త విధానాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సంక్షేమ గురుకుల విద్యా సంస్థలు, వసతిగృహాలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల్లో ఆహార ముడి సరుకులు, చిరుతిళ్లు, యూనిఫాం, బెల్ట్, ట్రంకుపెట్టెలు, చెద్దర్లు, దుప్పట్లు, పుస్తకాలు, ఇతర వస్తువులను జిల్లాల్లో జిల్లాస్థాయి కొనుగోలు కమిటీ (డీపీసీ) ఆధ్వర్యంలో టెండర్లు పిలిచి తక్కువ ధరకు కోట్ చేసిన కాంట్రాక్టర్ నుంచి కొనుగోలు చేస్తున్నారు. అయితే కాంట్రాక్టర్లు సరుకుల్లో నాణ్యత పాటించకపోవడం, సకాలంలో అందించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. గత ఏడాది కాలంగా పలు విద్యా సంస్థల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరగడానికి ఆహార పదార్థాల్లో నాణ్యత లేకపోవడమే కారణమని అధికారులు గుర్తించారు. దీంతో సరుకుల సేకరణ విధానంలో మార్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇటీవల సీఎం ఏ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్షలో సెంట్రలైజ్డ్ టెండర్ విధానంపై చర్చించారు. ఇందుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి సరికొత్త కార్యాచరణ రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

వచ్చే నెలలో ప్రణాళిక ఖరారు

సీఎం ఆదేశంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన మొదలుపెట్టారు. సరుకుల సేకరణకు సంక్షేమ వసతిగృహాలకు ఒకవిధమైన ప్రణాళిక ఉండగా... గురుకుల పాఠశాలలు, కళాశాలలకు మరో విధమైన ప్రణాళికలు ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలోని కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు.. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో సరుకుల డెలివరీ ప్రక్రియ వేరువేరుగా ఉంది. ఈ నేపథ్యంలో సెంట్రలైజ్డ్ టెండర్ విధానంలో సరుకులను ఏవిధంగా పంపిణీ చేయాలనే అంశంపై విభాగాధిపతులు వ్యూహాత్మక ప్రణాళికలు తయారు చేస్తున్నారు. రాష్ట్రంలో 29 వేల ప్రభుత్వ విద్యాసంస్థలున్నాయి. ఇకపై అన్ని విద్యాసంస్థల్లో ఒక రకం వస్తువును ఒకే కాంట్రాక్టర్ నుంచి సేకరించేలా నిబంధనలు రూపొందిస్తున్నట్లు తెలిసింది. అన్ని రకాల విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ఒకే నాణ్యతతో కూడిన సరుకులను ఏకకాలంలో అందించే విధంగా కొత్త విధానం ఉండనుంది. భోజన సరుకులు, ఇతర వస్తువులను కేటగిరీలుగా నిర్దేశించిన తర్వాత వాటికి టెండర్లు పిలవనున్నారు. రాష్ట్రస్థాయి టెండర్ విధానంతో డబ్బులు కూడా ఆదా అవుతాయని అధికారులు చెబుతున్నారు. వచ్చేనెల మొదటివారం నాటికి సరుకుల పంపిణీ ప్రణాళికలు ఖరారు కానున్నట్లు తెలిపారు. ఆ తర్వాత రాష్ట్రస్థాయి టెండర్ ప్రక్రియ ప్రారంభించి మే నెలలోనే టెండర్లు ఖరారు చేసే అవకాశం ఉందని అధికారవర్గాల సమాచారం.

స్వామి ముసుగులో అత్యాచారం

● తన దగ్గరకు వచ్చే మహిళా భక్తులకు నీటిలో నిద్రమాత్రలు కలిపి అఘాయిత్యం
● ఆపై వీడియోలు చిత్రీకరించి బ్లాక్‌మెయిల్.. దొంగస్వామిని అరెస్టు చేసిన పోలీసులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



స్వాధీనం చేసుకున్న సామగ్రి

మెదక్ మున్సిపాలిటీ: చదువుకున్నది ఏడో తరగతి. జ్యోతిషం ముసుగులో స్వామి అవతారమెత్తాడు. మహిళలను లక్ష్యంగా చేసుకొని వారికి మత్తుమందు ఇచ్చి అత్యాచారం చేసేవాడు. అనంతరం వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడేవాడు. అయితే బాధితుల ఫిర్యాదు మేరకు మెదక్ పోలీసులు నిఘా పెట్టి ఈ దొంగస్వామి ఆట కట్టించారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి గురువారం ఆ కేసు వివరాలు వెల్లడించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన బుడగ జంగం బొమ్మెర బాపుస్వామి అలియాస్ శివస్వామి.. వేములవాడ జ్యోతిషం శివస్వామి పేరిట విజిటింగ్ కార్డులు పంచుతూ విస్తృతంగా ప్రచారం చేసుకున్నాడు. అమాయక మహిళలను లక్ష్యంగా చేసుకొని పూజలు చేస్తే మీ సమస్యలు పరిష్కారమవుతాయని వారిని నమ్మించేవాడు. తన దగ్గరకు వచ్చే మహిళలకు నీటిలో నిద్రమాత్రలు కలిపి తాగించేవాడు. వారు స్పృహ కోల్పోయిన తర్వాత అత్యాచారం చేసేవాడు. అనంతరం మొబైల్‌లో వీడియోలు తీసేవాడు. కొద్ది రోజుల తర్వాత ఆ మహిళలకు ఫోన్ చేసి నగ్నంగా ఉన్న వీడియోల వి షయం చెప్పి బ్లాక్‌మెయిల్ చేసేవాడు. ఆర్థిక స్తోమతను బట్టి వారి నుంచి రూ.వేల నుంచి రూ.లక్షల వరకు వసూలు చేసేవాడు.

గుట్టురట్టు చేసింది ఇలా..: బాధితుల నుంచి వివరాలు సేకరించిన పోలీసులు శివస్వామిపై నిఘా పెట్టి నర్సాపూర్‌లో అదుపులోకి తీసుకున్నా రు. నిందితుడి మొబైల్ ఫోన్‌లో మహిళల నగ్న వీడియోలు, బ్లాక్‌మెయిల్ చేసి వసూలు చేసిన ఆన్‌లైన్ వివరాలను గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. మంత్రాలకు సంబంధించిన సామగ్రితోపాటు పసుపు, కుంకుమ, గజ్జెలు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

'దేవా'.. ఒక్క మోటారు!

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి కడియం శ్రీహరిలు.. మోటార్‌ను ఆన్ చేసి నీటిని విడుదల చేసేందుకు పంప్‌హౌస్ వద్దకు చేరుకున్నారు. అర్ధరాత్రి వరకు నిరీక్షించినా సాంకేతిక సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తిరిగి వచ్చేశారు. ఇవి ఆస్ట్రియాకి చెందిన ఆండ్రీజ్ కంపెనీ మోటార్లు కావడంతో ఆ దేశం నుంచి సాంకేతిక నిపుణులు పంప్‌హౌస్‌కు చేరుకుని సాంకేతిక అడ్డంకులు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం నాటికి మోటారు సిద్ధం చేసి ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి నీళ్లను ఎత్తిపోసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ తాజాగా మంత్రి ఉత్తమ్‌కు సమాచారమిచ్చింది. అదే జరిగితే ధర్మసాగర్‌లో నిల్వలు పెరిగి అక్కడి నుంచి ఇతర రిజర్వాయర్లకు నీటిని తరలించి స్టేషన్‌ఘన్‌పూర్, హుస్నాబాద్, వరంగల్ వెస్ట్, వర్ధన్నపేట, పరకాల ప్రాంతంలోని పంటలకు సరఫరా చేసేందుకు అవకాశం కలగనుంది.

800 క్యూసెక్కులు సరఫరా చేస్తేనే..

దేవాదుల ఎత్తిపోతల కింద 1,28,280 ఎకరాల్లో ఆరుతడి, 70,350 ఎకరాల్లో వరి కలుపుకుని మొత్తం 1,98,630 ఎకరాలకు నీరు అందించాలని నీటిపారుదల శాఖ నిర్ణయించింది. కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల కింద రాష్ట్రంలో సాగుచేస్తున్న పంటలకు సరిపడా నీళ్లు అందుతుండగా, దేవాదుల ప్రాజెక్టు కిందే తీవ్రమైన నీటి కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో దేవన్నపేట పంప్‌హౌస్‌లోని ఒక మోటార్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తెచ్చి 800 క్యూసెక్కుల నీటిని సరఫరా చేయగలిగితే అంత మేరకు పంటలను రక్షించుకోగలుగుతామని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రమాదాలు నివారించే పనుల వల్లే ఆలస్యం

పంప్‌హౌస్ నిర్మాణం చాలా రోజుల కిందే పూర్తికాగా, రక్షణ చర్యల్లో భాగంగా పైపులకు సిమెంట్ ఇన్‌కేసింగ్ పనులు చేయాలని నిపుణులు సూచించారు. పంప్‌హౌస్ లోతు ఎక్కువగా ఉండడంతో నీళ్లు వెనక్కి తన్ని వచ్చినప్పుడు ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని గుర్తించడంతో ఈ సిఫారసు చేశారు. గత రెండు నెలలుగా ఈ పనులు జరుగుతుండగా, ఇప్పటికే రెండు మోటార్లకు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. ఇందులో ఒక మోటార్‌ను తక్షణమే వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యేల నుంచి కూడా ఒత్తిడి పెరిగింది.

మూడో దశ పూర్తైతే ..రైతు దశ తిరిగినట్టే..!

సమ్మక్కసాగర్ బరాజ్ బ్యాక్‌వాటర్ నుంచి దేవాదుల ఎత్తిపోతల పథకం నీళ్లను తరలించనుండగా, ప్రస్తుతం సమ్మక్కసాగర్‌లో 2.5 టీఎంసీల నిల్వలున్నాయి. రోజూ 1,500 క్యూసెక్కుల వరద వస్తోంది. దేవాదుల తొలిదశ కింద 5.18 టీఎంసీలు, రెండో దశ కింద 7.25 టీఎంసీలు, మూడో దశ కింద 25.75 టీఎంసీలు కలిపి మొత్తం 38.16 టీఎంసీల నీళ్లను ఎత్తిపోసి మొత్తం 5.57 లక్షల ఎకరాల ఆయకట్టు కు సాగునీరు అందించాల్సి ఉంది. ఇప్పటికే తొలి 2 దశల పనులు పూర్తయ్యాయి. మూడో దశ కూడా పూర్తైతే ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతు దశ తిరగనుంది.

బడ్జెట్‌లో నిమ్స్‌కు పెద్దపీట

● రూ.402.73 కోట్ల కేటాయింపుల్లో జీతభత్యాలకు రూ.316.93 కోట్లు
● అభివృద్ధి పనులకు రూ.50 కోట్లు, అత్యవసర పరికరాలకు రూ.16.50 కోట్లు
● నిమ్స్ రోగులకు భరోసా కల్పించిన ప్రభుత్వం
● సీఎం, మంత్రులకు ధన్యవాదాలు తెలిపిన డైరెక్టర్ బీరప్ప



లక్డీకాపూల్: సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను సునాయసంగా విజయవంతం చేస్తున్న నిమ్స్ ఆస్పత్రికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. ఈ క్రమంలో ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్న ఉద్యోగులు, రోగులకు ప్రాధాన్యం కల్పిస్తూ నిధుల కేటాయింపుల్లో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. గత ఏడాది కేటాయింపుల కంటే అధికంగా ఈ బడ్జెట్‌లో కేటాయించడమే ఇందుకు నిదర్శనం. ఆరోగ్యశ్రీ కార్డు లేని నిరుపేద కుటుంబాలకు సైతం ఉచిత వైద్య సేవలు అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ రూ.7.90 కోట్లను కేటాయించింది. అదేవిధంగా అత్యవసర వైద్య పరికరాల కొనుగోలు చేసేందుకు రూ.16.50 కోట్లు, ఆస్పత్రి మరింత అభివృద్ధికి మరో రూ.50 కోట్లు వెచ్చించింది. వీటితో పాటు ఉద్యోగుల జీతభత్యాలకు రూ.316.93 కోట్లు, ఇవ్వగా గతేడాది రూ.265 కోట్లు కావడం గమనార్హం. కాగా ఆస్పత్రిలో మౌలిక సౌకర్యాల కోసం రూ.11.40 కోట్ల చొప్పున కేటాయిస్తూ బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించింది.

నిమ్స్ అభివృద్ధిలో ప్రభుత్వ భాగస్వామ్యం కీలకం..



నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప

పేదల కార్పొరేట్ ఆస్పత్రిగా ఖ్యాతి చెందిన నిమ్స్ అభివృద్ధిలో ప్రభుత్వ భాగస్వామ్యం కీలకమని డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆస్పత్రికి ప్రాధాన్యం ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిమ్స్ అందిస్తున్న సేవలను దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేట్ ఆస్పత్రులకు భిన్నంగా ఎప్పటికప్పుడు ఆధునిక పరికరాలను సమకూర్చుకుంటూ సేవల్ని విస్తరించడంతో పాటు వేగంగా వైద్య సేవలు అందిస్తామన్నారు. నిమ్స్ సేవలు పేదలకు అందించేందుకు ప్రత్యేక కార్యచరణకు రూపకల్పన చేస్తున్నట్లు డైరెక్టర్ పేర్కొన్నారు.

రూ.9.7 కోట్లతో వాస్కులర్ ల్యాబ్

● రాష్ట్రవ్యాప్తంగా రూ.32 కోట్లతో వాస్కులర్ ల్యాబ్స్
● ఆరోగ్యశ్రీ ద్వారా నిమ్స్‌లో అత్యాధునిక వైద్య సేవలందించే దిశగా..
● నిమ్స్ డైరెక్టర్ బీరప్ప పెట్ ప్రాజెక్ట్‌గా కార్యచరణ

లక్డీకాపూల్: రాష్ట్రవ్యాప్తంగా రోజురోజుకీ పెరుగుతున్న డయాలసిస్ రోగులకు అత్యాధునిక వైద్యసేలను అందుబాటులోకి తీసుకువచ్చే క్రమంలో వాస్కులర్ ల్యాబ్స్ అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు రాష్ట్రం ప్రభుత్వం రూ.32 కోట్లు కేటాయించింది. ఇవి ఒక కేంద్రం నుంచి మరో కేంద్రానికి అనుసంధానంగా రోగులకు సేవలు అందిస్తూ ముఖ్యంగా డయాలసిస్‌పై చికిత్స పొందుతున్న రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తాయి. ఈ సెంటర్ల పనితీరు, విధి విధానాలను నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప ప్రత్యేకంగా కార్యచరణ ప్రణాళికలను రూపొందించారు. ఈ వాస్కులర్ యాక్సెస్ సెంటర్లు రూ.1.35 కోట్లతో మహబూబ్‌నగర్, రూ.1.30 కోట్లతో ఖమ్మం, రూ.1.37 కోట్లతో వరంగల్‌లో ఏర్పాటు కానున్నాయి. రూ.9.82 కోట్లతో నిమ్స్‌లో, రూ.9.43 కోట్లతో గాంధీ ఆస్పత్రిలో, రూ.9.41 కోట్లతో ఉస్మానియా ఆస్పత్రిల్లో అపెక్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో నిమ్స్ ట్రామా బ్లాక్‌లోని 4వ అంతస్తులో వాస్కులర్ సెంటర్ అందుబాటులోకి రానుంది. పేషెంట్ రూమ్, రెసిడెంట్స్ రూమ్, నర్సెస్, స్టోర్‌లతో పాటు రెండు ఆపరేషన్ థియేటర్లు, ఒక డీఎస్‌ఏ ల్యాబ్ సౌకర్యాన్ని కల్పించనున్నారు.

పెరిగిన ఏవీ యాక్సెస్ డిమాండ్

చివరిదశకు చేరిన మూత్రపిండ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఏవీ యాక్సెస్ విధానాలకు డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా ఫిస్టులాస్, ఆటోజీనియస్ ట్రాన్స్‌పొజిషన్లు, ఫిస్టులాల సాల్వేజ్, యాంజియోప్లాస్టీ, స్టెంటింగ్ వంటి ఎండోవాస్కులర్ సేవలకు ఈ ల్యాబ్‌లు మరింత మెరుగైన నాణ్యత ప్రమాణాలకు దోహదపడతాయి. సీ–ఆర్మ్‌తో కూడిన డీఎస్‌ఏ సౌకర్యంతో వాస్కులర్ యాక్సెస్ ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి వస్తే డయాలసిస్ రోగులకు ఎంతో ఉపశమనం కలుగుతుంది.

అందాల పోటీలతో గ్లోబల్ గుర్తింపు

- తద్వారా పర్యాటక పెట్టుబడులకు ఊతం
- మే 7 నుంచి 31 వరకు నగరంలో మిస్ వరల్డ్ పోటీలు
- ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామన్న మంత్రి జూపల్లి



తెలంగాణ సంస్కృతి, సౌందర్యానికి ముగ్ధురాలినయ్యా : మిస్ వరల్డ్ 2024 క్రిస్టినాపిష్కోవా

సాక్షి, హైదరాబాద్: ప్రపంచసుందరి పోటీలను నిర్వహించే అరుదైన అవకాశాన్ని దక్కించుకోవటం ద్వారా తెలంగాణ/ హైదరాబాద్ బ్రాండ్లకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వస్తుందని..ఇది నిరుద్యోగ యువత ఉపాధికి ఊతమిస్తుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మిస్‌వరల్డ్ 72వ ఎడిషన్ పోటీలను మే 7 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించబోతున్నామని చెప్పారు. నగరంలోని టూరిజం ప్లాజా హోటల్‌లో గురువారం మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించి గ్రాండ్ ప్రీ–లాంచ్ జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈఓ చైర్మన్, సీఈఓ జూలియామోర్లీ, చెక్ రిపబ్లిక్ నుంచి 71వ మిస్ వరల్డ్‌గా ఎన్నికైన క్రిస్టినా పిస్కోవా, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఈ సౌందర్య పోటీల నిర్వహణ అవకాశం తెలంగాణకు దక్కిందన్నారు. 140 దేశాల ప్రతినిధులు, 3 వేల మంది వరకు మీడియా సిబ్బంది పాల్గొనటం వల్ల హైదరాబాద్, తెలంగాణ గురించి ప్రపంచానికి తెలుస్తుందని, తద్వారా పెట్టుబడులు, అంతర్జాతీయ పర్యాటకులు వచ్చే వీలుందని, ఇది ఉద్యోగ, ఉపాధి కల్పనకు మార్గం సుగమం చేస్తుందని చెప్పారు. ఈ పోటీల నిర్వహణకు రూ.54 కోట్లు ఖర్చవుతాయని, ఇందులో సగం మొత్తం నిర్వాహకులే భరిస్తారని, మిగతా సగంలో స్పాన్సరర్లు భరిస్తారని తెలిపారు. రూ.5 కోట్ల వరకు మాత్రమే పర్యాటకాభివృద్ధి సంస్థ ద్వారా ఖర్చవుతుందన్నారు. పర్యాటక శాఖ కార్యదర్శి స్మిత సబర్వాల్ మాట్లాడుతూ 'మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ అవకాశం మనకు రావటం గొప్ప విషయం. దానిని సద్వినియోగం చేసుకొని ప్రపంచవ్యాప్తంగా తెలంగాణకు గుర్తింపు లభించేలా చూస్తాం'అన్నారు.

చీరకట్టుతో మిస్ వరల్డ్ విఘ్నేశ్వర పూజ

పోచంపల్లి చీర, తలలో పూలు, తిలకం ధరించిన మిస్‌వరల్డ్ క్రిస్టినా పిస్కోవాను మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల మధ్య టూరిజం ప్లాజాలోకి తోడ్కొని వచ్చారు. అనంతరం ఆమెతో అక్కడ విఘ్నేశ్వర పూజ చేయించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన సందర్శకులకు ఆమె అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 'నా మిస్ వరల్డ్ ప్రయాణం మొదలైంది భారత్‌లోనే..గతేడాది ముంబైలో జరిగిన పోటీల్లో నేను విజేతగా నిలిచాను. గొప్ప సంస్కృతి, చరిత్ర ఉన్న భారత్ నుంచి ఎంతో నేర్చుకున్నా. మొన్న యాదగిరిగుట్టను సందర్శించి అక్కడి శిల్ప సౌందర్యానికి దాసోహం అయిపోయాను. నా సోదరి గతంలో ఇండియా నుంచి తెప్పించిన చీర ఇచ్చింది. నాకు అప్పుడే చీర పరిచయం. ఈరోజు నాకు పోచంపల్లి చీర కట్టారు. భవిష్యత్‌లో కూడా చీర ధరిస్తాను.ఇక్కడి సంస్కృతి, నృత్య, హస్తకళలు, సామాజిక విలువలు, భిన్నత్వం, విభిన్న భాషలు, ఐకమత్యం ప్రధాన బలాలు'అని చెప్పారు.

అగ్గిపెట్టెలో ఎలా పట్టిందబ్బా..

రాజన్న సిరిసిల్ల జిల్లా నేత కళాకారుడి ప్రతిభకు మిస్‌వరల్డ్ క్రిస్టినా పిష్కోవా అబ్బుర పడ్డారు. వెల్ది హరిప్రసాద్ తాను నేసిన అగ్గిపెట్టెలో ఇమిడే చీర చూపించాడు. ఆ చీరను చూసిన ఆమె ఆశ్చర్యానికి లోనై.. హరిప్రసాద్‌ను అభినందించారు. -సిరిసిల్ల



జగదేక నగరానికి అతిలోక సుందరి

▶ మొదటి పేజీ తరువాయి

వారి ప్రత్యేకతను చాటుకుని జగజ్జేతగా నిలిచేందుకు పోటీ పడనున్నారు. ప్రపంచంలోనే ప్రతిష్టాత్మక పోటీలు కావడంతో భాగ్యనగర పేరు ప్రఖ్యాతులు కూడా మరింత విశ్వవ్యాప్తం కానున్నాయి

గతంలో రెండుసార్లు..

మన దేశంలో ఇప్పటివరకు రెండు పర్యాయాలు ప్రపంచ సుందరి పోటీలు జరిగాయి. 1996లో తొలిసారి బెంగళూరు ఇందుకు వేదికైంది. ఆ తర్వాత గతేడాదే 71వ ఎడిషన్ పోటీలకు ముంబై ఆతిథ్యమిచ్చింది. ఇక వరుసగా రెండోసారి.. 72వ ఎడిషన్‌కు కూడా మన దేశమే వేదిక కానుంది. ఇతర దేశాల్లో పోటీలు జరిగినప్పుడు ఏర్పాట్లు ఘనంగా ఉన్నా, భారీ జనసందోహంలో కార్యక్రమాలు జరిగేవి కాదు. అయితే గతేడాది ముంబైలో జరిగినప్పుడు, ఈ కార్యక్రమానికి జనం బ్రహ్మరథం పట్టారు. దీంతో మిస్ వరల్డ్ నిర్వాహకులకు ఇది క్రేజీగా కనిపించింది. దీంతో మరోసారి భారత్‌లోనే నిర్వహిస్తే బాగుంటుందని భావించారు. దీంతో అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం.. నిర్వాహకులతో మాట్లాడి ఒప్పించే బాధ్యతను పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్‌కు అప్పగించింది. ఆమె నిర్వాహకులను ఒప్పించడంలో సఫలీకృతం కావడంతో హైదరాబాద్‌కు అరుదైన అవకాశం దక్కింది. ముఖ్యమంత్రి దావోస్ పర్యటనకు వెళ్లినప్పుడే ఈ విషయం ఆయన దృష్టికి వచ్చింది. అప్పటి నుంచే ఆయన నిర్వాహకులతో సంప్రదింపులకు సన్నాహాలు ప్రారంభించారు. కాగా ఈసారి 140 దేశాల సుందరీమణులు ఈ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు చెబుతున్నారు. ఆయా కార్యక్రమాలను కవర్ చేసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి 3,300 మంది మీడియా ప్రతినిధులు హైదరాబాద్‌లో మకాం వేయనున్నారు.



రాష్ట్రంలో పర్యటనలు ఇలా..

పోటీలు జరిగే సమయంలో సుందరీమణులు రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారు. ఆ సందర్భంలో వారందరితో పోచంపల్లి చీరలు కట్టించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే వారిని తీసుకెళుతుంది. 40 మందిని ఒక బృందంగా ఏర్పాటు చేసి, ఒక్కో బృందాన్ని ఒక్కోచోటకు తీసుకెళ్తారు.

గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం



మే 10 గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ప్రారంభ వేడుక ఘనంగా జరుగుతుంది.

- **బుద్ధవనం:** 12న ఓ బృందం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం సందర్శిస్తుంది. బౌద్ధం ఇతివృత్తంగా ఇది సాగుతుంది.
- **చార్మినార్:** 13న సాయంత్రం ఆరు నుంచి ఏడు వరకు ఓ బృందం చార్మినార్, లాడ్‌బజార్‌లలో హెరిటేజ్ వాక్ నిర్వహిస్తుంది. అక్కడ షాపింగ్ చేస్తారు.
- **చౌమొహల్లాలో డిన్నర్:** 13న చౌమొహల్లా ప్యాలెస్‌లో ప్రత్యక్ష సంగీత విభావరి నడుమ పోటీదారులు విందులో పాల్గొంటారు.
- **కాళోజీ కళాక్షేత్రం:** 14న అమెరికా–కరేబియన్ ప్రాంతాల పోటీదారులు వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శిస్తారు. ఉదయం 11 నుంచి 2 వరకు అక్కడ స్థానికులు, విద్యార్థులతో ముచ్చటిస్తారు.
- **రామప్ప:** సాయంత్రం 5 నుంచి 7 వరకు యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని సందర్శిస్తారు. అక్కడ పేరిణి నృత్యరీతులతో కళాకారులు వారికి స్వాగతం పలుకుతారు.
- **యాదగిరిగుట్ట:** యూరప్‌నకు చెందిన పోటీదారుల బృందం 15న మధ్యాహ్నం 12 నుంచి 2 వరకు యాదగిరిగుట్ట దేవాలయాన్ని సందర్శిస్తుంది.
- **పోచంపల్లి:** యూరప్‌నకు చెందిన రెండో బృందం 15న సాయంత్రం యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ గుర్తించిన పోచంపల్లి గ్రామాన్ని సందర్శించి అక్కడి చేనేత వస్త్ర తయారీ కేంద్రాలను పరిశీలిస్తారు.
- **మెడికల్ టూరిజం:** 16న ఆఫ్రికా, మధ్య ప్రాచ్య దేశాలకు చెందిన పోటీదారులు మెడికల్ టూర్‌లలో భాగంగా నగరంలోని అపోలో, ఏఐజీ, యశోదా ఆసుపత్రులను సందర్శిస్తారు.
- **స్పోర్ట్స్ ఫైనల్:** స్పోర్ట్స్ ఫైనల్ కార్యక్రమం 17న ఉదయం ఏడున్నర నుంచి పదిన్నర వరకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతుంది.
- **కల్చరల్, మ్యూజిక్, డాన్స్, ఫుడ్ ఆర్ట్ :** 17న సాయంత్రం నగర శివారులోని ఎకో టూరిజం పార్కులో జరిగే కల్చరల్, ఫుడ్, ఆర్ట్ ఫెస్టివల్‌లో పాల్గొంటారు.
- **సేఫ్టీ టూరిజం:** నగరంలో పోలీసింగ్ తీరును పరిశీలించేందుకు 19న పోటీదారులు పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శిస్తారు.
- **సచివాలయం:** 19న హుస్సేన్‌సాగర్ తీరం, అంబేడ్కర్ విగ్రహం, సచివాలయం ప్రాంతాలను సందర్శిస్తారు.
- **టీహబ్:** 20, 21 తేదీల్లో టీహబ్‌లో మిస్ వరల్డ్ కరేబియన్, మిస్ వరల్డ్ ఆఫ్రికా, మిస్ వరల్డ్ ఏషియా, ఓషియానియాల మధ్య కాంటినెంటల్ ఫినాలే ఉంటుంది.
- **శిల్పారామం:** 21న సాయంత్రం 6 నుంచి రాత్రి 8 వరకు శిల్పారామంలో ఆర్ట్స్ క్రాఫ్ట్స్ వర్క్‌షాప్‌లో పాల్గొంటారు.
- **శిల్పకళావేదిక:** 22న శిల్పకళావేదికలో టాలెంట్ ఫినాలే జరుగుతుంది.
- **ఐఎస్బీ:** గచ్చిబౌలిలోని ఐఎస్బీలో 23న హెడ్ టూ హెడ్ ఛాలెంజ్ ఫినాలే జరుగుతుంది.
- **హైటెక్స్:** 24న హైటెక్స్‌లో మోడల్ అండ్ ఫ్యాషన్ ఫినాలే జరుగుతుంది. హైటెక్స్‌లోనే 25న నగలు వజ్రాభరణాల ఫ్యాషన్ షో జరుగుతుంది.
- **బ్రిటిష్ రెసిడెన్సీ:** 26న బ్రిటిష్ రెసిడెన్సీ, తాజ్ ఫలక్‌నుమాలలో పర్పస్ ఈవెంట్ గలా డిన్నర్ ఉంటుంది. ప్రముఖ కళాకారుల సంగీత, నృత్య ప్రదర్శన ఉంటుంది.

హైటెక్స్



మే 31 పోటీల తుది పోరు (గ్రాండ్ ఫినాలె). సాయంత్రం ఐదున్నర నుంచి రాత్రి ఒంటిగంట వరకు కొనసాగుతుంది.

బికినీలకు నో..!

ప్రపంచ సుందరి పోటీల్లో పలు అంశాలకు ప్రాధాన్యత ఉంటుంది. వాటిల్లో కొన్నింటిలో బికినీల్లాంటి వస్త్రాలు ధరించాల్సి ఉంటుంది. కానీ హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో శరీరాన్ని ప్రదర్శించే విధంగా వస్త్రధారణ ఉండొద్దని ప్రభుత్వం నిర్వాహకులకు ముందుగానే షరతు విధించింది. ఆయా దేశాల సంప్రదాయ, కాస్త ఆధునిక వస్త్రాలు ధరించొచ్చని, ఒక పోటీలో పూర్తిగా భారతీయ సంప్రదాయ వస్త్రాలే ధరించాలని సూచించింది. దీనికి నిర్వాహకులు అంగీకరించారు.

రాష్ట్రావతరణ దినోత్సవంలో ప్రపంచ సుందరి

ఈసారి పరేడ్ మైదానంలో జరిగే రాష్ట్రావతరణ దినోత్సవంలో ప్రపంచ సుందరి సందడి చేయనుంది. మే 31న జరిగే తుదిపోరులో ఏ దేశానికి చెందిన సుందరి విజేతగా నిలుస్తుందో ఆమె.. జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొననుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి మిస్ వరల్డ్ లిమిటెడ్ నిర్వాహకులు అంగీకరించారు. మిస్ వరల్డ్ కిరీటం గెలుచుకున్న సుందరితో పాటు, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన మొదటి, రెండో రన్నరప్‌లు కూడా ఈ వేడుకల్లో పాల్గొననున్నట్టు తెలిసింది. పరేడ్ మైదానంలో జరిగే ముఖ్య కార్యక్రమాలతో పాటు ఆరోజు సాయంత్రం రాజ్‌భవన్‌లో జరిగే కార్యక్రమానికి కూడా వారు హాజరయ్యేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అక్కడ గవర్నర్ ఏర్పాటు చేసే హై టీ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో కలిసి పాల్గొంటారు.



గచ్చిబౌలి స్టేడియం టూ హైటెక్స్..

అందాల పోటీల్లో పాల్గొనే సుందరీమణులు మే 6, 7 తేదీల్లో నగరానికి చేరుకుంటారు. 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ప్రారంభ వేడుక ఘనంగా జరుగుతుంది. తెలంగాణ జానపద, గిరిజన నృత్యాభినయ ఇతివృత్తంతో ఇది ఉంటుంది. నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం, టీ–హబ్, శిల్పకళావేదిక, ఐఎస్బీ క్యాంపస్, హైటెక్స్ వేదికల్లో వివిధ అంశాల్లో పోటీలు జరుగుతాయి. వాటిని మిస్ వరల్డ్ నిర్వాహకులే ఎంచుకున్నారు.

మనుషులకంటే ఫోన్ కనెక్షన్‌లే ఎక్కువ

రాష్ట్రంలో దాదాపు 4.20 కోట్ల ఫోన్ కనెక్షన్లు

- వైర్‌లెస్ ఫోన్ కనెక్షన్లే 4 కోట్ల 42 వేలు
- మొబైల్ కనెక్షన్ డెన్సిటీలో దేశంలో 4వ స్థానం
- పట్టణ ప్రాంతాల్లోనే 60.40 శాతం ఫోన్లు
- బ్రాండ్‌బ్యాండ్ కనెక్షన్లు మూడున్నర కోట్లు
- సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడించిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో జనాభా కంటే ఫోన్ కనెక్షన్లే అధికంగా ఉన్నాయి. మొబైల్ కనెక్షన్ల డెన్సిటీ (సాంద్రత)లో దేశంలో తెలంగాణ నాలుగో స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన సామాజిక ఆర్థిక ముఖచిత్రం (సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్)లో 2024 సెప్టెంబర్ వరకు టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ ప్రకటించిన డేటాను పొందుపరిచింది. దేశంలో వైర్‌లెస్ ఫోన్ల డెన్సిటీలో గోవా (152.64 శాతం) మొదటి స్థానంలో ఉంది. కేరళ (115.05 శాతం), హర్యానా (114.08 శాతం) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉండగా.. తెలంగాణ (105.82 శాతం) నాలుగో స్థానంలో నిలిచింది.

బలమైన సమాచార వ్యవస్థ

రాష్ట్రంలో మొత్తం ఫోన్ కనెక్షన్లు 41.94 మిలియన్లు (దాదాపు 4 కోట్ల 19 లక్షల 40 వేలు) ఉన్నాయని ఆర్థిక సర్వేలో తెలిపారు. అందులో వైర్‌లెస్ కనెక్షన్లు 40.42 మిలియన్లు (4 కోట్ల 42 వేలు) ఉన్నట్లు తేల్చారు. ల్యాండ్‌లైన్ ఫోన్ కనెక్షన్లు రాష్ట్రంలో 1.52 మిలియన్లు ఉన్నట్లు వెల్లడించారు. సమాచార వ్యవస్థ తెలంగాణలో బలోపేతంగా ఉన్నట్లు ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని సర్వే నివేదికలో ప్రభుత్వం తెలిపింది. పట్టణాలు, నగరాల్లో వైర్‌లెస్ ఫోన్ నెట్‌వర్క్ బలంగా ఉంది. మొత్తం వైర్‌లెస్ కనెక్షన్లలో పట్టణాల్లో 23.87 మిలియన్లు (59.05 శాతం) ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 16.55 మిలియన్లు (40.95 శాతం) ఉన్నాయి. ల్యాండ్‌లైన్ ఫోన్లలో పట్టణాల్లో 1.46 మిలియన్ కనెక్షన్లు ఉంటే.. గ్రామీణ ప్రాంతాల్లో 0.06 మిలియన్లు ఉన్నాయి.

బ్రాడ్‌బ్యాండ్ జోరు

రాష్ట్రంలో డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మౌలిక సదుపాయాలు భారీగా విస్తరిస్తున్నాయి. తెలంగాణలో 36.43 మిలియన్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు ఉన్నట్లు ట్రాయ్ లెక్కలు తేల్చాయని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో ఈ– పరిపాలన, విద్య, ఆరోగ్యం, ఐటీ రంగాల్లో విస్తృతంగా వినియోగిస్తున్న నేపథ్యంలో బ్రాండ్‌బ్యాండ్ ఇంటర్నెట్ కనెక్షన్లు అధికంగా ఉన్నాయి. బ్రాండ్‌బ్యాండ్, న్యారోబ్రాండ్ ఇంటర్నెట్ కనెక్షన్లలో బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ 98% ఉన్నాయి. మొత్తం 36.43 ఇంటర్నెట్ కనెక్షన్లలో బ్రాండ్‌బ్యాండ్ కనెక్షన్లు 35.68 మిలియన్లు, న్యారో బ్రాండ్ కనెక్షన్లు 0.75 లక్షలు ఉన్నట్లు వివరించింది.

68% రైతులకు చిన్న కమతాలే

- 2014 తర్వాత 4 శాతం పెరిగిన చిన్న కమతాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయ భూముల్లో చిన్న కమతాలు పెరుగుతున్నాయి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లలో చిన్న కమతాలు 4 శాతం పెరిగాయి. 2.47 ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతుల శాతం పెరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడించింది. 2014లో 2.47 ఎకరాలలోపు సాగుభూమి ఉన్నవారు 64.6 శాతం మంది ఉంటే.. 2021–22లో నిర్వహించిన అగ్రికల్చర్ సెన్సస్‌లో అది 68.7 శాతానికి పెరిగింది. రాష్ట్రంలో మొత్తం 70.60 లక్షల మంది సొంత భూమి ఉన్న రైతులు ఉన్నారు. రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూమి 1.56 కోట్ల ఎకరాలు ఉన్నట్లు లెక్క తేల్చారు.

కమతం (భూ విస్తీర్ణం.. ఎకరాల్లో)	రైతుల శాతం
2.47 ఎకరాలలోపు	64.6
2.48 నుంచి 4.94 ఎకరాలు	23.7
4.95 నుంచి 9.88 ఎకరాలు	9.5
5 ఎకరాలలోపు పొలం ఉన్నవారు	88.3
9.89 నుంచి 24.77 ఎకరాలలోపు	2.1
24.77 ఎకరాలకంటే ఎక్కువ	0.2

వివిధ వర్గాల వద్ద ఉన్న భూమి

వర్గం	రైతులు (లక్షలు)	భూమి (లక్షల ఎకరాలు)
ఎస్సీలు	9.79	15.10
ఎస్టీలు	8.34	18.61
సంస్థలు	-	22,000
ఇతర వర్గాలు	52.47	1.22 కోట్ల ఎకరాలు


అడవులు 24.69%


జాతీయ సగటు 23.59 శాతం కంటే రాష్ట్రంలోనే అధికం

- రాష్ట్ర అటవీ విస్తీర్ణం 27,688 చదరపు కిలోమీటర్లు
- రాష్ట్రంలో 2,939 కి పైగా వృక్ష, మొక్కల జాతులు
- 365 పక్షి జాతులు, 131 జంతు, మృగాల జాతులు
- సామాజిక, ఆర్థిక సర్వేలో వెల్లడించిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అడవులు 24.69 శాతం ఉన్నాయని సామాజిక, ఆర్థిక సర్వే 2024–25లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశంలో అడవులు 23.59 శాతం ఉండగా, రాష్ట్రంలో అంతకంటే అధికంగానే ఉన్నట్లు పేర్కొంది. అడవుల సగటు విస్తీర్ణంలో దేశంలో తెలంగాణ మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 2,939 కి పైగా వృక్ష, మొక్క జాతులున్నాయి. 365 పక్షి జాతులు, 131 ఇతర జంతువులు, మృగాల జాతులున్నాయని సర్వేలో తెలిపారు. రాష్ట్రంలో మొత్తం అడవులు 27,688 చ.కి.మీ మేర విస్తరించి ఉన్నాయి. మొత్తం 12 రక్షిత ప్రాంతాల్లో 9 వైల్డ్‌లైఫ్ శాంక్చురీలు, మూడు జాతీయ పార్కులు ఉన్నాయి. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం వనమహోత్సవం, ప్రాజెక్ట్ టైగర్, అర్బన్ ఫారెస్ట్ బ్లాక్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. అమ్రాబాద్ పులుల అభయారణ్యం (ఏటీఆర్)ను ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా ప్రకటించింది.







రాష్ట్రంలోని వన్యమృగ సంరక్షణ కేంద్రాలు

శాంక్చురీలు	జిల్లా	విస్తీర్ణం
కవ్వాల్	మంచిర్యాల, నిర్మల్	892.23
ప్రాణహిత	మంచిర్యాల	136.02
శివ్వారం	మంచిర్యాల, పెద్దపల్లి	29.81
ఏటూరు నాగారం	ములుగు	803.00
పాకాల	మహబూబాబాద్, వరంగల్	860.20
కిన్నెరసాని	భద్రాద్రి కొత్తగూడెం	635.40
మంజీర	సంగారెడ్డి	20.00
పోచారం	మెదక్, కామారెడ్డి	129.84
అమ్రాబాద్	నాగర్‌కర్నూల్, నల్లగొండ	2,166.37
మొత్తం		5,672.87

(చ.కి.మీలలో)

సాగిలో 3 రూర్బన్‌లో 4వ స్థానం

గ్రామీణాభివృద్ధిలో రాష్ట్రం మంచి ప్రదర్శన

కేంద్ర పథకాల లక్ష్యాల సాధనలో ముందడుగు

సాక్షి,హైదరాబాద్: గ్రామీణాభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో సత్తా చాటుతోంది. కేంద్ర ప్రభుత్వం 2014లో ప్రారంభించిన సన్సద్ ఆదర్శ్ గ్రామ యోజన (ఎస్ఏజీవై)లో రాష్ట్రం మూడోస్థానంలో నిలిచింది. ఈ పథకం లక్ష్యాలలో 100 శాతం సాధించిన గుజరాత్, పశ్చిమబెంగాల్ మొదటి, రెండో స్థానాల్లో నిలువగా, 99.96 శాతం సాధించిన తెలంగాణ మూడో స్థానం దక్కించుకుంది. 99.47 శాతంతో తమిళనాడు నాలుగో స్థానంలో, ఉత్తరప్రదేశ్ 98.76 శాతంతో ఐదోస్థానంలో నిలిచాయి. ఈ పథకం కింద ఒక్కో పార్లమెంట్ సభ్యుడు ఒక గ్రామపంచాయతీని దత్తత తీసుకుని, ఆ గ్రామ సమగ్రాభివృద్ధికి అంశాలవారీగా ప్రాధాన్యతలను ఖరారు చేస్తారు. ఈ ఆదర్శ గ్రామాలు పరిపాలన, అభివృద్ధిలో ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవాలన్నదే ఈ పథకం లక్ష్యం. ఇందులో భాగంగా గ్రామాభివృద్ధి ప్రణాళికలు (వీడీపీ) సిద్ధంచేసి, నిర్ణీత కాలంలో వివిధ ప్రాజెక్టులను అమలు చేస్తారు.

గ్రామాలకు పట్టణ శోభ

పట్టణాల్లో మాదిరిగా గ్రామాల్లోనూ ముఖ్యమైన సౌకర్యాలు, సదుపాయాల కల్పన కోసం కేంద్రం శ్యామాప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ (ఎస్‌పీఎంఆర్‌ఎం)ను ప్రారంభించింది. రాష్ట్రంలో ఈ పథకం కింద నైపుణ్య శిక్షణ, అగ్రో ప్రాసెసింగ్, అగ్రి సర్వీసెస్ (స్టోరేజీ, వేర్ హౌసింగ్), వైద్య సదుపాయాలు, స్కూళ్ల అప్‌గ్రేడేషన్, పారిశుధ్యం నిర్వహణ, పైపుల ద్వారా తాగునీటి సరఫరా, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ కోసం పౌర సేవా కేంద్రాల ఏర్పాటు వంటివి చేపడుతున్నారు. ఈ పథకంలో 2025 జనవరి నాటికి చూస్తే తెలంగాణ 4వ స్థానంలో నిలిచింది.

రూర్బన్‌లో టాప్ 5 రాష్ట్రాలు (సాధించిన పాయింట్లు)

తమిళనాడు	మిజోరం	ఉత్తరప్రదేశ్	తెలంగాణ	కర్ణాటక
96.32	93.96	92.37	91.87	88.47

చేయూత పింఛన్లు 42,51,341



2024-25లో పింఛన్లకు రూ.10,514.32 కోట్లు అందజేత

- లబ్ధిదారుల్లో బీసీలు 54.8 శాతం, ఓసీలు 14.6 శాతం
- వృద్ధులు, వితంతు పింఛన్లు 30 లక్షల పైచిలుకు.. సామాజిక, ఆర్థిక సర్వేలో ప్రభుత్వం వెల్లడి

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో చేయూత సామాజిక పింఛన్ల కింద 2024–25 ఆర్థిక సంవత్సరంలో లబ్ధిదారులకు మొత్తం రూ.10,514.32 కోట్లు (మార్చిలో చెల్లించాల్సిన రూ.982.20 కోట్లు కలిపి) అందజేసినట్లు సామాజిక ఆర్థిక సర్వే 2024–25లో ప్రభుత్వం తెలిపింది. 2024–25 బడ్జెట్‌లో ఈ పింఛన్ల కోసం 14,628.91 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. 2025–26 వార్షిక బడ్జెట్‌లో పింఛన్లకు రూ.14,861 కోట్లు కేటాయించింది. మొత్తం 11 కేటగిరీల్లో 42,51,341 మందికి పింఛన్లు అందిస్తున్నారు. వీరిలో దివ్యాంగులకు నెలకు రూ.4,016 చొప్పున, వృద్ధులు, వితంతువులు, ఇతర కేటగిరీలవారికి రూ.2,016 చొప్పున ఇస్తున్నారు. అయితే కాంగ్రెస్ ఎన్నికల హామీ ప్రకారం వృద్ధులు ఇతర కేటగిరీల పింఛన్లను రూ.2,016 నుంచి రూ.4 వేలకు, దివ్యాంగులకు రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంపుదల ఎప్పటినుంచి అమల్లోకి వస్తుందనేదానిపై స్పష్టత కొరవడింది. ఈ హామీని అమలు చేయాలంటే ఏడాదికి రూ.23 వేల కోట్ల వరకు బడ్జెట్ పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు.

వివిధ కేటగిరీల్లో పింఛన్లు పొందుతున్న వారు..

కేటగిరీ	పింఛన్(రూ.)	లబ్ధిదారులు
వృద్ధులు	2,016	15,18,021
వితంతువులు	2,016	15,22,550
దివ్యాంగులు	4,016	4,90,044
బీడీ కార్మికులు	2,016	4,22,425
ఒంటరి మహిళలు	2,016	1,40,456
గీత కార్మికులు	2,016	62,635
నేత కార్మికులు	2,016	35,623
ఎయిడ్స్ రోగులు	2,016	34,254
బోదకాలు బాధితులు	2,016	17,403
డయాలసిస్ రోగులు	2,016	4,105
బీడీ టేకేదార్లు	2,016	3,825
మొత్తం		42,51,341

సామాజికవర్గం వారీగా పింఛన్‌దారులు

సామాజికవర్గం	సంఖ్య(లక్షల్లో)	శాతం
బీసీలు	23.30	54.8
ఎస్సీలు	6.72	15.8
ఓసీలు	6.19	14.6
ఎస్టీలు	3.46	8.1
మైనార్టీలు	2.83	6.7

క్లుప్తంగా...

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ఊరట

'ఎన్నికల' కేసును కొట్టివేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై సికింద్రాబాద్ మార్కెట్ పీఎస్‌లో దాఖలైన కేసును హైకోర్టు కొట్టివేసింది. జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా బీజేపీ కార్యకర్తల సమావేశంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడారని బండిపై ఈ కేసు నమోదైంది. కాగా, ఈ కేసును కొట్టివేయాలని, ఎలాంటి సాక్ష్యాలు లేకుండా తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్.. సంజయ్‌పై కేసును కొట్టివేస్తూ గురువారం తీర్పునిచ్చారు. ఈ కేసులో పోలీసు అధికారుల నుంచి కాకుండా ఇతర సాక్షుల స్టేట్‌మెంట్‌లను నమోదు చేయడంలో దర్యాప్తు అధికారి విఫలమయ్యారని బండి తరఫు న్యాయవాది వాదించారు. ఎఫ్ఎస్ఎల్ నుంచి నివేదికలు పొందడంలోనూ విచారణ సరిగా సాగలేదని భావించిన న్యాయమూర్తి కేసును కొట్టివేశారు. ఇదిలా ఉండగా 2023 ఎన్నికల సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌పై భవానీనగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన రెండు కేసులను కూడా దర్యాప్తు సరిగా లేదంటూ న్యాయమూర్తి కొట్టివేశారు.

బైపాస్ రోడ్డు నిర్మాణానికి అనుమతులివ్వండి

కేంద్రమంత్రి గడ్కరీకి డీకే అరుణ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డు నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతులు ఇవ్వాలని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి బీజేపీ ఎంపీ డీకే అరుణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి డీకే అరుణ.. కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జడ్చర్ల నుంచి రాయచూర్‌కు వెళ్లే 176 జాతీయ రహదారి వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, బైపాస్ రోడ్డు నిర్మాణం వల్ల రవాణా సౌలభ్యం మెరుగుపడటంతోపాటు.. ప్రజలకు మేలు జరుగుతుందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తమ ప్రతిపాదనకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. డీకే అరుణ సహకారంతో ఈ టర్మ్‌లోనే బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని యెన్నెం ఆశాభావం వ్యక్తం చేశారు.

ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీల సంబరాలు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ శాసనసభలో.. 42% బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ఆమోదం పొందడంపై కాంగ్రెస్ ఎంపీలు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సంబరాలు నిర్వహించారు. గురువారం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా.. ఎంపీలు మల్లు రవి, అనిల్ కుమార్, చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు కాంగ్రెస్ శ్రేణులు డప్పులు వాయిస్తూ, మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం మల్లు రవి విలేకరులతో మాట్లాడుతూ.. పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం రాహుల్ గాంధీ నేతృత్వంలో త్వరలో ప్రధాని మోదీని కలుస్తామన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం పార్టీలకతీతంగా అందరూ కలిసి రావాలని ఎంపీ చామల కోరారు. దేశంలో తొలిసారిగా బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులను ప్రవేశపెట్టిన సీఎంగా రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ప్రశంసించారు.

వినియోగదారుల సేవల్లో టీజీఎస్పీడీసీఎల్ భేష్

జాతీయ స్థాయిలో మూడో ర్యాంక్ ప్రకటించిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: వినియోగదారుల సేవల రేటింగ్స్‌లో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) జాతీయ స్థాయిలో మూడో ర్యాంకును దక్కించుకుంది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డిస్ట్రిబ్యూషన్ యుటిలిటీస్ ర్యాంకింగ్ రిపోర్టు 2023–24లో వినియోగదారుల సేవల విభాగంలో ఈ సంస్థ మూడో స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో మొత్తం 41 డిస్కంలకు ఈ రిపోర్టులో కేంద్రం రేటింగ్స్‌ను కేటాయించింది. నాణ్యమైన విద్యుత్ సరఫరా, సత్వరంగా కొత్త కనెక్షన్ల జారీ, వివిధ రకాల సేవలకు అవసరమైన ఆధారపత్రాల సంఖ్యను తగ్గించి నిబంధనలను సరళీకరించడం, కచ్చితమైన బిల్లింగ్, వినియోగదారుల ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించడం, ఆన్‌లైన్, మొబైల్ యాప్ ద్వారా 99 శాతం సేవలను అందుబాటులోకి తేవడం ద్వారా టీజీఎస్పీడీసీఎల్ వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తోందని గుర్తించి ఈ మేరకు కేంద్రం ర్యాంకును కేటాయించిందని సంస్థ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ తెలిపారు. ఇందుకు కృషి చేసిన సంస్థ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

నేడు అసెంబ్లీలో బడ్జెట్‌ పై చర్చ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం 2025–26 వార్షిక బడ్జెట్‌కు సంబంధించిన ప్రతిపాదనలపై సాధారణ చర్చ జరగనుంది. ఈ చర్చకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇస్తారు. తెలంగాణ చర్మ పరిశ్రమ అభివృద్ధి కార్పొరేషన్ వార్షిక నివేదికను సభకు సమర్పిస్తారు. దీంతోపాటు రెండు ప్రభుత్వ బిల్లులు సభ ఆమోదం కోసం చర్చకు రానున్నాయి. తెలంగాణ అడ్వొకేట్స్ వెల్ఫేర్ ఫండ్ సవరణ బిల్లు, తెలంగాణ అడ్వొకేట్ క్లర్క్స్ సంక్షేమ నిధి సవరణ బిల్లుపై సభ చర్చించి ఆమోదించనుంది. శాసనమండలిలోనూ వార్షిక బడ్జెట్‌పై చర్చ జరుగుతుంది.

ప్రతి ఒక్కరూ 'ఐరన్‌మ్యాన్' అయిపోయినట్టే!

ఒక్క గ్రాముతో.. 27 ఏళ్లు బతికేయొచ్చు



కడుపు నిండా భోజనం చేస్తే.. ఓ పూట పనికి సరిపడా శక్తి వచ్చేస్తుంది. మహా అయితే మరికొన్ని గంటలు గడిపేయొచ్చు. ఆ తర్వాత మళ్లీ ఏదో ఒకటి తినాల్సిందే. శక్తిని సమకూర్చుకోవాల్సిందే. అరటి పండు తింటే ఇంత, అన్నం తింటే ఇంత అంటూ మన శరీరానికి అందే కేలరీల శక్తిని గురించి లెక్కలేసుకుంటూ ఉంటాం కూడా. కానీ కేవలం ఒక్క గ్రాము.. అంటే అరచేతిలో పట్టేంత పదార్థంతో.. 27 ఏళ్లు బతికేసేంత శక్తి వస్తే!? భలే చిత్రమైన అంశం కదా.. ఇది జస్ట్ కేవలం థియరీ మాత్రమే, నిజంగా చేయగలిగితే మనుషులమంతా 'ఐరన్ మ్యాన్' అయిపోవచ్చన్న మాటే!

ఏం చేసినా, చేయకున్నా శక్తి ఖర్చు..

మనం ఏ పనిచేసినా, ఏమీ చేయకుండా నిద్రపోయినా కూడా మన శరీరంలో శక్తి ఖర్చవుతూనే ఉంటుంది. గుండె కొట్టుకోవడం, రక్త సరఫరా, శ్వాస తీసుకోవడం, మెదడు, కాలేయం, కిడ్నీలు ఇలా దాదాపు అన్ని అవయవాలు దాదాపుగా నిరంతరం పనిచేస్తూనే ఉంటాయి. ఇందుకోసం శక్తి ఖర్చవుతూనే ఉంటుంది. ఇక మనం ఏ పనిచేసినా కండరాల్లో శక్తి వినియోగం అవుతుంది. మనం తినే ఆహారం నుంచే ఈ శక్తి శరీరానికి సమకూరుతూ ఉంటుంది.

ఉదాహరణకు ఒక అరటి పండు నుంచి 90 కేలరీల శక్తి వస్తుంది. గుడ్డు నుంచి 155 కేలరీలు, వంద గ్రాముల అన్నం నుంచి 130 కేలరీలు, 100 గ్రాముల చికెన్ నుంచి 239 కేలరీల శక్తి అందుతుంది.

ఆ ఒక్క గ్రాము.. ఆహారం కాదు!

→ ఒక్క గ్రాముతో 27 ఏళ్లు బతికేయొచ్చని చెప్పినది ఆహారం గురించి కాదు.. అంత శక్తిని ఉత్పత్తి చేయగల యురేనియం నుంచి! అణువిద్యుత్ ఉత్పత్తి, అణ్వాయుధాల తయారీ కోసం యురేనియం వాడటం తెలిసిందే. శాస్త్రవేత్తలు తేల్చిన లెక్కల ప్రకారం... ఒక్క గ్రాము యురేనియం నుంచి సుమారు 1,96,05,985 కేలరీలు.. ఈజీగా చెప్పాలంటే సుమారు 2 కోట్ల కేలరీల శక్తి వస్తుంది. అంటే.. ఏకంగా 27 ఏళ్లపాటు శరీరానికి అవసరమైన శక్తి అంతా అందుతుందన్న మాట.

ఐరన్ మ్యాన్ 'ఆర్క్ రియాక్టర్' తరహాలో..

→ అయితే యురేనియం నుంచి శక్తి వస్తుందికదా అని నేరుగా తినేయడం అస్సలు సాధ్యం కాదు. అత్యంత ప్రమాదం కూడా. కేవలం 50 మిల్లీగ్రాముల యురేనియం శరీరంలోకి వెళ్లినా... ప్రాణాలు పోయినట్టే. మరి శరీరానికి శక్తి ఎలా? దీనిపైనే శాస్త్రవేత్తలు భిన్నమైన ప్రతిపాదన చేస్తు న్నారు. చిన్న పరిమాణంలో ఉండే అణు రియాక్టర్‌ను రూపొందించి, శరీరంలో అమర్చడం ద్వారా శక్తి పొందవచ్చట. ఉదాహరణకు.. 'ఐరన్ మ్యాన్' సినిమాలో హీరో క్యారెక్టర్. తన గుండె ఉండే భాగంలో చిన్న పాటి 'ఆర్క్ రియాక్టర్'ను అమర్చుకుంటాడు. దాని నుంచి వచ్చే శక్తితోనే ఐరన్‌మ్యాన్ పోరాటాలు, విన్యాసాలు చేస్తుంటాడు.



అయినా.. 'ఆహారం' తప్పనిసరిగా తినాల్సిందే!



ఒకవేళ నిజంగానే 'ఆర్క్ రియాక్టర్' వంటిది వచ్చినా.. మనం ఆహారం తీసుకోవడం మాత్రం తప్పదని నిపుణులు తేల్చి చెప్తున్నారు. మన శరీరం కేవలం కేలరీల శక్తితో మాత్రమే పనిచేయదు. ప్రతి అవయవం పనితీరుకు, ప్రతి జీవక్రియకు కొన్ని ప్రత్యేకమైన రసాయన సమ్మేళనాలు.. విటమిన్లు, ప్రొటీన్లు, ఖనిజాలు, అమైనో ఆమ్లాలు వంటివి అవసరం. వాటికోసమైనా మనం సమతుల పోషకాహారం తీసుకోక తప్పదు మరి.

ఇక మిగిలింది.. యురేనియంతో 'ఐరన్‌మ్యాన్' ఎప్పుడు అవుదామా అని ఎదురుచూడటమే!

– సాక్షి సెంట్రల్ డెస్క్

హరీశ్‌పై ఎఫ్ఐఆర్ చట్టవిరుద్ధం

- ఫోన్ ట్యాపింగ్ కేసును కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు
- ఫిర్యాదు చేయడంలో చక్రధర్‌గౌడ్‌ది విపరీత జాప్యం
- దర్యాప్తు కొనసాగనిస్తే చట్ట ప్రక్రియను దుర్వినియోగం చేసినట్టే
- పంజగుట్టలో నమోదైన కేసును కొట్టివేస్తున్నామన్న హైకోర్టు
- మరో నిందితుడు మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుకూ ఊరట



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ (చక్రధర్‌గౌడ్)పై పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో గత ఏడాది డిసెంబర్ 1న దాఖలైన కేసులో నేరానికి సంబంధించిన బలపరిచే అంశాలు మాజీమంత్రి హరీశ్‌రావుపై లేవని హైకోర్టు తేల్చి చెప్పింది. గత ఏడాది జూన్ 19న చక్రధర్‌గౌడ్ డీజీపీకి ఇచ్చిన ఫిర్యాదు, సీఆర్‌పీసీ సెక్షన్ 161 ఇచ్చిన స్టేట్‌మెంట్, అంతకు ముందు దాఖలు చేసిన మరో రిట్ పిటిషన్‌ను కూలంకషంగా పరిశీలించామని.. ఇందులో కేసులోని సెక్షన్లకు బలాన్ని చేకూర్చే అంశాలు లేవని అభిప్రాయపడింది. 'డిసెంబర్‌లో ఇచ్చిన ఫిర్యాదును కొంచెం మెరుగుపరిచి ఇచ్చారు. వీటిని పరిశీలించాకే హరీశ్‌ను అరెస్టు చేయొద్దని, దర్యాప్తు కొనసాగించవచ్చని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశాం. ఫిర్యాదు చేయడంలో చక్రధర్‌గౌడ్ విపరీత జాప్యం చేశారు. ఎందుకు అంత ఆలస్యం జరిగిందో కారణాలు తెలియజేయ డంలో ఆయన విఫలమయ్యారు. ఎఫ్ఐఆర్ చట్టవిరుద్ధంగా ఉన్నప్పుడు సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద దాన్ని రద్దు చేసే అధికారం హైకోర్టుకు ఉంటుందని భజన్‌లాల్ కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో పంజగుట్ట లోని కేసు దర్యాప్తు కొనసాగించడానికి వీల్లేదు. అది చట్ట ప్రక్రియను దుర్వినియోగం చేసినట్లే అవుతుంది. హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతిస్తున్నాం. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తున్నాం'అని గురువారం తీర్పు వెలువరించింది.

చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు...

తనను తీవ్ర వేధింపులకు గురిచేశారని, ఫోన్ ట్యాపింగ్ చేశారని.. హరీశ్ ఆదేశాలతో రాధాకిషన్‌రావు ఈ చర్యలకు పాల్పడ్డారని పేర్కొంటూ డిసెంబర్లో కాంగ్రెస్ నేత, రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు హరీశ్‌రావును ఏ-1గా, రాధాకిషన్‌రావును ఏ-2గా.. మరో ముగ్గురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. రాజకీయ కక్షతో చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజగుట్ట పీఎస్‌లో తనపై నమోదు చేసిన 'ట్యాపింగ్'కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో హరీశ్‌రావు పిటిషన్ దాఖలు చేశారు. ఇదే కేసులో మరో నిందితుడైన రాధాకిషన్‌రావు మరో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి గత నెల తీర్పు రిజర్వు చేసి.. గురువారం తుది ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీసులు, చక్రధర్‌గౌడ్ కుమ్మక్కు

దర్యాప్తు పారదర్శకంగా సాగడం లేదని, ఇతర నిందితులను హింసించి హరీశ్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలం చెప్పాలని పోలీసులు వేధిస్తున్నారని ఆయన తరఫు సీనియర్ న్యాయవాది శేషాద్రినాయుడు వాదించారు. రాజకీయ కక్షలో భాగంగా హరీశ్‌ను అరెస్టు చేయాలని సర్కార్ భావిస్తోందని.. అందుకే, ఫిర్యాదుదారు(చక్రధర్‌గౌడ్)కు ఒత్తాసు పలుకుతోందన్నారు. చక్రధర్‌గౌడ్ అవినీతిపై ప్రశ్నిస్తే.. పోలీసుల తరఫు న్యాయవాది బదులిస్తున్నారని, పోలీసులు, ఫిర్యాదుదారు కుమ్మక్కైయ్యారనేందుకు ఇదే నిదర్శనమని చెప్పారు. పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదిస్తూ.. 'నిందితులను పోలీసులు ఎలాంటి చిత్రహింసలు పెట్టలేదు. న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించాలని నిందితులు ప్రయత్నిస్తున్నారన్నారు. ట్రయల్‌కోర్టు ముగ్గురు నిందితులకు బెయిల్ ఇచ్చిందని, హరీశ్, రాధాకిషన్‌రావులు కూడా బయటే ఉన్నారన్నారు. దర్యాప్తు చేస్తే వచ్చే నష్టం ఏమీలేదని చెప్పారు. పీపీతోపాటు ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కూడా వాదనలు వినిపించారు.

ఇదే ఊపుతో 'స్థానిక'ంలో సత్తా చాటండి



గురువారం హోంమంత్రి అమిత్‌షాతో జరిగిన భేటీలో కిషన్‌రెడ్డి, బండి సంజయ్, డీకే అరుణ, రఘునందన్, కె.లక్ష్మణ్, అర్వింద్ తదితరులు

- గ్రామస్థాయి నుంచి పార్టీ బలపడితే విజయం మనదే
- రాష్ట్ర బీజేపీ నేతలతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- కొత్త ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డిలకు అభినందనలు
- జేపీ నడ్డాతోనూ మర్యాద పూర్వకంగా భేటీ
- వారంలో కొత్త అధ్యక్షుడి నియామకం ఉంటుందని సంకేతం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా నేతలంతా ఐక్యంగా కలిసి పనిచేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్ర బీజేపీ నేతలకు సూచించారు. తాజాగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కలిసికట్టుగా విజయం సాధించినట్టుగానే.. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటాలన్నారు. గురువారం కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నేతృత్వంలో ఎంపీలు లక్ష్మణ్, డీకే అరుణ, బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమరయ్య, ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావులు అమిత్ షా, నడ్డాలను వేర్వేరుగా కలిశారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ వ్యతికం కాదని, అయితే ఆ పేరుతో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని అడ్డుకోవాలని ఈ సందర్భంగా నేతలకు అమిత్ షా సూచించినట్టు తెలిసింది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన అంజిరెడ్డి, కొమరయ్యలను షా, నడ్డాలు ప్రత్యేకంగా అభినందించారు. నేతలు ముందుగా అమిత్ షాను, ఆ తర్వాత నడ్డాతో భేటీ అయ్యారు.

వారి మధ్య వైరుధ్యాలను అనుకూలంగా మార్చుకోండి

జేపీ నడ్డాతో 20 నిమిషాలపాటు మరోసారి రాష్ట్ర నేతలు భేటీ అయ్యారు. రాష్ట్రంలో పరిపాలనా వైఫల్యం, కాంగ్రెస్ నేతల మధ్య ఉన్న వైరుధ్యాలను పార్టీకి అనుకూలంగా మార్చుకోవాలని నడ్డా రాష్ట్ర నేతలకు సూచించినట్టు తెలిసింది. పార్టీ కార్యక్రమాలు, ప్రజా పోరాటాలపైనే ప్రధానంగా చర్చించారు. ఈ భేటీలో రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై ఎలాంటి చర్చ జరగలేదని నేతలు చెప్పారు. నేతలతో చర్చల్లో భాగంగా వారం, పది రోజుల్లోనే కొత్త అధ్యక్షుడి నియామకం ఉంటుందని సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది.

గరిష్ట విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లు

మళ్లీ కొత్త రికార్డు.. తొలిసారిగా 17వేలకు మించి నమోదు

ఎంత పెరిగినా నిరంతర సరఫరా చేస్తున్నాం: డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గురువారం సాయంత్రం 4.39 గంటలకు గరిష్ట విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరుకొని కొత్త రికార్డు సృష్టించింది. రాష్ట్ర చరిత్రలో విద్యుత్ డిమాండ్ 17వేల మెగావాట్లకు మించడం ఇదే తొలిసారి. గతేడాది సరిగ్గా ఇదే రోజు రాష్ట్రంలో నమోదైన గరిష్ట విద్యుత్ డిమాండ్ 13,557 మెగావాట్లే. గతేడాది మార్చి 8న నమోదైన 15,523 మెగావాట్ల గరిష్ట డిమాండే ఈ ఏడాది ప్రారంభం వరకు అత్యధికం కాగా, ఈ ఏడాది ఫిబ్రవరి 5న డిమాండ్ 15,752 మెగావాట్లకు పెరిగి కొత్త రికార్డు సృష్టించింది. ఆ తర్వాత రోజురోజుకు డిమాండ్ పెరుగుతూ పలుమార్లు కొత్త రికార్డులు సృష్టించింది. ప్రస్తుత నెలలో రోజువారీ గరిష్ట విద్యుత్ డిమాండ్ 16వేల మెగావాట్లకు మించి నమోదవుతోంది. ఈ నెల 18న 335.19 మిలియన్ యూనిట్ల రోజువారీ అత్యధిక విద్యుత్ వినియోగం జరిగింది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) పరిధిలో సైతం గురువారం 11,017 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది.

డిమాండ్ ఎంత పెరిగినా కోతల్లేని సరఫరా

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నా, రెప్పపాటు కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకొచ్చిన సంస్కరణలు, రూపొందించిన ముందస్తు ప్రణాళికలతో పాటు విద్యుదుత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థల బలోపేతానికి తీసుకున్న చర్యలతో ఇది సాధ్యమైందన్నారు.



ఒక్క వినియోగదారుడికి సమస్య రావొద్దు: సందీప్‌కుమార్‌సుల్తానియా

వేసవిలో ఏ ఒక్క వినియోగదారుడికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశించారు. విద్యుత్ సరఫరాపై గురువారం ఆయన సమీక్షించారు. జీహెచ్ఎంసీ పరిధిలో విద్యుత్ డిమాండ్ 30 శాతం పెరిగిందని అధికారులు వివరించారు. గత వేసవి అనుభవాల దృష్ట్యా ఈ వేసవిలో ఓవర్ లోడ్ సమస్యలు ఉత్పన్నం కాకుండా పలు సబ్‌స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచినట్టు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో గరిష్ట డిమాండ్ 5,000 మెగావాట్లకు పెరుగుతుందని అంచనా వేశామని, ఆ మేరకు సరఫరాకు సిద్ధంగా ఉన్నామని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ తెలిపారు.

కాళేశ్వరం 'అదనపు' డీపీఆర్ పరిశీలనకు ఓకే

- తాజాగా సమ్మతి తెలిపిన సీడబ్ల్యూసీ.. రాష్ట్ర ప్రభుత్వానికి భారీ ఉపశమనం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అదనపు టీఎంసీ పనుల సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను పునఃపరిశీలించేందుకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సమ్మతి తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వానికి భారీ ఉపశమనం లభించింది. కాళేశ్వరం ప్రాజెక్టు అదనపు టీఎంసీ పనులతోపాటు పాలమూరు–రంగారెడ్డి, వార్ధా ప్రాజెక్టుల డీపీఆర్‌లను పరిశీలించలేమని తేల్చి చెప్తూ వాటిని గతంలో సీడబ్ల్యూసీ వెనక్కి పంపడంతో ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ఎకరా ఆయకట్టుకు అదనంగా సాగునీరు సరఫరా చేయని అదనపు టీఎంసీ పనులు అవసరమా? వాటితో నిధులు వృథా తప్ప ప్రయోజనం ఏమిటి? అని గతంలో సీడబ్ల్యూసీ కొర్రీలు పెట్టగా, వాటిని నివృత్తి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. దీంతో కాళేశ్వరం అదనపు టీఎంసీ ప్రాజెక్టు డీపీఆర్‌ను వెనక్కి పంపుతున్నట్టు అప్పట్లో సీడబ్ల్యూసీ రాష్ట్రానికి లేఖ రాసింది. కాళేశ్వరం ప్రాజెక్టు అదనపు టీఎంసీ ప్రాజెక్టు ఆవశ్యకతను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వడంతో సంతృప్తి చెందిన సీడబ్ల్యూసీ మళ్లీ డీపీఆర్‌ను పరిశీలించేందుకు సమ్మతి తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖకు సీడబ్ల్యూసీ డైరెక్టర్ తాజాగా లేఖ రాశారు. వ్యయ ప్రయోజనాల నిష్పత్తి (బెనిఫిట్ కాస్ట్ రేషియో)తోపాటు ఇతర సమగ్ర వివరాలతో నవీకరించిన కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌ను మళ్లీ సమర్పించాలని కోరారు. రెండు టీఎంసీల జలాల తరలింపునకు తొలుత కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టగా, దానికి మాత్రమే అన్ని రకాల అనుమతులున్నాయి. ఆ తర్వా త చేపట్టిన అదనపు టీఎంసీ పనులకు సీడబ్ల్యూసీతోపాటు ఇతర అనుమతులు రావాల్సి ఉంది. 2021 జూలైలో జారీ చేసిన గెజిట్‌లో అదనపు టీఎంసీ పనులను అనుమతుల్లేని ప్రాజెక్టుల జాబితాలో కేంద్రం చేర్చడంతో అనుమతులు తీసుకోక తప్పని పరిస్థితి నెలకొంది.

ట్రిపుల్ ఆర్ దక్షిణభాగాన్ని మంజూరు చేయండి

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి కాంగ్రెస్ ఎంపీల విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: ట్రిపుల్‌ఆర్ (రీజినల్ రింగ్ రోడ్) దక్షిణ భాగాన్ని మంజూరు చేయాలని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. ట్రిపుల్ ఆర్ మంజూరు చేయాలంటూ వినతిపత్రం అందజేశారు. ఉత్తర భాగంలోని కొన్ని ప్రాంతాలను ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్‌లోకి బదలాయించినందుకు కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తర భాగానికి సమాంతరంగా దక్షిణభాగాన్ని కూడా మంజూరు చేయాలని విన్నవించారు. అనంతరం తెలంగాణభవన్‌లో మీడియాతో మల్లు రవి మాట్లాడుతూ తమ విజ్ఞప్తిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

కేసీ వేణుగోపాల్‌తోనూ భేటీ



కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయిన కాంగ్రెస్ నేతలు కడియం కావ్య, బలరాం నాయక్, వంశీకృష్ణ, మల్లు రవి, రఘురాంరెడ్డి, సురేశ్‌షెట్కార్, చామల కిరణ్

పార్లమెంట్‌లో తెలంగాణకు సంబంధించి పెండింగ్ అంశాలను లేవనెత్తాలని టీ కాంగ్రెస్ ఎంపీలకు ఆ పార్టీ జాతీయకార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన, 42 శాతం బీసీ రిజర్వేషన్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు తదితర అంశాలను పార్లమెంట్‌లో ప్రస్తావించాలని దిశానిర్దేశం చేశారు. గురువారం పాత పార్లమెంట్ భవనంలో ఎంపీలు మల్లు రవి, గడ్డం వంశీకృష్ణ, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేశ్‌షెట్కార్, రఘురాంరెడ్డి, బలరాంనాయక్, కావ్యలు వేణుగోపాల్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని తాజా పరిస్థితులు, ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుపై ప్రత్యేకంగా ఆయన చర్చించారు. పలుఅంశాలపై మరోసారి వేణుగోపాల్‌తో సమావేశమవుతామని ఎంపీ మల్లు రవి విలేకరులతో చెప్పారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు నుంచి తప్పించుకోలేరు

కేటీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి హెచ్చరిక



నల్లగొండ: 'ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి అమెరికాలో ఉంటున్న ప్రభాకర్ రావు, శ్రవణ్‌లు త్వరలో రాబోతున్నారు.. మీరు ఎక్కడ దాక్కుంటారో దాక్కోండి. దేశం విడిచి పారిపోతారో పోండి. కానీ ఈ కేసులో మీరు తప్పించుకోలేరు' అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కేటీఆర్‌ను హెచ్చరించారు. గురువారం ఆయన నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన మీరు.. సీఎం రేవంత్‌రెడ్డిపై నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. 'నువ్వు తండ్రి చాటు కొడుకువు. నీ అయ్య సీఎంగా ఉన్నప్పుడు యువరాజులా అనుకుని ఇష్టం వచ్చినట్లు చేశావు. నాలుగు ఇంగ్లిష్ మాటలు మాట్లాడితే పెద్ద నాయకుడివి కాదు'అని కేటీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. సోనియాగాంధీ కాళ్లు మొక్కిన కేసీఆర్.. అధికారంలోకి వచ్చాక లక్షల కోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. మీ ఇంట్లో ఒకరు అవినీతి కేసులో జైలుకు పోయివచ్చినా మీకు బుద్ధి రావడం లేదంటూ విమర్శించారు. 'బస్సు కిరాయికి డబ్బులు లేని జగదీశ్‌రెడ్డి మంత్రి అయ్యాక వేల కోట్లు సంపాదించాడు. అలాంటి వాడి దగ్గరకు పోయి మా సీఎంను విమర్శిస్తున్నావా'అని ప్రశ్నించారు.

ఫ్యూచర్ సిటీలో తైవాన్ పెట్టుబడులు

రూ.2,000 కోట్లతో పారిశ్రామిక పార్క్ ఏర్పాటు

తైపీలో రాష్ట్ర బృందంతో అవగాహన ఒప్పందం

పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఫ్యూచర్ సిటీలో భారీ పెట్టుబడులు పెట్టడానికి తైవాన్‌కు చెందిన అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తల సమూహం ముందుకు వచ్చింది. రూ.2,000 కోట్ల పెట్టుబడులతో తైవాన్ పారిశ్రామిక పార్క్‌ను ఏర్పాటు చేయడానికి పారిశ్రామికవేత్తలు సుముఖత తెలిపారు. ప్రపంచంలోనే తొలిసారి 'ప్రపంచస్థాయి సాంకేతిక పారిశ్రామిక పార్క్'(ఐటీఐపీ)ని ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వంతో గురువారం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందానికి సంబంధించి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి ఆదేశాలతో రాష్ట్ర ప్రతినిధి బృందం తైవాన్ రాజధాని తైపీలో పర్యటిస్తోంది. తైవాన్–భారత ఆర్థిక సంబంధాల పురోగతి కార్యక్రమంలో భాగంగా గురువారం 11 సంస్థలు ఈ పార్కులో పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు మంత్రి తెలిపారు. ఐటీఐపీకి రాష్ట్ర ప్రభుత్వం కొంగరకలాన్‌లోని ఎలక్ట్రానిక్స్ పార్కులో ఇప్పటికే 15 ఎకరాల భూమిని అందజేసింది. పూర్తి స్థాయిలో పరిశ్రమల ఏర్పాటుకు మరో 250 ఎకరాలను కేటాయించాలని తైవాన్ కంపెనీలు కోరినట్లు ఆయన తెలిపారు. భూ కేటాయింపులు పూర్తయిన వెంటనే పనులు మొదలు పెడతామని తైవాన్ ప్రతినిధులు స్పష్టం చేశారన్నారు. రానున్న 3 సంవత్సరాల్లో మొదటి దశలో రూ.2,000 కోట్ల పెట్టుబడితో పరిశ్రమల నిర్మాణం పూర్తయి, ఉత్పాదన ప్రారంభమవుతుందన్నారు. దీని వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ టెక్నాలజీ, ఇండస్ట్రియల్ పార్కులో ఎలక్ట్రానిక్స్, సౌర పలకల పరిశ్రమల లాంటి ఉన్నత స్థాయి సాంకేతిక ఉత్పత్తులు తయారవుతాయని వివరించారు. ఇక్కడి పరిశ్రమలకు యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ ద్వారా నిపుణులను అందుబాటులో ఉంచుతామని రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ విభాగం డైరెక్టర్ వింగ్ కమాండర్ డా.సూర్యకాంత్ శర్మ తైవాన్ ప్రతినిధులకు వివరించారు. శ్రీధర్‌బాబు తరఫున ఆయన తైవాన్ ప్రతినిధులతో వివిధ అంశాలపై చర్చించారు. తెలంగాణలో ప్రతిభావంతులైన మానవ వనరుల లభ్యతతో అత్యంత అనుకూల పారిశ్రామిక వాతావరణం (ఇకో సిస్టం) ఉందని తైవాన్ ప్రతినిధుల గ్రూప్ చైర్మన్ సైమోన్ లీ ఈ సందర్భంగా అన్నారు. త్వరలో రాష్ట్రంలో పర్యటించి సీఎం, శ్రీధర్ బాబులకు తమ అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తామని ఆయన తెలిపారు.



తైవాన్ ప్రతినిధులతో సూర్యకాంత్ శర్మ

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకాలపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణ ఏప్రిల్ 24కు వాయిదా పడింది. రాష్ట్ర ప్రభుత్వం తమ పేర్లు ప్రతిపాదించినా.. గవర్నర్ ఆమోదం తెలపకుండా తాత్సారం చేశారని బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణలు సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దాసోజు శ్రవణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ దాసోజు శ్రవణ్ ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారని ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అయితే దాసోజు శ్రవణ్ ఇంకా ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయలేదని.. కౌంటర్ దాఖలు చేయడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం.. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేగాక కౌంటర్ దాఖలు చేయడానికి మరోసారి గడువు ఇచ్చేది లేదని స్పష్టం చేసింది. ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేసినా, చేయకపోయినా ఏప్రిల్ 24న విచారణ జరుపుతామని ధర్మాసనం తెలిపింది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
899	283
76,348	23,191

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	17,718	▽	36
డోజోన్స్	42,628	▽	64
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,702	▽	5
డాక్స్	22,999	▽	289
షాంఘై	3,409	▽	18
నికాయ్	37,751	▽	64

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత) 88,506	▽	143
బంగారం (99.5 స్వచ్ఛత) 88,152	▽	142
వెండి (కేజీ) 98,392	△	1576

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	86.00	87.02
£	బ్రిటన్ పౌండ్	111.10	113.99
€	యూరో	93.06	95.73
¥	జపాన్ ఎన్ (100)	57.55	59.03
AU$	ఆస్ట్రేలియా డాలర్	53.79	56.53
S$	సింగపూర్ డాలర్	62.26	66.96
SAR	సౌదీ రియాల్	22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్	22.62	24.41
¥	చైనా యువాన్	11.04	12.87

చిన్న బ్రాండ్స్‌కు యువత జై



- ఎలక్ట్రానిక్స్‌లో నయా ట్రెండ్
- రెండంకెల్లో వర్ధమాన బ్రాండ్స్ వృద్ధి
- వినూత్నత, తక్కువ ధరే ఆకర్షణీయాంశాలు

ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కొనుగోళ్లలో సాధారణంగా పెద్ద బ్రాండ్స్‌నే ఎక్కువగా ఎంచుకునే వినియోగదారుల ధోరణి క్రమంగా మారుతోంది. కొత్త తరం కస్టమర్లు, ముఖ్యంగా మిలీనియల్స్, జెన్ జెడ్ వర్గాలు.. పేరొందిన పెద్ద కంపెనీల కన్నా కొన్నాళ్ల క్రితమే మార్కెట్లోకి వచ్చిన చిన్న బ్రాండ్స్ వైపు మొగ్గు చూపుతున్నాయి. మార్కెట్ రీసెర్చ్ సంస్థ నీల్సన్‌ఐక్యూ తాజా అధ్యయనం ప్రకారం 2019–2024 మధ్య కాలంలో పరిశ్రమ వార్షిక వృద్ధి రేటు కేవలం 8 శాతంగానే ఉండగా, వర్ధమాన ఎలక్ట్రానిక్స్ గృహోపకరణాల బ్రాండ్లు మాత్రం ఏకంగా 13% వృద్ధి రేటు నమోదు చేశాయి. 5 శాతం కన్నా తక్కువ మార్కెట్ వాటా గల సంస్థలను వర్ధమాన బ్రాండ్లుగా పరిగణనలోకి తీసుకున్నారు. 1981–96 మధ్య పుట్టిన వారిని మిలీనియల్స్‌గా, 1997–2012 మధ్య జన్మించిన వారిని జెనరేషన్ జెడ్‌గా వ్యవహరిస్తారు. చిన్న గృహోపకరణాల విభాగంలో వర్ధమాన బ్రాండ్ల మార్కెట్ వాటా గత అయిదేళ్లలో 55% నుంచి 59%కి పెరిగింది. టీవీల్లో 23% నుంచి 26%కి చేరింది. ఇక ఈ–కామర్స్‌లో కొత్త బ్రాండ్లు రెండంకెల స్థాయిలో వృద్ధి చెందుతున్నాయి. అటు కౌంటర్ పాయింట్ రీసెర్చ్ డేటా ప్రకారం గత అయిదేళ్లలో ఆరు టాప్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్స్ వార్షిక వృద్ధి 1.2 శాతానికి నెమ్మదించగా, చిన్న బ్రాండ్లు మాత్రం 2.65% వృద్ధి చెందాయి.

తీవ్రమైన పోటీ..

బ్రాండ్లు చిన్నవే అయినప్పటికే అవి అనుసరిస్తున్న వ్యూహాలే వ్యాపార వృద్ధికి ఊతమిస్తున్నాయి. ప్రధానంగా వినూత్నత, తక్కువ ధరలోనే ప్రీమియం ఫీచర్లను అందిస్తుండటంలాంటి అంశాలు వాటికి ప్లస్ పాయింటుగా ఉంటోంది. ఇక ఈ-కామర్స్ విషయానికొస్తే.. కొనుగోళ్లు సులభతరంగా ఉండటం కూడా కలిసి వస్తోంది. ప్రీమియం ఫీచర్లను మరింత అందుబాటులోకి తేవడం ద్వారా వివిధ కేటగిరీల్లో వర్ధమాన బ్రాండ్లు తీవ్రమైన పోటీకి తెరతీశాయని నీల్సన్‌ఐక్యూ ఇండియా పేర్కొంది. టీవీలు, ఎయిర్ కండీషనర్లు, వేరబుల్స్ విభాగాల్లో దాదాపు 45–50 బ్రాండ్స్ పోటీపడుతున్నాయి. సాధారణంగా ఎలక్ట్రానిక్స్ కేటగిరీలో 3–4 పెద్ద బ్రాండ్స్ మాత్రమే మార్కెట్‌పై ఆధిపత్యం చలాయిస్తుంటాయి. ఉదాహరణకు రిఫ్రిజిరేటర్లు.. వాషింగ్ మెషీన్లు వంటి కేటగిరీల్లో ఎల్‌జీ, శాంసంగ్, వర్ల్‌పూల్, గోద్రెజ్ మొదలైనవి అగ్రస్థానంలో ఉండగా .. ఏసీల్లో వోల్టాస్, డైకిన్, ఎల్‌జీ లాంటి సంస్థలు టాప్ బ్రాండ్లుగా ఉంటున్నాయి. ప్రస్తుతం ఫాస్ట్ మూవింగ్ కన్జూమర్ గూడ్స్ (ఎఫ్‌ఎంసీజీ) విభాగంలోని ధోరణులే ఎలక్ట్రానిక్స్‌లోనూ కనిపిస్తున్నాయని నీల్సన్‌ఐక్యూ వివరించింది. డిసెంబర్ క్వార్టర్‌లో దిగ్గజ సంస్థల కన్నా దాదాపు రెట్టింపు స్థాయిలో చిన్న, మధ్య తరహా సంస్థల అమ్మకాలు 13–14% స్థాయిలో పెరిగినట్లు పేర్కొంది. ఎలక్ట్రానిక్స్ సెగ్మెంట్లో ప్రీమియం ఉత్పత్తుల విభాగం వేగవంతంగా వృద్ధి చెందుతోందని నీల్సన్‌ఐక్యూ డేటా సూచిస్తోంది. ఇక 2024 సెప్టెంబర్–డిసెంబర్ మధ్య కాలంలో ఈ–కామర్స్ మాధ్యమాన్ని తీసుకుంటే మొత్తం మార్కెట్ 6 శాతమే పెరగ్గా ఈ–కామర్స్ అమ్మకాలు ఏకంగా 19–20 శాతం వృద్ధి చెందాయి.

స్మార్ట్ ఫోన్స్‌లో జోరు..

ఇక, స్మార్ట్‌ఫోన్స్ విభాగంలో వర్ధమాన బ్రాండ్లు మరింత జోరుగా దూసుకెళ్తున్నాయని ఐడీసీ ఇండియా వెల్లడించింది. ఈ సంస్థ డేటా ప్రకారం 2022లో టాప్ అయిదు బ్రాండ్ల మార్కెట్ వాటా 76 శాతంగా ఉండగా 2024లో 65 శాతానికి తగ్గింది. అలాగే, 2023తో పోలిస్తే స్మార్ట్‌వాచ్, వేరబుల్స్ విభాగాల్లోనూ చిన్న బ్రాండ్లు గణనీయంగా వృద్ధి చెందాయి. తక్కువ రేటులో ఎక్కువ ఫీచర్ల కోసం వినియోగదారుల నుంచి డిమాండ్ నెలకొనడం ఈ బ్రాండ్లకు ఉపయోగపడుతోంది. మోటరోలా వంటి వర్ధమాన బ్రాండ్ల అమ్మకాలు 136% ఎగియగా, ఐక్యూ 51%, పోకో సేల్స్ 19%పెరిగాయి. శాంసంగ్ స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు 2023తో పోలిస్తే 2024లో 19.4% క్షీణించాయి. రియల్‌మి 8.5%పడిపోగా, షావోమీ అమ్మకాలు 0.2 శాతమే పెరిగాయి. 34% వృద్ధితో బడా బ్రాండ్లలో యాపిల్ మాత్రమే ఇందుకు మినహాయింపు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

అదానీ చేతికి ఎమార్ ఇండియా!

చివరి దశలో చర్చలు



న్యూఢిల్లీ: బిలియనీర్ గౌతమ్ అదానీ గ్రూప్ తాజాగా రియల్టీ రంగ సంస్థ ఎమార్ ఇండియాను కొనుగోలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు చేపట్టిన చర్చలు చివరి దశకు చేరినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. 1.5 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 13,000 కోట్లు) ఎంటర్‌ప్రైజ్ విలువలో డీల్ కుదుర్చుకోనున్నట్లు అంచనా. అయితే ఈ అంశంపై స్పందించేందుకు రెండు గ్రూప్‌లు నిరాకరించడం గమనార్హం! కాగా.. దుబాయ్ సంస్థ ఎమార్ ప్రాపర్టీస్ 2005లో ఎంజీఎఫ్ డెవలప్‌మెంట్‌తో భాగస్వామ్యం ద్వారా దేశీ రియల్టీ మార్కెట్లో ప్రవేశించింది. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన భాగస్వామ్య కంపెనీ(జేవీ) ఎమార్ ఎంజీఎఫ్ ద్వారా రూ. 8,500 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. 2016 ఏప్రిల్‌లో విడదీత ప్రణాళిక ద్వారా జేవీకి ముగింపు పలికేందుకు ఎమార్ ప్రాపర్టీస్ నిర్ణయించుకుంది. ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబై, మొహాలీ, లక్నో, ఇండోర్, జైపూర్‌లలో రెసిడెన్షియల్, కమర్షియల్ విభాగాలలో భారీ పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది.

జనవరిలోనే..

ఎమార్ ఇండియాలో వాటా విక్రయానికి దేశీయంగా అదానీసహా వివిధ గ్రూప్‌లతో చర్చలు నిర్వహిస్తున్నట్లు ఎమార్ ప్రాపర్టీస్ ఈ ఏడాది జనవరిలోనే వెల్లడించింది. అయితే విలువ, లావాదేవీపై ఎలాంటి నిర్ణయానికీ రాలేదని స్పష్టం చేసింది. కాగా.. అన్‌లిస్టెడ్ సంస్థలు అదానీ రియల్టీ, అదానీ ప్రాపర్టీస్ ద్వారా అదానీ గ్రూప్ దేశీ రియల్టీ మార్కెట్లో వేగవంతంగా విస్తరిస్తోంది. అదానీ రియల్టీ దేశవ్యాప్తంగా పలు పట్టణాలలో ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. ఆసియాలోనే అతిపెద్ద మురికి వాడగా నిలుస్తున్న ముంబైలోని ధారావి సహా రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టులనూ చేపడుతోంది. ఈ బాటలో ముంబైలోని మోతీలాల్ నగర్ ప్రాజెక్టులను అదానీ ప్రాపర్టీస్ తిరిగి అభివృద్ధి చేయనుంది.

మార్కెట్‌కు ‘ఫెడ్’ జోష్

- సూచీలకు నాలుగోరోజూ లాభాలే
- సెన్సెక్స్ లాభం 899 పాయింట్లు
- మళ్లీ 23,000 పైకి నిఫ్టీ
- 4 రోజుల్లో రూ.17.43 లక్షల కోట్ల సంపద సృష్టి



ముంబై: ఈ ఏడాది రెండుసార్లు కీలక వడ్డీరేట్ల కోతకు కట్టుబడి ఉన్నట్లు ఫెడరల్ రిజర్వ్ సంకేతాలతో ఈక్విటీ మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. అమెరికా బాండ్లపై రాబడులు తగ్గడం, డాలర్ బలహీనత అంశాలు కలిసొచ్చాయి. ఐటీతో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్(1.65%), భారతీ ఎయిర్‌టెల్(4%) షేర్లు రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ 899 పాయింట్లు పెరిగి 76,348 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 283 పాయింట్లు బలపడి 23,191 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది వరుసగా నాలుగో రోజూ లాభాల ముగింపు. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ప్రారంభంలో కాస్త తడబాటుకు లోనయ్యాయి. అయితే ఐటీ, బ్యాంకింగ్, ఆటో షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో కోలుకున్నాయి. ట్రేడింగ్ గడిచే కొద్దీ కొనుగోళ్ల తీవ్రత పెరగడంతో సూచీలు భారీ లాభాల దిశగా కదిలాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,007 పాయింట్లు ఎగసి 76,456 వద్ద, నిఫ్టీ 309 పాయింట్లు దూసుకెళ్లి 23,217 వద్ద గరిష్టాలు తాకాయి. ఓ వైపు ట్రంప్ వాణిజ్య భయాలు ఉన్నా.. ఫెడ్ రేట్ల కోత ఉంటుందని సంకేతాలు ఇవ్వడంతో ప్రపంచ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.

- నాలుగు రోజుల వరుస ర్యాలీతో స్టాక్ మార్కెట్లో రూ.17.43 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.408.61 లక్షల కోట్ల (4.73 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది. గురువారం ఒక్కరోజే రూ.3.32 లక్షల కోట్లు ఇన్వెస్టర్ల సొంతమయ్యాయి.
- అమెరికా నుంచి అధిక ఆదాయాలు ఆర్జించే దేశీయ కంపెనీల షేర్లకు డిమాండ్ లభించింది. హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, విప్రో, ఇన్ఫోసిస్ 2% పెరిగాయి. సెన్సెక్స్ ఆర్జించిన మొత్తం పాయింట్లలో ఐటీ షేర్ల వాటాయే 200 పాయింట్లు కావడం విశేషం.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
ఈపీఎఫ్‌ఓలోకి 17.89 లక్షల కొత్త సభ్యులు | 2026లో నిధుల సమీకరణకు జోష్

77 కోట్లకు 5జీ యూజర్లు

- 40 జీబీకి సగటు డేటా వినియోగం
- 2028 నాటికి నోకియా అంచనా



న్యూఢిల్లీ: దేశీయంగా 5జీ యూజర్ల సంఖ్య వచ్చే మూడేళ్లలో (2028 నాటికి) 2.65 రెట్లు పెరగనుంది. 77 కోట్లకు చేరనుంది. అలాగే, నెలవారీ డేటా వినియోగం యూజర్‌కు సగటున 40 జీబీ స్థాయికి చేరుతుందని టెలికం పరికరాల తయారీ సంస్థ నోకియా ఓ నివేదికలో అంచనా వేసింది. గత అయిదేళ్లలో 2024 నాటికి 4జీ, 5జీ డేటా వినియోగం వార్షికంగా 19.5% పెరిగి 27.5 జీబీకి చేరిందని పేర్కొంది. గతేడాది 5జీ డేటా ట్రాఫిక్ మూడు రెట్లు పెరిగినట్లు వివరించింది. 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ లభ్యత (ఎఫ్‌డబ్ల్యూఏ) పెరుగుతుండటంతో డేటా వినియోగం కూడా గణనీయంగా పెరుగుతోందని నోకియా ఇండియా టెక్నాలజీ, సొల్యూషన్స్ హెడ్ సందీప్ సక్సేనా తెలిపారు. యాక్టివ్ 5జీ డివైజ్‌ల సంఖ్య వార్షికంగా రెట్టింపై 2024లో 27.1 కోట్లకు చేరినట్లు తెలిపారు.

ఒప్పో నుంచి ఎఫ్29 స్మార్ట్‌ఫోన్లు

ధర రూ. 23,999 నుంచి ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్మార్ట్‌ఫోన్ల తయారీ దిగ్గజం ఒప్పో తాజాగా ఎఫ్29 సిరీస్ ఫోన్లను ఆవిష్కరించింది. వీటిలో ఎఫ్29 ధర రూ. 23,999 నుంచి, ఎఫ్29 ప్రో మోడల్ రేటు రూ. 27,999 నుంచి ప్రారంభమవుతుంది. ఇవి వరుసగా మార్చి 27, ఏప్రిల్ 1 నుంచి లభిస్తాయని సంస్థ తెలిపింది. 6.7 అంగుళాల స్క్రీన్, 50 ఎంపీ కెమెరా, 6,500 ఎంఏహెచ్ వరకు బ్యాటరీ, కలర్‌ఓఎస్ 15, హంటర్ యాంటెన్నా తదితర ఫీచర్లు వీటిలో ఉంటాయని పేర్కొంది. భారతీయ పరిస్థితులకు తగ్గట్లుగా దుమ్ము, నీరు, ఇతరత్రా ద్రవాల నుంచి అత్యధిక రక్షణ ఉండేలా రూపొందించినట్లు ఒప్పో ఇండియా ప్రోడక్ట్ కమ్యూనికేషన్స్ హెడ్ సేవియో డిసౌజా వివరించారు. దేశీయంగా కార్యకలాపాల విస్తరణపై నిరంతరం పెట్టుబడులు పెడుతున్నట్లు చెప్పారు. భారత్‌లో స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తి కోసం నోయిడాలో 110 ఎకరాల్లో తయారీ ప్లాంటును నెలకొల్పినట్లు వివరించారు. తమ ఎఫ్27 ప్రోప్లస్ స్మార్ట్‌ఫోన్లకు ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ తదితర మార్కెట్లలో భారీ స్పందన లభిస్తోందన్నారు. ఎఫ్29 స్మార్ట్‌ఫోన్ల మీద ఎస్‌బీఐ కార్డ్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మొదలైన వాటిపై 10% వరకు క్యాష్‌బ్యాక్, 10% వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ వంటి ఆఫర్లు ఉంటాయి.



విడాకులు అధికారికం... విడిపోయిన చహల్, ధనశ్రీ

ముంబై: భారత లెగ్‌స్పిన్నర్ యుజువేంద్ర చహల్ వివాహ బంధం అధికారికంగా ముగిసింది. చహల్, ధనశ్రీ వర్మకు విడాకులు మంజూరు చేస్తూ బాంద్రాలోని ఫ్యామిలీ కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి 5న వీరిద్దరు విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేయగా... పరస్పర అంగీకారంతో చేస్తున్నారు కాబట్టి హైకోర్టు ఆదేశాల ప్రకారం ఆరు నెలల 'కూలింగ్ ఆఫ్ పీరియడ్' లేకుండానే న్యాయమూర్తి వీరికి విడాకులు మంజూరు చేశారు. యూట్యూబర్, కొరియాగ్రాఫర్ అయిన ధనశ్రీ వర్మతో చహల్‌కు 2020 డిసెంబర్‌లో పెళ్లయింది. పిటిషన్‌లో పేర్కొన్న ప్రకారం వారిద్దరు 2022 జూన్ నుంచే విడిగా ఉంటున్నారు. వివాహబంధం రద్దుతో ధనశ్రీకి భరణంగా చహల్ రూ.4.75 కోట్లు చెల్లించనున్నాడు. ఇందులో ఇప్పటికే చహల్ రూ.2.37 కోట్లు ఇచ్చేశాడు. శనివారం నుంచి మొదలు కానున్న ఐపీఎల్–18 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జట్టుకు చహల్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. 35 ఏళ్ల చహల్ భారత్ తరఫున 72 వన్డేలు, 80 టి20 మ్యాచ్‌లు ఆడాడు.

ఒక్క టైటిల్ కోసం...

ఐపీఎల్ మొదలైనప్పుడు ఉన్న ఎనిమిది జట్లలో ఐదు టీమ్‌లు ఎప్పుడో విజేతగా నిలిచాయి... బెంగళూరు ఒక్కసారి కూడా గెలవకపోయినా ఆ జట్టు మూడుసార్లు ఫైనల్‌కు వెళ్లింది. పైగా విరాట్ కోహ్లిలాంటి దిగ్గజం కారణంగా ఫలితాలతో సంబంధం లేకుండా ఆకర్షణ కోల్పోని జట్టుగా సాగుతోంది... కానీ మరో రెండు టీమ్‌లు మాత్రం ప్రతీ సీజన్‌లో ఎన్నో ఆశలతో బరిలోకి దిగడం, సగం టోర్నీ ముగిసేవరకే పేలవ ప్రదర్శనతో చేతులెత్తేయడం దాదాపుగా రివాజుగా మారిపోయింది... ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఆటగాళ్లు, కెప్టెన్లు, సిబ్బందిని మార్చి మార్చి ప్రయోగాలు చేసినా, వ్యూహాలు మార్చినా ఆశించిన ఫలితం దక్కలేదు. డేర్‌డెవిల్స్ నుంచి క్యాపిటల్స్‌గా మారినా... కింగ్స్ ఎలెవన్ నుంచి కింగ్స్‌కు పరిమితమైనా రాత మాత్రం మారలేదు. మరోసారి కొత్త మార్పులు, కొత్త బృందంతో దండయాత్రకు సిద్ధమవుతున్న ఢిల్లీ, పంజాబ్ టీమ్‌లకు ఇప్పుడైనా టైటిల్ రూపంలో అదృష్టం తలుపు తడుతుందా చూడాలి. –సాక్షి క్రీడా విభాగం

ఢిల్లీ, పంజాబ్ జట్ల సుదీర్ఘ పోరాటం

- వరుస వైఫల్యాలతో సతమతం
- ప్రతీ ఏటా ప్రతికూల ఫలితాలే

రేపటి నుంచి ఐపీఎల్

అక్షర్ అద్భుతం చేసేనా?



అక్షర్ పటేల్

2020 సీజన్‌లో ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్ రన్నరప్‌గా నిలిచి సంతృప్తి చెందింది. ఐపీఎల్‌లో ఢిల్లీకిదే అత్యుత్తమ ప్రదర్శన. ఆ తర్వాత నాలుగు సీజన్లలో ఢిల్లీ వరుసగా 3, 5, 9, 6 స్థానాల్లో నిలిచింది. గత ఏడాది తొలి ఐదు మ్యాచ్‌లలో ఓడిన తర్వాత కోలుకోవడం కష్టమైంది. ఈసారి జట్టు ఆటగాళ్లతో పాటు సహాయక సిబ్బందిలో కూడా భారీ మార్పు జరిగింది. వేలానికి ముందు అట్టి పెట్టుకున్న అక్షర్ పటేల్, కుల్దీప్, స్టబ్స్, పొరేల్‌లతో పాటు వేలంలో జేక్ ఫ్రేజర్‌ను మళ్లీ తెచ్చుకుంది. ఇప్పుడు అందరి దృష్టి కేఎల్ రాహుల్‌పై ఉంది. లక్నో యాజమాన్యంతో విభేదాల తర్వాత ఆ జట్టుకు దూరమైన రాహుల్ బ్యాటింగ్‌పై దృష్టి పెట్టేందుకే కెప్టెన్సీని తిరస్కరించినట్లు సమాచారం. ఇటీవలి ఫామ్ చూస్తే రాహుల్ చక్కటి ప్రదర్శనపై అంచనాలు పెరుగుతున్నాయి. ఓపెనింగ్‌లో ఫ్రేజర్, డుప్లెసిస్‌తో పాటు మిడిలార్డర్‌లో స్టబ్స్ దూకుడు కీలకం కానుంది. గత ఏడాది పంజాబ్ తరఫున చెలరేగిన అశుతోష్ శర్మతో పాటు సమీర్ రిజ్వీ ఫినిషర్లుగా సిద్ధమయ్యారు. ఇక ఆల్‌రౌండర్‌గా, కెప్టెన్‌గా అక్షర్ పటేల్ తన ముద్రను చూపించాల్సి ఉంది. ముఖ్యంగా టి20 వరల్డ్ కప్, చాంపియన్స్ ట్రోఫీలలో సత్తా చాటి ఒక్కసారిగా స్థాయిని పెంచుకున్న అతను ఢిల్లీని సమర్థంగా నడిపిస్తే చరిత్రలో నిలిచిపోగలడు. స్టార్క్‌లాంటి దిగ్గజం జట్టుతో ఉండటం ఎప్పుడైనా బలమే. ముకేశ్, నటరాజన్, కుల్దీప్‌లు అతనికి అండగా నిలవాల్సి ఉంది. మోహిత్ రూపంలో మరో చక్కటి బౌలింగ్ ప్రత్యామ్నాయం అందుబాటులో ఉంది. హెడ్ కోచ్‌గా హేమంగ్ బదాని, డైరెక్టర్ హోదాలో వచ్చిన వేణుగోపాలరావు ఎలాంటి మార్పు తీసుకొస్తారనేది ఆసక్తికరం. మాజీ ఇంగ్లండ్ స్టార్ కెవిన్ పీటర్సన్ మెంటార్‌గా తన ప్రభావం చూపించవచ్చు. స్టార్క్ మినహా మిగతా భారత పేసర్లకు బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్ ఎలా మార్గనిర్దేశం చేస్తాడో చూడాలి.

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు: అక్షర్ పటేల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్, కుల్దీప్ యాదవ్, ట్రిస్టన్ స్టబ్స్, జేక్ ఫ్రేజర్, మిచెల్ స్టార్క్, ఫాఫ్ డుప్లెసిస్, ముకేశ్ కుమార్, కరుణ్ నాయర్, డొనొవాన్ ఫెరీరా, అభిషేక్ పొరేల్, సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మ, దర్శన్ నల్కండే, విప్‌రాజ్ నిగమ్, అజయ్ మండల్, మన్వంత్ కుమార్, త్రిపురాన విజయ్, మాధవ్ తివారి, టి.నటరాజన్, మోహిత్ శర్మ, దుష్మంత చమీరా.

శ్రేయస్ నాయకత్వంలోనైనా...



శ్రేయస్ అయ్యర్

2014లో అనూహ్య ప్రదర్శనతో దూసుకుపోయి ఫైనల్ వరకు వెళ్లగలగడం పంజాబ్ కింగ్స్ జట్టు సాధించిన ఘనత. కానీ ఆ తర్వాత లీగ్‌లో మరే ఇతర జట్టుకు లేనంత చెత్త రికార్డును ఈ టీమ్ నమోదు చేసింది. తర్వాతి పదేళ్లలో ఒక్కసారి కూడా కనీసం 'ప్లే ఆఫ్స్'కు అర్హత సాధించలేకపోయిన జట్టు వరుసగా 8, 8, 5, 7, 6, 6, 6, 6, 8, 9 స్థానాలకు పరిమితమైంది! గత సీజన్లో 14 మ్యాచ్‌లలో 5 మాత్రమే గెలిచిన టీమ్ ఈసారి ఇద్దరు ఆటగాళ్లను మాత్రమే అట్టి పెట్టుకొని మళ్లీ కొత్తగా మొదలు పెట్టేందుకు సిద్ధమైంది. ప్రభ్‌సిమ్రన్ సింగ్, శశాంక్ సింగ్‌లను కొనసాగించి వారిపై అంచనాలు పెంచుకున్న టీమ్ వేలంలో యువ పేస్ అర్ష్‌దీప్‌ను తిరిగి తెచ్చుకోవడం సరైన నిర్ణయం. ఏడాది కాలంగా ఫామ్‌లో ఉన్న అతను టీమ్ విజయాలను శాసించగలడు. ఢిల్లీ కోచ్‌గా ఫలితాలు సాధించలేకపోయిన రికీ పాంటింగ్, 2024 ఐపీఎల్ విన్నింగ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కాంబినేషన్‌లో జట్టు సంచలనాలు ఆశిస్తోంది. ట్రోఫీ గురించి ఇప్పుడే మాట్లాడకపోయినా కనీసం గతంలోకంటే మెరుగైన విజయాలు అందుకొని ముందుగా ప్లే ఆఫ్స్ వరకు వెళ్లాలని జట్టు భావిస్తోంది. జట్టుపై ఆస్ట్రేలియన్ల ప్రభావం చాలా ఉంది. గతంలో ఐదు సీజన్లు ఇదే టీమ్‌కు ఆడిన మ్యాక్స్‌వెల్ మళ్లీ ఇక్కడికే వచ్చాడు. కెరీర్ చివర్లో ఉన్న అతను ఎంతగా ప్రభావం చూపిస్తాడనేది చర్చనీయాంశం. మరో నలుగురు ఆసీస్ ఆటగాళ్లు స్టొయినిస్, ఇన్‌గ్లిస్, బార్ట్‌లెట్, హార్డీ టీమ్‌తో ఉన్నారు. అయ్యర్ కెప్టెన్సీతో పాటు దూకుడైన బ్యాటింగ్ చూపించాల్సి ఉంటుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో చక్కటి ఫామ్‌లో ఉన్న అజ్మతుల్లా, మార్కో యాన్సెన్ కచ్చితంగా ప్రభావం చూపించగలరు. ఐపీఎల్ స్టార్ స్పిన్నర్ చహల్ ఉండటం జట్టుకు అదనపు బలం. హాడిన్, హోప్స్, సునీల్ జోషిలతో కూడిన సహాయక సిబ్బంది కూడా కీలకం కానున్నారు.

పంజాబ్ కింగ్స్ జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అర్ష్‌దీప్ సింగ్, యుజువేంద్ర చహల్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, శశాంక్ సింగ్, స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, ఇన్‌గ్లిస్, హర్‌ప్రీత్ బ్రార్, మార్కో యాన్సెన్, అజ్మతుల్లా ఒమర్జాయ్, ఫెర్గూసన్, నేహల్ వధేరా, విష్ణు వినోద్, హర్నూర్ పన్ను, పైలా అవినాశ్, ప్రియాన్ష్ ఆర్య, ఆరోన్ హార్డీ, ముషీర్ ఖాన్, సూర్యాంశ్ షెడ్గే, వైశాక్ విజయ్‌కుమార్, యశ్ ఠాకూర్, కుల్దీప్ సేన్, ప్రవీణ్ దూబే, జేవియర్ బార్ట్‌లెట్.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఐఓసీకి తొలి మహిళా అధ్యక్షురాలు

జింబాబ్వే మాజీ స్విమ్మర్ కిర్‌స్టీ కొవెంట్రీకి అరుదైన గౌరవం



కోస్టా నవారినో (గ్రీస్): విశ్వ క్రీడలకు సంబంధించి అత్యున్నత పదవి తొలిసారి మహిళను వరించింది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్షురాలిగా జింబాబ్వేకు చెందిన విఖ్యాత స్విమ్మర్, ప్రస్తుతం జింబాబ్వే ప్రభుత్వంలో క్రీడల మంత్రిగా ఉన్న కిర్‌స్టీ కొవెంట్రీ ఎన్నికయింది. ఈ అత్యున్నత పదవి కోసం ఏడుగురు పోటీపడగా... బరిలో ఉన్న ఏకైక మహిళా ప్రతినిధి 41 ఏళ్ల కిర్‌స్టీ కొవెంట్రీ తొలి రౌండ్‌లోనే స్పష్టమైన ఆధిక్యంతో విజయాన్ని దక్కించుకుంది. ఐఓసీలోని 97 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా... విజయానికి అవసరమైన 49 ఓట్లు కొవెంట్రీకి తొలి రౌండ్‌లోనే లభించాయి. ఒలింపిక్ దినోత్సవమైన జూన్ 23న ఐఓసీ అధ్యక్ష పదవిని అలంకరించనున్న కొవెంట్రీ ఎనిమిదేళ్ల పాటు (2033 వరకు) ఈ పదవిలో కొనసాగుతుంది. ప్రస్తుతం ఐఓసీ అధ్యక్షుడిగా ఉన్న థామస్ బాచ్ ఈ పదవిలో గరిష్టంగా 12 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. కొవెంట్రీ అధ్యక్షతన 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్, 2032 బ్రిస్బేన్ ఒలింపిక్స్ జరుగుతాయి. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య దేశం ఎంపిక కూడా కొవెంట్రీ హయాంలోనే ఖరారవుతుంది.

ఏడు ఒలింపిక్ పతకాలు...

ఐఓసీ అత్యున్నత పదవి దక్కించుకున్న తొలి ఆఫ్రికన్‌గా గుర్తింపు పొందిన కొవెంట్రీకి విశ్వ క్రీడల్లో ఘనమైన రికార్డు ఉంది. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో, 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో పోటీపడిన ఆమె మొత్తం 7 పతకాలు (2 స్వర్ణాలు, 4 రజతాలు, 1 కాంస్యం) సాధించింది. ఏథెన్స్ ఒలింపిక్స్‌లో కొవెంట్రీ 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో స్వర్ణం, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో రజతం, 200 మీటర్ల మెడ్లీలో కాంస్యం దక్కించుకుంది. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కొవెంట్రీ 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో పసిడి పతకం సాధించగా... 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో రజతం, 200 మీటర్ల మెడ్లీలో రజతం, 400 మీటర్ల మెడ్లీలో రజతం కైవసం చేసుకుంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 7 స్వర్ణాలు, 5 రజతాలు, 1 కాంస్యంతో కలిపి మొత్తం 13 పతకాలు ఆమె సంపాదించింది. 2002 మాంచెస్టర్ కామన్వెల్త్ గేమ్స్‌లో 200 మీటర్ల మెడ్లీలో స్వర్ణం నెగ్గిన కొవెంట్రీ... ఆల్ ఆఫ్రికా గేమ్స్‌లో 14 స్వర్ణాలు, 7 రజతాలు, 1 కాంస్యం సాధించింది.

భారత జట్టుకు రూ. 58 కోట్లు నజరానా



న్యూఢిల్లీ: పుష్కరకాలం తర్వాత చాంపియన్స్ ట్రోఫీ వన్డే క్రికెట్ టోర్నమెంట్ టైటిల్ నెగ్గిన భారత పురుషుల సీనియర్ జట్టుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భారీ నజరానా ప్రకటించింది. కెప్టెన్ రోహిత్ శర్మ నాయకత్వంలో టైటిల్ నెగ్గిన టీమిండియాకు రూ. 58 కోట్లు నగదు పురస్కారం అందజేస్తామని బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ ప్రకటించారు. జట్టులోని 15 మంది సభ్యులతోపాటు హెడ్ కోచ్, ఇతర కోచ్‌లు, సహాయక సిబ్బందికి ఈ నజరానా లభిస్తుంది. బీసీసీఐ నగదు పురస్కారంతోపాటు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ద్వారా లభించిన ప్రైజ్‌మనీ రూ. 20 కోట్లు కూడా ఆటగాళ్లకు సమానంగా అందజేస్తారు. 'వరుసగా రెండు ఐసీసీ టైటిల్స్ సాధించడం అనేది ఎంతో ప్రత్యేకం. ఈ విజయాలు విశ్వస్థాయిలో భారత జట్టు ఆధిపత్యానికి నిదర్శనం' అని రోజర్ బిన్నీ వ్యాఖ్యానించారు. విజేత జట్టులోని 15 మంది సభ్యులకు రూ. 3 కోట్ల చొప్పున ఇస్తారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు కూడా రూ. 3 కోట్లు ప్రదానం చేస్తారు. ఇతర కోచ్‌లలో ప్రతి ఒక్కరికి రూ. 50 లక్షలు చొప్పున లభిస్తుంది. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు రూ. 30 లక్షలు... మిగతా నలుగురు సెలెక్టర్లకు రూ. 25 లక్షల చొప్పున అందజేస్తారు. విజేత జట్టు బృందంలోని బీసీసీఐ సహాయక సిబ్బందికి రూ. 25 లక్షల చొప్పున లభిస్తాయి.

యూ ఆర్ నాటీ..

- ఎంపీ రఘునందన్‌రావు మనవరాలిపై ప్రధాని ప్రశంసలు
- కుటుంబ సభ్యులతో కలిసి మోదీతో ఎంపీ భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: యూ ఆర్ నాటీ.. అంటూ ప్రధాని మోదీ మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు మనవరాలిని ప్రశంసించారు. తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రధాని మోదీతో రఘునందన్‌రావు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గురువారం పార్లమెంటులో రఘునందన్‌రావు ఆయన సతీమణి మంజుల, కూతురు డాక్టర్ సింధు, అల్లుడు డాక్టర్ శ్రవణ్ తేజ, మనవరాళ్లు కనిష్క, శిశిర, చైత్ర ఆరాత్రికలు ప్రధానిని కలిశారు. రఘునందన్ ప్రధానికి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. గురువారం రఘునందన్‌రావు కూతురు, 23న రఘునందన్‌రావు పుట్టిన రోజు అని తెలుసుకున్న ప్రధాని ఇద్దరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా.. మనవరాళ్లకు మోదీ చాక్‌లెట్లు బహూకరించారు. చిన్నారి చైత్ర ఆరాత్రిక ప్రధానికి చాక్‌లెట్ తినిపించింది. 'యే చాక్లెట్ మైనే దియా.. మేరా చాక్లెట్ ముఝే ఖిలాయేగీ.. యూ ఆర్ నాటీ'(ఈ చాక్లెట్ నేనే ఇచ్చాను. నా చాక్లెట్ నాకే తినిపిస్తావా?) అంటూ మోదీ బాలికను ముద్దుచేశారు.

మొక్కలకు 'జెడ్‌ప్లస్ సెక్యూరిటీ'



మొక్కలను కాపాడేలా చుట్టూ రక్షణగా ఏర్పాటు చేసిన కంచె

పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మావలాల్‌గుట్ట సమీపంలో రోడ్డుకిరువైపులా అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. వాటిని మూగజీవాలు తినకుండా పకడ్బందీగా ముళ్ల కంచెను ఏర్పాటు చేశారు. వాటిని చూసిన ప్రజలు మొక్కలకు జెడ్‌ప్లస్ సెక్యూరిటీ తరహా రక్షణ కల్పించారని చర్చించుకోవడం గమనార్హం. కాగా ఇదే విధానంలో గతంలో నాటిన మొక్కలు ఏపుగా వృక్షాలుగా ఎదిగాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



ఖండాలలో తాగునీటి ఎద్దడిపై ఆరా తీస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

'ఖండాల'ను సందర్శించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

కైలాస్‌నగర్: మిషన్ భగీరథ నీటి సరఫరా జరగక ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడిపై 'బిందె నిండాలంటే.. జాగారం చేయాల్సిందే', 'భగీరథ ప్రయత్నం'శీర్షికన 'సాక్షి'మెయిన్‌లో గురువారం ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చంద్రమోహన్, డీఈ శ్రీనివాస్ గురువారం ఆయా గ్రామాలను సందర్శించారు. గ్రామస్తులు తాగునీటి కోసం ఆధారపడ్డ చేదబావిని పరిశీలించగా అది పూర్తిగా అడుగంటింది. మిషన్ భగీరథ నీటిసరఫరా, ఇబ్బందులపై గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామస్తులు తాగునీటి సమస్యను అధికారులకు ఏకరువు పెట్టారు. మిషన్ భగీరథ నీరు రెండు రోజులకోసారి వస్తుందని, దీంతో రెండు బిందెలు కూడా నిండడం లేదని తెలిపారు. తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా గ్రామంలో నిర్మించిన చిన్న ట్యాంకుకు సమీపంలోని బోరుబావి నుంచి పైపులైన్ కనెక్షన్ ఇచ్చామని పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓ తెలిపారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆ ట్యాంకును నింపుతున్నామని, 10 వేల లీటర్లు ఖండాల గ్రామస్తులకు అందిస్తున్నామని తెలిపారు. నీటిని వృథా చేస్తుండడం, భూగర్భజలాలు అడుగంటిపోవడంతో నీటి సమస్య తలెత్తుతోందని అధికారులు అంగీకరించారు. నీటి ఎద్దడి నివారణకు అదనంగా మరో మూడు ట్యాంకర్లను కేటాయించాలని కోరారు. పది హ్యాబిటేషన్లలోనూ నీటి సమస్య ఉండటంతో ఇంద్రవెల్లి మండలం సమ్మక్క గ్రామంలోని వ్యవసాయ బోరుబావి నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని, ఇందుకు డీజిల్‌కు వారానికి రూ.6 వేలు ఖర్చవుతోందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి కరీంనగర్

శుక్రవారం । 21 । మార్చి । 2025



క్వింటాల్ పత్తి రూ.7,170

జమ్మికుంట: జమ్మికుంట పత్తి మార్కెట్‌లో గురువారం క్వింటాల్ పత్తి రూ. 7,170 పలికింది. క్రయ విక్రయాలను ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశం ,గ్రేడ్–2 కార్యదర్శి రాజాలు పర్యవేక్షించారు.



విద్యార్థులకు రవాణా భత్యం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సర్కారు రవాణా భత్యం విడుదల చేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు రూ.1.06 కోట్లు విడుదల అయ్యాయి.

- IIలో▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సా॥)	సహర్ శనివారం (ఉ॥)
కరీంనగర్ :	6.29	5.00
పెద్దపల్లి :	6.32	4.58
సిరిసిల్ల :	6.28	5.08
జగిత్యాల :	6.32	4.58

న్యూస్‌రీల్

భవిష్యత్‌ను చాలెంజ్‌గా తీసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్: విద్యార్థులు భవిష్యత్‌ను చాలెంజ్‌గా తీసుకొని ముందుకు సాగాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల డైరెక్టర్ కె.శంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కిట్స్‌జెస్– 25 క్రీడా సాంస్కృతిక ఉత్సవ ప్రారంభ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ అభ్యున్నతికి ఇంజినీరింగ్ విద్యార్థుల సేవలు అవసరం అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పోటీపడి చదవాలన్నారు. కళాశాల చైర్మన్ లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ.. కళాశాలలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం క్రీడా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కళాశాల సెక్రటరీ వొడితల సతీశ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఈశ్వరయ్య పాల్గొన్నారు.

రూరల్ ఏసీపీ ఆఫీస్ తనిఖీ



మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని రూరల్ ఏసీపీ కార్యాలయాన్ని గురువారం సీపీ గౌస్ ఆలం సందర్శించారు. పెండింగ్ కేసులపై సమీక్ష చేశారు. త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అర్బన్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సైబర్‌నేరాల బారిన పడకుండా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పెండింగ్ వారెంట్లు అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై చర్చించారు. గంజాయి, ఇసుక అక్రమ రవాణా, పీడీఎస్ బియ్యం రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



విక్టరీ సింబల్ చూపుతున్న విద్యార్థులు

కరీంనగర్: ఇంటర్ పరీక్షలు ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా జనరల్, ఒకేషనల్ విభాగాల్లో 15,554 మంది విద్యార్థులకు 422 విద్యార్థులు గైర్హాజరు కాగా 15,132 మంది పరీక్షకు హాజరైనట్లు గురువారం డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. చివరిరోజు హుజూరాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకరు డిబార్ అయినట్లు వివరించారు. మరోవైపు పరీక్షలు ముగిసిన వెంటనే కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి నెలకొంది. కేరింతలు కొడుతూ జోష్‌గా కనిపించారు. పిల్లలను తీసుకెళ్లేందుకు ఆయా కళాశాలలు, హాస్టళ్ల వద్దకు తల్లిదండ్రులు చేరుకున్నారు. దీంతో ప్రధాన వీధుల్లో ఆటోలు, బస్సుల్లో రద్దీ నెలకొంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ జనంతో కిక్కిరిసింది.

ఐదుగురు ఎస్సైల బదిలీ



కరీంనగర్ క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఎస్సైలు బదిలీ అయ్యారు. స్పెషల్ బ్రాంచిలో పనిచేస్తున్న వంశీకృష్ణ గంగాధర ఎస్సైగా, కరీంనగర్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసే రాజు రామడుగుకు, కరీంనగర్ ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న సురేందర్ చొప్పదండికి, రామడుగులో పనిచేస్తున్న శేఖర్ వీఆర్‌కు, గంగాధరలో విధులు నిర్వహిస్తున్న నరేందర్ రెడ్డిని వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సిటీలో పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు 11 కేవీ ఉజ్వల పార్కు, ఐటీ హబ్ ఫీడర్ పరిధిలోని కోతిరాంపూర్ మెయిన్‌రోడ్, కోతిరాంపూర్, బైపాస్‌రోడ్డు, హనుమాన్‌నగర్, ఎమ్మెల్సీ హనుమాన్‌నగర్, గణేశ్‌నగర్, పాలిటెక్నిక్ కళాశాల, డీమార్ట్, ఐటీ హబ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 2 ఏడీఈ ఎం.లావణ్య తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు 11 కేవీ కోర్టు ఫీడర్ పరిధిలోని క్రోమా, వివేకానంద స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని టౌన్ 1 ఏడీఈ పి.శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.





ఓ మనిషి ఇలా చిగురించు

మనిషి చిన్నచిన్న సమస్యలు ఎదుర్కోలేకపోతున్నాడు. పరీక్షలో ఉత్తీర్ణత కాలేమోనని కొందరు.. కాలేదని మరికొందరు విద్యార్థులు, ఎంతచదివినా ఉద్యోగం రాలేదని యువత, అన్ని ఉండి ఏం చేయలేకపోతున్నాననే నిరాశ.. నిస్పృహతో నడివయసున్నవారు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇలాంటి వారికి ఇదిగో ఈ వృక్షం చిగురించిన తీరే ఓ ఉదాహరణ. మనోధైర్యం కూడా.. వాతావరణ మార్పుల కారణంగా నెలరోజుల క్రితం మానకొండూర్ మండలం రాఘవపూర్ గ్రామశివారులోని చెరువు ఒడ్డుకు మోడువారిన ఈ చెట్టు ఇప్పుడు ఇలా జవసత్వాలు నింపుకొని ఎలాచిగురించిందో చూడండి. కష్టాలు వచ్చినప్పుడు కుంగిపోవద్దని.. ఓపికతో ఎదుర్కొంటే ఇలా చిగురించవచ్చనడానికి నిదర్శనం. సో మనోధైర్యంతో ముందుకెళ్లడం నేర్చుకోండి. మీ వంతుగా ఇతరులకు అవగాహన కల్పించండి. ధైర్యం నూరిపోయండి. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

బిల్లులు ఇవ్వకుంటే సర్వే చేయం

పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా వేధిస్తూ మళ్లీ సర్వే చేయాలని చెప్పడం సరైనది కాదని... సర్వే బిల్లులు వచ్చేవరకు ప్రస్తుత లెప్రసీ సర్వే చేసేది లేదని ఆశా కార్యకర్తలు తేల్చిచెప్పారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. స్పందించిన డీఎంహెచ్‌వో వెంకటరమణ బిల్లులు వచ్చాక ఖాతాలో జమచేస్తామని తెలిపారు. నిర్దిష్టమైన హామీ ఇవ్వకపోవడంతో ఆశ కార్యకర్తలు సర్వే చేసేదిలేదని తేల్చిచెప్పారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుంద రెడ్డి, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రంగమైన శారద, జిల్లా ప్రధాన కార్యదర్శి మారేళ్ల శ్రీలత, రాజమణి, లత, సత్యలక్ష్మి, లక్ష్మి, శంకరమ్మ, రజిత, పద్మ, ప్రియాంక, స్వప్న, సుజాత, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. – కరీంనగర్‌టౌన్

ఆదాయం అంతంతే..

- తలసరి ఆదాయంలో పెద్దపల్లి టాప్
- అటవీ విస్తీర్ణంలో కరీంనగర్ లాస్ట్, ఉపాధి హామీలో భేష్
- తెలంగాణ సోషల్ ఎకనామిక్ అవుట్‌లుక్–2025లో వెల్లడి



సాక్షి, పెద్దపల్లి:

జిల్లాల పురోగతికి సూచికగా భావించే స్థూల జిల్లా దేశీయోత్పత్తి విలువ(జీడీడీపీ)లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలు పర్వాలేదన్నట్లుగా ఉండగా.. వ్యక్తుల ఆదాయంగా పరిగణించే తలసరి ఆదాయం విషయంలో జగిత్యాల మినహా మిగతా జిల్లాలు ముందువరుసలో ఉన్నాయి. అర్బన్ జనాభాలో కరీంనగర్‌లో 3లక్షలు, రామగుండంలో 2.5లక్షలు, జగిత్యాలలో లక్షమంది పట్టణాల్లో నివసిస్తున్నారు. జిల్లా విస్తీర్ణంలో అత్యల్పంగా అడవులు కలిగి ఉండి రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లా చివరి స్థానంలో నిలవగా, ఖనిజాల ద్వారా రాష్ట్రానికి ఆదాయం సమకూర్చడంలో ఉమ్మడి జిల్లాలు ముందువరుసలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన తెలంగాణ సోషల్ ఎకనామిక్ అవుట్‌లుక్– 2025లో ఈ అంశాలన్నీ వెల్లడయ్యాయి.

గనుల ద్వారా ఆదాయం



ఉమ్మడి జిల్లా సహజ వనరులకు నెలవైన ప్రాంతం. బొగ్గు, గ్రానైట్, ఇసుక, ఇటుక బట్టీలు తదితర మైనింగ్ కార్యకలాపాలతో రాష్ట్రానికి ఆదాయం సమకూర్చుతుంది. ఉమ్మడి జిల్లా నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ వరకు రూ.190.62 కోట్లకు గాను రూ.156.21కోట్ల ఆదాయం ప్రభుత్వానికి తెచ్చిపెట్టింది.

జిల్లా	టార్గెట్ (రూ.లక్షల్లో)	వసూలైంది (రూ.లక్షల్లో)
పెద్దపల్లి	2,465.99	2,264.30
సిరిసిల్ల	1,465.07	1,342.18
కరీంనగర్	12,872.16	10,658.72
జగిత్యాల	2,259.05	1,356.26

చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చిన్న సన్నకారు రైతులే ఎక్కువగా ఉన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఒక రైతు దగ్గర సరాసరి 0.83హెక్టార్ల భూమి ఉంటే, జగిత్యాలలో 0.77హెక్టార్లు, పెద్దపల్లిలో 0.76హెక్టార్లు, కరీంనగర్‌లో 0.75 హెక్టార్లు భూమి ఉంది. దాదాపు ఉమ్మడి జిల్లాలో సగటున ఒక్కో రైతుకు 1.9 ఎకరాల భూమి మాత్రమే ఉంది.

సామాజికవర్గాల వారీగా..



వ్యవసాయ గణన (2021–22) లెక్కల ప్రకారం వివిధ సామాజిక వర్గాల వారీగా ఉన్న భూముల లెక్కలు లెక్కించారు. ఆయా వివరాలు ఇలా ఉన్నాయి.

జిల్లా	ఎస్సీ		ఎస్టీ		ఇతరులు	
	రైతుల సంఖ్య	భూమి(ఎకరాల్లో)	రైతుల సంఖ్య	భూమి(ఎకరాల్లో)	రైతుల సంఖ్య	భూమి(ఎకరాల్లో)
జగిత్యాల	33,723	17,925	6,051	4,303	1,86,294	1,51,356
పెద్దపల్లి	24,330	12,310	2,621	1,580	1,35,198	1,08,074
కరీంనగర్	35,156	16,571	973	548	1,69,971	1,37,119
సిరిసిల్ల	23,153	13,882	6,648	5,665	1,02,757	90,394

జీడీడీపీలో అంతంతే..



ఒక ఆర్థిక సంవత్సరంలో జిల్లా ఉత్పత్తి చేసిన వస్తు, సేవల మొత్తం విలువే జీడీడీపీ. జిల్లా ఆర్థికాభివృద్ధికి ముఖ్య కొలమానంగా పరిగణించే జీడీడీపీలో కరీంనగర్ మెరుగ్గా ఉంది. సిరిసిల్ల రాష్ట్రంలోనే 29వస్థానంలో నిలిచింది.

జిల్లా	జీడీడీపీ(రూ.కోట్లలో)	ర్యాంకు
కరీంనగర్	30.216	12
పెద్దపల్లి	27,649	13
జగిత్యాల	24,011	18
సిరిసిల్ల	13,981	29

ఉపాధి హామీలో మెరుగు..



మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు కల్పించాల్సిన పనిదినాల విషయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలు రాష్ట్రంలోని మిగతా జిల్లాలకన్నా మెరుగ్గా ఉండటం విశేషం. ముందుచూపుతో రాష్ట్రంలోనే అత్యధిక పనిదినాలను కల్పించడంలో సక్సెస్ అయ్యారు.

ర్యాంకు	జిల్లా	లక్ష్యం (లక్షల్లో)	కల్పించిన పనిదినాలు	శాతం
2	కరీంనగర్	28.4	26.1	92.1
8	సిరిసిల్ల	21.8	19.6	90.0
12	జగిత్యాల	40.0	35.7	89.4
14	పెద్దపల్లి	25.5	22.8	89.4

పశుసంపద (లక్షల్లో)

జిల్లా	ఆవులు	గేదెలు	పందులు	కుక్కలు	ప్రౌల్టీ
జగిత్యాల	0.47	1.24	0.15	0.03	8.67
పెద్దపల్లి	0.56	0.91	0.04	0.04	10.70
కరీంనగర్	0.52	0.95	0.07	0.07	21.68
సిరిసిల్ల	0.44	0.73	0.03	0.03	7.44



రేషన్ కార్డులు

జిల్లా	దుకాణాలు	మొత్తంకార్డులు
జగిత్యాల	592	3,07,555
పెద్దపల్లి	413	2,19,952
కరీంనగర్	566	2,77,323
సిరిసిల్ల	345	1,73,790



తలసరి ఆదాయం భేష్..



వ్యక్తుల ఆదాయంగా పేర్కొనే తలసరి ఆదాయం విషయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలు ముందంజలో ఉన్నాయి. పెద్దపల్లి టాప్‌లో ఉండగా, జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే చివరి నుంచి మూడో స్థానంలో నిలిచింది.

జిల్లా	తలసరి ఆదాయం	ర్యాంకు
పెద్దపల్లి	2,84,661	8
కరీంనగర్	2,50,243	13
సిరిసిల్ల	2,13,725	28
జగిత్యాల	2,05,273	31

పచ్చదనంలో కరీంనగర్ పూర్



జిల్లా విస్తీర్ణంలో 25.14శాతం అడవులు విస్తరించి జగిత్యాల టాప్‌లో ఉండగా, జిల్లా విస్తీర్ణంలో 2.29శాతం మాత్రమే అడవులు కలిగిఉండి రాష్ట్రంలోనే చివరి స్థానంలో కరీంనగర్ జిల్లా నిలిచింది.

జిల్లా	శాతం
జగిత్యాల	25.14
సిరిసిల్ల	18.09
పెద్దపల్లి	17.55
కరీంనగర్	2.29

జిల్లాలవారీగా అన్నిరకాల పింఛన్లు



జగిత్యాల	2,24,181
కరీంనగర్	1,37,491
పెద్దపల్లి	95,127
సిరిసిల్ల	1,18,495

జిల్లాల వారీగా గ్యాస్ కనెక్షన్లు

జగిత్యాల	3,38,700
పెద్దపల్లి	2,34,600
కరీంనగర్	5,90,700
సిరిసిల్ల	1,69,200



కాలువ గేట్లు ఎత్తివేస్తాం

- రైతులను ఆదుకుంటాం
- బడ్జెట్‌లో కరీంనగర్‌కు తీవ్ర అన్యాయం
- మానేర్ రివర్ ఫ్రంట్‌కు మొండిచేయి
- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల

కరీంనగర్: కరీంనగర్ రూరల్ మండలానికి డీ–89 కాలువ ద్వారా రావాల్సిన వాటా సాగునీరు అందకపోతే రెగ్యులేటర్ గేట్లను ఎత్తివేస్తామని, అవసరమైతే వాటిని పగులకొడతామని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హెచ్చరించారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ.. తలాపున ఉన్న మానేరులో నీళ్లు అడుగంటుతున్నాయని, వచ్చే రెండు నెలల్లో కరీంనగర్‌లో నీటి ఎద్దడి నెలకొనే ప్రమాదముందని, అయినా కాంగ్రెస్ నాయకులకు సోయిలేదని విమర్శించారు. జిల్లా నుంచి గొప్ప మంత్రులు ఉన్నా ఈ బడ్జెట్‌లో జిల్లాకు ఒక్కపైసా కేటాయించలేదని మండిపడ్డారు. కాకతీయ కాలువ 116 క్రాస్ జంక్షన్ వద్ద సాగునీటి సరఫరాలో సమన్యాయం పాటించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. బడ్జెట్‌లో బీసీలకు కనీసం తగిన నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. కరీంనగర్ నగర అభివద్ధికి బీఆర్‌ఎస్ హయాంలో రూ.350 కోట్లు తీసుకువచ్చామని, 2023 డిసెంబర్ వరకు వేగంగా పనులు సాగాయని గంగుల గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అన్ని పనులు నిలిచిపోయాయని అన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. పార్టీ నగర అధ్యక్షుడు హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్రరాజు, కంసాల శ్రీనివాస్, రాజేందర్‌రావు, గందె మహేశ్, బండారి వేణు, సుంకిశీల సంపత్‌రావు, నారదాసు వసంత్‌రావు, పబ్బతి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు రైల్వే జీఎం రాక

కరీంనగర్‌రూరల్: కరీంనగర్, రామగుండం రైల్వేస్టేషన్లను శుక్రవారం దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజరు అరుణ్‌కుమార్ జైన్ సందర్శిస్తారని కరీంనగర్ స్టేషన్ మేనేజర్ ఎం.రవీందర్ తెలిపారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా కరీంనగర్, రామగుండం రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. జీఎం అరుణ్‌కుమార్ ప్రత్యేక రైలులో అధికారులతో కలిసి ఉదయం 8.30 గంటలకు కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు పరిశీలిస్తారు. అనంతరం రామగుండం వెళ్తారని మేనేజరు వివరించారు.

పది పరీక్షలకు 12,516 మంది

- టెన్త్ ఎగ్జామ్స్‌కు అంతా రెడీ
- నేటి నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు పరీక్షలు
- గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి
- జిల్లాలో 73 కేంద్రాల ఏర్పాటు

సమస్యలుంటే హెల్ప్‌లైన్ నంబరు 9441130379 కాల్‌చేయొచ్చు



హాల్‌టికెట్ నంబర్ వేస్తున్న సిబ్బంది

కరీంనగర్: పదోతరగతి పరీక్షలకు యంత్రాంగం సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈమేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ 12,516 మంది, ప్రైవేట్ విద్యార్థులు 24 మంది పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం 73 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 73 డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇద్దరు అదనపు డిపార్ట్‌మెంట్ అధికారులు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 694 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారని అధికారులు వెల్లడించారు.

ఏర్పాట్లు పూర్తి..

కేంద్రాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతీరోజు పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను ఆయా పోలీస్ స్టేషన్ నుంచి పరీక్ష సమయానికంటే ముందుగా తీసుకువచ్చే విధంగా చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డిపార్ట్‌మెంట్ అధికారులు (డీవో)లకు ఆదేశాలు జారీ చేశారు.

సీసీ కెమెరాల నిఘా..

సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. పరీక్ష పేపర్ల సీల్ ఓపెన్ చేసినప్పటి నుంచి పరీక్ష పూర్తయి వాటిని సీల్ చేసేంత వరకు సీసీ కెమెరాల్లో రికార్డు కానున్నాయి.

సందేహాలుంటే కాల్‌చేయండి..

అత్యవసరంగా ఫిర్యాదుల కోసం డీఈవో కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. హెల్ప్‌లైన్ నంబరు 9441130379ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేశాం



పదోతరగతిలో మంచి ఫలితాలు సాధిస్తాం. అందుకు తగ్గ ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేశాం. గతేడాదికన్నా మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రతీరోజు పరీక్షలు నిర్వహించాం. 100 రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేశాం. పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. – జనార్దన్‌రావు, డీఈవో

కేంద్రాల వద్ద బీఎన్‌ఎస్‌ఎస్ అమలు



కరీంనగర్‌క్రైం: పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద శుక్రవారం నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు సెక్షన్ 163 బీఎన్‌ఎస్‌ఎస్ యాక్ట్ (భారతీయ న్యాయ సురక్షా సంహిత) అమలులో ఉంటుందని కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలం గురువారం వెల్లడించారు. కేంద్రాలకు ఐదు వందల మీటర్ల దూరం వరకు ఇద్దరికి మించి ఉండరాదన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు చేయొద్దన్నారు. పరిసరాల్లోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు మూసివేయాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పోలీస్ పెట్రోలింగ్ పార్టీలు విధుల్లో ఉంటాయన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శివారులో 25 నుంచి 30ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. మృతుడి ఒంటిపై డార్క్ బ్లూ కలర్ నిక్కర్ ధరించి, కొద్దిగా బట్టతల, కుడి కాలుకు కడియం కలిగి ఉన్నాడు. ఎవరైన గుర్తు పట్టినట్లు అయితే వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

ఎన్టీఆర్ చౌరస్తా డ్రైనేజీలో..

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద గల డ్రైనేజీలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు వన్ టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉందని అన్నారు. మున్సిపల్ జవాన్ సుంకరి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

థాయ్‌లాండ్‌లో ప్రైవేట్ ఉద్యోగి మృతి

- నేడు స్వగ్రామానికి మృతదేహం


పుల్ల సృజన్ (ఫైల్)

హుజూరాబాద్: ఉద్యోగంలో ప్రతిభ కనబర్చడంతో కంపెనీ విహార యాత్రకు పంపిస్తే విధి వెక్కిరించింది. అక్కడ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి చనిపోయాడు. మృతదేహం నేడు స్వగ్రామానికి రానుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన పుల్ల సృజన్(33) ఏషియన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఉద్యోగంలో ప్రతిభ కనబర్చినందుకు థాయ్‌లాండ్ విహారయాత్రకు వెళ్లేందుకు కంపెనీ ఆఫర్ చేసింది. థాయ్‌లాండ్‌కు వెళ్లిన సృజన్ జనవరి 25న అక్కడ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అక్కడే ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి రానుంది. సృజన్‌కు భార్య స్నేహ, కుమార్తె ఉన్నారు.

పాతాళగంగలో పడి జమ్మికుంట విద్యార్థి..


సాయితేజ (ఫైల్)

జమ్మికుంట: పుట్టిన రోజు సందర్భంగా స్నేహితులతో కలిసి దైవదర్శనం కోసం వెళ్లిన యువకుడు శ్రీశైలంలో నీటిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన జమ్మికుంటలో విషాదం నింపింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం గ్రామానికి చెందిన సాగర్ల సుధాకర్- లక్ష్మి దంపతుల కొడుకు సాగర్ల సాయితేజ(19) హైదరాబాద్‌లో పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్ నుంచి స్నేహితులతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్లాడు. శ్రీశైలంలోని పాతాళ గంగవద్ద స్నానానికి వెళ్లి కాలుజారి నీటిలో మునిగి చనిపోయాడు. అక్కడివారి సమాచారంతో కుటుంబ సభ్యులు శ్రీశైలం బయల్దేరి వెళ్లారు.

తింటే బేజారే..



ఈనెల 17న రాత్రి రామగుండం బల్దియా పరిధిలోని ఓ బేకరీలో గోదావరిఖని విద్యానగర్‌కు చెందిన పిట్టల రాజ్‌కుమార్ స్వీట్ బ్రెడ్ కొనుగోలు చేశాడు. మరుసటి రోజు ఉదయం బ్రెడ్ తినడానికి కవర్ తెరువగా, నాలుగు బ్రెడ్ పీసుల్లో సిల్వర్ కవర్ ముక్కలు కనిపించడంతో షాక్ తిన్నాడు. గతంలో కూడా అదే బేకరీ అనుబంధ స్వీట్ హౌజ్‌లో కొనుగోలు చేసిన బూందీలో స్క్రూ వచ్చిందని ఆరోపించాడు'.

'గోదావరిఖనిలో విజయ్ అనే వ్యక్తి ఓ బేకరీ షాప్ నుంచి బ్రెడ్ కొనుగోలు చేశాడు. ఉదయం బ్రెడ్ తిన్న విజయ్ సాయంత్రం నుంచి కడుపునొప్పితో తల్లడిల్లాడు. డాక్టర్ వద్దకు వెళ్లగా బ్రెడ్ ద్వారా ఫుడ్ పాయిజన్ జరిగిందని చెప్పి, వారంపాటు ట్రీట్మెంట్ ఇచ్చారు. ఇలా విజయ్ ఒక్కడే కాదు. బేకరీలు, స్వీట్ హౌజ్‌ల్లో తినుబండారాలు కొనుగోలు చేసిన పలువురు అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు'.

'గోదావరిఖనిలోని ఓ బేకరి, స్వీట్‌షాప్‌లో కొందరు యువకులు ఓ ఫ్రెండ్ బర్త్ డే కోసం కూల్ కేక్ కొన్నారు. కేక్ కోసే ముందు అందులో ఫంగస్ ఉన్నట్లు గుర్తించారు. కేక్ విక్రయించిన షాప్ యజమానిని నిలదీయగా వాపస్ తీసుకొని వేరే ఇచ్చాడు. గమనించకుండా కేక్ తింటే ఆస్పత్రుల పాలయ్యేవాళ్లమని బర్త్‌డే పార్టీలో పాల్గొన్న వాళ్లంతా వాపోయారు'.

- నాణ్యత పాటించని బేకరీలు, స్వీట్‌హౌజ్‌లు
- బ్రెడ్ పీసుల్లో సిల్వర్ కవర్లు
- కంపెనీ పేరు, తయారీ తేదీ, ఎక్స్పైరీ డేట్ ఉండవు
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వ్యాపారస్తులు
- తనిఖీలు చేపట్టని ఫుడ్‌సేఫ్టీ అధికారులు


తయారు చేసిన సంస్థ పేరు, తేదీలు లేని బ్రెడ్లు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం బల్దియా పరిధిలో పలు బేకరీలు, స్వీట్ హౌజ్‌లు ఇష్టారాజ్యంగా వ్యాపారం సాగిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ఉత్పత్తుల తయారీ, అమ్మకాల్లో కనీస ప్రమాణాలు పాటించడం లేదని, తయారు చేసిన ఆహార పదార్థాల ప్యాకింగ్‌లపై లైసెన్స్, రిజిస్ట్రేషన్ నంబర్, ఎక్స్పైరీ తేదీ కూడా వేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇష్టారాజ్యంగా స్వీట్‌హౌజ్‌లు, బేకరీలు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నా, ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శలు వస్తున్నాయి.

నిబంధనలు బేఖాతరు

జిల్లాలోనే పెద్ద నగరమైన రామగుండం నగరపాలక సంస్థలో ఫుడ్ సేఫ్టీ అధికారుల పనితీరు మాటల్లో తప్ప చేతల్లో కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బల్దియా పరిధిలోని పలు బేకరీలు, స్వీట్‌హౌజ్‌లు, హోటళ్లు నిబంధనలు పాటించడం లేదని ఆరోపణలున్నాయి. అలాంటి బేకరీలకు అడ్డుకట్ట వేయాల్సిన ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో అడ్డూఅదుపు లేకుండా పోతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం బేకరీ చిరునామా, లైసెన్స్ నంబరు, మ్యానుఫ్యాక్చరింగ్, ఎక్స్పైరీ తేదీలను తప్పకుండా ప్యాకింగ్‌లపై వేయాలి. కానీ, నిర్వాహకులు ఇలాంటివేవి తమకు పట్టనట్టు వ్యాపారాలు సాగిస్తున్నారు.

అపరిశుభ్ర వాతావరణంలో..

ఆహార పదార్థాలు తయారు చేసే సమయంలో బేకరీలు, స్వీట్‌హౌజ్ యాజమాన్యాలు కనీస శుభ్రత ప్రమాణాలు పాటించడం లేదని, వంట కోసం ఉపయోగించే నూనెలు, ఆహార ఉత్పత్తుల్లో ఉపయోగించే రంగులు కూడా నాసిరకం వాడుతున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు అనధికారికంగా కంపెనీ పేర్లు లేకుండా ఆహార పదార్థాలు తయారుచేస్తూ బేకరీలు, స్వీట్ హౌజ్, సూపర్‌మార్కెట్లకు సరఫరా చేస్తున్నారని సమాచారం.

బయటి ఫుడ్‌తో ఇన్‌ఫెక్షన్లు



బయటి ఫుడ్ తినడం ద్వారా ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదాలున్నాయి. ఫుడ్ ఇన్‌ఫెక్షన్ అయితే లివర్ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు తదితర అనారోగ్య సమస్యలు వస్తాయి. సకాలంలో గుర్తించి వైద్యం తీసుకోవాలి. సాధ్యమైనంత వరకు ఇంట్లో చేసిన ఆహార పదార్థాలు తినడం మంచిది.

– టీవీ రాజశేఖర్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్, గోదావరిఖని

తనిఖీల్లేకనే..



ఇటీవల ఓ బేకరీలో బ్రెడ్ కొన్నా. దానిపై తయారీ తేదీ, ఎక్స్పైరీ డేట్, కంపెనీ పేరు లేవు. బేకరీపై నమ్మకంతో కొని, మరుసటి రోజు తినడానికి చూస్తే, బ్రెడ్ పీసుల్లో సిల్వర్ కవర్ ముక్కలు కనిపించాయి. బేకరీ నిర్వాహకులను నిలదీస్తే పొరపాటు జరిగిందని, మరోసారి ఇలా జరగకుండా చూస్తామని చెప్పి ఈజీగా తీసుకున్నారు. అధికారుల తనిఖీల్లేకనే ఇలా జరుగుతున్నాయి. నాకు జరిగిన అన్యాయంపై వినియోగదారుల ఫోరంను ఆశ్రయిస్తా.

– పిట్టల రాజ్‌కుమార్, గోదావరిఖని

చర్యలు తీసుకుంటాం



నాణ్యతాప్రమాణాలు పాటించని బేకరీలు, స్వీట్‌హౌజ్‌లను ఆకస్మికంగా తనిఖీలు చేయిస్తాం. నిబంధనలు పాటించనివాటిపై బాధితులు నేరుగా ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటారు. బల్దియాకు వచ్చే ఫిర్యాదుల నేపథ్యంలో శానిటేషన్ విభాగం అధికారులు పలు హోటళ్లపై తనిఖీలు చేసి జరిమానా విధించారు.

– జె.అరుణశ్రీ, అదనపు కలెక్టర్

మాయమవుతున్న గుట్టలు

- బుగ్గారంలో ఆనవాళ్లు కోల్పోతున్న స్థలాలు
- పట్టించుకోని అధికారులు


బుగ్గారం, యశ్వంతరావుపేట మధ్య తవ్వకాలు

బుగ్గారం: బుగ్గారం మండలంలోని పలు ప్రాంతాల్లో గుట్టలు, స్థలాలు మాయం అవుతున్నాయి. కొంతమంది మట్టికోసం.. మరికొందరు స్థలాన్ని కబ్జా చేసేందుకు తవ్వుతున్నారు. అనుమతి లేకుండా.. ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతుండడంతో పరిసరాలు గుర్తించలేని విధంగా మారిపోతున్నాయి. ఇదంతా అధికారుల కళ్లముందే జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలు ఇళ్ల నిర్మాణం సమయంలో, ఇతర అవసరాలకు మొరం తవ్వితేనే ఇబ్బందులకు గురిచేసే అధికారులు.. బడాబాబులు, అక్రమార్కులు ఇలా గుట్టలను మాయం చేస్తున్నా పట్టించుకోకపోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. మండలంలోని సిరికొండ, మద్దునూర్, యశ్వంతరావుపేట, బుగ్గారం, చిన్నాపూర్, గోపులాపూర్ పరిధిలోని గుట్టల స్థలాలను కొంతకాలంగా దర్జాగా తవ్వుతున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి రుసుమూ చెల్లించకుండా.. అనుమతి పొందకుండానే అక్రమంగా తవ్వకాలు చేపడుతుండడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం 11 గ్రామాలున్నాయి. అనేక గ్రామాల్లో అటవీశాఖ భూములు ఉన్నాయి. రైతుల పొలాలకు సమీపంలోనే కొన్ని గుట్టలు ఉండడంతో ఆ స్థలాన్ని కలుపుకోవాలనే దురుద్దేశంతో కొంతమంది తవ్వకాలు చేస్తున్నారు. ఫలితంగా ఆ స్థలంలోని విలువైన వృక్ష సంపద కనుమరుగవుతోంది. మరికొంత మంది మొరం కోసం తవ్వుతున్నారని ప్రజలు చెబుతున్నారు. నాలుగైదేళ్లలో సిరికొండ, మద్దునూర్, యశ్వంతరావుపేట, బుగ్గారం, గంగాపూర్, చిన్నాపూర్‌లోని గుట్టల స్థలాలు పూర్తిగా అన్యాక్రాంతమయ్యాయి. అక్రమ తవ్వకాలపై స్థానిక నాయకులు అధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల శెకెల్ల శివారులోని గుట్ట స్థలాన్ని జేసీబీలతో రాత్రిపూట మొరం తవ్వకాలు చేపట్టారు. దీనిపై స్థానికులు సంబంధిత అధికారులకు ఫోన్‌లో తెలపగా.. పోలీసులకు ఫోన్ చేయండంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని సమాచారం. అదేరాత్రి మరో అధికారికి ఫిర్యాదు చేయగా.. ఆయన స్థానిక అధికారులను పంపించారు. విషయం తెలుసుకున్న అక్రమార్కులు తమకు కావాల్సిన మొరాన్ని తవ్వుకున్నారు.

పట్టించుకోవడం లేదు



మండలంలోని పలు ప్రాంతాలలో ఇప్పటికే అనేక గుట్టబోర్లు మాయమయ్యాయి. పలుకుబడి ఉన్నవారు యథేచ్ఛగా వాటిని తవ్వి మొరం వ్యాపారం చేస్తున్నారు. పెద్దపెద్ద యంత్రాలతో రోజుల వ్యవధిలోనే అటవీప్రాంతంలోని గుట్టబోర్ల ఆనవాళ్ళు లేకుండా చేస్తున్నారు.

– పెద్దనవేణి రాగన్న, బుగ్గారం

చర్యలు తీసుకుంటాం



ఎవరైనా అనుమతి లేకుండా గుట్టబోర్లను తవ్వితే చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో మొరం కోసం తవ్విన ప్రాంతాలను స్థానిక అధికారులతో కలిసి పరిశీలిస్తాం. మొరం తవ్వకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. వ్యవసాయ భూముల సమీపంలో ఆక్రమణలను అడ్డుకుంటాం.

– మాజిద్, తహసీల్దార్, బుగ్గారం

నక్సల్స్‌పై కేంద్ర వైఖరి సరైంది కాదు


మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

గోదావరిఖని: నియోజకవర్గాల పునర్విభజన మూలంగా దక్షణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని, నక్సల్స్‌పై కేంద్ర వైఖరి సరైంది కాదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నక్సలిజాన్ని, కమ్యూనిస్టులను రూపుమాపడానికి కేంద్ర చేస్తున్న నిరంకుశత్వ విధానం సరైంది కాదన్నారు. సమావేశంలో నాయకులు కలవేన శంకర్, తాండ్ర సదానందం, కె.కనకరాజ్, గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, తాళ్లపెల్లి మల్లయ్య, మడికొండ ఓదెమ్మ, కోడం స్వామి, మాటేటి శంకర్, అసాల రమ, కందుకూరి రాజరత్నం, మార్కాపురి సూర్య, కుమార్, రేణికుంట్ల ప్రీతం తదితరులు పాల్గొన్నారు.

ఆయన కళ్లు సజీవం


మల్లయ్య (ఫైల్)

తిమ్మాపూర్: మండలంలోని పోరండ్ల గ్రామానికి చెందిన కిన్నెర మల్లయ్య(56) బుధవారం రాత్రి మానకొండూర్ మండలం శంషాబాద్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధలో ఉన్న కుటుంబ సభ్యులు మల్ల య్య నేత్రాలు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. తన తండ్రి నేత్రాలు మరొకరికి ఉపయోగపడాలనే ఉద్దేశంలో నేత్రాలను దానం చేసినట్లు మల్లయ్య కొడుకు అనిల్ తెలిపారు. గురువారం జరిగిన అంత్యక్రియల్లో గ్రామస్తులు పాల్గొన్నారు.

కాకతీయ కెనాల్‌లో విద్యార్థి గల్లంతు

తిమ్మాపూర్: మంచిర్యాల జిల్లా జన్నారంకు చెందిన వాసాల అరవింద్ (22) కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం స్నేహితులతో కలిసి అలుగునూర్‌లోని కాకతీయ కెనాల్‌లో ఈత కొట్టడానికి వచ్చాడు. ప్రమాదవశాత్తు కాకతీయ కెనాల్‌లోపడిన అరవింద్ గల్లంతయ్యాడు. ఎల్‌ఎండీ పోలీసులు ఆచూకీ కనుగొనే ప్రయత్నం చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

పెగడపల్లి: బాలిక మృతికి కారకుడైన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సీహెచ్.రవికిరణ్ తెలిపారు. మండలంలోని రామభద్రునిపల్లికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన బాస రాము, గొల్లపల్లి మండలం రంగధామునిపల్లికి చెందిన బాలుడు కొంతకాలంగా ప్రేమపేరుతో వేధించారు. దీంతో బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. దీంతో నిందితులపై పోక్సో కేసు నమోదు చేశారు. బాలిక మృతికి కారణమైన రామ్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- ఆరున్నర తులాల బంగారం...
- రూ.1.18 లక్షల నగదు అపహరణ

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం బాలపల్లికి చెందిన మడపతి గంగారాం ఇంట్లో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.1.18 లక్షలు ఎత్తుకెళ్లారు. గంగారాం కుటుంబం ఈనెల 17న తిరుపతి దర్శనానికి వెళ్లారు. అదునుగా భావించిన దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగులగొట్టి ఆరున్నర తులాల నక్లెస్, పుస్తెలతాడు, నగదు ఎత్తుకెళ్లారు. గంగారాం బంధువు పోలు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

కోరుట్ల: పట్టణంలోని ఆదర్శనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. కట్కం సంధ్య బుధవారం తన ఇంటికి తాళం వేసి మెట్‌పల్లికి వెళ్లింది. గురువారం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. బీరువాలోని 5మాసాల బంగారం, 15 గ్రాముల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మెదక్‌లో దొంగస్వామి అరెస్ట్

- వేములవాడ సోషల్ మీడియాలో వైరల్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన దొంగస్వామిని మెదక్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేయడం వేములవాడ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మెదక్ ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన బొమ్మెల బాపుస్వామి ఉరాఫ్ శివస్వామి జ్యోతిష్యం చెబుతూ, పలు పూజలు చేస్తుండేవాడు. అమాయక మహిళలను నమ్మించి నిమ్మకాయ, పసుపు, కుంకుమ వాసనలు చూపిస్తూ, నీటిలో నిద్రమాత్రలు కలిపి తాగించేవాడు. సదరు మహిళలు స్పృహ కోల్పోయిన తర్వాత లైంగికదాడి చేసి, సెల్‌ఫోన్లో వీడియోలు చిత్రీకరించేవాడు. అనంతరం సదరు మహిళలను బ్లాక్ మెయిల్ చేసి రూ.లక్షలు వసూలు చేశాడని ఎస్పీ తెలిపారు. పలువురు బాధితుల ఫిర్యాదు చేయడంతో నర్సాపూర్‌లో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న సామగ్రిని స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

దరఖాస్తులు ఆహ్వానం

కరీంనగర్: 2025 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం విదేశీ విద్యాలయాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు రూ.20లక్షలు స్కాలర్‌షిప్ అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్సీ డీడీ ఎం.నగైలేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూఎస్‌ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, న్యూజిలాండ్ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదలగు ప్రొఫెషనల్ కోర్సుల్లో చదువాలనుకుంటున్న ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 20 నుంచి మే 19 వరకు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన విద్యార్థులకు రూ.20లక్షలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా ఎస్సీ కులానికి చెందినవారై ఉండాలని, సంవత్సర ఆదాయం రూ.5లక్షలకు మించొద్దని, గ్రాడ్యుయేషన్‌లో 60 శాతం కంటే ఎక్కువ మార్కులు రావాలని, టీవోఈఎఫ్ఎల్, ఐఈఎల్‌టీఎస్, జీఆర్ఈ, జీఎంఏటీలో ఎక్కువ శాతం అర్హత కలిగి ఉండాలన్నారు.

అల్ఫోర్స్‌లో 'బ్లింక్' జోష్


చిన్నారుల నృత్యం

కొత్తపల్లి: కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ పాఠశాలలో గురువారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు విద్యార్థుల్లో జోష్‌ను నింపాయి. పాఠశాల ఆవరణలో గురువారం రాత్రి అల్ఫోర్స్ 'బ్లింక్' పేరుతో నిర్వహించిన వేడుకలను అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డితో కలిసి శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రతిభపాటవ పోటీలు, పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రేపు రిక్రూట్‌మెంట్ డ్రైవ్

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో 22న కాన్సర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌వారు డేటా సెంటర్ సేల్స్ అసోసియేట్ పోస్ట్ కోసం క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు హాజరయ్యే అభ్యర్థులు 2021, 2022, 2023, 2024 సంవత్సరాల్లో బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీబీఎం, బీఏ కోర్సులలో 60శాతం లేదా 6సీజీపీఏలతో ఉత్తీర్ణులైన వారితో పాటు ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు. డ్రైవ్‌కు హాజరయ్యే అభ్యర్థులు పూర్తి సమాచారంతో కూడిన బయోడేటాతో ఉదయం 9.30గంటలకు రావాలని, వివరాలకు 97012 74956, 7981782659 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

15 మందిపై కేసు

చందుర్తి(వేములవాడ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడంతో పాటు ఎలాంటి అనుమతి లేకుండా రోడ్డుపై ధర్నా చేశారని చందుర్తి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 15మంది బీఆర్ఎస్ కార్యకర్తలపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 16న చందుర్తిలో అనుమతి లేకుండా ధర్నా చేశారని, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, చిలుక పెంటయ్య, మందాల అబ్రహం, దప్పుల అశోక్, ఏనుగు శ్రీనివాస్, కొమ్ము రమేశ్, ఎండీ.ఇస్మాయిల్, పెగ్గర్ల రమేశ్‌రావు, మాదాసు ప్రసాద్, వెంకటేశం, పులి మనోహర్‌లతో పాటు మరో నలుగురిపై కేసు నమోదైనట్లు ఎస్సై అంజయ్య వివరించారు.

భూనిర్వాసితుల టీడీఎస్ చెల్లింపుల్లో అవకతవకలు?

- ఆర్డీవో కార్యాలయంలో అధికారుల విచారణ
- ఉదయం నుంచి రాత్రి వరకూ కొనసాగిన తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌కమ్‌టాక్స్ అధికారులు

జగిత్యాల: భూ నిర్వాసితుల నష్ట పరిహారానికి సంబంధించి వడ్డీకి టీడీఎస్ (ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్) కట్ అవుతుంది. ఈ విషయంలో ఓ ప్రైవేటు ప్రాక్టీషనర్ ద్వారా ఆర్డీవో కార్యాలయం అధికారులు అవకతవకలకు పాల్పడినట్లు ఐటీ అధికారులు గుర్తించారు. ఈ మేరకు హైదరాబాద్ నుంచి వచ్చిన ఐటీ అధికారులు జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో గురువారం విచారణ చేపట్టారు. జిల్లామీదుగా వెళ్లే రైల్వేలైన్ కోసం భూసేకరణ చేపట్టారు. 2006లో సుమారు 300 మంది రైతులు భూమి కోల్పోయారు. వారికి పరిహారం కింద ప్రభుత్వం కొంతమేర చెల్లించింది. పరిహారం తక్కువగా ఉందంటూ రైతులు అప్పట్లోనే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పరిహారం పెంచుతూ వడ్డీతో సహా పూర్తిస్థాయిలో చెల్లించాలని 2019లో సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ అధికారులు పెంచిన పరిహారంతోపాటు వడ్డీ కలిపి డిపాజిట్ చేశారు. అయితే ఆ వడ్డీకి సంబంధించిన టీడీఎస్ విషయంలో అధికారులు ఓ ప్రైవేటు ప్రాక్టీషనర్‌తో చేతులు కలిపి అవకతవకలకు పాల్పడినట్లు తెలుస్తోంది. కొంతమంది రైతులకు పాన్‌కార్డు లేకపోవడంతో వచ్చిన వడ్డీలో 20 శాతం, పాన్‌కార్డు ఉన్న వారికి 10 శాతం టీడీఎస్ కట్ చేశారు. 20 శాతం కట్ అయిన రైతుల టీడీఎస్‌లో ప్రైవేటు ట్యాక్స్ ప్రాక్టీషనర్‌తో కలిసి ఇతరుల పాన్‌కార్డులు ఉపయోగించి స్వాహా చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు ఐటీ అధికారులు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విచారణ చేపట్టారు. కార్యాలయంలో ఉన్న అన్ని ఫైల్స్ పరిశీలించారు. జగిత్యాలలోని సంబంధిత ప్రైవేటు ప్రాక్టీషనర్‌ను పిలిపించి విచారించారు. ఇందులో సుమారు రూ.50 లక్షల వరకు అవకతవకలకు పాల్పడినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గతంలో భూనిర్వాసితుల టీడీఎస్ చెల్లింపుల విషయంలో ఐటీ అధికారులు విచారణ చేపడుతున్నట్లు ఆర్డీవో మధుసూదన్ తెలిపారు.

విద్యార్థులకు రవాణా భత్యం

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంజూరు
- ఉమ్మడి జిల్లాలో 1,776 మందికి రూ.1.06 కోట్లు


సైకిళ్లపై స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థినులు(ఫైల్)

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సర్కారు రవాణా భత్యం విడుదల చేసింది. ఒక గ్రామం నుంచి మరో గ్రామంలో ఉండే ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి చదువుకునేవారికి రాష్ట్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టం ప్రకారం రవాణా భత్యం విడుదల చేస్తోంది. ఉమ్మడి జిల్లాలోని 1,776మందికి ఈ పథకం కింద రూ.1.06 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ మొదటివారంలోగా రవాణాభత్యం అందించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు.

9,10 తరగతి విద్యార్థులకు వర్తింపు

దూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరంలో రవాణా భత్యం అందించేందుకు ఉపాధ్యాయులు ఇటీవల వివరాలు సేకరించారు. ఇది వరకు 1 నుంచి 8వ తరగతుల విద్యార్థులకు మాత్రమే రవాణా భత్యం వర్తింపజేశారు. వచ్చే ఏడాది నుంచి 9,10 తరగతులవారికి సైతం ఈ పథకాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వీరి వివరాలు సైతం సేకరించి ప్రతిపాదనలు పంపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థి ఇంటికి ప్రాథమిక పాఠశాల కిలోమీటరు దూరం, ప్రాథమికోన్నత పాఠశాల 3 కి.మీ, ఉన్నత పాఠశాల 5కి.మీ దూరంలో ఉంటే రవాణా భత్యం అందిస్తారు. ఆటోలు, తదితర ప్రైవేటు వాహనాల్లో విద్యాలయాలకు వచ్చి వెళ్లేందుకు ఈ భత్యాన్ని చెల్లిస్తారు. ఒకటి నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.600 చొప్పున పది నెలలపాటు రూ.6వేలు, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు సైతం ఇదే విధంగా వర్తింపజేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఈ డబ్బు విద్యార్థుల వ్యక్తిగత ఖాతాల్లో జమ అవుతుంది. ఈ మేరకు విద్యార్థి పూర్తి వివరాలు, బ్యాంకు ఖాతా సంఖ్య సమగ్రశిక్ష అభియాన్ ప్రాజెక్టు మండలి ఉన్నతాధికారులకు నివేదించారు.

రవాణా భత్యానికి అర్హులైన విద్యార్థులు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	నిధులు(రూ.లు)
కరీంనగర్	100	431	25,86,000
జగిత్యాల	46	272	16,32,000
పెద్దపల్లి	220	622	37,32,000
రాజన్నసిరిసిల్ల	150	451	27,06,000

క్లుప్తంగా

అభినందన



కళాకారులను అభినందిస్తున్న ఎస్ఈ, డీఈ

కొత్తపల్లి: హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన విద్యుత్ శాఖ కల్చరల్ కాంపిటీషన్‌లో బహుమతులు సాధించిన కళాకారులను గురువారం కరీంనగర్‌లోని ఎస్ఈ చాంబర్‌లో టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ ఎస్ఈ రమేశ్ బాబు అభినందించారు. అలాగే కళాకారులు రంగు వెంకటనారాయణ, కె.ఆనంద్, సరళకుమారిలను ఎస్ఏఓ రాజేంద్రప్రసాద్, డీఈ జంపాల రాజం, రమణారెడ్డి, పీవో బండారి చంద్రయ్య తదితరులు అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం

కరీంనగర్ టౌన్ సబ్ డివిజన్ పరిధిలోని టౌన్ 2, టౌన్ 9 సెక్షన్లలో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మేక రమేశ్‌బాబు ప్రారంభించారు. డీఈ జంపాల రాజం, ఏడీఈ ఎం.లావణ్య, ఏఈలు కె.మల్లయ్య, ఎస్.త్రిమూర్తి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ



కరీంనగర్‌టౌన్: ప్రపంచ తల గాయాల అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని రెనే హాస్పిటల్, ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్‌లో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ రోడ్డు ప్రమాదాల వల్ల తలకు బలమైన గాయాలు కావడం వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోవడం లేదా శాశ్వత అంగ వైకల్యంతో నిండు జీవితాలు కోల్పోవడం జరుగుతోందని అన్నారు. కేవలం హెల్మెట్ ధరించడం ద్వారా తలకు ఎటువంటి గాయాలు కాకుండా ఉండొచ్చని తెలియజేయాలనే ఉద్దేశంతోనే ర్యాలీ నిర్వహించినట్లు ఆసుపత్రి చైర్మన్ బంగారి స్వామి తెలిపారు. బైక్ ర్యాలీని ఏసీపీ వెంకటస్వామి ప్రారంభించారు. డాక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని, వన్ టౌన్, టూ టౌన్, త్రీటౌన్, ట్రాఫిక్ సీఐలు కోటేశ్, సృజన్ రెడ్డి, జాన్ రెడ్డి, సీఐ రమేశ్, వైద్యుల తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో నిరసన



కరీంనగర్: బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించడాన్ని నిరసిస్తూ గురువారం కరీంనగర్‌లోని కమాన్ చౌరస్తాలో ఏఐఎస్ఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, వెంకటేశ్, రమేశ్‌లు మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు ఏ మేరకు సరిపోవని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్, జిల్లా నాయకులు మచ్చ అభిలాష్, దాసరి అఖిల్, అక్షయ్ కుమార్, శివ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతులు దహనం



కరీంనగర్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి స్వల్ప నిధుల కేటాయింపును నిరసిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో బడ్జెట్ ప్రతులు దహనం చేశారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణాప్రతాప్ మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి స్వల్పనిధులు కేటాయించడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కాంసారపు రవితేజ, నాయకులు కొయ్యడ బాబు, ఎండీ అస్లాం, రమేశ్, అజయ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం రాజు

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ కరీంనగర్–2 డిపో మేనేజర్ మల్లయ్య, జగిత్యాల డిపో మేనేజర్ సునీతలు బదిలీపై వెళ్తున్న సందర్భంగా గురువారం కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు వారిని తన కార్యాలయంలో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులు సాధిస్తాం

- సమయం వృథా చేయం.. భవిష్యత్‌పై దృష్టిపెడతాం
- ఇంటర్ పరీక్షలు ముగిశాక కేంద్రాల వద్ద విద్యార్థుల ఆనందం



పరీక్ష కేంద్రం వద్ద విజయ సంకేతం చూపుతున్న ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): సంవత్సరం పాటు చదివిన చదువు.. ఆరు రోజులు టెన్షన్ పడుతూ.. ఉత్కంఠ మధ్య జరిగిన ఇంటర్ పబ్లిక్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. బుధవారం ఫస్ట్ ఇయర్ పరీక్షలు ముగియగా గురువారం సెకండ్ ఇయర్ పరీక్షలు ముగిశాయి. అనంతరం ఆయా సెంటర్‌ల ఎదుట ఆనందంతో రెక్కలు వచ్చిన పక్షుల్లా ఎగిరి గంతేశారు. తమతో పరీక్ష రాసిన వారిని పలికించారు. బైబై చెప్పుకున్నారు.. సెల్ఫీలు తీసుకున్నారు.. ఎక్కడో ఒక దగ్గర తప్పకుండా మళ్లీ కలుద్దాం అంటూ సంకేతాలిచ్చుకున్నారు. ఫోన్ నంబర్లు తీసుకున్నారు. ఇలా 2025 సంవత్సర ఇంటర్ పరీక్షలు ముగిశాయి. అయితే పరీక్షలు బాగా రాశాం.. ఉత్తమ మార్కులు సాధిస్తాం అంటూ వేసవి సెలవులు వృథా చేయకుండా భవిష్యత్‌పైనే దృష్టి పెడుతామన్నారు. మెయిన్స్ ప్రిపరేషన్ అంటూ కొందరు..ఎంసెట్ అంటూ మరికొందరు ఇలా ఎవరి అభిప్రాయాలను వారు వెలిబుచ్చారు.



పరీక్షలు ముగియడంతో ఫ్రెండ్స్‌తో ఒక సెల్ఫీ

హ్యాపీగా ఉంది



పరీక్షలు బాగా రాశా. హ్యాపీగా ఉంది. స్టేట్ లెవల్ మార్కులు వస్తాయి. సంవత్సరం పాటు టెన్షన్‌లోనే ఉన్నాం. ఇప్పుడు రిలాక్స్ అయింది. ఇక ఈ హాలిడేస్‌లో సెకండ్ ఇయర్ ప్రిపరేషన్ అవుతా. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని ఉంది.

– మట్టా నివ్యా రెడ్డి, ఫస్ట్ ఇయర్, ఎంపీసీ

పరీక్షలు బాగా రాశా...



ఇంటర్ పరీక్షలు అనగానే మాలో టెన్షన్ ఉండేది. ఫస్ట్ ఎగ్జామ్ కాగానే టెన్షన్ పోయింది. పరీక్షలన్నీ చాలా హ్యాపీగా జరిగాయి. మంచి మార్కులు సాధిస్తా. హాలిడేస్‌లో టైం వేస్ట్ చేయకుండా సెకండ్ ఇయర్ ప్రిపరేషన్ స్టార్ట్ చేస్తా.

– తాడూరి ఆర్తి, ఫస్ట్ ఇయర్, ఎంపీసీ

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..



ఫ్యూచర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనేది నా కోరిక. ఇప్పటి నుంచే బాగా చదువుతున్న. ఫస్ట్ ఇయర్‌లో 465 మార్కుల సాధించా. ఇప్పుడు కూడా స్టేట్ లెవల్ మార్కులు వస్తాయి అని అనుకుంటున్న. సమ్మర్ హాలిడేస్‌లో కూడా ఎంసెట్, మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతా.

– కె మానస, సెకండ్ ఇయర్, ఎంపీసీ

స్టేట్ లెవల్ ర్యాంక్ వస్తుంది



టెన్త్‌లో టెన్ జీపీఏ సాధించా. ఇప్పుడు ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో కూడా స్టేట్ లెవల్ ర్యాంక్ వచ్చేలా పరీక్షలు రాశా. లాంగ్వేజ్ మినహా అన్నింట్లో బైకిబై వస్తాయి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనేది నా ఆశయం.

– బిజా, ఫస్ట్ ఇయర్, ఎంపీసీ

డాక్టర్ కావాలనేది నా కోరిక



డాక్టర్ కావాలనేది నా కోరిక. డాక్టర్ అయి సమాజ సేవ చేయాలని బైపీసీ తీసుకున్న. ఫస్ట్ ఇయర్‌లో 408 మార్కులు వచ్చాయి. సెకండ్ ఇయర్ కలిపి సుమారుగా 950కి పైగా వస్తాయి. కార్డియాలజిస్ట్ నా గోల్.

– టి స్మిత, సెకండ్ ఇయర్, బైపీసీ

సివిల్స్ నా గోల్



సీఈసీ గ్రూప్ తీసుకున్న. ఫస్ట్ ఇయర్‌లో 494 మార్కులు సాధించా. సెకండ్ ఇయర్‌లో 495 మార్కులకు పైగా సాధిస్తా. సివిల్స్‌లో ర్యాంక్ సాధించాలనేది నా గోల్. చిన్నప్పటి నుంచే సివిల్స్ చదవాలనేది నా కోరిక. అందుకు తగ్గట్టుగా ప్రిపేర్ అవుతా.

– నిఖిత, సెకండ్ ఇయర్, సీఈసీ

సభ ఏర్పాట్లు పరిశీలన



పరిశీలిస్తున్న గంగుల కమలాకర్

కరీంనగర్: కరీంనగర్‌లో ఈనెల 23న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుల పర్యటన నేపథ్యంలో నగరంలోని కేఎస్ఎల్ ఫంక్షన్ హాల్‌లో సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌లతో కలిసి గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరిశీలించారు. వీరి వెంట కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్ర రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, కొత్తపల్లి మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, మాజీ కార్పొరేటర్లు జంగిలి ఐలేందర్ యాదవ్, దిండిగాల మహేష్, గందె మహేశ్, సాగర్, బాలయ్యలు ఉన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్: యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 27న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాలను గురువారం కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గణేశ్, జిల్లా కమిటీ సభ్యులు సంపత్, అభిలాష్, ఉమామహేశ్వర్, గణేశ్, కళ్యాణ్, జీవన్, అభిలాష్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్/కొత్తపల్లి/కరీంనగర్‌రూరల్: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ భూమిపూజ చేశారు. 21వ డివిజన్ సీతారాంపూర్‌లో రూ.40లక్షలతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులు, కొత్తపల్లి మండలం ఖాజీపూర్ నుంచి బిలవోనిపల్లె వరకు రూ.4.5 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు పనులు, రూ.1.50కోట్లతో గోపాల్‌పూర్‌లో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్క రూపాయి అయినా నిధులు తెచ్చారా అని కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. మెరుగైన రవాణా కోసం చేపడుతున్న రోడ్ల పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మధు, మాజీ కార్పొరేటర్‌లు జంగిలి సాగర్, వంగపల్లి రాజేందర్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్



మాట్లాడుతున్న ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ రామకృష్ణ

కరీంనగర్‌సిటీ: వికసిత్ భారత్‌లో యువత భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎస్ఆర్ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కాలేజీలో గురువారం భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాల వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేషనల్ యూత్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటరాంబాబు మాట్లాడుతూ వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో ఈ నోడల్ కళాశాల విద్యార్థులకు లభించిన అపురూపమ అవకాశం అన్నారు. శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మనోహర్ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి ఉంటేనే విజయం సాధించవచ్చని సందేశమిచ్చారు. జ్యూరీమెంబర్ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు కె.మురళి, వికసిత్ భారత్ నోడల్ జిల్లా అధికారి ఎలిజబెత్ రాణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, టి. రాజయ్య , స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ మల్లారం శ్రీనివాసరెడ్డి ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కాంపల్లి అర్జున్, రాజేశం, పడాల తిరుపతి, రాపర్తి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు .

మందకృష్ణ మాటలు నమ్మొద్దు



మాట్లాడుతున్న ఆరెపల్లి మోహన్

కరీంనగర్ కార్పొరేషన్: ఎస్సీ వర్గీకరణపై మందకృష్ణ మాటలను మాదిగలు నమ్మొద్దని మాజీ విప్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆరెపల్లి మోహన్ అన్నారు. గురువారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో ఏ వర్గానికి నష్టం వాటిల్లదన్నారు. రాష్ట్రంలో నాలుగు జాతులు మాల, మాదిగ, నేతకాని, బుడగజంగాలు అన్ని రంగాల్లో ముందున్నాయని తెలిపారు. బీజేపీ వర్గీకరణ చేయకపోతే, కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ చేసిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి, బహుజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు మారంపల్లి లక్ష్మీనారాయణ, నాయకులు కాడె శంకర్, సముద్రాల అజయ్, గాలి అనిల్‌కుమార్, జీడీ రమేష్, పోతారపు సురేందర్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు స్మార్ట్ సిటీ బోర్డు సమావేశం

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ బోర్డ్ సమావేశం శుక్రవారం హైదరాబాదులో జరగనుంది. స్మార్ట్ సిటీ బోర్డ్ సభ్యులు పాల్గొనే సమావేశానికి సభ్యులైన ప్రత్యేక అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి, కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్, ఇంజినీరింగ్ అధికారులు హాజరు కానున్నారు. స్మార్ట్ సిటీ పనుల గడువు ఈనెల 31వ తేదీతో ముగియనున్న క్రమంలో మీటింగ్‌కు ప్రాధాన్యత ఏర్పడింది.

నేడు ఆర్గానిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎక్స్‌పో

కరీంనగర్ కార్పొరేషన్: స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆర్గానిక్ బల్క్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉ.10 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ ఎక్స్‌పోలో హోటల్స్, రెస్టారెంట్స్, ఫంక్షన్‌హాల్స్, ఆర్గనైజేషన్స్, ఇనిస్టిట్యూషన్స్, అపార్ట్‌మెంట్ల నిర్వాహకులు పాల్గొనాలన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ కరీంనగర్–1 పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ విజయమాధురి తెలిపారు. 1 డిపో పరిధిలోని కరీంనగర్, మానకొండూర్, ఇల్లంతకుంట, బెజ్జంకి, జమ్మికుంట మండలాల ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు, సూచనలను 81219 93780 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని కోరారు.

'అచీవర్స్' విద్యార్థుల ప్రతిభ



కరీంనగర్: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్ఆర్ఎఫ్ ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో కరీంనగర్‌లోని అచీవర్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పి.నిధి, ఎన్.కార్తికేయలు తెలంగాణ, ఏపీ ఐటీ కమిషనర్ జీవన్ లాల్, ఎస్ఆర్ఎఫ్ ఒలింపియడ్ ఫౌండర్ తుమ్మ అమరేశ్‌ల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

యువతను నిరాశపరిచిన రాష్ట్ర బడ్జెట్



నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

కరీంనగర్: శాసనసభలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ యువతను నిరాశపర్చిందని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి అన్నారు. గురువారం డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ప్రధాన డిమాండ్‌గా ఉన్న నిరుద్యోగ భృతి పదమే ఊసెత్తకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి షెడ్యూల్ ప్రకారం నోటిఫికేషన్ వేయడం లేదని తెలిపారు. గిరిజన సంఘం నగర కార్యదర్శి రవీందర్ నాయక్, డీవైఎఫ్ఐ నాయకులు భూమేశ్, వెంకటేశ్, శివరాజ్, అరవింద్, శ్రావణ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కరీంనగర్: రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ ప్రాధాన్యం ఇస్తూ కేటాయించిన బడ్జెట్‌ను నిరసిస్తూ గురువారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలు దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పూర్తిగా విద్యారంగాన్ని విస్మరిస్తున్న పరిస్థితి కనిపిస్తుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఆసంపల్లి వినయ్ సాగర్, సహాయ కార్యదర్శి ఇషాక్క, దుర్గం బొగేశ్వర్ జిల్లా కమిటీ సభ్యులు రత్నం సురేశ్, తిప్పరపు రోహిత్, సందేశ్, రాకేశ్, మానస, నాయకులు అక్షయ్, విష్ణు, అజయ్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధానంలో సమూల మార్పులు జరగాలి

కరీంనగర్‌టౌన్: భారతదేశ ఎన్నికల విధానంలో ఒకే దేశం ఒకే ఎన్నిక (జమిలి ఎన్నికలు) విధానం అత్యావసరమని నగర పశ్చిమ జోన్ వన్ నేషన్, వన్ ఎలక్షన్ వర్క్‌షాప్ కన్వీనర్ నరహరి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం బీజేపీ జిల్లా కార్యాలయంలో నగర పశ్చిమ జోన్ పరిధిలోని డివిజన్ల రాష్ట్ర, జిల్లా, జోన్ల బీజేపీ నాయకులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులతో జరిగిన వన్ నేషన్ వన్ ఎలక్షన్ వర్క్‌షాప్‌లో మాట్లాడారు. పార్లమెంట్, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఎన్నికల ఖర్చు బాగా తగ్గుతుందని అన్నారు. ఈ సమావేశంలో సాయిని మల్లేశం, దుబాల శ్రీనివాస్, జాడి బాల్‌రెడ్డి, బండ రమణారెడ్డి, ఎన్నం ప్రకాశ్, వాసు, ఎలకపల్లి రమేశ్, తిరుమల్ రెడ్డి, ప్రసన్నారెడ్డి, సిద్ధి సంపత్, ఉప్పరపల్లి శ్రీనివాస్, పర్వత మల్లేశం, కర్ర ప్రభాకర్‌రెడ్డి, నరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత బకాయిలు వెంటనే చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న అజయ్, రాజు

కరీంనగర్‌రూరల్: ఉపాధిహామీ కూలీలకు పాత బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కవ్వంపల్లి అజయ్, వడ్ల రాజు డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్ మండలం జూబ్లీనగర్‌లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి మాట్లాడారు. కూలీలు పనిచేసే ప్రాంతాల్లో తాగునీరు, మెడికల్ కిట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న కలెక్టరేట్ ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు. ఉపాధికూలీలందరూ పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంజయ్య, మల్లయ్య, రాములు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువ ఉత్సవ్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: తిమ్మాపూర్‌లో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన యువ ఉత్సవ్ 2024–25 జిల్లాస్థాయి విభాగంలో నగునూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించారు. నాట్య ప్రదర్శనలో జి.సమత బృందం మొదటి బహుమతి, పెయింటింగ్ విభాగంలో పి.శ్రీజ మొదటి బహుమతి, పి.పార్థవి తృతీయ బహుమతతో పాటు ప్రశంసాపత్రాలను కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా అందుకున్నారు. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ టి.మాలతి, వైస్ ప్రిన్సిపాల్ సమత, సూపరింటెండెంట్ సురేశ్‌కుమార్, అధ్యాపకులు పద్మజ, రాధిక, వెంకటేశ్వర్లు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బల్దియా ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఊరట

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఊరట లభించింది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌ల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సీడీఎంఏ తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ సర్క్యులర్ జారీ చేశారు. దీంతో పాత పద్ధతిలోనే ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు అందనున్నాయి.

సర్వే రెమ్యూనరేషన్ చెల్లించేలా చొరవ చూపాలి

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేలో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్‌ను చెల్లించేలా చొరవ చూపాలని కోరుతూ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మండల ఆనందం, కనకయ్య, కాంతయ్యలు గురువారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉచిత థైరాయిడ్ వైద్యశిబిరం

కరీంనగర్‌టౌన్: నగరంలోని వాసుదేవ ఆస్పత్రిలో గురువారం తెలంగాణ శ్రీనివాసుల సేవా సమితి, అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, వాసుదేవ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత థైరాయిడ్ వైద్యశిబిరం నిర్వహించారు. 150 మందికి థైరాయిడ్ పరీక్షలు చేశారు.

పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

కరీంనగర్: ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించి రక్షణ కల్పించాలని బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ అన్నారు. గురువారం బీకేఎంయూ ఆధ్వర్యంలో డీఆర్‌డీవో శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎగుర్ల మల్లేశం, నాయకులు నల్లగొండ శ్రీనివాస్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి

కరీంనగర్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి చూపించిందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం రమేశ్ అన్నారు. గురువారం సంఘం కార్యాలయంలో జరిగిన పీడీఎస్‌యూ నగర కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. నాయకులు జీవన్, కళ్యాణ్, నవీన్, అనిల్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరేయాలి

కరీంనగర్‌టౌన్: రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కరీంనగర్‌లో కాషాయ జండా ఎగరేయాలని, అందుకు ప్రతీ కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని ఈస్ట్ జోన్ అధ్యక్షుడు ఆవుదుర్తి శ్రీనివాస్ అన్నారు. ఈనెల 21న ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో జరుగనున్న నగర సమావేశాన్ని విజయవంతం చేసేందుకు గురువారం కోతిరాంపూర్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. బీజేపీ నాయకులు వాసాల రమేశ్, గుగ్గిళ్ల రమేశ్, శివనంద్, దూబాల శ్రీనివాస్, కళ్యాణ్‌చంద్ర, గొట్టె వెంకటరమణ, గణేశ్, వేణు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్ బండ్‌పై తానూ నాయక్ విగ్రహాన్ని పెట్టాలి

కరీంనగర్: ట్యాంక్ బండ్‌పై తానూ నాయక్ విగ్రహాన్ని పెట్టాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోడ మోహన్ నాయక్, బీమాసాహెబ్‌లు అన్నారు. తానూ నాయక్ వర్ధంతి సందర్భంగా గురువారం సంఘ కార్యాలయంలో తానూ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలంగాణ గిరిజన సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తానూ నాయక్ ఆశయ సాధనకు ఉద్యమించండి

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు తానూ నాయక్ ఆశయ సాధన కోసం ఉద్యమించాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు గుగులోతు రాజు అన్నారు. తానూ నాయక్ 75వ వర్ధంతి సందర్భంగా గురువారం కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తానూ నాయక్ చిత్రపటానికి పూజమాలలు వేసి నివాళి అర్పించారు. కొత్తపల్లి మాజీ ఎంపీపీ భూక్యా తిరుపతినాయక్, జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మెంబర్ లకావత్ రవి, షెడ్యూల్ తెగల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు రాములు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సునావత్ నరసింహ, గిరిజన సంఘాల నాయకులు భాస్కర్, శ్రీను హాతిరాం పాల్గొన్నారు.

పురుగుమందుల వినియోగంపై అవగాహన

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో గురువారం డబ్ల్యూడబ్ల్యూఎఫ్ నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ బీసీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పురుగుల మందుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బీసీఐ అసిస్టెంట్ మేనేజరు మాధవి, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్, వనితతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం: కట్టరాంపూర్‌కు చెందిన జింకటి స్వామి (38) గురువారం అనారోగ్యంతో మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ బిళ్ల కోటేశ్వర్ తెలిపారు. కార్ డ్రైవింగ్ చేసుకుంటూ జీవిస్తున్న జింకటి స్వామి భార్య సుశ్మిత రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించింది. కొన్ని రోజులుగా కట్టరాంపూర్‌లోని ప్రభుత్వ ఆశ్రమంలో ఉంటూ మద్యానికి బానిసై రోజూ తాగేవాడన్నారు. గురువారం అంబేడ్కర్ స్టేడియం వద్ద ఫిట్స్ వచ్చి మృతిచెందగా మృతుడి సోదరుడు రాజేంద్రప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జై సంవిధాన్ కోఆర్డినేటర్‌గా అంజన్ కుమార్

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



● ఆర్ట్ అండ్ కల్చర్

రోహిట్

చిన్నప్పటి నుంచి టీవీల్లో డ్యాన్స్ షోలు చూస్తూ డాన్సర్ కావాలనుకునేవాడు రోహిత్ సరాఫ్. వెండితెరపై కుమారుడిని చూడాలని కలలు కనేవాడు అతడి తండ్రి. అయితే తన కల నెరవేరే భాగ్యాన్ని చూడలేదు. రోహిత్ పన్నెండేళ్ల ఉన్నప్పుడు తండ్రి చనిపోయాడు.

'నాన్న ఆత్మకు శాంతి చేకూరాలంటే నేను నటుడిని కావాల్సిందే' అని బలంగా డిసైడైపోయాడు రోహిత్.

దిల్లీ నుంచి ముంబైకి వచ్చిన సరాఫ్ ఒక టీవీ చానల్ యూత్ షోకు హాజరయ్యాడు. కెమెరా ముందుకు రావడం కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లుగా అనిపించింది.

'బాగా కష్టపడితేగానీ ఇక్కడ నెగ్గుకు రాలేం' అనుకున్నాడు. మొదటి సంవత్సరం రెండు టీవీ షోలలో నటించే అవకాశం వచ్చింది. ఆ తరువాత యాడ్స్‌లో, ఒక సినిమాలో అవకాశం వచ్చింది.

అయితే...తొలి సినిమా షూట్ చేసిన రెండున్నరేళ్ల తరువాత అది ఆగిపోయిందని తెలుసుకున్నాడు. బాగా నిరాశకు గురయ్యాడు. ఆడిషన్స్‌కు కూడా వెళ్లేవాడు కాదు. దీంతో ఎవరి నుంచి పిలుపు వచ్చేది కాదు. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు. ఆ చీకటి రోజులలో 'ఇలా అయితే ఎలా?' అని తనకు తానే ప్రశ్న వేసుకున్నాడు. మళ్లీ కష్టపడాలని గట్టిగా అనుకున్నాడు. 'ప్రతిరోజూ కొండంత ధైర్యంతో, కోటి కలలతో నిద్ర లేవాలి అనుకున్నాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకున్నాడు.

డియర్ జిందగీ, హిచ్కీ, ది స్కై ఈజ్ పింక్‌లాంటి చిత్రాల్లో అవకాశాలు వచ్చాయి. 'యస్...నాకు భవిష్యత్తు ఉంది' అనే ఆశాకిరణం ఉజ్వలంగా మెరిసింది. నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'మిస్‌మ్యాచ్‌డ్' తన కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అయింది. ప్రస్తుతం మణిరత్నం-కమల్‌హాసన్ సినిమాలో, ధర్మ ప్రొడక్షన్స్‌లాంటి పెద్ద సంస్థ సినిమాలో నటిస్తున్నాడు. 'కలలు అనేవి పిరికి వాళ్ల కోసం కాదు. ధైర్యంగా ఉండే వ్యక్తుల కోసమే' అంటున్న 28 సంవత్సరాల రోహిత్ సరాఫ్ ఫోర్బ్స్ ఇండియా '30 అండర్ 30' జాబితాలో చోటు సాధించాడు.

ఏకాగ్రత పెరుగుతుంది

చదువు అనేది మహా సముద్రం లాంటిది. మనం నేర్చుకోవడానికి ఎన్నో ఉన్నాయి. మనం ఎప్పుడూ నిత్య విద్యార్థిగా ఉండాలి' క్లాసురూమ్‌లో విన్న ఇలాంటి మాటలు ఎప్పటికప్పుడు కొత్త కోర్సులు నేర్చుకునేలా చేసింది. కొత్త కోర్సులు చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. ఐఏఎస్ చేయాలనేది నా లక్ష్యం.

- బి. ప్రవల్లిక



175 ఆన్‌లైన్ కోర్సులు
నాన్‌స్టాప్ లెర్నర్

పది విషయాలు నేర్చుకున్నప్పుడు కూడా... నేర్చుకోవడానికి మరో పది విషయాలు రెడీగా ఉంటాయి. 'నేర్చుకోవడానికి నేను రెడీ' అనుకుంటే మీరే విజేత. అలాంటి ఒక విజేత... బి. ప్రవల్లిక. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 175 ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేసి 'భౌరా' అనిపించింది...

విశాఖ జిల్లా భీమిలిలోని 'కస్తూర్బా గాంధీ విద్యాలయం'లో పదవ తరగతి చదువుతున్న బి. ప్రవల్లిక చదువులో ముందుండడమే కాకుండా పలు కోర్సులలో విశేష ప్రతిభ చూపుతూ ప్రశంసలు అందుకుంటోంది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి చెందిన ప్రవల్లిక తండ్రి కోవిడ్ వల్ల చనిపోయారు. తల్లి ప్రైవేటు కంపెనీలో పని చేస్తోంది.



ఆన్‌లైన్ కోర్సుల హవా...

గతంలో సమగ్ర శిక్ష అభియాన్‌ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా పని చేసిన బి.శ్రీనివాసరావు ఇక్కడి విద్యార్థినులు ఆధునిక కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్తులో వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో ఇన్ఫోసిస్ వారి సహకారాన్ని తీసుకున్నారు. కోర్సుల కోసం 20 మందిని ఎంపిక చేశారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం ద్వారా కోర్సులను ఎంపిక చేసుకోవలసి ఉంటుంది. ఎంపిక చేసుకున్న కోర్సులకు సంబంధించిన సమాచారం, సూచనలు అందిస్తారు. ఆ తరువాత ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్షల్లో పాల్గొనాలి. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటాబేస్, డ్రోన్... మొదలైన వాటితోపాటు మొత్తం 175 కోర్సులు పూర్తి చేసింది ప్రవల్లిక. కోర్సును బట్టి కొన్ని గంటలు లేదా ఒకటి, రెండు రోజుల్లో నేర్చుకుని పరీక్షల్లో పాల్గొంటూ మంచి మార్కులు పొందుతూ సర్టిఫికెట్లు సాధించింది.

నాడు... నేడు

గత ప్రభుత్వ హయాంలో జరిగిన 'నాడు-నేడు' పనుల ద్వారా ఎన్నో సదుపాయాలు అందుబాటులోకి రావడం వల్ల ఆన్‌లైన్ కోర్సుల అభ్యసనకు వీలు కలిగింది. రూ. 51 లక్షలతో అదనపు గదులు, విద్యార్థినులు ప్రశాంతంగా చదువుకోవడానికి పెద్ద షెడ్డు, అవసరమైన ఇతర సదుపాయాల కల్పన జరిగింది.

'ఆసక్తి ఉన్నచోటే ప్రతిభ ఉంటుంది. ప్రవల్లికకు కొత్త విషయాలపై ఎంతో ఆసక్తి ఉంది. ఆ ఆసక్తే ఆమెను 175 కోర్సులు పూర్తి చేసేలా చేసింది. భవిష్యత్తులో తన చదువుకు ఈ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయి. 175 కోర్సులు పూర్తి చేయడం అనేది ఆమెకే కాదు విద్యాలయానికి గర్వకారణం' అంటుంది కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగా కుమారి.

టార్గెట్... ఐఏఎస్

ఎంతోమంది ఐఏఎస్ అధికారుల విజయగాథలను క్లాస్ రూమ్‌లో వింటున్నప్పుడు ప్రవల్లిక మదిలో 'ఐఏఎస్' కలకు బీజం పడింది. 'లక్ష్యసాధనకు మన ఆర్థిక స్థితిగతులతో పని లేదు. కడు పేదరికంలో పుట్టిన వారు కూడా ఎంతో కష్టపడి తమ లక్ష్యాన్ని నెరవేర్చుకున్నారు. మనకు కావాల్సింది సాధించాలనే పట్టుదల మాత్రమే'... ఇలాంటి మాటలు ఎన్నో ప్రవల్లికకు స్ఫూర్తినిచ్చి 'ఐఏఎస్' లక్ష్యానికి బలాన్ని ఇచ్చాయి.

– సింగారెడ్డి రమణప్రసాద్, సాక్షి, భీమిలి

● టెక్... టాక్



షావోమీ 15 అల్ట్రా

డిస్‌ప్లే: 6.73 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్/512జీబి 16జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 15
ఫ్రంట్ కెమెరా: 32ఎంపీ
బ్యాటరీ: 5410 ఎంఏహెచ్
రిజల్యూషన్: 1440x3200 పిక్సెల్స్



షావోమీ ప్యాడ్ 7 ప్రో

హైట్: 251.22 ఎంఎం : విడ్త్:173.42 ఎంఎం
బరువు: 500 గ్రా. స్క్రీన్ సైజ్: 11.2
రిఫ్రెష్ రేట్: 144 హెచ్‌జడ్
వోఎస్: షావోమీ హైపర్ వోఎస్ 2
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ
బ్యాటరీ: 8850 ఎంఏహెచ్
కలర్స్: గ్రే, బ్లూ, గ్రీన్

గెలాక్సీ ఏ సిరీస్

శాంసంగ్ తన పాపులర్ గెలాక్సీ ఏ సిరీస్ కోసం మూడు కొత్త డివైజ్‌లను యాడ్ చేసింది. అవి: గెలాక్సీ ఏ 56, గెలాక్సీ ఏ 36, గెలాక్సీ ఏ26. గెలాక్సీ ఏబని మరింత యాక్సెస్ చేసే లేటెస్ట్ మిడ్ రేంజ్ శాంసంగ్ స్మార్ట్‌ఫోన్‌లు ఇవి.
గెలాక్సీ ఏ56
8జీబి ర్యామ్: 128 జీబి స్టోరేజ్
గెలాక్సీ ఏ 36 : 8జీబి ర్యామ్: 128 జీబి స్టోరేజ్



మెరుపు వీరుడు

● గేమింగ్

'కొండలు, కోనలు మనకి అడ్డంకి కాదు' అనుకునే సాహసికులకు స్వాగతం పలికే గేమ్ ఇది.

మిస్టీరియస్ పాయింట్స్‌ను అవగాహన చేసుకుంటూ అనుభవజ్ఞానాన్ని సొంతం చేసుకునే సాధకులకు దారి చూపే గేమ్ ఇది.
గెరిల్లా యుద్ధంలో రాటు తేలిన యోధులకు వీర తిలకం దిద్దే గేమ్ ఇది. యాక్షన్ రోల్-ప్లేయింగ్ గేమ్ అసాసిన్స్ క్రీడ్ షాడోస్ విడుదల అయింది. అసాసిన్స్ క్రీడ్ సిరీస్‌లో వస్తున్న 14వ మేజర్ ఇన్‌స్టాల్‌మెంట్ ఇది. 16వ శతాబ్దంలో సెంగోకు కాలానికి చెందిన కథ నేపథ్యంలో రూపొందించిన ఈ గేమ్‌లో జపాన్ అంతర్యుద్ధ సంఘటనలు కనిపిస్తాయి. తన శక్తియుక్తులతో టకేడా వంశంపై విజయం సాధిస్తాడు ఓడా నోబునాగా. ఒళ్లు గగుర్పొడిచే యుద్ధాలే కాదు నిలువెత్తు కోటలు, అలంకరించబడిన వాస్తు శిల్పాలు, సందడిగా ఉండే ఓడరేవులు... మొదలైనవి ఎన్నో ఈ ఆటలో కనిపిస్తాయి. రకరకాల మిషన్‌ల ద్వారా వివిధ క్యారెక్టర్‌లకు మారే అవకాశం ప్లేయర్స్‌కు ఉంటుంది. సరికొత్త ఫీచర్‌లతో ప్లేయర్స్‌కు సినిమాటిక్ ఫైటింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది.

సిరీస్: అసాసిన్స్ క్రీడ్
మోడ్స్: సింగిల్-ప్లేయర్
ప్లాట్‌ఫామ్: ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్/ మాక్ వోఎస్/ఐపాడ్ వోఎస్
జానర్స్: యాక్షన్ రోల్-ప్లేయింగ్



● ఇడియమ్స్

చ్యూ ద కడ్
ఒక విషయం లేదా సంఘటనకు సంబంధించి లోతుగా ఆలోచించడం, విశ్లేషించడానికి సంబంధించి వాడే మాట... చ్యూ ద కడ్. **ఉదా:** ఆఫ్టర్ దీ మీటింగ్, శ్రీను టుక్ టైమ్ టు చ్యూ ద కడ్ ఆన్ దెయిర్ న్యూ ప్రాజెక్ట్ ప్రపోజల్



ఫోమ్ ఎట్ ద మౌత్
తట్టుకోలేని కోపం, అసహనానికి గురయ్యే సందర్భంలో వాడే మాట... ఫోమ్ ఎట్ ద మౌత్.
ఉదా: ది సీయివో బిగెన్ టు ఫోమ్ ఎట్ ద మౌత్ వెన్ హీ డిస్కవర్‌డ్ ది ఫైనాన్సియల్ లాసెస్.

సాక్షి సినిమా

ధమ ధమ ధమ విశ్వలింగ...


● మోహన్ బాబు

విష్ణు మంచు హీరోగా నటించిన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్‌బాబు, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ ఇతర కీలక పాత్రలు పోషించారు. మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ మూవీ ఏప్రిల్ 25న విడుదల కానుంది. కాగా మార్చి 19న మోహన్‌బాబు పుట్టినరోజు. ఈ సందర్భంగా 'కన్నప్ప'లో మోహన్‌బాబు చేసిన మహదేవ శాస్త్రి పాత్ర పరిచయ గీతానికి సంబంధించిన గ్లింప్స్ విడుదల చేశారు. 'ధమ ధమ ధమ విశ్వలింగ... ధిమి ధిమి ధిమి విశ్వ లింగ....' అంటూ ఈ పాట సాగుతుంది. స్టీఫెన్ దేవస్సీ స్వరపరిచిన ఈ పాటకు సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించగా శంకర్ మహదేవన్ ఆలపించారు.

నా హృదయం నిండిపోయింది

- చిరంజీవి



''హౌస్ ఆఫ్ కామన్స్-యుకె పార్లమెంట్‌లోని కొందరు పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, అండర్ సెక్రటరీలు, దౌత్యవేత్తలచే గౌరవించబడటం గౌరవంగా భావిస్తున్నాను. నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది'' అని హీరో చిరంజీవి తెలిపారు. నాలుగున్నర దశాబ్దాలుగా కళారంగానికి, సమాజానికి చిరంజీవి చేసిన సేవలకుగానూ యుకె పార్లమెంట్ హౌస్ ఆఫ్ కామన్స్‌లోని కొందరు ఎంపీలు, మంత్రుల చేతులమీదుగా ఈ నెల 19న(బుధవారం) చిరంజీవికి గౌరవ సత్కారం జరిగింది. అలాగే సినిమా, ప్రజాసేవ, దాతృత్వానికి ఆయన చేసిన కృషిని గుర్తించిన యూకేకి చెందిన 'బ్రిడ్జి ఇండియా' అనే సంస్థ తొలిసారి అందించిన 'జీవిత సాఫల్య పురస్కారం' కూడా అందుకున్నారు చిరంజీవి. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ-''మాటలు సరిపోవు. అద్భుతమైన ప్రేమాభిమానాలను చూపించే అభిమానులు, రక్త దాతలు, నా సినీ కుటుంబం, శ్రేయోభిలాషులు, స్నేహితులు, నా కుటుంబ సభ్యులు, నా ప్రయాణంలో ఎంతగానో సహకరించిన వారు, నేను మానవతా దృక్పథంతో చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొన్న వారందరికీ థ్యాంక్స్. ఈ గౌరవం నన్ను మరింత ఉత్సాహంతో పని చేయడానికి ప్రేరేపిస్తుంది'' అన్నారు.


● శిరీష్, హర్షిత్, 'దిల్' రాజు, హనీఫ్, హర్షిత, సునీత

మల్టీస్టారర్‌కి శ్రీకారం

ప్రముఖ నిర్మాత 'దిల్' రాజు 'మార్కో' మూవీ చిత్ర దర్శకుడు హనీఫ్ అదేనితో ఓ మల్టీస్టారర్ మూవీకి శ్రీకారం చుట్టారు. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించనున్న ఈ కొత్త చిత్రాన్ని గురువారం ప్రకటించారు. ''మలయాళంలో బ్లాక్ బస్టర్ అయిన 'మార్కో'తో దర్శకుడు హనీఫ్ అదేని పేరు బాగా ట్రెండ్ అయింది. అలాంటి ఓ క్రేజీ డైరెక్టర్‌తో హై బడ్జెట్‌తో పాన్ ఇండియా మల్టీస్టారర్ ఫిల్మ్‌ని ప్రకటించడం సంతోషంగా ఉంది. ఈ మూవీతో హనీఫ్ తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్నారు. గురు ఫిల్మ్స్ సునీత తాటి ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామి అయ్యారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు.

భాగ్యనగరం అంతా మనదే మనదే...


● వైష్ణవీ చైతన్య, సిద్ధు జొన్నలగడ్డ

''ఈ పనిని ఇలానే ఎందుకు చేయాలి? మరోలా చేస్తానని కొందరు అంటుంటారు. అలాంటివాళ్లని క్రాక్ అంటుంటాం. 'జాక్: కొంచెం క్రాక్' రైమింగ్‌తో పాటు హీరో క్యారక్టరైజేషన్ కూడా ఈ సినిమాకు ఈ టైటిల్ పెట్టడానికి కారణం అయ్యింది. ఈ సినిమాలో ప్రేక్షకులను నవ్విస్తూనే, బాధ్యతగా ఉండే పాత్రలో కనిపిస్తాను'' అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'జాక్: కొంచెం క్రాక్'. వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బి. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'కిస్' పాట లిరికల్ వీడియోను గురువారం రిలీజ్ చేశారు మేకర్స్. 'భాగ్యనగరం అంతా మనదే మనదే...' అంటూ ఈ 'కిస్' సాంగ్ సాగుతుంది. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ- ''ఈ సినిమాలోని హీరో క్యారెక్టరైజేషన్ గురించి భాస్కర్‌గారు చెప్పగానే ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నాను. నేనూ ఓ రైటర్‌ని కాబట్టి కొన్ని ఇన్‌పుట్స్ ఇచ్చాను. భాస్కర్‌గారు ఆయన కథకు అనుగుణంగా డెవలప్ చేశారు'' అన్నారు. ''సిద్ధు యూత్‌కి మాత్రమే కాదు అన్ని ఏజ్‌ల వారికీ స్టార్ బాయ్‌గా మారారు. 'జాక్' సినిమాను భాస్కర్ చాలా చక్కగా హ్యాండిల్ చేశాడు'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్. ఈ చిత్రం పాటల రచయిత సనారె, మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడారు.


● సత్య యాదు, రామ్‌గోపాల్ వర్మ, ఆరాధ్య, గిరి కృష్ణకమల్

శారీ చూశాక అమ్మాయిలు జాగ్రత్త పడతారు

- రామ్‌గోపాల్ వర్మ

''సోషల్ మీడియాలో వ్యక్తిగత విషయాలు షేర్ చేసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది? అనే నేపథ్యంలో 'శారీ' రూపొందింది. నేనీ చిత్రానికి మూల కథ రాశాను. గిరి కృష్ణకమల్ దర్శకత్వం వహించాడు. 'శారీ'లో సందేశం ఉంటుందని చెప్పను గానీ, ఈ సినిమా చూశాక అమ్మాయిలు జాగ్రత్త పడతారు'' అని రామ్‌గోపాల్ వర్మ చెప్పారు. సత్య యాదు, ఆరాధ్యా దేవి ప్రధాన పాత్రల్లో గిరి కృష్ణ కమల్ దర్శకత్వం వహించిన చిత్రం 'శారీ'. ఆర్జీవీ, ఆర్వీ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై రవిశంకర్ వర్మ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 4న తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ- ''రాజకీయాలు, సినిమాలు వేర్వేరు. ఆంధ్రప్రదేశ్‌లో మా సినిమాకు థియేటర్స్ దొరకవని అనుకోవడం లేదు. ఏదైనా చట్ట ప్రకారమే జరుగుతుంది. పోసాని కృష్ణమురళిగారిని అరెస్ట్ చేస్తే ఆయన సినిమాలు ఆపేయరు కదా? తాము చేస్తున్న యాడ్స్ లీగలా? కాదా? అనేది యాక్టర్స్‌కు, స్టార్స్‌కు తెలియకపోవచ్చు. దానిపై అధికారులు నటీనటులకు అవగాహన కల్పించాలి. అంతేగానీ సడెన్‌గా చర్యలు తీసుకోవడం సరికాదు'' అన్నారు. ''ఆరాధ్య, సత్య బాగా నటించడం వల్ల దర్శకుడిగా నాపై ఒత్తిడి తగ్గింది'' అని గిరి కృష్ణకమల్ చెప్పారు. ''ఈ సినిమాలో నా పాత్ర చిన్నదే అయినా కథలో కీలకంగా ఉంటుంది'' అని సత్య యాదు తెలిపారు.

వినోదాల సింగిల్


● శ్రీవిష్ణు, కేతికా శర్మ

శ్రీవిష్ణు హీరోగా రూపొందుతోన్న చిత్రం '#సింగిల్'. 'నిను వీడని నీడను నేనే' మూవీ ఫేమ్ కార్తీక్ రాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఇవాన, కేతికా శర్మ హీరోయిన్లు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్‌పై విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. ఈ సినిమాని మే 9న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. ''యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌ని అలరించే చిత్రంగా 'సింగిల్' ఉంటుంది. ఈ వేసవిలో శ్రీవిష్ణు తన నవ్వులతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఆయన పాత్రలోని రెండు డిఫరెంట్ వేరియేషన్స్ ఆకట్టుకుంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమేరా: ఆర్. వేల్‌రాజ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అజయ్ గద్దె.

ఆ ఉద్దేశంతోనే ఈ ఫంక్షన్‌కి వచ్చాను

- బ్రహ్మానందం

''తమ్ముడు సప్తగిరి సినిమా ఇది. ఒక హాస్య నటుడు సినిమా హిట్ కావాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చాను'' అన్నారు బ్రహ్మానందం. సప్తగిరి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. ఈ చిత్రంలో ప్రియాంకా శర్మ హీరోయిన్. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వంలో కేవై బాబు, భాను ప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల కలిసి నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మానందం మాట్లాడుతూ- ''ప్రేక్షకులను పది కాలాల పాటు నవ్వించాలని తపన పడేవాడు హాస్యనటుడు. హాస్య నటుడిది మనల్ని నవ్వించే వృత్తి. నిజంగా ఇది పవిత్రమైనది. 'పెళ్లికాని ప్రసాద్' సినిమా కోసం సప్తగిరి చాలా కష్టపడ్డాడు. ఈ సినిమాను హిట్ చేసి, హాస్య నటుడికి మంచి జీవితం ఇవ్వాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''ఈ సినిమా కాన్సెప్ట్ బాగుంది'' అని మరో ముఖ్య అతిథి, దర్శక-నిర్మాత మారుతి తెలిపారు. ''ఈ సినిమాను తప్పకుండా థియేటర్స్‌లో చూడండి'' అని పేర్కొన్నారు కేవై బాబు.


● ప్రియాంక, బ్రహ్మానందం, సప్తగిరి

కోర్ట్ విజయం మాకు హెల్ప్ అవుతుంది

- రాహుల్ రెడ్డి



''కొత్తదనంతో కూడిన మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తారని నిర్మాతగా నా నమ్మకం. మంచి కంటెంట్‌తో రూపొందించిన మా 'టుక్ టుక్' విజయం పై నమ్మకం ఉంది'' అని రాహుల్ రెడ్డి అన్నారు. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, శాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ముఖ్య తారలుగా సి. సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'టుక్ టుక్'. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీవరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాహుల్ రెడ్డి మాట్లాడుతూ- ''దర్శకుడు సుప్రీత్‌తో కలిసి 'అలనాటి చిత్రాలు' అనే వెబ్ ఆంథాలజీ చేశాను. సుప్రీత్ చెప్పిన ఫ్యాంటసీ థ్రిల్లర్ కథ నచ్చడంతో 'టుక్ టుక్' నిర్మించాను. రెండున్నర గంటల పాటు నాన్‌స్టాప్‌గా ఎంటర్‌టైన్ చేసే ఫిల్మ్ ఇది. రోషన్ నటించిన 'కోర్ట్' సినిమా మంచి విజయం సాధించింది. ఆ సినిమా సక్సెస్ మాకూ హెల్ప్ అవుతుందని ఆశిస్తున్నాను'' అని అన్నారు.



తొర్రూరులో 'కిడ్నాప్'నాటికను ప్రదర్శిస్తున్న గుంటూరు కళాకారులు



తొర్రూరులో 'స్వేచ్ఛ'నాటికను ప్రదర్శిస్తున్న హైదరాబాద్ కళాకారులు

నాటకానికి 'చైతన్య'ం!

చైతన్య కళా సమాఖ్య కృషి • 40 ఏళ్లుగా తొర్రూరులో నాటక ప్రదర్శనలు • వర్ధమాన నటులను ప్రోత్సహిస్తున్న సమాఖ్య

తొర్రూరు: ఒక జాతి సంస్కృతి తెలుసుకోవాలంటే.. ఆ జాతి ఏర్పాటు చేసుకున్న రంగస్థలమేంటో తెలుసుకుంటే సరిపోతుందంటారు సామాజికవేత్తలు. తెలుగు జాతి సంస్కృతి, సంప్రదాయాలు, సమకాలీన సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో చూపడంలో రంగస్థలం అత్యంత ప్రధానమైంది. నలభయ్యేళ్లుగా ప్రవాహంలా సాగిపోతున్న నాటక రంగానికి తమవంతు బాధ్యతగా దశాదిశ చూపే ప్రయత్నం చేస్తున్నారు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ప్రాంత కళాకారులు. తొర్రూరు ప్రాంతానికి చెందిన చైతన్య కళా సమాఖ్య ప్రతినిధులు 1985 నుంచి నాటక రంగానికి జీవం పోస్తున్నారు. నాటక ప్రదర్శనల్లో.. తెలుగు రాష్ట్రాల్లోనే చైతన్య కళా సమాఖ్య మూడో స్థానంలో నిలిచింది. ఇప్పటివరకు 200 పైచిలుకు నాటక ప్రదర్శనలకు అవకాశమిచ్చిన కళా సమాఖ్య.. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ గుర్తింపు పొందుతోంది.

ఆదర్శం.. చైతన్య కళా సమాఖ్య నాటక సేవ

మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో 1985లో మన్నూరు ఉమ బృందం చైతన్య కళా సమాఖ్యను స్థాపించింది. అప్పటినుంచి సమాఖ్య 40 ఏళ్లుగా కళా రంగానికి తన వంతు సేవ చేస్తోంది. ఏటా మార్చిలో వారం రోజుల పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలను ఘనంగా నిర్వహిస్తోంది. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ జాతీయ తెలుగు ఆహ్వాన నాటికల పోటీల్లో.. తెలుగు రాష్ట్రాల నుంచి అనేక నాటక సంఘాలు ప్రదర్శనలిచ్చాయి. హైదరాబాద్, కరీంనగర్, గుంటూరు కళాకారులు నాటకాలను ప్రదర్శించారు. ఈ కళా సమితి వేదికపై ప్రదర్శనలు ఇచ్చి పలువురు గుర్తింపు పొందారు.

మూస ధోరణికి భిన్నంగా..

1980 వరకు గ్రామాల్లో, పట్టణాల్లో పండుగల సందర్భాల్లో నాటకాలను ప్రదర్శిస్తుండేవారు. వాటికి విపరీతమైన ఆదరణ ఉండేది. ఒకప్పుడు వెలుగొందిన ఈ కళ.. నేడు సినిమా, టీవీల ప్రభావంతో మసకబారుతోంది. ప్రస్తుతం నాటక ప్రదర్శనలకు పెద్దలు మినహా నేటితరం యువత రావడం లేదు. ఇలాగే కొనసాగితే తెలుగు నాటకం మసకబారే ప్రమాదముందని భావించిన తొర్రూరు చైతన్య కళా సమాఖ్య కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. ఉత్తమ నాటకాలను ఎంచుకుని ప్రదర్శనలకు ఆహ్వానిస్తోంది. పోటీకి వచ్చిన నాటికల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి నగదు బహుమతులు అందజేస్తోంది. ఉత్తమ నటులకు ప్రోత్సాహకాలు అందిస్తోంది.

నాటక వారసత్వాన్ని కొనసాగించాలని..



ప్రస్తుతం టీవీ, సినిమాలు చూస్తే.. వాటిలో ఎలాంటి సందేశం ఉండటం లేదు. కానీ నాటకాలను తిలకించినప్పుడు.. అందులోని పాత్రలు, సారాంశం నిజ జీవితానికి అద్దం పట్టేలా ఉంటాయి. నాటకాల వారసత్వాన్ని నేటి తరానికి అందించే లక్ష్యంతో చైతన్య కళా సమాఖ్య ఏటా పోటీలు నిర్వహిస్తోంది. కళా సమాఖ్య ద్వారా తొర్రూరులో మా వంతుగా కళా రంగాభివృద్ధికి కృషి చేస్తున్నాం.

– మన్నూరు ఉమ, అధ్యక్షుడు, చైతన్య కళా సమాఖ్య, తొర్రూరు

నాటకానికి జవసత్వాలు నింపాలి



ప్రాచీన కళలు అంతరించి పోకుండా ఐక్యంగా కృషి చేయాలి. నాటక పోటీల ద్వారా ఈ రంగానికి జవసత్వాలు నిండాలన్నదే మా ఆకాంక్ష. ఇటీవల తొర్రూరులో నిర్వహించిన జాతీయ స్థాయి తెలుగు ఆహ్వానిత నాటక పోటీలకు ఎన్నడూ లేనంత ఆదరణ లభించింది. ప్రేక్షకులు నాటకాలు వీక్షించేందుకు గంటల తరబడి కుర్చీలకే అతుక్కుపోయారు. రానున్న రోజుల్లోనూ నాటక ప్రదర్శనలు కొనసాగిస్తాం.

– సుంకరనేని పినాకపాణి, ప్రధాన కార్యదర్శి, చైతన్య కళా సమాఖ్య

హామీల అమలుపై ప్రశ్నిస్తూనే ఉంటా

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

సాక్షి, హైదరాబాద్: హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది గోరంత, చెప్పుకునేది కొండంత అని, బడ్జెట్ ప్రసంగంలో తమకు తామే పొగుడుకున్నట్లుగా ఉందని విమర్శించారు. హైదరాబాదులో 40 శాతం వీధి దీపాలు వెలగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ మహానగరంలో నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను పూర్తిగా విస్మరించారని ధ్వజమెత్తారు. ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్ నగరాన్ని అయోమయం చేశారని, మహానగరాన్ని విడిచిపెట్టి ఫోర్త్ సిటీ అంటున్నారని తెలిపారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంలేదని కానీ, ఫోర్త్ సిటీ పేరుమీద భూదందాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లకు తెరలేపారని అన్నారు. హైదరాబాద్ నగరం రాష్ట్రానికి గుండెకాయ లాంటిదని, అలాంటి నగరానికి 16 నెలలు గడిచినా మంత్రి పదవి ఇవ్వలేదని వివేకానంద ధ్వజమెత్తారు.

వలస కార్మికులకు మొండిచేయి

- బడ్జెట్‌లో గల్ఫ్ వలస కార్మికుల ఊసెత్తని ప్రభుత్వం
- గల్ఫ్ బోర్డు ఏర్పాటు, రూ.500 కోట్ల కేటాయింపులే లక్ష్యంగా పోరాడిన వలస కార్మిక సంఘాలు
- ఎన్నికల హామీని విస్మరించడంపై నిరసన

మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ వలస కార్మికులకు మరోసారి మొండిచేయి ఎదురైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో.. ఎన్నో సంక్షేమ పథకాలకు నిధులను కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ వలస కార్మికుల ఆశలను తీర్చలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2023 ఎన్నికల మేనిఫెస్టోలో.. గల్ఫ్ వలస కార్మికుల అంశంపై ప్రత్యేక హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోపోవడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన వలస కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం రూ.7.50 కోట్లను ఖర్చు చేసింది. ఈసారి మాత్రం ఎలాంటి కేటాయింపులు లేకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గల్ఫ్ బోర్డు ఏర్పాటుతో పాటు రూ.500 కోట్ల కేటాయింపులే లక్ష్యంగా వలస కార్మిక సంఘాలు కృషి చేశాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఆయన మంత్రివర్గ సహచరులతో అనేకమార్లు సమావేశాలను నిర్వహించారు. సీఎం కూడా గల్ఫ్ వలస కార్మికుల ఆశలు తీర్చడానికి సానుకూలంగానే స్పందించారు. తీరా బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం, కనీసం వలస కార్మికుల సంక్షేమం ప్రస్తావనే లేకపోవడంతో వలస కార్మికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం..

పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ వలస కార్మికులను పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా కాంగ్రెస్ పార్టీ తీరుపైనా అలాంటి ఆరోపణలే వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో ఎన్నోమార్లు చర్చించి.. గల్ఫ్ వలస కార్మికులు, వారి కుటుంబాల ఓట్లను రాబట్టుకున్న కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లను గెలుచుకుంది. గల్ఫ్ ఓటర్ల ప్రభావం ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలుపొందేవారు. ఒకవేళ ఓడినా.. ఓట్లలో వ్యత్యాసం తక్కువగా ఉండేది. అయినా వలస కార్మికులను కరివేపాకులాగా తీసి పారేశారని కార్మిక సంఘాలు వాపోతున్నాయి.

ప్రభుత్వ తీరు సరికాదు



వలస కార్మికుల ఆశలు తీర్చేలా బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని ఆశించాం. ప్రభుత్వం ఎలాంటి కేటాయింపులు చేయక నిరాశ మిగిల్చింది. వలస కార్మికుల శ్రమకు గుర్తింపు లేకపోవడం శోచనీయం. వలస కార్మికులు పంపే విదేశీ మారకద్రవ్యం అవసరం కానీ వారి సంక్షేమం పట్టక పోవడం సరైంది కాదు.

– గుగ్గిల్ల రవిగౌడ్, చైర్మన్, గల్ఫ్ జేఏసీ

ప్రపంచ హ్యాపీనెస్ డే సాధన ఘనత భూటాన్‌దే

యూజీసీ మాజీ చైర్మన్, పద్మశ్రీ ఎస్కే తోరట్

సాక్షి, హైదరాబాద్: ప్రతి ఏడాది మార్చి 20న ప్రపంచ హ్యాపీనెస్ డేను జరుపుకునే విధంగా కృషి చేసిన ఘనత భూటాన్ ప్రభుత్వానికి ప్రత్యేకించి అక్కడి ప్రజలకు దక్కుతుందని యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) మాజీ చైర్మన్, పద్మశ్రీ ఎస్కే తోరట్ ప్రశంసించారు. అసోసియేషన్ ఆఫ్ బుద్ధిస్టు టూరిస్ట్ ఆపరేటర్స్ (ఏబీటీవో), బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) సంయుక్త ఆధ్వర్యంలో గురువారం భూటాన్ రాజధాని తింపులో అంతర్జాతీయ హ్యాపీనెస్ డే సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తోరట్ మాట్లాడుతూ ఇప్పటివరకు పాశ్చాత్య దేశాలు మానవ అభివృద్ధికి అనుసరించిన ఆర్థిక విధానాలకు భూటాన్ ప్రాతిపాదించిన హ్యాపీనెస్ ఇండెక్స్ భిన్నమైనదని అన్నారు. ఏబీటీవో అంతర్జాతీయ అధ్యక్షుడు మల్లేపల్లి లక్ష్మయ్య సదస్సు ఉద్దేశ్యాన్ని వివరిస్తూ 8 లక్షల జనాభా కలిగిన భూటాన్ దేశం ప్రపంచంలోని 8 వందల కోట్ల మానవాళికి సంతోషంగా జీవించడం ఎలాగో మార్గనిర్దేశనం చేసిందని కొనియాడారు. సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, భూటాన్ ఎన్ఆర్‌సీ విద్యా సంస్థల అధ్యక్షుడు ఖుంజాగ్ దృక్ప, బీఎస్ఐ జాతీయ అధ్యక్షుడు చంద్రబోధి పాటిల్, వివిధ దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.



గురువారం హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీల 'గ్రాండ్ ప్రీ-లాంచ్' కార్యక్రమానికి వచ్చిన మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవాకు స్వాగతం పలుకుతున్న దృశ్యం.

రాష్ట్రానికి 'చల్లని' కబురు..

- రాష్ట్రంపై ఉపరితల ఆవర్తనం ప్రభావం
- రానున్న రెండ్రోజులు తగ్గనున్న ఉష్ణోగ్రతలు
- ఉత్తర ప్రాంత జిల్లాల్లో వడగండ్ల వానలకు అవకాశం



సాక్షి, హైదరాబాద్: నైరుతి మధ్యప్రదేశ్ మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఛత్తీస్‌గఢ్ మీదుగా దక్షిణ విదర్భ మీదుగా కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోనూ వాతావరణ మార్పులు చోటుచేసుకున్నాయి. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు.. రాష్ట్రంలోని ఉత్తర ప్రాంత జిల్లాల్లోని ఒకట్రెండు చోట్ల తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం నమోదవుతున్న ఉష్ణోగ్రతలు.. రెండు నుంచి మూడు డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదు కావొచ్చని, చాలా ప్రాంతాల్లో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయని వాతావరణ శాఖ సూచించింది. వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదయ్యాయి. దీంతో తీవ్ర ఉక్కపోత రాష్ట్ర ప్రజానీకాన్ని ఉక్కిరిబిక్కిరి చేయగా.. తాజాగా మారిన వాతావరణం కాస్త ఉపశమనం కలిగించినట్లయింది. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో గురువారం నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గరిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 39.6 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 18.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఆదిలాబాద్, ఆసీఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానలు కురిసే అవకాశం ఉన్నట్లు జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్, నిజామాబాద్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వివరించారు.

గురువారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు(సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
మెదక్	39.6	18.8
ఆదిలాబాద్	39.0	24.2
నిజామాబాద్	38.6	23.4
భద్రాచలం	37.8	24.0
ఖమ్మం	37.6	23.6
మహబూబ్‌నగర్	37.6	23.6
నల్లగొండ	37.0	20.0
దుండిగల్	36.3	22.3
హకీంపేట్	36.3	22.8
హన్మకొండ	34.5	22.0
హైదరాబాద్	36.5	22.4
రామగుండం	35.2	24.5

ఈటలకు బర్త్‌డే గ్రీటింగ్స్

శుభాకాంక్షలు తెలిపిన ద్రౌపదీ ముర్ము, ధన్‌ఖడ్, మోదీ, అమిత్ షా, దత్తాత్రేయ, రేవంత్‌రెడ్డి తదితరులు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీశ్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా, సీఎం రేవంత్‌రెడ్డి, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్రమంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, వీరేంద్ర కుమార్.. కేంద్ర సహాయ మంత్రులు రాందాస్ అథవాలే, ఎంపీలు డా.కె.లక్ష్మణ్, అర్వింద్ ధర్మపురి, సుప్రియా సూలే, భానుప్రసాద్ సింగ్ వర్మ, ఎంఎల్ఏలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పాయల్ శంకర్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, బీజేపీ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ కూడా శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. రాష్ట్రపతి, ప్రధాని, ఇతర ముఖ్యులు కొందరు లేఖల ద్వారా, ఫోన్ ద్వారా తమ శుభాకాంక్షలు తెలియజేశారు. శామీర్‌పేటలోని ఈటల నివాసంలో బీజేపీ నాయకులు, వివిధ జిల్లాల బీజేపీ అధ్యక్షులు, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, కార్యకర్తలు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. సహవాసి వాలంటరీ ఆర్గనైజేషన్, స్వేచ్ఛ మీడియా ఆధ్వర్యంలో మిత్ర బ్లడ్ బ్యాంక్ రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. కేన్సర్, తలసేమియా పేషెంట్లకు ఈ రక్తాన్ని ఉచితంగా అందించనున్నారు. హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో పలుచోట్ల రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించినట్టు నిర్వాహకులు తెలియజేశారు.

అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీని ప్రకటించాలి

మంత్రి శ్రీధర్‌బాబును కోరిన టీడబ్ల్యూజేఎఫ్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ మీడియా పాసుల గడువు ముగిసి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ కొత్త పాసులు ఇవ్వలేదని, వెంటనే అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీని ప్రకటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. గురువారం శాసన సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబును అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో ఫెడరేషన్ ప్రతినిధి బృందం కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించింది. పాత పాసుల కారణంగా అసెంబ్లీకి వచ్చే సమయంలో పోలీసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గడువు ముగిసిన పాస్‌ల వినియోగంతో జర్నలిస్టులకు సమస్యగా ఉందని ఫెడరేషన్ బృందం తెలిపింది. అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీ లేకపోవటం వల్ల మీడియా పాస్‌ల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని, అందుకే మీడియా సలహా కమిటీని వెంటనే ప్రకటించి కొత్త పాసులు జారీ చేయాలని ఫెడరేషన్ మంత్రికి విజ్ఞప్తి చేసింది. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ, ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమై వెంటనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మంత్రిని కలసిన వారిలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి.బసవ పున్నయ్య, ఉపాధ్యక్షుడు బట్టిపాటి రాజశేఖర్, హెచ్‌యూజే అధ్యక్షుడు బి. అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపీల ప్రశ్నోత్తరాలు

భారత్‌నెట్ ఫేజ్-2లో వడ్డీ రహిత రుణ సదుపాయం లేదు: కేంద్రమంత్రి చంద్రశేఖర్



భారత్‌నెట్ ఫేజ్–2... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలో మోడల్ కింద అమలు అవుతోందని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం భారత్‌నెట్ ఫేజ్–2లో తమ సహకారం కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ నుంచి వడ్డీ రహిత రుణానికి అభ్యర్థించిందని..అయితే అలాంటి సదుపాయం ఏదీ లేదని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు గురువారం కేంద్రమంత్రి రాజ్యసభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

సీఆర్ఐఎఫ్ కింద రూ.2288.63 కోట్ల విలువైన పనులు ఆమోదం పొందాయి : కేంద్రమంత్రి గడ్కరీ



తెలంగాణలో గత ఐదేళ్లలో (2019–2020 నుంచి 2023–2024) సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) కింద 1109.04 కి.మీ పొడవైన రూ.2,288.63 కోట్ల విలువైన మొత్తం 90 పనులు ఆమోదం పొందాయని కేంద్ర రహదారులు, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. దీంతోపాటు 2022–23లో సీఆర్ఐఎఫ్ (సేతుబంధన్)కింద 5 ఆర్‌ఓబీ పనులకు రూ.432.84 కోట్లు మంజూరు చేశామని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లోక్‌సభలో సమాధానం ఇచ్చారు. తెలంగాణలో దాదాపు 790 కి.మీ పొడవునా రూ.1827.14 కోట్లతో మొత్తం 66 సీఆర్ఐఎఫ్ పనులు వివిధ దశల్లో ఉన్నాయని, ఈ పనులు 2026 నాటికి దశలవారీగా పూర్తి చేయాలని నిర్ణయించామని గడ్కరీ చెప్పారు.

అమృత్ పథకం కింద తెలంగాణలో 65 ప్రాజెక్టులు: కేంద్రమంత్రి తోఖన్ సాహు



అమృత్ పథకం కింద..తెలంగాణలో రూ.1,663.08 కోట్ల విలువైన 66 ప్రాజెక్టులు, 18.25 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగి ఉన్న రూ.203.3 కోట్ల విలువైన 4 సీవరేజీ/సెప్టేజ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులు ఉన్నాయని కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు తెలిపారు. ఇంకా, అమృత్ 2.0 కింద, 1,132 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన రూ.9,584.26 కోట్ల విలువైన 252 ప్రాజెక్టులను తెలంగాణలో కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ ఆమోదించిందన్నారు. వీటితోపాటు రూ.5,775.11 కోట్ల విలువైన 12 సీవరేజీ/సెప్టాజ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్‌లు కూడా ఆమోదించామని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి బదులిచ్చారు. అమృత్ 2.0 కింద, హైదరాబాద్ కోసం కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ ద్వారా రూ.3,849.1 కోట్ల విలువైన 972 ఎంఎల్‌డీ కెపాసిటీ గల 03 మురుగునీటి/సెప్టాజ్ నిర్వహణ ప్రాజెక్టులు ఆమోదించామన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్–అర్బన్ 2.0 కింద తెలంగాణకు యూడబ్ల్యూఎం కాంపోనెంట్ కింద రూ.463.10 కోట్ల నిధులు కేటాయించామని చెప్పారు. రూ.934.60 కోట్లు విలువైన ప్రతిపాదనల్లో కేంద్ర వాటా కింద రూ.463.10 ఆమోదించామని, అందలో ఇప్పటి వరకు రూ.185.24 కోట్లు విడుదలయ్యాయని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నకు కేంద్రమంత్రి బదులిచ్చారు.

హైదరాబాద్-శ్రీశైలం రూట్‌లో 125 కి.మీ.అభివృద్ధి చేశాం: కేంద్రమంత్రి గడ్కరీ

ఎన్‌హెచ్–765లోని హైదరాబాద్–శ్రీశైలం సెక్షన్‌లో ఉన్న 187 కి.మీ రహదారిలో... హైదరాబాద్ నుంచి బ్రాహ్మణపల్లి వరకు దాదాపు 125 కి.మీ.లు ఇప్పటికే రెండు లేన్‌లుగా పేవ్డ్ షోల్డర్‌లు, నాలుగు లేన్‌లతో అభివృద్ధి చేసినట్టు కేంద్ర రహదారులు, రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. మిగిలిన 62 కి.మీ అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోకి వస్తాయని కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, సురేష్ షెట్కార్‌లు అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి లోక్‌సభలో సమాధానం ఇచ్చారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ఉండే బ్రాహ్మణపల్లి నుంచి తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వరకు 62 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం తన ప్రతిపాదనను సమర్పించిందన్నారు.

వరంగల్‌లో ఓఆర్ఆర్ ప్రాజెక్టు అభివృద్ధికి ఏ ప్రతిపాదన రాలేదు: కేంద్రమంత్రి గడ్కరీ

వరంగల్ నగరంలోని ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు అభివృద్ధికి ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదని కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బదులిచ్చారు. అయితే, యాదగిరిగుట్ట నుంచి వరంగల్ సెక్షన్ వరకు ఎన్‌హెచ్–163 నాలుగు లేనింగ్‌లో భాగంగా, వరంగల్ నగరానికి ఉత్తరం వైపున బైపాస్ నిర్మించామని, 2020 అక్టోబర్ 1వ తేదీ నుంచి ట్రాఫిక్ కోసం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. వరంగల్ నగరానికి చెందిన అంతర్గత రింగ్ రోడ్డు ప్రాజెక్ట్ కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా), తెలంగాణ ప్రభుత్వంలో ఉందని, ఇది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని కేంద్రమంత్రి స్పష్టత ఇచ్చారు.

– సాక్షి, న్యూఢిల్లీ



చెలమలతో చెలిమి..

చెంతనే వంశధార ఉన్నా ఈ గ్రామస్తులకు తాగునీటి చింత మాత్రం ఎన్నటికీ తీరడం లేదు. శ్రీకాకుళం జిల్లా ఎల్ఎన్ పేట మండలం దబ్బపాడు గ్రామ ప్రజలు సీజన్‌తో సంబంధంలేకుండా వంశధార నదిలోని చెలమ గుంతల్లో నీటినే తాగుతుంటారు. గ్రామంలో రక్షిత నీటి పథకం ఉన్నా కొళాయిల్లో అరకొరగానే నీరు వస్తుండటంతో గ్రామస్తులు చెలమలపైనే ఆధారపడుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



మల్లన్న చెంతకు భక్తితో..

కర్ణాటకకు చెందిన ఈ భక్తులు శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు ఇలా వందల కిలోమీటర్లు కాలినడకన వస్తుంటారు. మండుటెండలో కాళ్లు బొబ్బలెక్కుతున్నా లెక్కచేయకుండా శివనామస్మరణ చేసుకుంటూ శ్రీశైలం చేరుకుంటున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



ఈపాపం ఎవ్వరిదని..

వైఎస్సార్ జిల్లాలోని కాశినాయన క్షేత్రంలో గోశాలలను అటవీశాఖ కూల్చివేయడంతో గోవులు ఇలా మండుటెండలో నిలబడాల్సి వస్తోంది. ఇంతవరకూ తమకు ఆశ్రయమిచ్చిన నీడ ఎందుకు కూలిపోయిందో తెలియని ఈ మూగజీవాలు మండుటెండలో ఇలా మౌనంగా రోదిస్తున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

క్లుప్తంగా...

పాస్టర్లకు మూడు నెలల వేతనం విడుదల

సాక్షి, అమరావతి: పాస్టర్లకు మూడు నెలల గౌరవ వేతనాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 8,427 మందికి 3 నెలల గౌరవ వేతనం రూ.12,82,78,000 విడుదల చేసినట్టు మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, గతేడాది మే నుంచి పాస్టర్లకు నెలకు రూ.5 వేలు చొప్పున గౌరవ వేతనాన్ని ప్రభుత్వం విడుదల చేసిందని మంత్రి ఫరూక్ తెలిపారు.

రూ.50.56 కోట్లకు.. రూ.12.82కోట్లే ఇస్తారా

పాస్టర్లకు రూ.50.56 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.12.82 కోట్లు ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సరికాదని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటినా పాస్టర్ల గౌరవ వేతనాన్ని మూడు నెలలకే ఇవ్వడం శోచనీయమని ఒక ప్రకటనలో విమర్శించారు.

స్వయంగా మా ముందు హాజరుకండి

వనజాక్షికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: కోర్టు ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించారంటూ తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం పూర్వ తహసీల్దార్ వనజాక్షిపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. వ్యక్తిగతంగా తమముందు హాజరుకావాలంటూ ఆమెను ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. గోపాలపురం మండలం భీమోలు గ్రామ పరిధిలోని 359 ఎకరాల భూమిని వివాద రిజిస్టర్‌లో చేర్చాలని గత ఏడాది ఇచ్చిన ఉత్తర్వులను వనజాక్షి ఉల్లంఘించారంటూ కె.సూర్యకుమారి, పోతిరెడ్డి వీరరాఘవమ్మ హైకోర్టులో కోర్టుధిక్కార పిటిషన్ దాఖలు చేశారు.

కొడుకును చంపిన తండ్రికి యావజ్జీవ శిక్ష

ప్రకాశం జిల్లా కోర్టు తీర్పు

ఒంగోలు: భార్యపై అనుమానంతో మూడేళ్ల కొడుకును హత్య చేసిన కేసులో తండ్రికి యావజ్జీవ జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ ప్రకాశం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. నెల్లూరుకు చెందిన షేక్ ఖాదర్‌వలి, షేక్ సల్మా ప్రకాశం జిల్లా చీమకుర్తిలో నివాసం ఉండేవారు. వీరికి కుమారుడు షాహుల్(3) ఉన్నాడు. భార్యపై అనుమానం పెంచుకున్న ఖాదర్ ప్రతిరోజూ ఆమెను వేధించేవాడు. ఈ క్రమంలో 2018 నవంబర్ 30న ఖాదర్ తన బైక్‌పై షాహుల్‌ను తీసుకెళ్లాడు. సాయంత్రం భర్త ఒక్కడే ఇంటికి రావడంతో సల్మా ప్రశ్నించింది. తనకు తెలియదంటూ ఖాదర్ జవాబివ్వడంతో.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఖాదర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.. నేరాన్ని అంగీకరించాడు.


సభాహక్కుల సంఘం చైర్మన్‌గా పితాని

సాక్షి, అమరావతి: అసెంబ్లీ సభాహక్కుల సంఘం చైర్మన్‌గా పితాని సత్యనారాయణ నియమితులయ్యారు. అసెంబ్లీలో వివిధ కమిటీలకు చైర్మన్లు, సభ్యుల నియామకంపై గురువారం కార్యదర్శి ప్రసన్నకుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రతి కమిటీలో చైర్మన్, ఆరుగురు సభ్యులు ఉన్నారు. నిబంధనల కమిటీకి చింతకాయల అయ్యన్నపాత్రుడు, వినతుల కమిటీకి రఘురామకృష్ణరాజు, నైతిక విలువల కమిటీకి మండలి బుద్ధప్రసాద్, సభాహక్కుల సంఘానికి పితాని సత్యనారాయణ, ప్రభుత్వహామీల కమిటీకి కామినేని శ్రీనివాస్ చైర్మన్లుగా నియమితులయ్యారు.

వేరుశనగ సాగుపై వర్క్‌షాప్

సాక్షి, అమరావతి: వేరుశనగ, నువ్వుల సాగులో నూతన సాంకేతికత, ఉత్తమ యాజమాన్య పద్ధతులపై గురువారం రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ జరిగింది. వ్యవసాయ శాఖ సంచాలకులు ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ నెల రోజులుగా పంటల వారీ చేపట్టిన రాష్ట్రస్థాయి వర్క్ షాప్‌లు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. రైతులకు నూతన మార్కెట్ ఆధారిత వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు.

పుట్టుకతో తోడై.. జీవితం సూదిపోటై!



షుగర్ వ్యాధి బారిన పడకుండా ఒక్కొక్కరు ఒక్కో ఆరోగ్య సూత్రాన్ని పాటిస్తుంటారు. ఒకరు రైస్ తినకూడదంటారు.. ఇంకొకరు నడక మంచిదంటారు.. ఒక వయస్సుకు వచ్చిన తర్వాత వ్యాధి బారిన పడటం ఒక ఎత్తయితే, రాకుండా జాగ్రత్త పడటం ఇంకొక ఎత్తు. మరి పుట్టుకతోనే ఈ వ్యాధి తోడుగా వస్తే. ఆ పిల్లల జీవితం నరక ప్రాయం. ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకుంటే తప్ప బతకలేని పరిస్థితి తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. అసలు ఎందుకు ఈ పరిస్థితి? వీళ్లు చేసిన పాపం ఏమిటి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానమే ఈ కథనం

➤ కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీకి చెందిన యువకునికి పుట్టుకతోనే షుగర్ వ్యాధి వచ్చింది. వైద్యులు పరిశీలించి టైప్–1 డయాబెటీస్‌గా నిర్ధారించారు. అప్పటి నుంచి ఇన్సులిన్‌ను ఇంజెక్షన్ రూపంలో అందిస్తున్నారు. ప్రస్తుతం ఇతని వయస్సు 30 ఏళ్లు. రోజూ ఇంజెక్షన్ వేయించుకోవాలంటే బాధగా ఉంటోందని, కానీ బతకాలంటే తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. స్వీట్లు అంటే ఇష్టమని, కానీ తింటే పరిస్థితి దారుణంగా ఉంటుందని వాపోతున్నాడు.

➤ పగిడ్యాల మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామానికి చెందిన మల్లయ్య, మానస దంపతులు వ్యవసాయ కూలీలు. వీరికి ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు వెంకట ఉమామహేష్, రెండవ కుమారుడు లిఖిత్. 9 నెలల వయస్సు కలిగిన లిఖిత్‌కు పుట్టుకతోనే చక్కెర వ్యాధి తోడుగా వచ్చింది. తరచూ అపస్మారక స్థితికి చేరుకోవడం గమనించి కర్నూలు ప్రైవేట్ ఆసుపత్రిలో సుమారు రూ.3లక్షలకు పైగా ఖర్చు చేసినా ఫలితం లేకపోయింది. షుగర్ లెవెల్స్ గుర్తించేందుకు మిషన్ తెచ్చుకుని వారానికోసారి ఇన్సులిన్ ఇంజెక్షన్ వేయించాల్సిన పరిస్థితి. వారానికి సుమారు రూ.5వేల దాకా ఖర్చవుతోందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.



కర్నూలు(హాస్పిటల్): పేరులో తియ్యదనం దాచుకున్న మహమ్మారి మధుమేహం. ఇది పెద్దలనే కాదు.. చిన్నారులనూ వదలని పరిస్థితి. పుట్టుకతోనే తోడుగా వచ్చి జీవించినంత కాలం వేధిస్తోంది. అందరిలా జీవించాలంటే రోజూ సూదిపోటుతో ఇన్సులిన్ మందు వేసుకోవడం తప్పనిసరి. అల్లారుముద్దుగా పెంచుకున్న కన్నబిడ్డలను తల్లిదండ్రులే స్వయంగా ఇంజెక్షన్ ద్వారా ఇన్సులిన్ ఇవ్వడం వారికీ నరకంతో సమానం. ఇలాంటి బాధితుల సంఖ్య సమాజంలో రోజురోజుకూ పెరుగుతోంది. శరీరంలోని క్లోమగ్రంధిలో ఇన్సులిన్ హార్మోన్ ఉత్పత్తి అవుతుంది. అయితే కొన్ని కారణాల వల్ల ఈ గ్రంధిలో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే కణాలను(బీటా కణాలు) వ్యక్తుల రోగనిరోధక వ్యవస్థ నాశనం చేస్తుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. దీన్ని టైప్–1 మధుమేహం(డయాబెటిస్) అంటారు. సాధారణంగా పిల్లలు, యువకుల్లో ఈ పరిస్థితి కనిపిస్తుంది. అయితే కొన్నిసార్లు బీటా కణాలను రోగనిరోధక వ్యవస్థ నిర్వీర్యం చేయడం కాకుండా క్లోమగ్రంధికి ఏదైనా వ్యాధి సోకినప్పుడు లేదా గాయం అయినప్పుడు బీటా కణాలు నిర్వీర్యం అవుతాయి. దీనిబారిన పడిన వారికి క్రమం తప్పకుండా ఇన్సులిన్‌ను ఇంజెక్షన్ చేయాల్సి ఉంటుంది. ఇది కొంత మందికి జన్యుపరంగా కూడా రావచ్చు. మరికొంత మందికి పలు రకాల వైరల్ వ్యాధులు, ఇతర ప్రమాదకర అనారోగ్యాల కారణంగా కూడా ఈ పరిస్థితి ఎదురవ్వొచ్చు. అంతేకానీ ఆహారం, జీవనశైలి అలవాట్లు టైప్–1 డయాబెటిస్‌కు కారణం కావు.

చిన్నారుల్లో 'తియ్యని' బాధ

- పుట్టుకతోనే తోడవుతున్న షుగర్ వ్యాధి
- కోవిడ్ తర్వాత పెరిగిన టైప్–1 రోగులు
- వంశపారంపర్యం, పలు రకాల ఇన్ఫెక్షన్లు కారణం
- ఇన్సులిన్ తీసుకోవడం తప్పనిసరి
- పెరిగిన చికిత్స వ్యయంతో సతమతం

లక్షణాలు

- టైప్–1 డయాబెటిస్ లక్షణాలు బయటపడటానికి కొన్ని నెలలు లేదా సంవత్సరాలు పట్టవచ్చు.
- విపరీతమైన దాహం, తిన్న తర్వాత కూడా బాగా ఆకలి వేయడం, నోరు తడి ఆరిపోవడం.
- కడుపునొప్పి, వాంతులు, ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లడం.
- ఊహించని విధంగా బరువు తగ్గిపోవడం, అలసట, కంటిచూపు తగ్గిపోవడం.
- శ్వాస తీసుకోవడానికి ఎక్కువ కష్టపడటం, తరచుగా చర్మ, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు.
- మూడ్ మారిపోవడం, నిద్రలో మూత్రవిసర్జన చేయడం.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 50లక్షల వరకు జనాభా ఉంటుంది. ఇందులో 15 నుంచి 20 శాతం వరకు మధుమేహ బాధితులు. వీరిలో టైప్–2 మధుమేహ బాధితులు 90 శాతం కాగా.. టైప్–1 బాధితులు 10 శాతం పైనే. ఈ లెక్కన 7.50లక్షల నుంచి 10లక్షల వరకు మధుమేహ బాధితులు ఉండగా.. 75వేల నుంచి లక్ష దాకా చిన్నారులు ఉంటున్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో అరకొర ఇన్సులిన్

ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్సతో పాటు ఇన్సులిన్‌ను ఉచితంగా అందించాల్సి ఉంది. అయితే గత 10 నెలలుగా వీరికి అరకొరగా ఇన్సులిన్ ఇస్తున్నారు. కేవలం కర్నూలు, నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లో మాత్రమే అధికారులు స్థానికంగా కొనుగోలు చేసి ఇన్సులిన్‌ను కొద్దిమొత్తంలో అందజేస్తున్నారు. ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో ఇన్సులిన్ అందుబాటులో ఉండటం లేదు. దీంతో చాలా మంది మెడికల్ షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో చిన్నారికి వ్యాధి తీవ్రతను బట్టి నెలకు రెండు నుంచి నాలుగు ఇన్సులిన్ ఇంజెక్షన్లు అవసరం.

కోవిడ్ తర్వాత పెరిగిన కేసులు



కోవిడ్–19 అనంతరం టైప్–1 డయాబెటిస్ రోగుల సంఖ్య పెరిగింది. గతంలో డయాబెటిస్ రోగులు 5 శాతం ఉండగా ఇప్పుడు 10శాతానికి చేరుకుంది. కోవిడ్ వైరస్ నేరుగా బీటా కణాలపై దాడి చేయడమే ఇందుకు కారణం. ఈ కారణంగా కోవిడ్‌కు గురైన వారికి జన్మించే పిల్లల్లో టైప్–1 డయాబెటీస్ ఎక్కువగా కనిపిస్తోంది.
– డాక్టర్ పి.శ్రీనివాసులు, ఎండోక్రైనాలజీ హెచ్‌వోడి, జీజీహెచ్, కర్నూలు

ఇన్సులిన్‌తో మాత్రమే చికిత్స



చిన్నపిల్లల్లో వచ్చే టైప్–1 డయాబెటిస్‌కు ఇన్సులిన్‌తో మాత్రమే చికిత్స అందుబాటులో ఉంది. ఆయాసం, కడుపునొప్పి, వాంతులు లక్షణాలతో చిన్నపిల్లలను ఆసుపత్రికి తీసుకొస్తారు. అన్ని రకాల పరీక్షలు నిర్వహించి డయాబెటిస్ నిర్ధారణ అయ్యాక చికిత్స ప్రారంభిస్తాం. ఈ పిల్లలకు ఇన్సులిన్‌తో పాటు ఆహార నియమావళి తప్పనిసరి.
– డాక్టర్ ఎం.మల్లికార్జున, అసోసియేట్ ప్రొఫెసర్, పీడియాట్రిక్స్, జీజీహెచ్, కర్నూలు

పెరుగుతున్న చికిత్స వ్యయం

మెడికల్‌షాపుల్లో ఒక్కో ఇన్సులిన్ ఖరీదు రూ.180 వరకు ఉంటోంది. ఈ మేరకు ప్రతి చిన్నారికి నెలకు రూ.600 నుంచి రూ.800 వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రులతో పాటు ప్రైవేటు క్లినిక్‌లు, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యుల వద్ద చికిత్స తీసుకునే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఆధునిక వైద్యవిధానాల మేరకు వారికి నొప్పి తక్కువగా ఉండే ఇన్సులిన్ పెన్నుల ద్వారా ఇంజెక్షన్ చేస్తున్నారు. వీటి ఖరీదు సాధారణ ఇన్సులిన్‌తో పోలిస్తే రెట్టింపుగా ఉంటుంది.

రాజకీయాల్లో వ్యక్తిగత విభేదాలకు తావివ్వొద్దు

నేటి రాజకీయాలు కలుషితమయ్యాయి

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: అధికార, ప్రతిపక్షాలు అనేవి ప్రజా సమస్యలపై పోరాడటానికి తప్ప వ్యక్తిగత విభేదాలకు కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం విజయవాడలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన వీక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయాలు కలుషితమయ్యాయని, ఆప్యాయంగా పలకరించుకునే స్థితి నుంచి బద్ధ శత్రువులుగా మారిపోయే పరిస్థితి తలెత్తిందన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు చెప్పిన డైలాగులు వినగానే ఎన్టీఆర్ గుర్తొచ్చారన్నారు. శాసన సభ్యులందరూ ఇలానే ఉత్సాహంగా ఉంటే ఆస్పత్రులకు వెళ్లే అవసరం ఉండదన్నారు. వచ్చే ఏడాదీ ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యేలందరూ ప్రజలు మెచ్చుకునే విధంగా నడుచుకోవాలని సూచించారు. తెలుగు ప్రజల వారసత్వ నృత్యం కూచిపూడి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. త్వరలోనే ప్రధాని నరేంద్రమోదీ సభలో కూచిపూడి నృత్య ప్రదర్శనకు అవకాశం కల్పిస్తామన్నారు.

గబ్బర్ సింగ్ గుర్తొచ్చింది : పవన్ కళ్యాణ్

శాసన సభ్యుల కామెడీ స్కిట్లు చూస్తే గబ్బర్ సింగ్ సినిమా పోలీస్ స్టేషన్ సీన్ గుర్తుకు వచ్చిందని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. శాసన సభ్యుల్లో సుహృద్భావ వాతావరణం, సోదర భావం పెంపొందించేందుకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఎస్సీ వర్గీకరణపై విజయం సాధించిన తరుణంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఎప్పుడూ పాలన, ఆలోచనలతో గుంభనంగా ఉండే సీఎం చంద్రబాబు చాలా రోజుల అనంతరం మనసారా నవ్వడం చూశానన్నారు. దుర్యోధనుడిగా ఏక పాత్రాభినయం చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణ రాజు, బాల చంద్రుడిగా మంత్రి కందుల దుర్గేష్ నట కౌశలాన్ని పవన్ అభినందించారు.

85.52 గంటల పాటు సాగిన అసెంబ్లీ సమావేశాలు

స్పీకర్ అయ్యన్న ప్రకటన

సాక్షి, అమరావతి: ప్రస్తుత 16వ శాసనసభ మూడో విడత శాసనసభ సమావేశాలు 85.52 గంటల పాటు కొనసాగినట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పారు. గవర్నర్ ప్రసంగం రోజున మినహాయిస్తే 15 రోజుల పాటు సభ సమావేశమైనట్లు తెలిపారు. గురువారం సభ నిరవధికంగా వాయిదా పడిన సందర్భంగా 15 రోజుల పాటు సభ జరిగిన తీరును ఆయన వివరించారు. 15 రోజుల్లో 113 నక్షత్రగుర్తు ప్రశ్నలకు, 2 స్వల్ప వ్యవధి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగా, 37 నక్షత్ర గుర్తు ప్రశ్నలకు సమాధానాలు సభా సమక్షంలో ఉంచినట్లు తెలిపారు. మరో 2 నక్షత్ర గుర్తు లేని ప్రశ్నలకు సమాధానాలను సభా సమక్షంలో ఉంచినట్లు తెలిపారు. 9 బిల్లులు సభలో ప్రవేశపెట్టి, అన్ని బిల్లులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు చెప్పారు. 5 లఘు చర్చలు, 344 నిబంధన కింద ఒక అంశం, 74 నిబంధన కింద 2 అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఒక ప్రభుత్వ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించామని, సహకార బ్యాంకుల అవకతవకలపై విచారణ కోసం సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలనే సభ్యుల తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు చెప్పారు. సమావేశంలో ప్రతిపక్ష నాయకుని హోదా గురించి స్పీకర్‌గా తాను రూలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. వివిధ అంశాలపై సభ్యులు 127 ప్రసంగాలు చేశారని వివరించారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

ఏపీలో 72 టోల్‌ప్లాజాలు

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఫిబ్రవరి 28 నాటికి 72 టోల్‌ప్లాజాలు ఉన్నట్లు రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. లోక్‌సభలో గురువారం వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. గడిచిన ఐదేళ్లలో 29 టోల్‌ప్లాజాలు నిర్మించినట్లు తెలిపారు.

వ్యయం రూ.48.18 కోట్లు.. ఆదాయం రూ.25.96 కోట్లు!

కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో నిర్వహించిన ×వరల్డ్ ఫుడ్ ఇండియా–2023₹కి వ్యయం రూ.48.18 కోట్లుకాగా.. రూ.25.96 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆహారశుద్ధి పరిశ్రమల శాఖ సహాయమంత్రి రవ్‌నీత్‌సింగ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

తిరుపతిలో పీఎంఎఫ్‌ఎంఈ లబ్ధిదారులు 248 మంది

తిరుపతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థల పథకం (పీఎంఎఫ్‌ఎంఈ) లబ్ధిదారులు 248 మంది ఉన్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ప్రశ్నకు కేంద్రమంత్రి రవ్నీత్ సింగ్ జవాబిచ్చారు. వీరికి రూ.8.9 కోట్లు సబ్సిడీ రుణాలు మంజూరైనట్లు తెలిపారు. 1,959 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.7.53 కోట్ల మూలధన సహాయం, తిరుపతి ఐఐటీలో ఒక ఇంక్యుబేషన్ సెంటర్‌కు రూ.2.60 కోట్లు మంజూరైనట్లు వివరించారు. 190 మంది లబ్ధిదారులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

మీడియా పాయింట్

ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువు



సాక్షి, అమరావతి: శాసన మండలి 15 రోజుల సమావేశాల్లో ప్రభుత్వం అనుసరించిన తీరును మేం ఖండిస్తున్నాం. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించి పరిష్కారానికి ప్రయత్నం చేశాం. కానీ, ప్రభుత్వం మార్షల్స్‌తో మమ్మల్ని సభ నుంచి బయటికి పంపాలని చూసింది. సూపర్ సిక్స్‌కు నిధులు కేటాయించకుండా కాలక్షేపం చేస్తోంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలనే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదు. ఓటేశారు.. మేం గెలిచాం... ఇక దోచుకుంటే సరిపోతుందనే భావనలో ఈ ప్రభుత్వం ఉంది. ఎస్సీ వర్గీకరణపై షెడ్యూల్ కులాలు పోరాడుతున్నాయి. ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడిన వారిపై గతంలో టీడీపీ ప్రభుత్వం కేసులు పెట్టింది. ఆ కేసులను ఎత్తేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. అన్ని కులాల వారికి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ప్రభుత్వం అన్ని వర్గాలను కాపాడుకోవాలి.
– బొత్స సత్యనారాయణ, శాసనమండలి విపక్ష నేత

వైఎస్సార్ ప్రజల గుండెల్లో ఉన్నారు



కూటమి ప్రభుత్వం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిపై ఇంకా కక్ష సాధిస్తూనే ఉంది. ఆయన విగ్రహాలను కూల్చేస్తోంది. ఎక్కడా ఆయన పేరు కనపడకుండా చేయాలని ప్రయత్నిస్తోంది. విశాఖ అభివృద్ధికి వైఎస్సార్ ఎంతో కృషి చేశారు. గ్రేటర్ విశాఖగా మార్చిందే ఆయన. అలాంటి మహనీయుని పేరును క్రికెట్ స్టేడియానికి పెడితే.. కూటమి ప్రభుత్వం తొలగించడం దారుణం. ఇలాంటి చర్యలతో వైఎస్సార్‌ను, ఆయన తనయుడు వైఎస్ జగన్‌ను ప్రజల నుంచి దూరం చేయాలనుకోవడం కూటమి నేతల అవివేకం. వారెప్పుడూ ప్రజల గుండెల్లో ఉంటారు.
– వరుదు కళ్యాణి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

హామీలు ఇచ్చి నిండా ముంచారు



గత ప్రభుత్వంలో రూ.14లక్షల కోట్లు అప్పులు చేశారని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, పురందేశ్వరి దుష్ప్రచారం చేశారు. వారు అధికారంలోకి వచ్చాక గవర్నర్ ప్రసంగంలో రూ.10లక్షల కోట్లు అప్పు అని చెప్పించారు. అధికారంలోకి వస్తే చాలా చేస్తామని హామీలు ఇచ్చిన కూటమి నేతలు ప్రజలను నమ్మించి నిండా ముంచారు. మాయమాటలు చెప్పి ఈ రోజు సభను వాయిదా వేసుకొని వెళ్లిపోవచ్చు. ఆ తర్వాత సమావేశాల్లో అయినా పూర్తి డేటాతో ప్రభుత్వ తీరును ఎండగడతాం.
– తుమాటి మాధవరావు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

డయాలసిస్ యూనిట్లు పెంచాలి



శ్రీకాకుళం జిల్లాలో కిడ్నీ సమస్య పరిష్కారానికి మాజీ సీఎం వైఎస్ జగన్ కృషి చేశారు. తాగునీటి ప్రాజెక్టును నిర్మించారు. పలాసలో డయాలసిస్ సౌకర్యంతో ఆస్పత్రిని కట్టారు. కిడ్నీ బాధితుల కోసం గత ప్రభుత్వంలో దాదాపు రూ.1,500 కోట్లు కేటాయించారు. ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా ప్రభుత్వం డయాలసిస్ యూనిట్లను పెంచాలి.
– నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

వెటర్నరీ మెడికోల సమస్యలు పరిష్కరించాలి



తమకు స్టయిఫండ్ పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని చాలా రోజులుగా తిరుపతిలో వెటర్నరీ మెడికోలు ఆందోళన చేస్తున్నారు. వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని వెటర్నరీ మెడికోలతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలి.
– సిపాయి సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

సాక్షి సినిమా

స్పెషల్ సాంగ్స్‌కి సై

'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అనేది సామెత. చిత్ర పరిశ్రమలో ఈ సామెత బాగా వర్తిస్తుంది. ప్రత్యేకించి హీరోయిన్ల విషయంలో.. క్రేజ్ ఉన్నప్పుడే వరుసగా సినిమాలు చేసి, అటు ప్రేక్షకుల్ని అలరించడంతో పాటు ఇటు బ్యాంక్ బ్యాలెన్స్‌లు పెంచుకోవాలి. ఇందుకు కేవలం హీరోయిన్ పాత్రలకే పరిమితం కాకుండా ట్రెండ్‌కి తగ్గట్టుగా కెరీర్‌ని మలచుకుంటూ స్పెషల్ సాంగ్స్‌కి కూడా సై అంటున్నారు పలువురు కథానాయికలు. పైగా ప్రత్యేక పాటల్లో నటించే వారికి పారితోషికం కూడా భారీగా ఇస్తుండటంతో స్పెషల్ సాంగ్స్‌లో నర్తించేందుకు హీరోయిన్లు ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. ప్రస్తుతం పూజా హెగ్డే, శ్రియ, నేహా శెట్టి, కేతికా శర్మ, రెబా మోనికా జాన్, చంద్రికా రవి వంటి హీరోయిన్లు స్పెషల్ సాంగ్స్‌లో నటిస్తున్నారు. ఆ వివరాలేంటో చూద్దాం.



● పూజా హెగ్డే

● శ్రియ

● చంద్రికా రవి

● రెబా మోనికా జాన్

● నేహా శెట్టి

● కేతికా శర్మ

రెట్రోకి హైలైట్

'ఇష్టం' (2001) సినిమాతో హీరోయిన్‌గా పరిచయమయ్యారు శ్రియా శరణ్. చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్, ప్రభాస్, పవన్ కల్యాణ్, మహేశ్‌బాబు, ఎన్టీఆర్... ఇలా పలువురు హీరోలకి జోడీగా నటించి, స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగారు శ్రియ. ప్రస్తుతం హీరోయిన్‌గా అవకాశాలు తగ్గడంతో క్యారెక్టర్ ఆర్టిస్ట్, స్పెషల్ సాంగ్స్‌పై దృష్టి పెట్టారు శ్రియ. ప్రత్యేక పాటల్లో నర్తించడం ఆమెకు కొత్త కాదు. రామ్‌ని హీరోగా, ఇలియానాని హీరోయిన్‌గా పరిచయం చేస్తూ వైవీఎస్ చౌదరి తెరకెక్కించిన 'దేవదాసు' (2006) సినిమాలో తొలిసారి ప్రత్యేక పాటలో చిందేశారు శ్రియ. ఆ తర్వాత ప్రభాస్ హీరోగా నటించిన 'మున్నా' (2007), వెంకటేశ్ కథానాయకుడిగా నటించిన 'తులసి' (2007), పవన్ కల్యాణ్ హీరోగా చేసిన 'పులి', సందీప్ కిషన్, సాయిదుర్గా తేజ్ నటించిన 'నక్షత్రం' (2017) వంటి తెలుగు సినిమాలతో పాటు పలు తమిళ, హిందీ చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్ చేసిన శ్రియ తాజాగా 'రెట్రో' సినిమాలో ప్రత్యేక పాటలో సందడి చేయనున్నారు. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో సూర్యకి జంటగా పూజా హెగ్డే నటించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందించిన ఈ మూవీలో ఓ స్పెషల్ సాంగ్‌లో సూర్యతో కాలు కదిపారు శ్రియ. గోవాలో ప్రత్యేకంగా వేసిన సెట్స్‌లో సూర్య, శ్రియలపై ఈ పాట చిత్రీకరించారు మేకర్స్. సూర్య, జ్యోతిక, కార్తికేయ సంతానం నిర్మించిన ఈ మూవీ మే 1న విడుదల కానుంది. ఈ మూవీ తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్‌ను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ సొంతం చేసుకుంది.

ముచ్చటగా మూడోసారి

నాగచైతన్య హీరోగా నటించిన 'ఒక లైలా కోసం' (2014) సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చారు పూజా హెగ్డే. ప్రభాస్, మహేశ్‌బాబు, అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్‌చరణ్, వరుణ్ తేజ్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అఖిల్ వంటి హీరోలకి జోడీగా నటించి, తెలుగులో ఓ వెలుగు వెలిగిన ఆమె ప్రస్తుతం తమిళ, హిందీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఓ వైపు హీరోయిన్‌గా నటిస్తున్న ఈ బ్యూటీ రజనీకాంత్ హీరోగా నటిస్తున్న 'కూలీ' సినిమాలో ఓ ప్రత్యేక పాటలో నర్తించారు. రామ్‌చరణ్ హీరోగా నటించిన 'రంగస్థలం' (2018) సినిమాలోని 'జిల్ జిల్ జిగేల్ రాణి...' పూజా చేసిన తొలి స్పెషల్ సాంగ్. ఈ పాటలో రామ్‌చరణ్, పూజా హెగ్డే మాస్ డ్యాన్సులకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఆ తర్వాత 'ఎఫ్ 3' (2022) సినిమాలో 'అధ్యక్షా... లైఫ్ అంటే మినిమం ఇట్టా ఉండాలా...' అనే సాంగ్‌లో రెండోసారి చిందేసిన పూజ ముచ్చటగా మూడోసారి 'కూలీ'లో ఓ స్పెషల్ సాంగ్ చేశారు. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కూలీ'. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ మూవీలోని ప్రత్యేక పాట చాలా వెరీ వెరీ స్పెషల్‌గా ఉంటుందట. ఈ చిత్రంలో నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, శ్రుతీహాసన్ ప్రధాన పాత్రల్లో నటించారు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించిన 'కూలీ' నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం ప్రకటించ లేదు.

అది దా సర్‌ప్రైజ్

అది దా సర్‌ప్రైజ్ అంటున్నారు కేతికా శర్మ. ఆకాశ్ పూరి హీరోగా నటించిన 'రొమాంటిక్' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమకు హీరోయిన్‌గా పరిచయమయ్యారు కేతిక. 2021 అక్టోబరు 21న విడుదలైన ఈ మూవీలో ఈ అమ్మడు అందాలకు కుర్రకారు ఫిదా అయ్యారు. ఆ తర్వాత 'లక్ష్య, రంగరంగ వైభవంగా, బ్రో' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన కేతికా శర్మ తొలిసారి 'రాబిన్‌హుడ్' సినిమాలో స్పెషల్ సాంగ్ చేశారు. 'భీష్మ' (2020) వంటి హిట్ మూవీ తర్వాత హీరో నితిన్, డైరెక్టర్ వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందిన ద్వితీయ చిత్రం 'రాబిన్‌హుడ్'. శ్రీలీల హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాలో 'అది దా సర్‌ప్రైజ్...' అంటూ సాగే ప్రత్యేక పాటలో కేతికా శర్మ సందడి చేశారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించిన ఈ పాటని ఇటీవలే విడుదల చేశారు. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటని నీతి మోహన్, అనురాగ్ కులకర్ణి పాడగా, శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదలవుతోంది.

టచ్‌లో ఉండు ఓ రబ్బీ...

తమిళ చిత్ర పరిశ్రమలో హీరోయిన్‌గా నటించిన చంద్రికా రవి ఓ స్పెషల్ సాంగ్‌తో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చారు. 2019లో విడుదలైన 'చీకటి గదిలో చితక్కొట్టుడు' సినిమాలో ఓ ప్రత్యేక పాట ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారీ బ్యూటీ. ఆ తర్వాత బాలకృష్ణ హీరోగా నటించిన 'వీర సింహారెడ్డి' (2023) మూవీలో 'మా బావ మనోభావాలు దెబ్బ తిన్నాయే...' అనే స్పెషల్ సాంగ్‌లో తనదైన గ్లామర్, డ్యాన్సులతో ప్రేక్షకులను ఫిదా చేశారు చంద్రిక. తాజాగా 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ చేశారామె. '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?' సినిమా ద్వారా హీరోగా పరిచయమైన యాంకర్ ప్రదీప్ మాచిరాజు హీరోగా నటించిన ద్వితీయ చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. దర్శక ద్వయం నితిన్, భరత్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో దీపికా పిల్లి కథానాయికగా నటించారు. యూనిక్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ మూవీలో 'టచ్‌లో ఉండు ఓ రబ్బీ... ఓ రబ్బీ...' అంటూ చిందేశారు చంద్రిక. ఈ పాటకి చంద్రబోస్ మాస్ లిరిక్స్ అందించగా, లక్ష్మీ దాస, పి. రఘు పాడారు. రధన్ తనదైన హుషారైన సంగీతం అందించారు. శేఖర్ మాస్టర్ నృత్యరీతులు సమకూర్చారు. మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్‌పై రూపొందిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' ఏప్రిల్ 11న విడుదల కానుంది.

నా ముద్దుపేరు స్వాతి రెడ్డి

శ్రీవిష్ణు హీరోగా నటించిన 'సామజవర గమన' (2023) సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు రెబా మోనికా జాన్. ఆ సినిమా సూపర్ హిట్ అవడంతో ఈ బ్యూటీ క్రేజ్ ఓ రేంజ్‌కి వెళ్లింది. ప్రస్తుతం ఆమె 'మృత్యుంజయ్' మూవీలో శ్రీవిష్ణుతో రెండోసారి జోడీగా నటిస్తున్నారు. ఓ వైపు హీరోయిన్‌గా నటిస్తున్న ఈ బ్యూటీ మరోవైపు 'మ్యాడ్ స్క్వేర్' సినిమాలో స్పెషల్ సాంగ్ చేశారు. సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ హీరోలుగా నటించిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ప్రియాంకా జవాల్కర్, మురళీధర్ గౌడ్, డైరెక్టర్ కేవీ అనుదీప్ కీలక పాత్రలు పోషించారు. 'మ్యాడ్'కి (2023) సీక్వెల్‌గా రూపొందిన 'మ్యాడ్ స్క్వేర్'లో రెబా మోనికా జాన్ ప్రత్యేక గీతంలో సందడి చేయనున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. 'నా ముద్దుపేరు పెట్టుకున్న స్వాతి రెడ్డి... నే ముట్టుకుంటే భగ్గుమంది పచ్చ ఎండు గడ్డి...' అంటూ సాగే ఈ పాటలో హుషారైన స్టెప్పులు వేశారు రెబా. సురేష్ గంగుల సాహిత్యం అందించిన ఈ పాటని స్వాతి రెడ్డి, భీమ్స్ ఆలపించారు. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న రిలీజ్ కానుంది.

మొదటి సారి...

ఆకాశ్ పూరి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన 'మెహబూబా' (2018) సినిమా ద్వారా హీరోయిన్‌గా తెలుగుకి పరిచయం అయ్యారు కన్నడ బ్యూటీ నేహా శెట్టి. ఆ సినిమా తర్వాత 'గల్లీ రౌడీ, డీజే టిల్లు, బెదురులంక 2012, రూల్స్ రంజన్, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' వంటి సినిమాల్లో నటించి, మెప్పించారామె. సిద్ధు జొన్నలగడ్డకి జోడీగా నటించిన 'డీజే టిల్లు' (2022) సినిమాలో రాధిక పాత్రతో కుర్రకారు మనసులు దోచేశారీ బ్యూటీ. ఈ మూవీలో ఆమె నటన, గ్లామర్‌కి ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇదిలా ఉంటే నేహా శెట్టి తొలిసారి ఓ ప్రత్యేక పాటలో చిందేశారు. పవన్ కల్యాణ్ హీరోగా 'సాహో' మూవీ ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్). డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమాలో ప్రియాంకా మోహన్, శ్రియా రెడ్డి హీరోయిన్లుగా నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉందట. ఆ పాటలో పవన్ కల్యాణ్‌తో కలిసి చిందేశారట నేహా శెట్టి. థాయ్‌ల్యాండ్‌లో ఈ పాటని చిత్రీకరించారని సమాచారం. ఈ సినిమా ఈ ఏడాది సెప్టెంబరులో రిలీజ్ కానుందని ఫిల్మ్‌నగర్ టాక్.

వీరే కాదు.. మరి కొందరు హీరోయిన్లు కూడా ప్రత్యేక పాటల్లో సందడి చేయనున్నారు.

చిరంజీవి హీరోగా నటిస్తున్న చిత్రం 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉందట. ఆ పాటలో చిరంజీవితో కలిసి ఊర్వశీ రౌతేలా చిందేయనున్నారని టాక్. 'వాల్తేరు వీరయ్య' (2023) సినిమాలో 'వేర్ ఈజ్ ద పార్టీ...' అనే ప్రత్యేక పాటలో చిరంజీవి- ఊర్వశీ రౌతేలా తమదైన స్టెప్పులతో అలరించిన సంగతి తెలిసిందే. ఈ పాట సూపర్ హిట్‌గా నిలిచింది. దీంతో 'విశ్వంభర'లోనూ చిరంజీవితో కలిసి స్పెషల్ సాంగ్‌లో ఊర్వశి మెరవనున్నారట. విక్రమ్ రెడ్డి సమర్పణలో యూవీ క్రియేషన్స్‌పై వంశీ కృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మిస్తున్న ఈ మూవీ ఈ వేసవిలో విడుదల కానుందని టాక్. ఇదిలా ఉంటే... బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ హీరోగా టాలీవుడ్ దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కించిన హిందీ చిత్రం 'జాట్'. ఈ మూవీలో రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా ఇతర కీలక పాత్రధారులు. తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉందట. ఆ పాటలో హీరోయిన్ నిధీ అగర్వాల్ మెరవనున్నారని టాక్. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీలపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ మూవీ ఏప్రిల్ 10న రిలీజ్ కానుంది. కాగా 'విశ్వంభర'లో ఊర్వశీ రౌతేలా, 'జాట్'లో నిధీ అగర్వాల్ స్పెషల్ సాంగ్స్ విషయంపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రాలేదు.

– దేరంగుల జగన్ మోహన్

ప్రేమ వెల్లువ



● శ్రీనిధి, నాని

నాని హీరోగా నటించిన తాజా ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'హిట్: ది థర్డ్ కేస్'. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించారు. శైలేష్ కొలను దర్శకత్వంలో వాల్ పోస్టర్ సినిమా, నాని యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం మే 1న విడుదల కానుంది. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయినట్లుగా తెలిసింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా జరుగుతున్నాయట. కాగా ఈ మూవీలోని 'ప్రేమ వెల్లువ..' పాట లిరికల్ వీడియోను ఈ నెల 24న రిలీజ్ చేయనున్నట్లుగా వెల్లడించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''నాని, శ్రీనిధి శెట్టిల బ్యూటిఫుల్ కెమిస్ట్రీని ఈ మూవీ ప్రజెంట్ చేస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.

ఈ మూవీలో మ్యాజిక్ ఉంది

– మోహన్‌లాల్

మోహన్‌లాల్ హీరోగా నటించిన చిత్రం 'ఎల్2ఈ: ఎంపురాన్'. ఈ చిత్రంలోని మరో కీలక పాత్రలో నటించి, ఈ సినిమాకు దర్శకత్వం వహించారు పృథ్వీరాజ్ సుకుమారన్. ఆంటోనీ పెరుంబవూర్, గోకులం గోపాలన్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో విడుదల



● మోహన్‌లాల్, పృథ్వీరాజ్

చేశారు. ఈ సందర్భంగా ముంబైలో జరిగిన 'ఎల్2ఈ: ఎంపురాన్' మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మోహన్‌లాల్ మాట్లాడుతూ– ''మలయాళ సినీ ఇండస్ట్రీ నుంచి వస్తోన్న తొలి ఐమ్యాక్స్ ఫార్మాట్ మూవీ ఎల్2ఈ: ఎంపురాన్'. ఈ మూవీలో మ్యాజిక్ ఉంది. ఆడియన్స్‌తో కలిసి ఈ సినిమాను చూసేందుకు ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నాను. ఇదొక ట్రయాలజీ మూవీ. తొలి పార్ట్‌గా 'లూసీఫర్' వచ్చింది. రెండో పార్ట్‌గా 'ఎల్2ఈ: ఎంపురాన్' రాబోతోంది. మరో సినిమాను రూపొందించాల్సి ఉంది'' అని అన్నారు. ''2022లో మోహన్‌లాల్‌గారిని కలిసి, 'ఎల్2ఈ: ఎంపురాన్' మూవీ కథ చెప్పాను. ఈ సినిమా మనం చేస్తున్నాం అన్నారు. ఆయన నమ్మకమే నన్నింత దూరం నడిపించింది. హిందీలో అనిల్ తడానీ ఏఏ ఫిల్మ్స్, తమిళంలో శ్రీ గోకులం మూవీస్, కర్ణాటకలో హోంబలే ఫిల్మ్స్, తెలుగులో 'దిల్' రాజు వెంకటేశ్వర క్రియేషన్స్ ఇలా మా సినిమాను... దేశంలోని ప్రముఖ సంస్థలు డిస్ట్రిబ్యూట్ చేస్తుండటం హ్యాపీగా ఉంది'' అని తెలిపారు పృథ్వీరాజ్ సుకుమారన్.

బెగ్గర్?



● విజయ్ సేతుపతి

హీరో విజయ్ సేతుపతి, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుందనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల విజయ్ సేతుపతిని కలిసి పూరి జగన్నాథ్ ఓ కథ వినిపించారట. కథ నచ్చడంతో పూరి జగన్నాథ్‌తో సినిమా చేసేందుకు సిద్ధమయ్యారట విజయ్ సేతుపతి. కాగా ఈ సినిమాకు 'బెగ్గర్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని సమాచారం. పూరి కనెక్ట్స్ ఈ మూవీని నిర్మించనుందని భోగట్టా. త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని, వచ్చే ఏడాది ఈ మూవీ రిలీజ్ అయ్యేలా షూటింగ్ షెడ్యూల్స్‌ని యూనిట్ ప్లాన్ చేస్తోందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై పూర్తి స్థాయి అధికారిక సమాచారం అందాల్సి ఉంది.



● తమన్నా

ఫారెస్ట్‌లో అడ్వెంచర్

ఫారెస్ట్‌లో అడ్వెంచర్ చేయనున్నారట హీరోయిన్ తమన్నా. అజయ్ దేవగన్ హీరోగా 'మిషన్ మంగళ్' ఫేమ్ జగన్ శక్తి డైరెక్షన్‌లో ఓ ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ ఫిల్మ్ తెరకెక్కనుంది. ఈ మూవీలో సంజయ్ దత్ మరో లీడ్ రోల్‌లో నటించనున్నారట. ఈ సినిమాకు 'రేంజర్' అనే టైటిల్ అనుకుంటున్నారని, ఈ నెలాఖర్లో ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నారని బాలీవుడ్ టాక్. అంతేకాదు... ఈ మూవీలో తమన్నా హీరోయిన్‌గా నటించనున్నారని, ఈ సినిమా షూటింగ్ కోసం తమన్నా ఎక్కువగా కాల్షీట్స్ కేటాయించారని సమాచారం. ఇంకా ఈ చిత్రంలో తమన్నా పాత్రకూ యాక్షన్ సీక్వెన్స్‌లు ఉంటాయట. ఈ సినిమా చిత్రీకరణను వేగంగా పూర్తి చేసి, 2026 రిలీజ్ చేయాలన్నది యూనిట్ ప్లాన్ అని బాలీవుడ్ భోగట్టా.

బిజినెస్ రీల్

2030 నాటికి రెట్టింపు ఉద్యోగాలు: ఇన్ఫినియోన్



న్యూఢిల్లీ: వేగంగా వృద్ధి చెందుతున్న భారత మార్కెట్ తమ కార్యకలాపాలకు సంబంధించి కీలకంగా ఎదుగుతోందని జర్మన్ సెమీకండక్టర్ల సంస్థ ఇన్ఫినియోన్ టెక్నాలజీస్ సీఎంవో ఆండ్రియాస్ ఉర్షిజ్ తెలిపారు. తమకు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 58,000 మంది, భారత్‌లో 2,500 మంది పైగా ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. భారత్‌లో పరిశోధన.. అభివృద్ధి కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తున్న నేపథ్యంలో 2030 నాటికి ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు చేసుకోనున్నట్లు ఆయన వివరించారు. దేశీయంగా ఇతర భాగస్వాములతో కలిసి పని చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఆండ్రియాస్ పేర్కొన్నారు. ప్రస్తుతానికి తమ గ్రూప్ ఆదాయంలో భారత్ వాటా సింగిల్ డిజిట్ స్థాయిలోనే ఉన్నప్పటికీ, రాబోయే రోజుల్లో ఇది మరింతగా పెరగనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే, సమీప భవిష్యత్తులో ఇక్కడ తయారీ ప్లాంటు ఆలోచనేదీ లేదని వివరించారు. మరోవైపు, కొత్త ఆవిష్కరణలను వేగవంతం చేసే దిశగా ఎలక్ట్రానిక్స్, మైక్రో ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో స్టార్టప్‌లకు సహాయం అందించేందుకు వాణిజ్య, పరిశ్రమల శాఖ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆండ్రియాస్ చెప్పారు.

ఆరు నెలల్లో పెట్రోల్ వాహన రేట్లకే ఈవీలు: గడ్కరీ



న్యూఢిల్లీ: వచ్చే ఆరు నెలల్లో దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల ధరలు, పెట్రోల్ వాహనాల రేట్ల స్థాయికి చేరతాయని కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. దిగుమతులకు ప్రత్యామ్నాయంగా, చౌకగా, కాలుష్యరహితంగా, దేశీయంగానే ఉత్పత్తులను తయారు చేయడాన్ని ప్రోత్సహించాలనేది ప్రభుత్వ విధానమని ఆయన తెలిపారు. మూడో అతి పెద్ద ఎకానమీగా భారత్ ఎదగాలంటే మౌలిక సదుపాయాలు మెరుగుపడాలని 32వ కన్వర్జెన్స్ ఇండియా కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా వివరించారు. రహదారులను మెరుగుపర్చుకోవడం ద్వారా లాజిస్టిక్స్ వ్యయాల తగ్గించుకోవచ్చని మంత్రి చెప్పారు. ఢిల్లీ–డెహ్రాడూన్ మధ్య 212 కి.మీ. మేర నిర్మిస్తున్న ఎక్స్‌ప్రెస్‌వే మరో మూడు నెలల్లో పూర్తవుతుందని పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణ వ్యయాలను తగ్గించేందుకు కొత్త టెక్నాలజీలు, ఆవిష్కరణలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-3-2025

విశాఖ	420-00
చిత్తూరు	470-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	440-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	420-00
వరంగల్	422-00
రిటైల్ ధర	4.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BHARTIARTL	1,704.00	4.08
TITAN	3,183.05	3.47
EICHERMOT	5,234.00	2.61
BAJAJ-AUTO	7,920.00	2.57
BRITANNIA	4,828.00	2.57

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	685	-1.11
BAJFINANCE	8,680.00	-0.59
TRENT	5,215.00	-0.3
SHRIRAMFIN	666.3	-0.25
AXISBANK	1,052.00	-0.1

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,629
ఎన్ఎస్ఈ	1,04,176
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,05,815
ఎఫ్ఐఐ	+ 3,239
డీఐఐ	- 3,136

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.00 $	66.91
బ్రెంట్	71.92 $	70.78

రష్యా క్రూడ్‌తో అమెరికాకు ఇంధనం

- 724 మిలియన్ యూరోల మేర రిలయన్స్ సరఫరా
- నయారా ఎనర్జీ, ఎంఆర్‌పీఎల్ సైతం



న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏడాది కాలంలో 724 మిలియన్ యూరోల విలువైన రష్యా ముడి చమురును ఇంధనంగా మార్చి అమెరికాకు ఎగుమతి చేసింది. ''2024 జనవరి నుంచి 2025 జనవరి మధ్యకాలంలో 2.8 బిలియన్ యూరోల శుద్ధి చేసిన ఇంధనాన్ని భారత్, టర్కీలోని ఆరు రిఫైనరీల నుంచి అమెరికా దిగుమతి చేసుకుంది. ఇందులో 1.3 బిలియన్ యూరోల విలువ చేసే ఇంధనం రష్యా చమురుతో తయారైనది''అని సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) ఒక నివేదికలో వెల్లడించింది. గుజరాత్‌లోని రిలయన్స్ జామ్‌నగర్ యూనిట్ల నుంచి అమెరికా రెండు బిలియన్ యూరోల పెట్రోల్, డీజిల్‌ను దిగుమతి చేసుకోగా.. ఇందులో 724 మిలియన్ యూరోల (రూ.6,733 కోట్లు సుమారు) విలువైన ఇంధనం రష్యా ముడి చమురు ఆధారితమేనని తెలిపింది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై దాడికి నిరసనగా రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆర్థిక ఆంక్షలు విధించడం తెలిసిందే. దీంతో రష్యా నేరుగా ఎగుమతి చేయడానికి అవకాశం లేకుండా పోయింది. గుజరాత్‌లోని వాదినార్‌లో రష్యా రోజ్‌నెఫ్ట్‌కు చెందిన నయారా ఎనర్జీకి 20 మిలియన్ టన్నుల సామర్థ్యంతో రిఫైనరీ ఉంది. ఈ సంస్థ సైతం గతేడాది కాలంలో అమెరికాకు 184 మిలియన్ యూరోల ఇంధనాన్ని ఎగుమతి చేసినట్టు ఈ నివేదిక వెల్లడించింది. ఇందులోనూ 124 మిలియన్ యూరోల విలువ మేర రష్యా ముడి చమురు ఆధారితమేనని పేర్కొంది. ప్రభుత్వరంగ ఎంఆర్‌పీఎల్ సైతం అమెరికాకు 42 మిలియన్ యూరోల విలువైన ఇంధనాన్ని ఎగుమతి చేయగా, ఇందులో 22 మిలియన్ యూరోల మేర రష్యా ముడి చమురుతో చేసిందేనని ఈ నివేదిక తెలిపింది.

చమురుపై ఇక విండ్‌ఫాల్ ట్యాక్స్‌లు ఉండవు

పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్ పురి



న్యూఢిల్లీ: ఆయిల్‌ఫీల్డ్స్ (నియంత్రణ, అభివృద్ధి) బిల్లు అమల్లోకి వచ్చాక చమురు, గ్యాస్ కంపెనీల అసాధారణ లాభాలపై విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్‌ల్లాంటి కొత్త పన్నుల విధింపు బాదరబందీ ఉండదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. బిల్లుకు పార్లమెంటు ఆమోదముద్ర వేయడాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఈ విషయం చెప్పారు. ఇన్వెస్టర్లకు ఆర్థిక విధానాల స్థిరత్వంపై కొత్త చట్టం భరోసా కల్పిస్తుందని పురి వివరించారు. అంతర్జాతీయంగా పలు ఆయిల్ దిగ్గజాలు భారత్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశాలను పరిశీలిస్తున్నాయని ఆయన చెప్పారు. ప్రభుత్వ రంగ ఆయిల్ ఇండియాతో బ్రెజిల్‌కి చెందిన పెట్రోబ్రస్, ఓఎన్‌జీసీతో ఎక్సాన్‌మొబిల్, ఈక్వినార్ వంటి సంస్థలు చర్చలు జరుపుతున్నట్లు మంత్రి వివరించారు. ఇతర దేశాల తరహాలోనే, ఇంధన కంపెనీలకు వచ్చే అసాధారణ లాభాలపై 2022 జూలై 1 నుంచి భారత్ విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్‌లు విధించడం మొదలుపెట్టింది. పెట్రోల్.. ఏటీఎఫ్‌పై లీటరుకు రూ. 6 చొప్పున, డీజిల్‌పై లీటరుకు రూ. 13 చొప్పున ఎగుమతి సుంకాలు విధించింది. దేశీయంగా క్రూడాయిల్ ఉత్పత్తిపైనా టన్నుకు రూ. 23,250 చొప్పున విధించింది. పలుమార్లు సవరించిన ఈ ట్యాక్స్‌లను 30 నెలల తర్వాత గతేడాది డిసెంబర్‌లో నిలిపివేసింది.

ఈపీఎఫ్‌వోలోకి 17.89 లక్షల కొత్త సభ్యులు

- 11.67 శాతం పెరుగుదల
- జనవరి పేరోల్ గణాంకాలు విడుదల



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) కిందకు జనవరిలో 17.89 లక్షల మంది కొత్తగా చేరారు. క్రితం ఏడాది జనవరి నెల గణాంకాలతో పోల్చి చూస్తే 11.67 శాతం మందికి అదనంగా ఉపాధి లభించింది. 2024 డిసెంబర్ నెల గణాంకాలతో పోల్చి చూసినా ఉపాధి కల్పనలో 11.48 శాతం వృద్ధి నమోదైంది. ఇక ఈపీఎఫ్‌వో పరిధిలోకి మొదటిసారి 8.23 లక్షల మంది వచ్చి చేరారు. క్రితం ఏడాది జనవరితో పోల్చి చూస్తే 1.87 శాతం మందికి అదనంగా మొదటిసారి సంఘటిత రంగంలో ఉపాధి పొందినట్టు తెలుస్తోంది. మొదటిసారి సభ్యుల్లో 4.70 లక్షల మంది (57 శాతం) 18.25 ఏళ్ల వయసులోని వారున్నారు. వార్షికంగా చూస్తే ఈ వయసులోని వారు 3% అధికంగా ఉపాధి పొందారు. జనవరిలో 15.03 లక్షల మంది సభ్యులు ఒక సంస్థలో ఉద్యోగం మానేసి, మరో సంస్థలో చేరారు. క్రితం ఏడాది జనవరితో పోల్చి చూసినప్పుడు 23 శాతం పెరుగుదల కనిపించింది. అంటే ఉద్యోగ వలసలు అధికమైనట్టు కనిపిస్తోంది. వీరంతా పూర్వపు సంస్థ నుంచి కొత్త సంస్థకు ఈపీఎఫ్‌వో ఖాతా బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు.

2.17 లక్షల మంది మహిళలు

కొత్త సభ్యుల్లో 2.17 లక్షల మంది మహిళలు ఉన్నారు. క్రితం ఏడాది జనవరితో పోల్చి చూస్తే 6 శాతం పెరుగుదల నమోదైంది. జనవరిలో 60 శాతం మేర సభ్యుల చేరిక ఐదు రాష్ట్రాల నుంచే ఉండడం గమనార్హం. అత్యధికంగా మహారాష్ట్ర నుంచి 22.77 శాతం మంది ఈపీఎఫ్‌వోలో చేరారు. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, హర్యానా, ఢిల్లీ, యూపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి సభ్యుల చేరిక విడిగా 5 శాతానికి పైన ఉంది. నైపుణ్య సేవలు, రోడ్డు మోటారు రవాణా తదితర రంగాలు ఎక్కువ మందికి ఉపాధి కల్పించాయి. ఇందులో 40 శాతం మందికి నైపుణ్య సేవల్లో ఉపాధి లభించింది.

వాణిజ్య అవరోధాలపై ప్రధాన దృష్టి

ఎఫ్‌టీఏ ప్రతిపాదనలపై వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ వెల్లడి



న్యూఢిల్లీ: ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్లో (ఎఫ్‌టీఏ) దిగుమతి సుంకాలు, టారిఫ్‌యేతర అంశాల్లాంటి ప్రధాన వాణిజ్య అవరోధాలపై ముందుగా దృష్టి పెడుతున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బరత్‌వాల్ తెలిపారు. సాధారణంగా ఇవి ఓ కొలిక్కి వచ్చేసరికే ఎక్కువ సమయం పట్టేస్తుందని, అప్పటికల్లా అందరికీ ఎఫ్‌టీఏలపై ఆసక్తి తగ్గిపోతుందని ఆయన పేర్కొన్నారు. అందుకే టారిఫ్‌లు, టారిఫ్‌యేతర అడ్డంకులు, నియంత్రణ సంస్థలపరమైన సమస్యలు మొదలైన వాటిని ముందుగా పరిష్కరించుకునే విధానం పాటించడం శ్రేయస్కరమని చెప్పారు. సీఐఐ నిర్వహించిన ఇండియా-ఎల్ఏసీ (లాటిన్ అమెరికా-కరీబియన్) బిజినెస్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా సునీల్ ఈ విషయాలు వివరించారు. భారత్ ఇప్పటికే బ్రెజిల్, పరాగ్వే తదితర దేశాలతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతోందని, ఎల్ఏసీ ప్రాంత దేశాలతో కూడా అవరోధాలను అధిగమించే అవకాశాలను పరిశీలిస్తోందని చెప్పారు. ప్రపంచ దేశాలు రక్షణాత్మక ధోరణులను తగ్గించుకుని వాణిజ్య వృద్ధికి ఊతమివ్వాలని సూచించారు. ఆటోమొబైల్, మెడికల్ డివైజ్‌లు, ఫార్మా తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించుకునేందుకు అవకాశాలు ఉన్నాయని సునీల్ చెప్పారు.

బీఎండబ్ల్యూ, రెనో ఇండియా కార్ల ధరల పెంపు



న్యూఢిల్లీ: బీఎండబ్ల్యూ, రెనో ఇండియా కార్ల ధరలు ఏప్రిల్ 1 నుంచి పెరగనున్నాయి. బీఎండబ్ల్యూ, మినీ వాహన శ్రేణిలోని అన్ని మోడళ్లపై 3% వరకు ధరల్ని పెంచుతున్నట్లు ప్రకటించింది. తయారీ వ్యయం, ముడి సరకు ధరలు, నిర్వహణ ఖర్చులు పెరిగిన కారణంగా కార్ల ధరలను 2% మేర పెంచుతున్నట్లు రెనో ఇండియా సీఈఓ ఎండీ వెంకట్రామ్ మామిళ్లపల్లె తెలిపారు. 2023 ఫిబ్రవరి తర్వాత రెనో ఇండియా తమ వాహన ధరలు పెంచడం ఇదే తొలిసారి. మారుతీ సుజుకీ, కియా ఇండియా, టాటా మోటార్స్, హోండా కార్స్, హ్యుందాయ్ కార్ల ధరలు కూడా ఏప్రిల్ 1 నుంచి పెరగనున్నాయి.

కేవైసీ కోసం కస్టమర్లను వేధించొద్దు

బ్యాంక్‌లకు ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా సూచన



ముంబై: ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బ్యాంక్‌లకు కీలక సూచన చేశారు. నో యువర్ కస్టమర్ (కేవైసీ/నీ కస్టమర్ గురించి తెలుసుకో) డాక్యుమెంట్ల కోసం కస్టమర్లకు అదేపనిగా తరచూ కాల్ చేస్తూ వేధించొద్దన్నారు. ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్ వార్షిక సదస్సులో భాగంగా ఆయన మాట్లాడారు. ఏదేనీ ఆర్థిక నియంత్రణ సంస్థ పరిధిలో ఒక కస్టమర్ ఒక చోట (బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ తదితర) సమర్పించిన కేవైసీ డాక్యుమెంట్లను.. ఇతర సంస్థలు సైతం పొందడానికి అవకాశం ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. కస్టమర్ ఒకసారి ఒక ఆర్థిక సంస్థకు పత్రాలను సమర్పించినట్టయితే, అవే పత్రాలను మళ్లీ, మళ్లీ సమర్పించాలంటూ కోరకుండా చూడాలన్నారు. తరచూ కేవైసీ డాక్యుమెంట్లను బ్యాంకులు కోరుతుండడం పట్ల సోషల్ మీడియాపై చాలా మంది నిరసన వ్యక్తం చేస్తుండడంతో, ఆర్‌బీఐ గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కస్టమర్ల ఫిర్యాదుల సంఖ్యను బ్యాంకులు తగ్గించి చూపించరాదని, అలా చేయడం నిబంధనలను ఉల్లంఘించినట్టు అవుతుందని బ్యాంకులను ఆర్‌బీఐ గవర్నర్ హెచ్చరించారు. బ్యాంకులు తమ సేవలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారానికి బ్యాంక్ మేనేజర్ల నుంచి మేనేజింగ్ డైరెక్టర్ల వరకు సమయం కేటాయించాలన్నారు.

250 బిలియన్ డాలర్లకు ఐటీ సర్వీసులు

ఎస్‌టీపీఐ డీజీ అరవింద్ కుమార్ వెల్లడి




న్యూఢిల్లీ: దాదాపు మూడు దశాబ్దాల క్రితం కేవలం 20 మిలియన్ డాలర్లుగా ఉన్న ఐటీ, ఐటీ ఆధారిత సేవల ఆదాయం నేడు 250 బిలియన్ డాలర్ల స్థాయిని అధిగమించినట్లు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) డైరెక్టర్ జనరల్ అరవింద్ కుమార్ తెలిపారు. ఇందులో 200 బిలియన్ డాలర్ల ఆదాయం ఎగుమతుల నుంచే వచ్చిందని పేర్కొన్నారు. 1992–93లో ఐటీ–ఐటీఈఎస్ రెవెన్యూ కేవలం 20 మిలియన్ డాలర్లని ఇండియాసాఫ్ట్ 2025, ఇండియా ఎలక్ట్రానిక్స్ ఎక్స్‌పో కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా వివరించారు. ఎగుమతులను ప్రోత్సహించడంలో ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ కీలకంగా వ్యవహరిస్తోందని అరవింద్ కుమార్ వివరించారు. దేశీయంగా టెక్నాలజీ వ్యవస్థ చాలా వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. 1,58,000 స్టార్టప్‌లు నమోదు చేసుకోగా, వీటిలో 78,000 అంకురాలు టెక్నాలజీ రంగానికి చెందినవేనని అరవింద్ కుమార్ వివరించారు. ఎస్‌టీపీఐతో పాటు వివిధ శాఖలు.. అంకుర సంస్థలను ప్రోత్సహిస్తున్నాయన్నారు. 50 శాతం పైగా స్టార్టప్‌లు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచి ఉంటున్నాయని, అంకుర సంస్థల వ్యవస్థాపకులు లేదా డైరెక్టర్లలో సగం మంది పైగా మహిళలు ఉంటున్నారని అరవింద్ వివరించారు.

2026లో నిధుల సమీకరణకు జోష్

- ప్రభుత్వ వాటా విక్రయ ప్రణాళికల ఎఫెక్ట్
- ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ అంచనాలు



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం(2025–26)లో ప్రభుత్వం చేపట్టనున్న వాటా విక్రయ ప్రణాళికలు నిధుల సమీకరణకు జోష్‌నిచ్చే వీలున్నట్లు ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పేర్కొంది. ఇటీవల మార్కెట్ దిద్దుబాటు కారణంగా డీల్ యాక్టివిటీ మందగించినట్లు తెలియజేసింది. ఇండియన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ ఇండస్ట్రీ అంశాలపై ఏర్పాటైన వెబినార్‌లో ప్రసంగిస్తూ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సీఈవో యతిన్ సింగ్ ఈ అంశాలను పేర్కొన్నారు. వచ్చే ఏడాదికి వాటా విక్రయాల ద్వారా రూ. 47,000 కోట్ల లక్ష్యాన్ని దీపమ్ నిర్దేశించుకున్నట్లు తెలియజేశారు. దీంతో దేశీయంగా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులకు ప్రభుత్వం మెటీరియల్ క్లయింట్‌గా నిలవనున్నట్లు అభిప్రాయపడ్డారు. వెరసి వచ్చే ఏడాదితోపాటు ఆపై కాలంలో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులకు ఇది భారీ అవకాశంగా నిలవనున్నట్లు అంచనా వేశారు. గత మూడేళ్లుగా పీఎస్‌యూ దిగ్గజాలు ఎల్ఐసీ, ఇరెడా ఐపీవోలతో పాటు.. ఓఎన్‌జీసీ, ఐఆర్‌సీటీసీ, హిందుస్తాన్ ఏరోనాటిక్స్(హెచ్ఏఎల్), కోల్ ఇండియా, ఆర్‌వీఎన్ఎల్, ఎన్‌హెచ్‌పీసీ, హడ్కో, ఇర్కాన్, కొచిన్ షిప్‌యార్డ్ తదితర ఓఎఫ్ఎస్‌ల కారణంగా డీల్ స్ట్రీట్ యాక్టివ్‌గా ఉన్నట్లు తెలియజేశారు. భవిష్యత్‌లోనూ భారత్ కోకింగ్ కోల్, సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్(సీఎంపీడీఐ), మహారాష్ట్ర నేచురల్ గ్యాస్(ఎంఎస్‌జీఎల్) పబ్లిక్ ఇష్యూలుసహా.. ఇరెడా, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్, వీడల్, సెంట్రల్ బ్యాంక్, యుకో బ్యాంక్, ఐవోబీ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ క్విప్, ఓఎఫ్ఎస్ తదితరాలు భారీ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు.



పార్లమెంటుతో ఇండియా ఏఐ మిషన్ ఒప్పందం

న్యూఢిల్లీ: స్వదేశీ కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీ రూపకల్పనపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇందులో భాగంగా పార్లమెంటు–ఇండియా ఏఐ మిషన్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఏఐ రూపకల్పన కోసం పార్లమెంటు వద్ద ఉండే విస్తృత డేటాను ఉపయోగించేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. దూరదర్శన్, ఆలిండియా రేడియో మొదలైన సంస్థల దగ్గర కూడా డేటా సమృద్ధిగా ఉంటుందని, స్వంత ఎల్ఎల్ఎం (చాట్‌జీపీటీ లాంటి లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్స్)ను రూపొందించేందుకు దాన్ని కూడా ఉపయోగించుకోవచ్చని మంత్రి వివరించారు. అలాగే, సొంత గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను (జీపీయూ) తయారు చేసుకోవడం కూడా ముఖ్యమని, ఇప్పటికే దీనిపై పరిశ్రమతో కలిసి ప్రభుత్వం పని చేస్తోందని ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చెప్పారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్ తరహాలో వచ్చే 2-3 ఏళ్లలో 50-100 బిలియన్ డాలర్ల మేర నిధులను సమకూరిస్తే ఉపయుక్తంగా ఉంటుందన్న ఇండో–యూఎస్ వెంచర్ పార్ట్‌నర్స్ వ్యవస్థాపకుడు వినోద్ ధామ్ సూచనపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

ఎన్‌హెచ్‌ఐటీలో ఎస్‌బీఐ ఎంఎఫ్ 5 శాతం వాటాల విక్రయం



న్యూఢిల్లీ: నేషనల్ హైవేస్ ఇన్‌ఫ్రా ట్రస్ట్‌లో (ఎన్‌హెచ్‌ఐటీ) ఎస్‌బీఐ మ్యుచువల్ ఫండ్ గురువారం 4.7 శాతం వాటాలు విక్రయించింది. ఓపెన్ మార్కెట్లో నిర్వహించిన ఈ లావాదేవీ విలువ రూ. 815 కోట్లు. ఎన్ఎస్ఈలోని బల్క్ డీల్ డేటా ప్రకారం ఎస్‌బీఐ ఎంఎఫ్ 6.10 కోట్ల పైగా యూనిట్లను (4.7 శాతం వాటా) సగటున రూ. 133.50 రేటుకు విక్రయించింది. దీనితో ఎన్‌హెచ్‌ఐటీలో దాని వాటా 9.34 శాతం నుంచి 4.69 శాతానికి తగ్గింది. మరోవైపు, ఇన్‌ఫ్రా దిగ్గజం లార్సన్ అండ్ టూబ్రో (ఎల్‌అండ్‌టీ), విద్యానీతి ఎల్ఎల్‌పీ సుమారు రూ. 799 కోట్ల విలువ చేసే 5.99 కోట్ల షేర్లు కొనుగోలు చేశాయి.

గురువారం ఎన్‌హెచ్‌ఐటీ షేర్లు ఎన్ఎస్ఈలో 1% పెరిగి రూ. 133.50 వద్ద క్లోజయ్యాయి.

రూ.10 లక్షల కోట్ల దివాలా పరిష్కారాలు

- 28,818 ఐబీసీ దరఖాస్తులకు ఆమోదం
- కేంద్ర సహాయ మంత్రి హర్ష మల్హోత్ర



న్యూఢిల్లీ: దివాలా చట్టం (ఐబీసీ) కింద ఇప్పటి వరకు 28,828 దరఖాస్తులకు పరిష్కారం లభించినట్టు కేంద్ర కార్పొరేట్ శాఖ సహాయ మంత్రి మర్ష మల్హోత్రా ప్రకటించారు. వీటి మొత్తం రూ.10 లక్షల కోట్లుగా ఉంటుందని లోక్‌సభకు తెలియజేశారు. ''మొత్తం 40,943 దరఖాస్తులు ఐబీసీ కింద దాఖలయ్యాయి. ఇందులో 28,818 దరఖాస్తులు పరిష్కారమయ్యాయి. ఇదొక గొప్ప విజయం''అని మంత్రి పేర్కొన్నారు. 2016లో ఐబీసీని తీసుకురావడం భారత్‌కు ఎంతో మేలు చేసిందన్నారు. అంతర్జాతీయంగా వ్యాపార సులభతర సూచీలో భారత్ ర్యాంక్ 2018లో 108గా ఉంటే, 2019లో 52కు మెరుగుపడినట్టు తెలిపారు. గృహ కొనుగోలుదారుల కోసం ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చిన విషయాన్ని సైతం ప్రస్తావించారు. ''ఏదైనా బిల్డర్ లేదా వినియోగదారుడు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ను ఆశ్రయించినట్టయితే.. పరిష్కారం టవర్ నుంచి టవర్‌కు విడిగా ఉండేలా చర్యలు తీసుకున్నాం''అని వివరించారు.

అపరిష్కృతానికి ఎన్నో కారణాలు

2024 డిసెంబర్ చివరికి కంపెనీల చట్టం కింద 8,133 కేసులు, ఐబీసీ కింద 12,351 కేసులు ఎన్‌సీఎల్‌టీ వద్ద అపరిష్కృతంగా ఉన్నట్టు సహాయ మంత్రి హర్ష మల్హోత్ర తెలిపారు. ఒక్కో కేసులో ఉండే సంక్లిష్టతలు, సాక్ష్యాల తీరు, ఉన్నత న్యాయస్థానాల్లో స్టేలు, భాగస్వాముల మధ్య సహకార లేమి, వాయిదాలు ఇవన్నీ పరిష్కారంలో జాప్యానికి కారణాలుగా పేర్కొన్నారు. ''కేసులను వేగంగా పరిష్కరించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది. ఈ–కోర్టు, హైబ్రిడ్ కోర్టు ప్రాజెక్ట్, సామర్థ్యాన్ని పెంచడానికి తరచూ చర్చలు, ఖాళీల భర్తీ, సదుపాయాల కల్పన ఇందులో ఉన్నాయి'' అని మంత్రి వివరించారు. సులభతర వ్యాపార నిర్వహణకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకోవడంతో 2019 ప్రపంచబ్యాంక్ నివేదికలో భారత్ 52వ స్థానం దక్కించుకున్నట్టు చెప్పారు. ఆ తర్వాత నుంచి ప్రపంచబ్యాంక్ ఈ సూచీని ప్రకటించడం లేదన్నారు.

హావెల్స్ బ్రాండ్ అంబాసిడర్లుగా నయనతార, విఘ్నేష్ శివన్



సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ విద్యుత్ ఉపకరణాల సంస్థ 'హావెల్స్' దక్షిణాది మార్కెట్‌కు బ్రాండ్ అబాసిడర్లుగా సినీతారలు నయనతార, విఘ్నేష్ శివన్‌లను ఎంచుకుంది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం దక్షిణాదిలో హావెల్స్ పట్టును మరింత బలోపేతం చేస్తుందని ఆశిస్తున్నట్లు బుధవారం హావెల్స్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. నయనతార, విఘ్నేష్ శివన్‌లు జంటగా తమ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్లుగా ఎంపిక కావడం ఇది తొలి సారి అని వెల్లడించింది. దక్షిణాదిలో సంస్థ ఉనికిని మరింత బలోపేతం చేయడమేకాకుండా అభివృద్ధికి కొత్త మార్గాలను అందిపుచ్చుకోవడానికి ఊతమిస్తుందని హావెల్స్ ఇండియా సేల్స్ విభాగం ప్రెసిడెంట్ పరాగ్ భట్నాగర్ పేర్కొన్నారు. నయనతార, విఘ్నేష్ శివన్‌లను హావెల్స్ కుటుంబంలోకి ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉందని హావెల్స్ ఇండియా ఈవీపీ బ్రాండ్ అండ్ మార్‌కామ్ రోహిత్ కపూర్ పేర్కొన్నారు. సంస్థ బ్రాండ్ విలువలను వాస్తవికంగా ప్రతిబింబించే వ్యక్తులతో కలిసి పని చేయడం ఎంతో అవసరమన్నారు. కాగా.. హావెల్స్‌కు బ్రాండ్ అంబాసిడర్లు ఎంపిక కావడం పట్ల నయతార, విఘ్నేష్‌శివన్ హర్షం వ్యక్తం చేశారు. సృజనాత్మకత, నాణ్యత, విశ్వాసానికి పేరున్న హావెల్స్‌తో అనుబంధం చాలా సంతోషకరమన్నారు. దక్షిణాది మార్కెట్లలో బ్రాండ్ స్థానాన్ని బలోపేతం చేయడానికి తాము హావెల్స్‌కు పూర్తిగా మద్దతు ఇస్తామన్నారు.



సెమీస్‌లో అనిరుధ్ జోడీ

ముర్సియా (స్పెయిన్): కోస్టా కలీడా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-75 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్ (భారత్)-డేవిడ్ వీగా హెర్నాండెజ్ (స్పెయిన్) ద్వయం 6-4, 6-3తో జాన్స్ ఇంగిల్డ్‌సన్ (డెన్మార్క్)-డేవిడ్ స్టీవెన్సన్ (బ్రిటన్) జంటపై విజయం సాధించింది. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్-హెర్నాండెజ్ జోడీ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. తొలి సర్వ్‌లో 27 పాయింట్లు, రెండో సర్వ్‌లో ఏడు పాయింట్లు సాధించింది. తొలి రౌండ్‌లో అనిరుధ్-హెర్నాండెజ్ 6-3, 2-6, 10-5తో ఇనిగో సెర్వాంటెస్-గోర్నెస్ మార్టోస్ (స్పెయిన్)లపై గెలిచారు. భారత్‌కే చెందిన జీవన్ నెడుంజెళియన్-విజయ్ సుందర్ ప్రశాంత్ ద్వయం 3-6, 7-5, 7-10తో ఇంగిల్డ్‌సన్-స్టీవెన్సన్ జోడీ చేతిలో ఓడిపోయింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)-ఇడాస్ బుట్విలాస్ (లిథువేనియా) ద్వయం 6-4, 4-6, 10-8తో బరాంకో కొసానో-వింటర్ లోపెజ్ (స్పెయిన్) జంటపై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది.

'ఎంపిక నా చేతుల్లో లేదు'



భారత జట్టులో చోటుపై సిరాజ్ వ్యాఖ్య

గుజరాత్ టైటాన్స్ తరఫున సత్తా చాటేందుకు సిద్ధం

బెంగళూరు: పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ తర్వాత భారత జట్టులో చోటు కోల్పోయాడు. స్వదేశంలో ఇంగ్లండ్‌తో సిరీస్‌తో పాటు టీమిండియా విజేతగా నిలిచిన చాంపియన్స్ ట్రోఫీ టీమ్‌లోనూ అతనికి స్థానం లభించలేదు. అయితే ఈ హైదరాబాదీ పేసర్ జాతీయ జట్టులోకి త్వరలోనే పునరాగమనం చేస్తానని ఆశాభావంతో ఉన్నాడు. ప్రస్తుతం అంతగా ఆందోళన చెందడం లేదని, ఐపీఎల్‌లో సత్తా చాటాలనే పట్టుదలతో బరిలోకి దిగుతున్నట్లు అతను చెప్పాడు. ఐపీఎల్‌లో సిరాజ్ ఈసారి గుజరాత్ టైటాన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించబోతున్నాడు. 'భారత జట్టు ఎంపిక నా చేతుల్లో ఉండదనేది వాస్తవం. నా చేతుల్లో బంతి మాత్రమే ఉంటుంది. దాంతో ఏం చేయగలను అనేదే ముఖ్యం. టీమ్ సెలక్షన్ గురించి అతిగా ఆలోచిస్తూ ఒత్తిడి పెంచుకోను. అలా చేస్తే నా ఆటపై ప్రభావం పడుతుంది. ముమ్మందు ఇంగ్లండ్ పర్యటన, ఆసియా కప్‌లాంటివి ఉన్నాయనే విషయం నాకు తెలుసు. ఏం జరుగుతుందో చూద్దాం. ప్రస్తుతానికి దృష్టంతా ఐపీఎల్ పైనే ఉంది' అని సిరాజ్ వ్యాఖ్యానించాడు. టీమిండియా తరఫున ఆడని సమయంలో బౌలింగ్ మెరుగుపర్చుకోవడంతో పాటు ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టినట్లు సిరాజ్ వెల్లడించాడు. 'గత కొన్నేళ్లుగా నిరంతరాయంగా ఆడుతున్నాను. సాధారణంగా విశ్రాంతి తక్కువగా దొరుకుతుంది. కానీ ఈసారి మంచి విరామం లభించింది. అందుకే బౌలింగ్, ఫిట్‌నెస్‌పై మరింత దృష్టి పెట్టా. కొత్త బంతులు, పాత బంతులతో బౌలింగ్ చేశాం. స్లో బంతులు, యార్కర్ల విషయంలో ప్రత్యేక సాధన చేశాను. కొత్తగా నేర్చుకున్న అంశాలను ఐపీఎల్‌లో ప్రదర్శిస్తా' అని అతను చెప్పాడు. శుబ్‌మన్ గిల్ నాయకత్వంలో ఆడేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నట్లు సిరాజ్ వెల్లడించాడు. 'బెంగళూరు జట్టుకు దూరం కావడం కొంత బాధకు గురి చేసిందనేది వాస్తవం. కోహ్లి అన్ని రకాలుగా అండగా నిలిచాడు. అయితే ఇక్కడా గిల్ సారథ్యంలో చాలా మంచి జట్టుంది. గిల్ కెప్టెన్సీలో బౌలర్లకు మంచి స్వేచ్ఛ ఉంటుంది. ఏదైనా కొత్తగా ప్రయత్నిస్తే ఎప్పుడూ వారించడు. మేమిద్దరం ఒకే టెస్టుతో అరంగేట్రం చేశాం. వ్యక్తిగతంగా కూడా మంచి సాన్నిహిత్యం ఉంది' అని సిరాజ్ సంతోషం వ్యక్తం చేశాడు. తమ టీమ్‌లో రబాడ, రషీద్, ఇషాంత్, కొయెట్జీ లాంటి అగ్రశ్రేణి బౌలర్లు ఉండటం సానుకూల విషయమని, ఇది అందరిపై ఒత్తిడి తగ్గిస్తుందని అతను అభిప్రాయ పడ్డాడు. గత సీజన్ వరకు ఇదే ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహించిన మొహమ్మద్ షమీతో తనను పోల్చడంపై స్పందిస్తూ... 'టైటాన్స్ టీమ్ తరఫున షమీ భాయ్ చాలా బాగా ఆడాడు. కీలక సమయాల్లో స్వింగ్‌తో వికెట్లు తీశాడు. నేను కూడా ఆయనలాగే పెద్ద సంఖ్యలో వికెట్లు తీసి జట్టుకు ఉపయోగపడితే చాలు. మొతెరా మైదానంలో కొత్త బంతితో షమీ వికెట్లు తీయడం నేను చూశాను. అదే తరహాలో పవర్ ప్లేలో వికెట్లు తీయడమే నా పని' అని సిరాజ్ చెప్పాడు. టైటాన్స్ కోచ్‌గా ఉన్న మాజీ పేసర్ ఆశిష్ నెహ్రాతో కలిసి పని చేసేందుకు, ఆయన వద్ద కొత్త విషయాలు నేర్చుకునేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు ఈ హైదరాబాదీ పేర్కొన్నాడు.

ఐపీఎల్‌లో 'సలైవా' వాడవచ్చు!

నిషేధం ఎత్తివేసిన బీసీసీఐ



న్యూఢిల్లీ: బంతిని రివర్స్ స్వింగ్ చేయగల సత్తా ఉన్న బౌలర్లకు శుభవార్త ఇది! బ్యాటర్ల బాదుడుతో ఏ దశలోనూ బంతిని నియంత్రణలో ఉంచుకోలేక పోతున్న పేసర్లకు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఊరటనిచ్చింది. 2025 సీజన్‌లో బంతిపై ఉమ్మి (సలైవా)ని రుద్దేందుకు అనుమతినిచ్చింది. గురువారం జరిగిన టీమ్ కెప్టెన్ల సమావేశంలో వారి అభిప్రాయం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. సలైవాను ఉపయోగిస్తే బంతిపై నునుపుదనం పెరిగి రివర్స్ స్వింగ్ అయ్యేందుకు అవకాశం ఉంటుంది. మ్యాచ్ కీలక క్షణాల్లో పేసర్లు దీనిని సమర్థంగా వాడుకోగలిగితే పైచేయి సాధించవచ్చు. క్రికెట్‌లో సుదీర్ఘ కాలంగా ఇది అమల్లో ఉంది. అయితే కోవిడ్ వచ్చిన తర్వాత నాటి ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సలైవాను రుద్దడంపై నిషేధం విధించడంతో పాటు ఎవరైనా వాడితే ఆ బౌలర్లకు శిక్షలు కూడా విధించింది. అయితే ఇప్పుడు అంతా మారిపోవడంతో బౌలర్ల వైపు నుంచి అభ్యర్థనలు వచ్చాయి. దాంతో ఒక మేజర్ ఈవెంట్‌లో తొలిసారి సలైవాను వాడేందుకు అనుమతినిస్తున్నారు. ఐసీసీ ఆంక్షలు ఇంకా ఉన్నా... ఐపీఎల్ మాత్రం దానికి సై అంది. తాజా నిర్ణయాన్ని పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ స్వాగతించాడు. లీగ్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున తొలిసారి ఆడనున్న అతను 'సలైవా' తమకు మేలు చేస్తుందని అభిప్రాయపడ్డాడు. 'ఇది పేస్ బౌలర్లకు ఎంతో మంచిది. బంతితో ఏమాత్రం ప్రభావం చూపలేకపోతున్న పరిస్థితుల్లో సలైవా వాడటం తప్పనిసరి. కొంతైనా రివర్స్ స్వింగ్‌కు ప్రయత్నించవచ్చు. బంతిని షర్ట్‌ను రుద్దడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండటం లేదు. సలైవా వల్ల ఒకవైపు మెరుపును కొనసాగించవచ్చు. ఇది చాలా ముఖ్యం' అని సిరాజ్ అన్నాడు. మరోవైపు ఎత్తుకు సంబంధించిన వైడ్‌లు, ఆఫ్‌సైడ్ వైడ్‌ల విషయంలో డీఆర్‌ఎస్ వాడుకునేందుకు కూడా గవర్నింగ్ కౌన్సిల్ అంగీకరించింది. రాత్రి మ్యాచ్‌లలో మంచు ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రెండో ఇన్నింగ్స్ సమయంలో 11వ ఓవర్ ఒక బంతిని మార్చేందుకు కూడా అనుమతినిచ్చారు.

కెప్టెన్‌లపై నిషేధం ఉండదు...

ఇక నుంచి ఐపీఎల్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా కెప్టెన్‌లపై మ్యాచ్ నిషేధం ఉండదని గవర్నింగ్ కౌన్సిల్ తెలిపింది. గురువారం జరిగిన ఐపీఎల్ జట్ల కెప్టెన్‌ల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. నిషేధం బదులుగా కెప్టెన్‌లపై డీ మెరిట్ పాయింట్లు విధిస్తారు. గత ఏడాది హార్దిక్ పాండ్యా సారథ్యంలోని ముంబై ఇండియన్స్ జట్టు మూడు సార్లు స్లో ఓవర్‌రేట్ నమోదు చేసింది. దాంతో పాండ్యాపై ఒక మ్యాచ్ నిషేధం పడింది. గతేడాది హార్దిక్‌పై విధించిన ఒక మ్యాచ్ నిషేధం ఈ ఏడాది అమలు కానుంది. ఫలితంగా 23న చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే తమ తొలి మ్యాచ్‌కు హార్దిక్ దూరమయ్యాడు. హార్దిక్ స్థానంలో సూర్యకుమార్ యాదవ్ ముంబై ఇండియన్స్ జట్టుకు నాయకత్వం వహిస్తాడు.

ఆసియా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు భారత్ ఆతిథ్యం

న్యూఢిల్లీ: ఆరేళ్ల విరామం తర్వాత అంతర్జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి 15వ తేదీ వరకు ఆసియా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు అహ్మదాబాద్‌లోని నరన్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదిక కానుంది. జపాన్, దక్షిణ కొరియా, చైనా తదితర దేశాల నుంచి మేటి స్విమ్మర్లు ఈ మెగా ఈవెంట్‌కు వచ్చే అవకాశముంది. 'గుజరాత్ ప్రభుత్వం, ఆసియా అక్వాటిక్స్ నుంచి ఈ మెగా ఈవెంట్ నిర్వహణకు ఆమోదం లభించింది. వచ్చే నెలలో ఎంఓయూ కూడా జరుగుతుంది' అని భారత స్విమ్మింగ్ సమాఖ్య సెక్రటరీ జనరల్ మోనల్ చోక్సీ తెలిపారు. చివరిసారి భారత్ 2019లో ఆసియా ఏజ్ గ్రూప్ స్విమ్మింగ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చింది. ఆసియా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో స్విమ్మింగ్, డైవింగ్, ఆర్టిస్టిక్ స్విమ్మింగ్, వాటర్ పోలో ఈవెంట్స్‌ను నిర్వహిస్తారు.

భారత బాక్సింగ్ సమాఖ్య ఎన్నికల బరిలో అనురాగ్ ఠాకూర్

హిమాచల్ హైకోర్టు అనుమతి



సిమ్లా: భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్‌ఐ) ఎన్నికల్లో పార్లమెంట్ సభ్యుడు, మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ పోటీ పడేందుకు అనుమతించాలని హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 28న ఎన్నికలు జరగనున్నాయి. ఠాకూర్ నామినేషన్ దాఖలు చేసేందుకు వీలుగా నామినేషన్ల గడువును పొడిగించాలని కూడా కోర్టు ఉత్తర్వులిచ్చింది. బీఎఫ్‌ఐ ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర బాక్సింగ్ సంఘం ప్రతినిధిగా పోటీ పడేందుకు ఠాకూర్ సిద్ధం కాగా... బీఎఫ్‌ఐ అధ్యక్షుడు అజయ్ సింగ్ ఆయనను అనర్హుడిగా ప్రకటించారు. ఆయా రాష్ట్ర సంఘాల్లో ఎన్నికల ద్వారా గెలిచి ఆఫీస్ బేరర్లుగా కొనసాగుతున్న వారికే ఇక్కడా పోటీ పడే అవకాశం ఉంటుందని... ఈ కారణంగా ఠాకూర్ అనర్హుడంటూ రిటర్నింగ్ అధికారి ఈ నెల 7న ఆదేశాలు జారీ చేశారు. దీనిపై బీజేపీ ఎంపీ కోర్టుకెక్కారు. 2008 నుంచి వేర్వేరు హోదాల్లో తాను రాష్ట్ర సంఘంలో పని చేశానని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వాదోపవాదాల అనంతరం... బీఎఫ్‌ఐ ఉత్తర్వులకు చట్టపరంగా ఎలాంటి విలువ లేదని, ఠాకూర్‌ను ఎన్నికలకు అనుమతించాలంటూ హిమాచల్ హైకోర్టు స్పష్టం చేసింది.



గాయత్రి-ట్రెసా జోడీ జోరు

- స్విస్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశం
- పురుషుల సింగిల్స్‌లో ఓడిన శ్రీకాంత్, ప్రియాన్షు


బాసెల్: స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ద్వయం 21-12, 21-8తో అమెలీ లెహ్‌మన్-సెలీన్ హబ్ష్ (జర్మనీ) జంటపై విజయం సాధించింది. 38 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత ద్వయం ఆద్యంతం ఆధిపత్యం కనబరిచింది. రెండో గేమ్‌లోనైతే ఒకదశలో గాయత్రి-ట్రెసా వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించారు.

పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్, ప్రియాన్షు రజావత్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో శ్రీకాంత్ 15-21, 11-21తో ప్రపంచ ఆరో ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో... ప్రియాన్షు 15-21, 17-21తో టోమా పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయారు. మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణుల పోరాటం ముగిసింది. ఇషారాణి బారువా 19-21, 21-18, 18-21తో జియాన్ జి హాన్ (చైనా) చేతిలో, అనుపమ 17-21, 19-21తో పుత్రి కుసుమ వర్ధిని (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలయ్యారు.

భారత్ ఖాతాలోనే 'ఇండియన్ టూర్' స్క్వాష్ టైటిల్

ఫైనల్లో అనాహత్‌తో ఆకాంక్ష 'ఢీ'

చెన్నై: స్క్వాష్ రాకెట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఆర్‌ఎఫ్‌ఐ) ఇండియన్ టూర్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ టైటిల్ భారత్‌కు ఖరారైంది. భారత్‌కే చెందిన అనాహత్ సింగ్, ఆకాంక్ష సాలుంఖే ఫైనల్‌కు చేరుకోవడంతో ఇది సాధ్యం కానుంది. గురువారం జరిగిన సెమీఫైనల్స్‌లో అనాహత్ 11-6, 11-3, 11-4తో హీలీ వార్డ్ (దక్షిణాఫ్రికా)పై, టాప్ సీడ్ ఆకాంక్ష 11-5, 11-7, 11-7తో భారత్‌కే చెందిన స్టార్ జోష్నా చినప్పపై విజయం సాధించారు. ఫైనల్ నేడు జరుగుతుంది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఆకాంక్ష 11-8, 10-12, 4-11, 11-8, 11-9తో నాదియా ఎల్‌హమి (ఈజిప్ట్)పై, అనాహత్ 11-3, 11-3, 7-11, 11-1తో క్రిస్టినా గోమెజ్ (స్పెయిన్)పై, జోష్నా చినప్ప 11-7, 11-5, 11-4తో సోఫియా మటియోస్ (స్పెయిన్)పై గెలుపొందారు. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్‌కే చెందిన వీర్ చోత్రాని, మెల్విల్ సియానిమనికో (ఫ్రాన్స్) టైటిల్ పోరుకు సిద్ధమయ్యారు. సెమీఫైనల్స్‌లో వీర్ 11-5, 11-7, 12-10తో రవిందు లక్సిరి (శ్రీలంక)పై, మెల్విల్ 11-7, 11-2, 11-7తో డీగో గొబ్బి (బ్రెజిల్)పై విజయం సాధించారు.



అనాహత్ సింగ్

2030 కామన్వెల్త్‌కు భారత్ సిద్ధం!

నిర్వహణ కోసం బిడ్ దాఖలు

న్యూఢిల్లీ: రెండు దశాబ్దాల తర్వాత భారత్‌లో ప్రతిష్టాత్మక కామన్వెల్త్ క్రీడలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2030లో జరిగే కామన్వెల్త్ క్రీడల నిర్వహణ కోసం భారత్ అధికారికంగా బిడ్‌ను దాఖలు చేసింది. నిబంధనల ప్రకారం బిడ్‌లో నగరం పేరును కూడా పేర్కొన్నారు. భారత్‌కు ఈ క్రీడలు నిర్వహించే అవకాశం దక్కితే వాటికి అహ్మదాబాద్ వేదిక అవుతుంది. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఈ ప్రక్రియను పూర్తి చేసిందని కేంద్ర క్రీడా శాఖలోని ఉన్నతాధికారి ఒకరు ఈ విషయాన్ని వెల్లడించారు. 'అవును, మనం 2023 కామన్వెల్త్ క్రీడల నిర్వహణ కోసం పోటీ పడుతున్నాం. భారత్ తరఫున ఐఓఏ, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా బిడ్‌ను సమర్పించాయి' అని ఆయన చెప్పారు. నిర్వహణా కమిటీ 'కామన్వెల్త్ స్పోర్ట్' ఈ బిడ్‌ను పరిశీలించిన అనంతరం తదుపరి ప్రక్రియ కోసం పరిగణలోకి తీసుకుంటుంది. 2010లో భారత్‌లో కామన్వెల్త్ క్రీడలకు జరిగాయి. ప్రధాని నరేంద్ర మోదీ సూచనల ప్రకారం 2036 ఒలింపిక్స్‌ను కూడా మన దేశంలో నిర్వహించాలనే యోచన ఉంది. ఇందు కోసం కూడా ప్రాథమికంగా ప్రయత్నాలు మొదలయ్యాయి. దానికి ముందు సన్నాహకంగా ఈ కామన్వెల్త్ క్రీడల నిర్వహణతో తమ స్థాయిని ప్రదర్శించాలని భారత్ భావిస్తోంది.

బౌలింగ్ చేసేందుకు షకీబ్‌కు అనుమతి



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్, మేటి ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్‌కు మళ్లీ బౌలింగ్ చేసేందుకు అనుమతి లభించింది. అతని బౌలింగ్ శైలితీరు నియమాలకు లోబడే ఉందని, సందేహాస్పదంగా లేదని సమీక్ష అనంతరం తేలింది. అయితే తన బౌలింగ్ యాక్షన్‌ను ఎక్కడ సమీక్షించారనే విషయాన్ని షకీబ్ వెల్లడించలేదు. ఇప్పటికే టెస్టులకు, అంతర్జాతీయ టి20లకు వీడ్కోలు పలికిన షకీబ్ వన్డే ఫార్మాట్‌లో, ఫ్రాంచైజీ లీగ్‌లలో బౌలింగ్ చేసేందుకు మార్గం సుగమం అయింది. గత ఏడాది అక్టోబర్ కాన్పూర్‌లో భారత్‌తో జరిగిన రెండో టెస్టు తర్వాత షకీబ్ మళ్లీ బరిలోకి దిగలేదు. గత డిసెంబర్‌లో ఇంగ్లిష్ కౌంటీ క్రికెట్‌లో సర్రే జట్టు తరఫున మ్యాచ్ ఆడిన సమయంలో షకీబ్ బౌలింగ్ శైలి సందేహాస్పదంగా ఉండటంతో అతడు బౌలింగ్‌పై నిషేధం విధించారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్, పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకోలేకపోయిన షకీబ్ త్వరలో శ్రీలంకతో వన్డే సిరీస్‌లో పాల్గొనే అవకాశముంది.



భూమిపై ఉదయం, రాత్రి సమయాలు సమంగా ఉండే రోజుగా చరిత్రకెక్కిన 'వసంత సమం' వినీలాకాశం నుంచి ఈనెల 19న కనిపించిన అరుదైన దృశ్యమిది.

నీటమునిగి ఉంటుందని భావిస్తున్నాం

వర్జీనియా: డొమినికన్ రిపబ్లిక్‌లో విహారయాత్రకు వెళ్లి అదృశ్యమైన 20 ఏళ్ల భారతీయ విద్యార్థిని సుదీక్ష కోణంకి నీట మునిగిపోయి ఉంటుందని ఆమె తల్లిదండ్రులు భావిస్తున్నారు. 'మా కూతురు నీట మునిగి చనిపోయిందన్న విషయాన్ని తీవ్ర విచారంతో, బరువెక్కిన హృదయంతో జీర్ణించుకుంటున్నాం. దీన్ని నమ్మడం మాకు కష్టంగా ఉంది. దయచేసి మా కుమార్తె కోసం ప్రార్థించండి'అని సుదీక్ష తండ్రి సుబ్బారాయుడు కోనంకి మీడియా ముందు ఒక ప్రకటన చదివి వినిపించారు. సుబ్బారాయుడు అది చదువుతుండగా ఆయన భార్య శ్రీదేవి కన్నీరుమున్నీరుగా విలపించారు. 'మాకు ఇంకా ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. వారు చాలా చిన్న వయస్సులో ఉన్నారు. వారికోసం మమ్మల్ని మేం దిటవు చేసుకోవాలి. మేం, మా పిల్లలు కోలుకోవడానికి, మా జీవితాలతో ముందుకు సాగడానికి మాకు కొంత సమయం, గోప్యత ఇవ్వాలని గౌరవపూర్వకంగా అభ్యర్థిస్తున్నాం'అని ఆయన కోరారు.



సుదీక్ష

మార్చి 6న అదృశ్యమై..

సుదీక్ష కోణంకి భారత పౌరురాలు, యూఎస్‌లో శాశ్వత నివాసి. పిట్స్‌బర్గ్ యూనివర్సిటీలో చదువుతున్న ఆమె.. తన స్నేహితులతో కలిసి డొమినికన్ రిపబ్లిక్‌లోని పుంటాకానాలోని ఓ రిసార్ట్‌కు విహారయాత్రకు వెళ్లారు. మార్చి 6న తెల్లవారుజామున నలుగురు స్నేహితులతో కలిసి బీచ్‌కు వెళ్లిన సుదీక్ష.. ఆ తరువాత స్నేహితులతో కలిసి రిసార్ట్‌కు తిరిగి రాలేదు. అదే రోజు సాయంత్రం ఆమె కనిపించడం లేదని స్నేహితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటినుంచి హెలికాప్టర్లు, డ్రోన్లు, పడవలు, స్కూబా డైవర్లు, ఏటీవీలను మోహరించి తీరం, పరిసర ప్రాంతాల్లో ముమ్మరంగా గాలించారు. ఆమె మునిగిపోయి ఉంటుందని పోలీసులు సందేహం వ్యక్తంచేశారు. తరువాత సుదీక్ష ఆచూకీ కోసం ఎఫ్‌బీఐ కూడా రంగంలోకి దిగింది. స్థానిక భారత రాయబార కార్యాలయం కూడా దర్యాప్తును పర్యవేక్షించింది. సుదీక్ష అదృశ్యంపై ఇంటర్‌పోల్ ఎల్లో నోటీస్ జారీ చేసింది. అయినా తామె ఆచూకీ లభించలేదు. దీంతో ఆశలు వదులుకున్న కుటుంబం.. మునిగిపోయి ఉంటుందని భావిస్తున్నామని ప్రకటించింది.

కీలక నిందితుడిపై విద్రోహం కేసు

నాగ్‌పూర్ హింస కేసు..

నాగ్‌పూర్/బరేలీ/కోల్‌కతా: నాగ్‌పూర్‌లో హింసాత్మక ఘటనల కేసులో కీలక నిందితుడిగా భావిస్తున్న ఫహీమ్ ఖాన్ సహా ఆరుగురిపై దేశ ద్రోహం కేసు నమోదైంది. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తూ ఉద్రిక్తతలను రగిల్చినట్లు వీరిపై ఆరోపణలున్నాయి. అదేవిధంగా, మూడు రోజుల అనంతరం నాగ్‌పూర్‌లో పరిస్థితులు సాధారణ స్థితికి చేరడంతో గురువారం కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూను ఎత్తివేయడంతోపాటు, ఆంక్షలు సడలించారు. సుమారు 230 ప్రొఫైల్స్‌కు సంబంధించిన సమాచారం తమకు అందజేయాలని, ఆయా ఖాతాలను బ్లాక్ చేయాలని ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టా, యూట్యూబ్ వేదికల నిర్వాహకులను కోరినట్లు డీసీపీ సైబర్ క్రైం లోహిత్ మతానీ వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన కొన్ని వీడియోల్లోని తప్పుడు సమాచారం హింసకు దారి తీయగా, ఆ ఘటనలను కీర్తిస్తూ షేర్ చేసిన మరికొన్ని వీడియోలతో హింస తీవ్రత పెరిగిందని తెలిపారు. ఇందుకు సంబంధించి మైనారిటీ డెమోక్రాటిక్ పార్టీ నగర అధ్యక్షుడు ఫహీమ్ ఖాన్ సహా ఆరుగురిపై విద్రోహ చట్టం కింద కేసులు పెట్టామన్నారు.

ఫడ్నవీస్ దిగజారుడు మాటలు: శివసేన యూబీటీ

నాగ్‌పూర్ హింసకు ఛావా సినిమానే కారణమంటూ సీఎం ఫడ్నవీస్ చేసిన వ్యాఖ్యలను శివసేన(యూబీటీ)తప్పుపట్టింది. ఈ వ్యాఖ్యలు ఫడ్నవీస్ నైతిక దిగజారుడు తనానికి నిదర్శనమంది. ఛావా సినిమా నటులు, డైరెక్టర్, నిర్మాతలపై కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. దివంగత ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ ఎంఎస్ గోల్వాల్కర్, హిందూత్వ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్ శంభాజీ మహారాజ్‌పై పరుష పదజాలం వాడుతూ చేసిన రచనలు అల్లర్లను ప్రేరేపించలేదని గుర్తు చేసిన శివసేన (యూబీటీ), సినిమా చూసిన తర్వాతే ప్రజలు హింసను ఎందుకు ఆశ్రయిస్తారని ప్రశ్నించింది. నాగ్‌పూర్ హింసకు, మతపరమైన ఉద్రిక్తతలకు ప్రత్యక్షంగా కారణమైన 'ఛావా'సినిమాను నిషేధించాలంటూ బరేల్వీ వర్గం మతపెద్ద మౌలానా షహబుద్దీన్ రిజ్వీ గురువారం హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. సినిమా దర్శక నిర్మాతలతోపాటు రచయితపైనా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమాధి చుట్టూ రక్షణ వలయం

శంభాజీనగర్‌లోని ఖుల్దాబాద్‌లో ఉన్న మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ సమాధిని తొలగించాలంటూ కొన్ని వర్గాల నుంచి డిమాండ్లు వస్తుండటం తెల్సిందే. ఈ నేపథ్యంలో గురువారం భారత పురాతత్వ విభాగం(ఏఎస్ఐ) అధికారులు 18వ శతాబ్దంనాటి ఔరంగజేబ్ సమాధికి రెండు వైపులా తగరం షీట్లతోపాటు వైర్ ఫెన్సింగ్‌ను బుధవారం రాత్రి ఏర్పాటు చేశారు. సమాధి చుట్టూ వలయాకారంలో మరో ఫెన్సింగ్‌ను రక్షణగా ఉంచినట్లు ఓ అధికారి తెలిపారు. ప్రస్తుతమున్న గ్రీన్ నెట్ శిథిలావస్థలో ఉందన్నారు. ఖ్వాజా సయ్యద్ జైనుద్దీన్ చిష్తీ సమాధి పక్కనున్న ఈ సమాధిని సందర్శకులు దగ్గర్నుంచి వీక్షించవచ్చని వివరించారు.

జిల్లా కేంద్రంగా సంస్థాగత పునరుద్ధరణ

డీసీసీలను బలోపేతం చేసే విధానాన్ని తెరపైకి తెస్తున్న ఏఐసీసీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో వరుస ఓటములను చవిచూస్తున్న కాంగ్రెస్ పార్టీ తన ప్రాబల్యాన్ని నిలుపుకునే క్రమంలో అతిపెద్ద సంస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టింది. పార్టీని పునరుద్ధరించే క్రమంలో కేంద్రీకృత విధానాన్ని పక్కనపెట్టి జిల్లా కేంద్రీకృత విధానానికి మారేలా కొత్త ప్రణాళికలను సిద్ధంచేస్తోంది. 1970లో ఇందిరా గాంధీ హయాంలో మాదిరిగా జిల్లా కాంగ్రెస్ కమిటీలను (డీసీసీ) బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి సంబంధించిన రోడ్ మ్యాప్ సిద్ధం చేసేందుకు రెండ్రోజుల కిందటే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ పార్టీ రాష్ట్రాల ఇంఛార్జిలు, ప్రధాన కార్యదర్శులతో పలుమార్లు సమావేశమయ్యారు. పార్టీ దీర్ఘకాలిక సంస్కరణల్లో భాగంగా జిల్లా యూనిట్లకు అధిక ప్రాధాన్యతనివ్వడం, నియోజకవర్గ అభ్యర్థులు మొదలు, పార్టీ, ప్రభుత్వ నియామకాల్లో వారి సూచనల మేరకే పదవుల పంపకాలు, జిల్లా స్థాయి సమస్యలపై పోరాటాలు చేసే స్వేచ్ఛను వారికి ఇవ్వడం తదితర కీలకాంశాలపై ఈ భేటీల్లో సమాలోచనలు జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రధానంగా రాహుల్ గాంధీ డీసీసీల నిర్ణయాత్మక పాత్ర పోషించేలా పార్టీ విధానాల రూపకల్పన ఉండాలని నొక్కి చెప్పినట్లు చెబుతున్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణం, గ్రామాధ్యక్షుల నుంచి మండల, బ్లాక్, జిల్లా కార్యవర్గ కూర్పు, రాష్ట్ర కమిటీకి సభ్యుల ప్రతిపాదనలన్నీ డీసీసీల ద్వారానే జరిగేలా కార్యాచరణ తీసుకున్నప్పుడే పార్టీ బలోపేతం అవుతుందన్న రాహుల్ సూచనలను ఏఐసీసీ పెద్దలు పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. సంస్థాగత ఎన్నికల నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలకు డీసీసీలే జవాబుదారీగా ఉండాలని, వారి అభిప్రాయం మేరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పార్టీ విధానాల రూపకల్పన ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దీని అమలుపై చర్చించేందుకు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ నెల 27, 28న, ఏప్రిల్ 3 తేదీలలో పార్టీ నూతన ప్రధానకార్యాలయం 'ఇందిరా భవన్'లో మూడు బ్యాచ్‌లుగా 750 మంది డీసీసీలతో చర్చించనున్నారు. వారి అభిప్రాయాలను సేకరించిన తర్వాత, ఏప్రిల్ 8, 9 తేదీల్లో అహ్మదాబాద్‌లో జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో తుది బ్లూప్రింట్‌ను సిద్ధం చేయనున్నారు.

ప్రకృతి సేద్యం సాగించండి

- విస్తృతంగా మొక్కలు నాటండి
- భార్వాడ్ వర్గానికి ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

అహ్మదాబాద్: ఆధునిక కాలంలో పర్యావరణాన్ని కాపాడుకోవడానికి, ఆరోగ్య పరిరక్షణకు ప్రకృతి సేద్యం వైపు మళ్లాలని గుజరాత్‌లోని భార్వాడ్ సామాజిక వర్గ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా మొక్కలు నాటాలని కోరారు. అహ్మదాబాద్ సమీపంలో ధోలేరా తాలూకాలోని బవాలియాలీ ధామ్‌లో గురువారం సమావేశమైన భార్వాడ్ వర్గం ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములుగా మారాలని చెప్పారు. దేశ అభివృద్ధిలో మొదటి అడుగు గ్రామ అభివృద్ధేనని స్పష్టంచేశారు. రైతులు సహజసిద్ధమైన వ్యవసాయం చేయాలన్నారు. భార్వాడ్ వర్గం పరమ పవిత్రంగా భావించే బవాలియాలీ ధామ్‌కు ఎంతో విశిష్టత ఉందన్నారు. మతం, విశ్వాసం, సంస్కృతికి ఇది అద్దం పడుతోందని తెలిపారు. కాలానుగుణంగా వచ్చే మార్పులు అందిపుచ్చుకోవాలని అన్నారు. 'మీ కుమార్తెలకు కంప్యూటర్ విద్య నేర్పించండి' అని భార్వాడ్ వర్గానికి సూచించారు.

రూ.54 వేల కోట్లతో సైనిక సామగ్రి

న్యూఢిల్లీ: సుమారు రూ.54 వేల కోట్ల విలువైన టీ–90 యుద్ధ ట్యాంకులకు ఇంజన్లు, టార్పెడోలు, యుద్ధ విమాన హెచ్చరిక వ్యవస్థలు తదితరాల కొనుగోలుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. వీటిని సాధ్యమైనంత త్వరగా సైన్యానికి అందించేందుకు అవసరమైన మార్గదర్శకాలకు సైతం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సారథ్యంలోని డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్(డీఏసీ) ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా టీ–20 ట్యాంకులకు ప్రస్తుతమున్న వెయ్యి హార్స్ పవర్ సామర్థ్యమున్న ఇంజన్ల స్థానే 1,350 హార్స్ పవర్ ఉన్న ఇంజన్లను అమరుస్తారు. నావికా దళం కోసం వరుణాస్త్ర టార్పెడోల కొనుగోలుకు డీఏసీ పచ్చజెండా ఊపింది. నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ ల్యాబొరేటరీ దేశీయంగా అభివృద్ధి పరిచిన శక్తివంతమైన టార్పెడోనే వరుణాస్త్ర.

ఆదిత్య ఠాక్రేను అరెస్టు చేయండి

హైకోర్టును ఆశ్రయించిన దిశా సాలియన్ తండ్రి

ముంబై: దివంగత నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సలియన్ మృతి కేసు మరోసారి తెరపైకి వచ్చింది. ఈ కేసులో శివసేన (యూబీటీ) ఎమ్మెల్యే ఆదిత్య ఠాక్రే, ఇతరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ ఆమె మరణించిన ఐదేళ్ల తర్వాత, ఆమె తండ్రి బాంబే హైకోర్టును ఆశ్రయించారు. అయితే తనను అప్రతిష్టపాలు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నమని, కోర్టులో తేల్చుకుంటానని ఠాక్రే చెబుతున్నారు.

2020 జూన్ 8న సబర్బన్ మలాడ్‌లోని ఎత్తైన భవనం 14వ అంతస్తు నుంచి పడి దిశ మృతి చెందింది. దీంతో పోలీసులు ప్రమాదావశాత్తు మరణం కింద కేసు నమోదు చేశారు. ఆమె మరణించిన ఆరు రోజుల తర్వాత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ బాంద్రాలోని తన ఫ్లాట్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. దిశ మృతిని ఆత్మహత్య కేసు అని చెప్పిన పోలీసులు ఆ తర్వాత సీబీఐకి అప్పగించారు. అయితే దిశ తండ్రి సతీష్ సాలియన్ తన కుమార్తె మరణంలో ఎలాంటి అనుమానం లేదని, పోలీసుల దర్యాప్తుతో పూర్తిగా సంతృప్తి చెందానని పోలీసులకు చెప్పాడు.

'సామూహిక అత్యాచారం, హత్య': పిటిషన్‌లో సతీష్ సలియన్

అయితే తాజా పిటిషన్‌లో దిశ తండ్రి సంచలన ఆరోపణలు చేశారు. జూన్ 8న దిశ తన ఇంట్లో పార్టీ ఇచ్చిందని, దీనికి ఆదిత్య ఠాక్రేతో పాటు ఆయన అంగరక్షకులు, నటులు సూరజ్ పంచోలి, డినో మోరియా తదితరులు హాజరయ్యారని పేర్కొన్నారు. దిశపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని, బలవంతంగా నిర్బంధించారని, క్రూరమైన లైంగిక దాడికి పాల్పడ్డారని ప్రత్యక్ష సాక్షులను ఉటంకించారు. ఎత్తైన భవనంపై నుంచి పడి దిశ చనిపోయిందని చెప్పినప్పటికీ ఆమె శరీరంలో ఒక్క ఫ్రాక్చర్ కూడా లేదని, నం ఘటనా స్థలంలో రక్తపు చుక్క కనిపించలేదన్నారు. నిందితులను రక్షించడానికి రాజకీయ ఒత్తిళ్లతో శవపరీక్ష నివేదికను మార్చారని ఆరోపించారు. కల్పిత ఆత్మహత్య కథనాన్ని సరిపోల్చడానికి అధికారిక పోస్టుమార్టం నివేదికను తారుమారు చేసినట్లు ఫోటోగ్రాఫిక్ సాక్ష్యాలు రుజువు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఫోరెన్సిక్ సాక్ష్యాలను నాశనం చేశారని, సీసీటీవీ ఫుటేజీలను కూడా తారుమారు చేశారని దిశ తండ్రి ఆరోపించారు. సరైన పోస్టుమార్టం విశ్లేషణ లేకుండానే హడావుడిగా దహన సంస్కారాలు నిర్వహించారని ఆరోపించారు. దిశ, సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌ల పోస్టుమార్టం వివరాలను పిటిషన్‌లో ప్రస్తావించారు. రాజ్‌పుత్ మరణించిన రోజే శవపరీక్ష నిర్వహించగా, దిశ పోస్టుమార్టం 50 గంటలకు పైగా ఆలస్యమైందని పేర్కొన్నారు. ప్రధాన నిందితుడైన ఆదిత్య ఠాక్రేను కాపాడేందుకు లైంగికదాడి సాక్ష్యాలను నాశనం చేయడమే లక్ష్యంగా ఈ జాప్యం జరిగిందని ఆరోపించారు.

సీబీఐ విచారణకు ఆదేశం

2023లో సుప్రీంకోర్టు, హైకోర్టు కక్షిదారుల సంఘం అధ్యక్షుడు రషీద్ ఖాన్ పఠాన్ దాఖలు చేసిన పిటిషన్ జత చేయాలని పిటిషన్‌లో కోరారు. నిందితులపై హత్యానేరం నమోదు చేయడానికి పఠాన్ ముంబై పోలీస్ చీఫ్‌కు ఇచ్చిన ఫిర్యాదును ప్రాతిపదికగా తీసుకోవాలని, దిశ మృతిపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరారు. కాగా, 2023లో మహారాష్ట్ర ప్రభుత్వం దిశ మృతిపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. సిట్ తన నివేదికను సమర్పించాల్సి ఉంది.

మహాకూటమి వర్సెస్ శివసేన (యూబీటీ)

ఈ పిటిషన్ అధికార మహాకూటమి, శివసేన (యూబీటీ) మధ్య తాజా వివాదంగా మారింది. నిందితులను ఎలాగైనా జైలుకు పంపుతామని మహారాష్ట్ర మంత్రి సంజయ్ శిర్సాట్ తెలిపారు. దిశ తండ్రి ఇప్పుడు బాహాటంగానే బయటకు వచ్చారన్న శిర్సాట్ మిగతా విషయాలను కోర్టు నిర్ణయిస్తుందన్నారు. అయితే.. ఐదేళ్ల తర్వాత ఎందుకు పిటిషన్ దాఖలు చేశారని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ ప్రశ్నించారు. పోలీసుల దర్యాప్తును తాను చూశానని, ఇది యాక్సిడెంట్ అని, హత్య కాదని అంగీకరించిన తండ్రి.. ఐదేళ్ల తర్వాత ఎందుకు ముందుకొచ్చారని ప్రశ్నించారు. ఈ పిటిషన్ వెనుక ఉన్న రాజకీయం రాష్ట్రమంతా తెలుసన్నారు.



అప్రతిష్టపాలు చేసేందుకే : ఠాక్రే

దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం తనను అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆదిత్య ఠాక్రే ఆరోపించారు. 'గత ఐదేళ్లుగా నా ప్రతిష్టకు భంగం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ విషయం కోర్టులో ఉంటే కోర్టులో స్పందిస్తాను. ఈ దేశ శ్రేయస్సు కోసం నా పోరాటం కొనసాగుతుంది'అని ఠాక్రే మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ పిటిషన్‌ను మహారాష్ట్రలోని బీజేపీ ప్రభుత్వం ఎత్తుగడగా ఆదిత్య అభివర్ణించారు. సమస్యలను పక్కదారి పట్టించడానికి కొన్నిసార్లు ఔరంగజేబు, మరి కొన్ని అంశాలను ముందుకు తెస్తారని ఆదిత్య వ్యాఖ్యానించారు.

ప్రాజెక్ట్ చీతా కీలక సభ్యుడు విన్సెంట్ మృతి

రియాద్: ప్రపంచ ప్రఖ్యాత జంతు పరిరక్షకుడు, ప్రధాని నరేంద్ర మోదీ డ్రీమ్ ప్రాజెక్ట్ 'ప్రాజెక్ట్ చీతా'లో కీలక సభ్యుడు విన్సెంట్ వాన్‌డెర్ మెర్వే మృతి చెందారు. సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో అనుమానాస్పద స్థితిలో అతని మృతదేహం లభించింది. ఆత్మహత్యగా పోలీసులు చెబుతున్న ప్పటికీ.. తలకు గాయాలున్నాయని విన్సెంట్ కుటుంబం అనుమానం వ్యక్తంచేసింది. ఆఫ్రికాలోని చిరుతలను భారత్‌లోని కునో నేషనల్ పార్క్‌కు పరిచయం చేయడంలో విన్సెంట్ కీలక పాత్ర పోషించారు. చిరుతల నిపుణుడైన విన్సెంట్.. దక్షిణాఫ్రికా, నమీబియా నుంచి తీసుకువచ్చిన చిరుతలను భారత పరిస్థితులకు అలవాటు పడేలా చేశారు. అనేక సవాళ్లు ఉన్నప్పటికీ, అతను ఈ ప్రాజెక్టుపై నమ్మకంతో ఉన్నారు. మెటాపాపులేషన్ ఇనిషియేటివ్ (టీఎంఐ) వ్యవస్థాపకుడు అయిన వాన్‌డెర్ మెర్వే తన కృషితో ఆసియా, ఆఫ్రికాల్లో పేరు సంపాదించుకున్నారు. అతని సంస్థ సౌదీ అరేబియా ప్రభుత్వంతో కలిసి అక్కడ చిరుతలను తిరిగి ప్రవేశపెట్టే ప్రణాళికపై పనిచేస్తోంది. దీంతో అతను రియాద్‌లో ఉన్నారు. అక్కడే అతని మృతదేహం లభించింది.

మా పౌరుల్ని చైనా ఉరి తీసింది: కెనడా

టొరంటో: డ్రగ్స్ సంబంధిత ఆరోపణలపై తమ నలుగురు పౌరులకు చైనా ప్రభుత్వం ఇటీవల ఉరిశిక్ష అమలు చేసిందని కెనడా వెల్లడించింది. ఈ పరిణామాన్ని తీవ్రంగా ఖండించింది. ద్వంద పౌరసత్వం ఉన్న ఈ నలుగురికీ క్షమాభిక్ష ప్రకటించాలని మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో, తాను గతంలో చైనాను కోరినట్లు విదేశాంగ మంత్రి మెలనీ జోలీ గురువారం చెప్పారు. ఘటనపై ఒట్టావాలోని చైనా ఎంబసీ స్పందించింది. ద్వంద పౌరసత్వాన్ని తమ ప్రభుత్వం గుర్తించడం లేదని, ఆ నలుగురికీ డ్రగ్ సంబంధిత నేరాలపై ఉరిశిక్ష అమలు చేసిందని వివరించింది. ఇటువంటి నేరాలపై తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, నలుగురిపై ఆరోపణలకు ఆధారాలు పక్కాగా ఉన్నాయని కూడా తెలిపింది. ఈ విషయంలో బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేయవద్దని కెనడా ప్రభుత్వాన్ని కోరింది. ఇలా ఉండగా, డ్రగ్ స్మగ్లింగ్ కేసులో మరణ శిక్షను ఎదుర్కొంటున్న రాబర్ట్ షెల్లెన్‌బర్గ్ అనే కెనడా పౌరుడికి క్షమాభిక్ష ప్రసాదించాలంటూ చైనాను కోరామని మంత్రి జోలీ వెల్లడించారు. చైనా తయారీ ఎలక్ట్రిక్ వాహనాలు, స్టీల్ అల్యూమినియం ఉత్పత్తులపై గతేడాది అక్టోబర్‌లో కెనడా టారిఫ్‌లు విధించింది. ప్రతిగా, కెనడా వ్యవసాయ, ఆహారోత్పత్తులపై చైనా టారిఫ్‌లు ప్రకటించింది. 2018లో హువై మాజీ చీఫ్‌ను కెనడా అధికారులు అరెస్ట్ చేసినప్పటి నుంచి కొనసాగుతున్న ఉద్రిక్తతలు టారిఫ్ యుద్ధంతో మరింత ముదిరాయి. కాగా, కెనడాకు చైనా రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది.

38 విదేశీ పర్యటనలు.. రూ.258 కోట్లు

రెండున్నరేళ్లలో ప్రధాని మోదీ పర్యటనలు

న్యూఢిల్లీ 2022 మే నుంచి 2024 డిసెంబర్ దాకా.. దాదాపు రెండున్నరేళ్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 38 విదేశీ పర్యటనలు చేశారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.258 కోట్లు ఖర్చు పెట్టింది. విదేశాంగ శాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గరీటా ఈ వివరాలను వెల్లడించారు. విపక్ష నేత మల్లికార్జున ఖర్గే అడిగిన ప్రశ్నకు గురువారం రాజ్యసభలో సమాధానమిచ్చారు. 2023 జూన్‌లో మోదీ అమెరికా పర్యటనకు ఏకంగా రూ.22.89 కోట్లు ఖర్చయ్యాయి. అలాగే 2024 సెప్టెంబర్‌లో మరోసారి అమెరికా వెళ్లారు. దీనికి ప్రభుత్వం రూ.15.33 కోట్లు వెచ్చించింది. 2023 మేలో జపాన్ పర్యటనకు రూ.17.19 కోట్లు ఖర్చయ్యాయి. 2022 మేలో నేపాల్ పర్యటనకు కేంద్రం రూ.80 లక్షలు ఖర్చు చేసింది. రెండున్నరేళ్లలో అమెరికా, జపాన్, నేపాల్‌తోపాటు డెన్మార్క్, ఫ్రాన్స్, యూఏఈ, ఉజ్బెకిస్తాన్, ఇండోనేషియా, ఆస్ట్రేలియా, ఈజిప్ట్, దక్షిణాఫ్రికా, గ్రీస్, పోలాండ్, ఉక్రెయిన్, రష్యా, ఇటలీ, బ్రెజిల్, గయానా దేశాల్లో పర్యటించారు.

కోల్‌కతా, ఢిల్లీల్లోనూ సీఐఏ రహస్య స్థావరాలు?

వాషింగ్టన్: అమెరికా నిఘా విభాగం సీఐఏ ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో భారత్ సహా పలు దేశాల్లో రహస్య స్థావరాలను ఏర్పాటు చేసుకుంది. 'బ్లాక్ సైట్స్'పేరుతో భారత్‌లోని ఢిల్లీ, కోల్‌కతాల్లో వీటిని నిర్వహించేదని రష్యా అంతర్జాతీయ టెలివిజన్ నెట్‌వర్క్ ఆర్‌టీ తెలిపింది. రహస్య కేంద్రాల్లో అనుమానిత ఉగ్రవాదుల విచారణ, నిర్బంధం వంటి కార్యకలాపాలు సాగేవని వివరించింది. 1963లో అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్.కెన్నడీ హత్యకు సంబంధించిన ఫైళ్లను ప్రభుత్వం ఇటీవల బయటపెట్టడం తెలిసిందే. ఈ ఫైళ్లలో అప్పట్లో సీఐఏ రహస్య కార్యకలాపాలకు సంబంధించిన కీలక సమాచారం ఉందని ఆర్‌టీ పేర్కొంది. ఇంకా..పాకిస్తాన్‌లోని రావల్పిండి, శ్రీలంక రాజధాని కొలంబో, ఇరాన్ రాజధాని టెహ్రాన్, దక్షిణ కొరియా రాజధాని సియోల్, జపాన్ రాజధాని టోక్యోల్లోనూ 'బ్లాక్ సైట్స్'ఉన్నట్లు తెలిపింది. సీఐఏతో భారత్‌కు ఎప్పటి నుంచో సంబంధాలున్నాయి. ఒడిశాలోని చార్‌బటియా ఎయిర్ బేస్‌ను సీఐఏ నిఘా విమానం యూ–2 ఇంధనం నింపుకునేందుకు భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని 2013లో మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

మీకు చట్టంలో ఏబీసీడీలైనా తెలుసా?

రేప్ కేసులో బాలికకు సమ్మతి ఉందన్న లాయర్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ: మైనర్ బాలికపై అత్యాచారం కేసులో బెయిల్ కోరుతూ నిందితుడి తరఫున స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్‌పీ) దాఖలుచేసిన ఒక న్యాయవాది ఆ పిటిషన్‌లో ఉపయోగించిన పదజాలంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. పదేపదే కనీసం 20 సార్లు ఆ పిటిషన్‌లో 'బాలిక సమ్మతితోనే'అంటూ ప్రస్తావించడాన్ని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం తప్పుబట్టింది. ''అసలు మీ పిటిషన్‌ను చూశాక మానసికంగా మేం కుంగిపోయాం. రేప్ విషయంలో నిందితుడికి, మైనర్ బాలికకు మధ్య సమ్మతితో సంబంధం ఉందని మీరు రాశారు. ఇలా పిటిషన్‌లో కనీసం 20 చోట్ల సమ్మతి అంశాన్ని ప్రస్తావించారు. దాదాపు ప్రతి పేరాగ్రాఫ్‌లో అలా రాసి ఉంది. అసలు పరస్పర సమ్మతి అంటే మీరు ఏమనుకుంటున్నారు?. బాధితురాలు మైనర్ అని మీరే ప్రస్తావించి మళ్లీ మీరే అంత చిన్న అమ్మాయి సమ్మతితో ఈ ఘటన జరిగిందని ఎలా వాదిస్తారు?. 'లా'లో మీకు ఏబీసీడీలు కూడా తెలియవు. ఏమీ తెలియని మీరెలా ఎస్ఎల్‌పీ పిటిషన్‌ను దాఖలుచేశారు?. ఈ కేసును ఫైల్ చేసిన, వాదించాల్సిన అసలైన లాయర్ మీరేనా? అడ్వకేట్ ఆన్ రికార్డ్(ఏఓఆర్) మీరేనా?. అసలు మీలాంటి వాళ్లు ఏఓఆర్‌లుగా ఎలా ఎంపికయ్యారు?. మిమ్మల్ని ఇలాగే వదిలేస్తే రేపొద్దున 8 నెలల వయసు చిన్నారిపై రేప్ కేసులోనూ సమ్మతి ఉందని వాదిస్తారు''అని జస్టిస్ సూర్యకాంత్ తీవ్రంగా మందలించారు. దీంతో సదరు లాయర్ వెంటనే క్షమాపణ చెప్పారు. తర్వాత ఈ బెయిల్ విషయంలో మీ స్పందన తెలపాలంటూ పోలీసులు, సంబంధిత విభాగాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది.

అమెరికా ఆసుపత్రిలో దుండగుడి కాల్పులు

మిషిగన్: అమెరికాలో మిషిగన్ రాష్ట్రంలోని ట్రోయ్ నగరంలో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. స్థానిక కోర్‌వెల్ హెల్త్ బీమాంట్ ట్రోయ్ ఆసుపత్రిలో గుర్తుతెలియని దుండగుడు కాల్పులు జరిపి పారిపోయినట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు. అయితే, కాల్పుల్లో ఎవరైనా మరణించారా లేక గాయపడ్డారా అనేది బహిర్గతం చేయలేదు. ట్రోయ్ నగరంలో 87 వేల మంది నివసిస్తున్నారు. ఇది ఉత్తర డెట్రాయిట్‌కు 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. గత నెలలో పెన్సిల్వేనియాలోని ఓ ఆసుపత్రిలో ఓ దుండగుడు బీభత్సం సృష్టించాడు. తుపాకీతో బెదిరిస్తూ హాస్పిటల్ సిబ్బందిని ఐసీయూలో బంధించాడు. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి అతడిని కాల్చి చంపారు. బందీలను క్షేమంగా విడిపించారు. ఈ ఘటనలో ఓ పోలీసు అధికారి సైతం మరణించాడు. ముష్కరులు ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

శంభు వద్ద ట్రాఫిక్ పునరుద్ధరణ

చండీగఢ్: రైతుల ఆందోళనల కారణంగా ఏడాదికిపైగా మూతబడి ఉన్న శంభు–అంబాలా హైవేపై గురువారం వాహనాల రాకపోకలు తిరిగి మొదలయ్యాయి. శంభు వద్ద నిరసన తెలుపుతున్న రైతులను బుధవారం అదుపులోకి తీసుకున్న పోలీసులు, వారు ఏర్పాటు చేసిన తాత్కాలిక నిర్మాణాలను ధ్వంసం చేశారు. ఖనౌరీ సరిహద్దు పాయింట్‌ను కూడా తెరిచేందుకు పంజాబ్, హరియాణా పోలీసులు రోడ్డుపై ఉన్న అడ్డంకులను తొలగిస్తున్నారు. రైతులు తీసుకువచ్చిన ట్రాలీలను పక్కనే ఉన్న మైదానంలోకి తరలించారు. దీంతో, రైతులు తమ గుర్తింపు కార్డులు చూపించి ట్రాలీలను తీసుకెళ్తున్నారు. ఢిల్లీలోకి ప్రవేశించకుండా పోలీసులు అడ్డుకోవడంతో రైతులు గతేడాది ఫిబ్రవరి 13వ తేదీ నుంచి ఇక్కడ తిష్టవేశారు. ఆందోళనలను నిర్విరామంగా కొనసాగించేందుకు వీలుగా రహదారులపైనే తాత్కాలిక నిర్మాణాలు ఏర్పాటు చేసుకున్నారు. అదే సమయంలో, రైతులు దేశ రాజధానిలోకి ప్రవేశించకుండా పోలీసులు రోడ్లపై ముళ్లకంచెలను, సిమెంట్ దిమ్మెలను, మేకులను ఏర్పాటు చేశారు. దీంతో, శంభు- అంబాలా, సంగ్రూర్–జింద్ రహదారులు ఏడాదికిపైగా మూతబడి ఉన్నాయి.

యోగ్యులైన మహిళలు భరణం అడగరాదు

ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: బద్ధకస్తులను చట్టం ప్రోత్సహించదని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. అర్హత కలిగిన మహిళలు సంపాదించగల శక్తి వుండి కూడా మాజీ భర్తల నుంచి భరణం కోరడం తగదని వ్యాఖ్యానించింది. సీఆర్‌పీసీలోని సెక్షన్ 125 భార్యాభర్తల మధ్య సమానత్వాన్ని కొనసాగించడం, భార్యలు, సంతానం, తల్లిదండ్రులకు రక్షణ కల్పించడానికి ఉద్దేశించినదనీ, అదే సమయంలో పనిచేయకుండా ఉండటాన్ని ఈ నిబంధన ప్రోత్సహించలేదని జస్టిస్ చంద్రధారి సింగ్ ఈ నెల 19వ తేదీన వెలువరించిన ఆదేశాల్లో స్పష్టం చేశారు. విడిపోయిన భర్త నుంచి భృతికి అర్హురాలు కాదంటూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఓ మహిళ వేసిన పిటిషన్‌ను ఆయన కొట్టివేశారు. 2019 డిసెంబర్‌లో ఈమెకు వివాహమై భర్తతో సింగపూర్ వెళ్లింది. అక్కడ పెట్టే హింసకు తాళలేక 2021 ఫిబ్రవరిలో తిరిగి ఇండియా వచ్చేసింది. స్వదేశానికి వచ్చేందుకు చేతిలో డబ్బుల్లేక పోవడంతో తన నగలను అమ్ముకున్నానని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. మేనమామ ఇంట్లో ఉంటున్న తనకు ఆర్థికంగా ఎటువంటి ఆధారం లేదని తెలిపారు. తన మాజీ భర్తకి మంచి ఉద్యోగం, సంపాదన ఉన్నాయన్నారు. అయితే, ఆస్ట్రేలియాలో పీజీ చదువుకుని, పెళ్లికి ముందు దుబాయ్‌లో మంచి సంపాదన కలిగిన జాబ్ చేసిన పిటిషనర్ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉండి కూడా ఎందుకు ఖాళీగా ఉంటున్నారని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఉద్యోగాన్వేషణలో ఉన్నట్లుగా చెబుతున్న ఆమె అందుకు తగ్గ ఆధారాలు చూపలేకపోయారని పేర్కొన్నారు. మంచి ఉద్యోగం సంపాదించుకుని, స్వశక్తితో ఎదగాలని పిటిషనర్‌కు సూచించారు.

వెట్టిచాకిరీని నిషేధించే ఆర్టికల్ ఏది?

వ్యక్తిగత స్వేచ్ఛలు, హక్కులు

ప్రకరణ 21

విస్తృత పరిధి, అభ్యుదయ వ్యాఖ్యానాలు

మేనకా గాంధీ కేసు, ఇంద్రజిత్, వెల్లూరు సిటిజన్స్ వెల్ఫేర్ కేసు, ప్రేమశంకర్ శుక్లా కేసు, నరేంద్ర కుమార్ కేసు, మోహిని జైన్ కేసు, ఆటోశంకర్ కేసు, శ్రీమతి ఖుష్బు కేసు మొదలైన వాటిల్లో సుప్రీంకోర్టు జీవించే స్వేచ్ఛపై విస్తృత అర్థాన్ని చెప్పింది. ఈ తీర్పుల సారాంశం ప్రకారం ప్రకరణ 21లో కింద పేర్కొన్న హక్కులు కూడా అంతర్భాగమే.

- గౌరవప్రదంగా జీవించే హక్కు
- కాలుష్య రహిత వాతావరణ హక్కు
- రహస్యాలను, ఆరోగ్యాన్ని కాపాడుకునే హక్కు
- ఉచిత న్యాయ సలహా హక్కు
- విదేశాల పర్యటన హక్కు
- లాకప్ మరణాల వ్యతిరేక హక్కు
- సమాచార హక్కు • సహజీవన హక్కు
- ఏకాంతంగా జీవించే హక్కు
- సత్వర విచారణ పొందే హక్కు
- మరణ శిక్ష అమలును ఆలస్యం చేయడంపై అడిగే హక్కు
- ఆహార హక్కు • నిద్ర హక్కు

ఆత్మహత్యా ప్రయత్నం- జీవించే హక్కు- తాజా వివాదం

ప్రకరణ 21 జీవించే హక్కును కల్పించింది. ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 309 ప్రకారం ఆత్మహత్యాయత్నం శిక్షార్హమైన నేరం. ఈ సెక్షన్ అమానుషమైందని, దాన్ని ఇండియన్ పీనల్ కోడ్ నుంచి తొలగించాలని సుప్రీంకోర్టు సూచించింది. ఆ సెక్షన్‌ను తొలగిస్తున్నట్లు ఇటీవలే కేంద్రం ప్రకటించింది.

'ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం అసహజమైన కోరిక. కాబట్టి ఆ కోరికకు కారణమైన పరిస్థితులను పరిశీలించాలి. అలాంటి వ్యక్తులకు సరైన కౌన్సెలింగ్ నిర్వహించాలి. పోలీసు కేసులతో వేధించరాదు' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

కారుణ్య మరణం (Euthanasia): 2011లో పింకీ విరానీ అనే జర్నలిస్టు అరుణా షాన్‌బాగ్ తరఫున సుప్రీంకోర్టులో కేసు వేసింది. వృత్తి రీత్యా నర్సు అయిన అరుణ షాన్‌బాగ్ బొంబాయి ఎడ్వర్డ్ ఆసుపత్రిలో లైంగిక దాడికి గురైంది. ఆమె సుమారు 37 సంవత్సరాలు కోమాలోనే ఉంది. ఆమె పరిస్థితి దృష్ట్యా కారుణ్య మరణానికి అనుమతివ్వాలని సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసింది. న్యాయస్థానం కారుణ్య మరణాన్ని నిరాకరించింది. ప్రత్యేక పరిస్థితుల్లోనే పాసివ్ కారుణ్య మరణాన్ని అనుమతిస్తామని పేర్కొంది.

విద్యాహక్కు (ప్రకరణ 21-ఎ) (Right to education): విద్యాహక్కును 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్-21ఎలో చేర్చారు. 6 - 14 ఏళ్ల మధ్య వయసున్న బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలని పేర్కొన్నారు.

వాస్తవానికి 2002కు ముందు ఆదేశ సూత్రాల్లోని ఆర్టికల్ 45లో ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను పొందుపరిచారు. కానీ 86వ రాజ్యాంగ సవరణ ద్వారా దీన్ని ఆర్టికల్ 21-ఎకి బదలాయించి ప్రాథమిక హక్కుగా గుర్తించారు. ప్రస్తుతం నిబంధన 45లో ఉచిత ప్రాథమిక విద్యను (ఆరేళ్ల లోపు వారికి) అందించాలనే కొత్త అంశాన్ని చేర్చారు.2009లో విద్యా హక్కు చట్టాన్ని చేశారు. ఈ చట్టం 2010 ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది.

మేనకా గాంధీ V/S యూనియన్ ఆఫ్ ఇండియా (1978 డ్యూ ప్రాసెస్ ఆఫ్ లా)

1978లో మేనకా గాంధీ కేసులో సుప్రీంకోర్టు వ్యక్తి స్వేచ్ఛకు నూతన అర్థాన్నిచ్చింది. మేనకా గాంధీ వివాదం విదేశీ సంచారానికి సంబంధించింది. ప్రజా సంక్షేమం దృష్ట్యా ఆమె పాస్‌పోర్టును రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీన్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో వ్యాజ్యం నడిచింది. ఈ కేసులో అమెరికా రాజ్యాంగంలోని 'డ్యూ ప్రాసెస్ ఆఫ్ లా'ను సుప్రీంకోర్టు అనువర్తింపజేసింది. 'ప్రభుత్వం ఏదో ఒక పద్ధతిని నిర్ణయించి స్వేచ్ఛలను పరిమితం చేయలేదు. నిర్ణయించిన పద్ధతి న్యాయబద్ధంగా, సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగా, వెరసి సమంజసంగా ఉండాలి. ప్రభుత్వం చేసిన పని సక్రమమైనా, ఆ పని చేయడానికి ఎంచుకున్న ప్రక్రియ సక్రమంగా లేకపోతే ఆ చర్యలు చెల్లుబాటు కావు.' దీన్నే డ్యూ ప్రాసెస్ ఆఫ్ లా అంటారు.

విద్యా హక్కుచట్టం ముఖ్యాంశాలు

- ఒకటి నుంచి అయిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వారి నివాస ప్రదేశానికి ఒక కి.మీ. పరిధిలో పాఠశాల ఉండాలి.
- ప్రైవేట్ పాఠశాలల్లోని మొత్తం విద్యార్థుల సంఖ్యలో 25 శాతం సీట్లను బలహీన వర్గాలకు కేటాయించాలి.
- ఉపాధ్యాయ,విద్యార్థుల నిష్పత్తి 1:30గా ఉండాలి.
- ఈ చట్టం అమలుకయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 65:35 నిష్పత్తిలో భరిస్తాయి. ప్రైవేట్ పాఠశాలల్లో ఈ కోటాలో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండరాదు.

విద్యాహక్కు - సుప్రీంకోర్టు తీర్పులు

1992లో మోహిని జైన్ v/s కర్ణాటక, ఉన్నికృష్ణన్ v/s ఆంధ్రప్రదేశ్ కేసుల్లో జీవించే హక్కు, వ్యక్తి గౌరవాన్ని పొందే హక్కుల్లో విద్యా హక్కు అంతర్భాగం. దాన్ని ప్రాథమిక హక్కుగా పరిగణించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక నేపథ్యంతో సంబంధం లేకుండా బాలలకు ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని తమిళనాడు ప్రభుత్వం v/s శ్యామ్ సుందర్ కేసు (2011)లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

ప్రాథమిక విధి: ఇదే సవరణ ద్వారా నిబంధన 51-ఎలో ప్రతి తల్లిదండ్రులు, సంరక్షకులు 6 నుంచి 14 ఏళ్లలోపు వయసున్న తమ పిల్లలకు విద్యా సౌకర్యాలు కల్పించాలనే విధిని నూతన ప్రాథమిక విధిగా పేర్కొన్నారు.

ప్రకరణ-22

అక్రమ నిగ్రహణ (Arrest), నిర్బంధం (Detention) నుంచి రక్షణ

అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు వ్యతిరేకంగా ఆర్టికల్ 22 రక్షణ కల్పిస్తుంది. ఈ ప్రకరణ ప్రకారం చట్టబద్ధంగా అరెస్ట్ చేయడానికి కొన్ని ప్రాతిపదికలు పాటించాలి. అవి..

ప్రకరణ 22 (1):

ఎ) ప్రతి అరెస్టుకు కారణం ఉండాలి లేదా కారణాన్ని తెలియజేయాలి. న్యాయవాదిని సంప్రదించే అవకాశం ఇవ్వాలి. బి) నిందితుణ్ని 24 గంటల్లోగా సమీప న్యాయస్థానంలో హాజరుపరచాలి.

24 గంటలను లెక్కించేటప్పుడు ప్రయాణ సమయాన్ని మినహాయిస్తారు. సెలవు దినాలను మినహాయించరు. అరెస్టయిన వ్యక్తిని సమీప మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చాలి. పై రక్షణలకు కొన్ని మినహాయింపులున్నాయి. ప్రకరణ 22(3) ప్రకారం శత్రు దేశ పౌరులకు, ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల కింద అరెస్టయిన వారికి ఈ రక్షణలు వర్తించవు.

ప్రకరణ 22(4) ప్రకారం ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల కింద అరెస్టయిన వారిని మూడు నెలలకు మించి నిర్బంధంలో ఉంచరాదు. కానీ ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల కింద ఏర్పాటైన ఎడ్వైజరీ బోర్డు సూచన మేరకు మూడు నెలల కంటే ఎక్కువ కాలం నిర్బంధంలో ఉంచవచ్చు. ఈ బోర్డులో హైకోర్టు న్యాయమూర్తులు లేదా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యే అర్హతలున్న వ్యక్తులు సభ్యులుగా ఉంటారు.

ప్రకరణ 22(5) ప్రకారం ప్రివెంటివ్ డిటెన్షన్ కింద అరెస్టయిన వారికి తమను ఎందుకు అరెస్టు చేశారో వీలైనంత త్వరగా తెలపాలి. తద్వారా బాధితులకు పిటీషన్ వేసుకునే అవకాశం ఉంటుంది.

ప్రకరణ 22(6) ప్రకారం ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ప్రివెంటివ్ అరెస్టుకు కారణాలను వెల్లడించకుండా ఉండే అధికారం ప్రభుత్వానికి ఉంది.



ప్రకరణ 22(7) ప్రకారం పైన పేర్కొన్న క్లాజులతో సంబంధం లేకుండా మూడు నెలల కంటే ఎక్కువ కాలం నిర్బంధించే విధంగా పార్లమెంట్ శాసనాలు రూపొందించవచ్చు.

ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాలు, వివరణ: సాధారణంగా నిర్బంధాలు రెండు రకాలు:

1. శిక్షించే చట్టాలు 2. నివారక చట్టాలు.

శిక్షించే చట్టాల్లో ముద్దాయి నేరం రుజువయ్యాక కోర్టు విధించిన శిక్షను అమలు చేయడానికి నిర్బంధిస్తారు. నివారక నిర్బంధంలో విచారణ లేకుండా నేరం చేస్తారేమో అనే అనుమానంతో నిందితుణ్ని లేదా అనుమానితుణ్ని ముందుగానే నిర్బంధిస్తారు. దేశ రక్షణ, శాంతి భద్రతల దృష్ట్యా ఇలా చేస్తారు.

సుప్రీంకోర్టు తీర్పులు

ఎ.కె.గోపాలన్ v/s స్టేట్ ఆఫ్ మద్రాస్ (1950): ఒక వ్యక్తిని అరెస్టు చేస్తున్నప్పుడు అతడికి కారణాలను తెలపడం సంబంధిత పోలీస్ అధికారి బాధ్యత. అలాగే అరెస్టయిన వ్యక్తికి తన వాదనను వినిపించేందుకు అవకాశం ఇవ్వాలి. దీన్ని లాటిన్ పరిభాషలో 'ఆడీ ఆల్టిరమ్ పార్టెమ్' అంటారు. అంటే హియర్ ది అదర్ సౌండ్ టూ అని అర్థం. అభియోగం ఎదుర్కొంటున్న వ్యక్తికి తన నిర్దోషిత్వాన్ని వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని దీని అర్థం.

అబ్దుల్ సమర్థ v/s స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ (1962)

అరెస్టయిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప కోర్టులో హాజరు పరచకపోతే 24 గంటల తర్వాత ఆ వ్యక్తికి విడుదలయ్యే హక్కు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

జోగిందర్ కుమార్ v/s స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్

ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు ఆ సమాచారాన్ని కుటుంబ సభ్యులకు/స్నేహితుడికి/సంబంధిత వ్యక్తులకు తెలియజేయాలి.

ప్రకరణలు 23, 24

పీడన నిరోధ హక్కులు

మానవులతో వ్యాపారం, బలవంతపు వెట్టిచాకిరీని ప్రకరణ 23(1) నిషేధిస్తుంది. వ్యక్తుల ఇష్టానికి వ్యతిరేకంగా, బలవంతంగా ఏ పని చేయించరాదు. పై చర్యలకు పాల్పడితే పార్లమెంటు చట్టాల ప్రకారం శిక్షార్హులు అవుతారు.

నిబంధన 23లో బేగార్ అనే పదాన్ని ప్రయోగించారు. బేగార్ అంటే వెట్టిచాకిరీ. ఉత్తర భారతదేశంలో హాలీ అంటే.. ఎలాంటి పారితోషకం లేకుండా వ్యక్తులతో పని చేయించుకోవడం. దీన్ని 1976లో వెట్టిచాకిరీ చట్టం ద్వారా నిషేధించారు.

ఈ నిబంధన స్వయంగా అమల్లోకి రాదు. అందుకే 1956లో పార్లమెంటు అశ్లీల, అసభ్య వ్యాపార నిరోధక చట్టాన్ని రూపొందించింది.

ప్రకరణ 23(2) ప్రకారం ప్రజా ప్రయోజనం కోసం పౌరులు, ప్రభుత్వ ఉద్యోగులపై నిర్బంధ సేవలను విధించవచ్చు. దీన్ని దోపిడీగా పరిగణించరు.

ప్రకరణ-24

బాల కార్మిక వ్యవస్థ రద్దు

ఈ ఆర్టికల్ ప్రకారం 14 ఏళ్ల లోపు వయసున్న బాలలను ప్రమాదకర, ఇతర పనుల్లో వినియోగించరాదు. ఒకవేళ వినియోగిస్తే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారు. ఈ నిబంధన కూడా స్వయంగా అమల్లోకి రాదు. దీనికి సంబంధించి పార్లమెంటు చట్టం చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు తదనుగుణంగా చట్టాలు చేశారు.

సుప్రీంకోర్టు తీర్పులు

ఎం.సి.మెహతా v/s తమిళనాడు(1997) కేసులో 14 ఏళ్ల లోపు వయసున్న బాలలను ఏ రకమైన ప్రమాదకర పరిశ్రమల్లో లేదా ఇతర పనుల్లో వినియోగించరాదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

బంధువా ముక్తిమోర్చా v/s యూనియన్ ఆఫ్ ఇండియా, 1997 కేసులో కూడా సుప్రీంకోర్టు ఇదే తీర్పు వెలువరించింది. బాలల సంరక్షణకు ప్రత్యేక పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని, బాలకార్మికులను పనిలో వినియోగించే యజమానిపై రూ. 20,000 వరకు జరిమానా విధించాలని పేర్కొంది.

ప్రకరణలు 25-28

మత స్వాతంత్ర్యపు హక్కులు

ప్రకరణ 25(1) ప్రకారం ప్రతి వ్యక్తి తన అంతరాత్మ ప్రబోధానుసారం ఏ మతాన్నైనా అవలంబించి, ఆచరించి, ప్రచారం చేసే స్వేచ్ఛ ఉంది.

ప్రకరణ 25(2) ప్రకారం మత స్వేచ్ఛ ప్రజాశాంతికి, నైతికతకు, ప్రజారోగ్యానికి భంగం కలిగించరాదు. అలాంటి సమయాల్లో ప్రభుత్వం పరిమితులు విధించవచ్చు. మత విషయాలను నియంత్రించవచ్చు. హిందూ మతంలో కొన్ని సామాజిక సంస్కరణలు చేపట్టవచ్చు.

ప్రకరణ-25లో రెండు వివరణలు ఉన్నాయి. అవి

- సిక్కులు తలపాగా, కత్తి ధరించడం వారి సంప్రదాయంలో భాగం.
- ప్రకరణ-25(2)(బి)లో హిందువులు అనే పదం ఉంది. ఇక్కడ హిందువులంటే సిక్కులు, జైనులు, బౌద్ధులు కూడా.

ప్రకరణ-26

మత సంస్థలు - మతపరమైన వ్యవహార నిర్వహణలో స్వేచ్ఛ

ప్రజా శాంతికి, నైతికతకు, ఆరోగ్యానికి భంగం కలిగించకుండా వ్యక్తులు మత సంస్థలను ఏర్పాటు చేసి నిర్వహించుకోవచ్చు.

- మత సంస్థలను, ధర్మాదాయ సంస్థలను స్థాపించవచ్చు.
- సంస్థలను నిర్వహించుకోవచ్చు.
- స్థిర, చరాస్తులను సంపాదించుకోవచ్చు.
- అమల్లో ఉన్న చట్టాలకు లోబడి వాటిని నిర్వహించుకోవచ్చు.

ప్రకరణ-27

మతవ్యాప్తి లేదా మత పోషణ కోసం పన్నులు వసూలు చేయరాదు

మత ప్రాతిపదికన ప్రజలపై పన్నులు విధించరాదు, వసూలు చేయరాదు. ఈ నిబంధన పన్నులు వసూలు చేయడాన్ని మాత్రమే నిషేధిస్తుంది. అయితే మత ప్రాతిపదికన ప్రత్యేక సేవలు అందించినందుకు ప్రజల నుంచి ప్రభుత్వం రుసుం వసూలు చేయవచ్చు. **ఉదా:** దేవాలయంలో ప్రత్యేక దర్శనాల కోసం, సేవల కోసం రుసుం వసూలు చేయడం రాజ్యాంగబద్ధమే.

రక్తం ఎరుపు రంగులో ఉండటానికి కారణం?

రక్త ప్రసరణ వ్యవస్థ

రక్త ప్రసరణ వ్యవస్థ మొదట అనిలెడా వర్గానికి చెందిన వానపాము, జలగలో ఏర్పడింది. రక్తప్రసరణ వ్యవస్థ పితామహుడు విలియం హార్వే.

రక్తం

రక్తం ఒక కొల్లాయిడల్ పదార్థం. రక్తం ద్రవ రూపంలో ఉండి శరీరంలోని అన్ని భాగాలను అనుసంధానం చేస్తుంది. కాబట్టి రక్తాన్ని ద్రవరూప సంయోజక కణజాలం అంటారు.

- రక్తాన్ని అధ్యయనం చేసే శాస్త్రం హెమటాలజీ.
- ప్రౌఢమానవుడిలో 5 లీటర్ల రక్తం ఉంటుంది.
- రక్తం రుచి కొంచెం ఉప్పగా ఉంటుంది. రక్తం pH 7.4 (బలహీన క్షారం)
- ఆక్సిజన్, కార్బన్ డైఆక్సైడ్, ఆహార పదార్థాలను రక్తం రవాణా చేస్తుంది.

రక్తం- రంగు

ఆర్థ్రోపొడా, మొలస్కా వర్గం జీవులు మినహా అన్ని జీవుల్లో రక్తం ఎరుపు రంగులో ఉంటుంది. జీవుల రక్తంలోని ఎర్ర రర్తకణాలపైన హిమోగ్లోబిన్ ఉంటుంది.

- తెలుపు రంగు రక్తం ఉన్న జీవులు.. కీటకాలు (ఆర్థ్రోపొడా వర్గం)
- ఈ జీవుల రక్తంలో Hb (హిమోగ్లోబిన్) ఉండదు. కాబట్టి రక్తం వర్ణరహితం (తెలుపు)గా ఉంటుంది.
- పీతలు, నత్తలు, ఆల్చిప్పల్లో నీలి రంగు రక్తం ఉంటుంది.
- ఈ జీవుల రక్తంలో హిమోసయనిన్ అనే వర్ణద్రవ్యం ఉంటుంది.
- అనిలెడా (పాలికీటా) జీవుల్లో రక్తం ఆకుపచ్చ రంగులో ఉంటుంది.
- ఈ జీవుల్లో క్లోరోక్రువోరిన్స్ అనే శ్వాసవర్ణకం ఉంటుంది.

రక్త ప్రసరణ వ్యవస్థ - రకాలు

రక్త ప్రసరణ వ్యవస్థ రెండు రకాలు.

1) వివృత రక్త ప్రసరణ లేదా స్వేచ్ఛా రక్త ప్రసరణ వ్యవస్థ.
2) సంవృత లేదా బంధిత రక్తప్రసరణ వ్యవస్థ.

వివృత రక్త ప్రసరణ వ్యవస్థ

- రక్తం రక్తనాళాల్లో కాకుండా స్వేచ్ఛగా శరీరంలోని కోటరాలు లేదా కాలువల్లో ప్రవహిస్తుంది.
- ఈ జీవుల్లో రక్తనాళాలు ఉండవు.


ఉదా:

1. ఆర్థ్రోపొడా (కీటకాలు)
2. మొలస్కా (సెఫలోపొడా మినహా)
3. ఇకైనోడర్మేటా
4. నిమ్నశ్రేణి కార్డేటా జీవులు

సంవృత రక్త ప్రసరణ వ్యవస్థ

- రక్తం రక్తనాళాల్లో ప్రవహిస్తుంది.
- ఈ జీవుల్లో రక్తనాళాలు ఉంటాయి

  ఉదా॥ అనిలెడా, ఆక్టోపస్ (సెఫలోపొడా, మొలస్కా) ఉన్నత స్థాయి కార్డేటా జీవులు, సెఫలోకార్డేటా, సకశేరుక జీవులు (చేపలు ఉభయచరాలు, సరీసృపాలు, పక్షులు, క్షీరదాలు).
- జలగ లాలాజలంలో హిరుడిన్ ఉత్పత్తి అవుతుంది. కాబట్టి రక్తాన్ని పీల్చినప్పుడు గడ్డకట్టకుండా ఉంటుంది.
- జలగను చెడురక్తం పీల్చే ప్రక్రియలో ఉపయోగిస్తారు. ఈ పద్ధతిని ఫిలోబోటమీ అంటారు.
- దోమల లాలాజలంలో హిమోలైసిన్ ఉత్పత్తి అవుతుంది.





సీరం

శరీరం నుంచి సేకరించిన రక్తాన్ని పరీక్ష నాళికల్లోకి తీసుకున్నప్పుడు రక్తం గడ్డకడుతుంది. రక్తం గడ్డకట్టిన తర్వాత పైకి కనిపించే పసుపు రంగు ద్రవాన్ని సీరం అంటారు. సీరంలో ప్రతిరక్షకాలు ఉంటాయి. కానీ రక్తకణాలు, ప్లాస్మా ప్రొటీన్లు, రక్తం గడ్డకట్టే కారకాలు ఉండవు. సీరం అధ్యయనాన్ని సీరాలజీ అంటారు.

రక్తం- భాగాలు

రక్తంలో రెండు భాగాలు ఉంటాయి.అవి..

1) ప్లాస్మా 2) రక్త కణాలు

ప్లాస్మా

రక్తంలోని ద్రవభాగాన్ని ప్లాస్మా అంటారు. ప్రౌఢవ్యక్తిలో సుమారు 2.7 నుంచి 3 లీటర్ల ప్లాస్మా ఉంటుంది. ఇది గడ్డి రంగులో ఉంటుంది.

- రక్తంలో ప్లాస్మా 55 శాతం ఉంటుంది.
- ప్లాస్మాలో 92 శాతం నీరు, 8 శాతం కర్బన, అకర్బన, ఇతర పదార్థాలు ఉంటాయి.
- ప్లాస్మా pH విలువ 7.1
- ప్లాస్మాలో లవణ శాతం 0.85 నుంచి 0.9
- ప్లాస్మాలో అల్బుమిన్, గ్లోబ్యులిన్ అనే ప్రొటీన్లు ఉంటాయి. ఇవి ఆహార పదార్థాల రవాణాలో పాల్గొంటాయి.
- ప్రోత్రాంబిన్, ఫైబ్రినోజన్ అనే రక్తస్కందన పదార్థాలు ఉంటాయి.
- సోడియం, పొటాషియం, అమ్మోనియం, కాల్షియం, మెగ్నీషియం క్లోరైడ్లు, ఫాస్ఫేట్లు, సల్ఫేట్లు తక్కువ పరిమాణంలో ఉంటాయి.
- కర్బన పదార్థాలైన యూరికామ్లం, విటమిన్లు, హార్మోన్లు కూడా తక్కువ మోతాదులో ఉంటాయి.

రక్త కణాలు

రక్త కణాల సేకరణకు రక్తానికి 10 మి.లీ. (0.9%) సోడియం క్లోరైడ్ (NaCl) ద్రావణాన్ని కలుపుతారు.

- రక్తంలో రక్తకణాలు 45 శాతం ఉంటాయి.
- రక్త కణాలు మూడు రకాలు అవి..

  1) ఎర్ర రక్తకణాలు
  2) తెల్ల రక్తకణాలు
  3) రక్త ఫలకికలు

ఎర్ర రక్త కణాలు (ఆర్‌బీసీ)

ఎర్ర రక్తకణాలను ఆంటోనీవాన్ లీవెన్ హుక్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఎముక ఎరుపు అస్థిమజ్జలోని నార్మోబ్లాస్ట్ అనే పూర్వకణాల నుంచి ఎర్ర రక్తకణాలు ఏర్పడుతాయి.

- పక్షుల్లో అస్థిమజ్జ ఉండదు. ఎముకలు గాలితో నిండి ఉంటాయి. కాబట్టి పక్షుల్లో ఎర్ర రక్తకణాలను బూర్సా అనే అవయవం ఉత్పత్తి చేస్తుంది.
- ఎర్ర రక్తకణాల పరిపక్వతకు విటమిన్ $బి_{12}$, ఫోలిక్ ఆమ్లం అవసరం.
- పరిపక్వం చెందిన ఎర్ర రక్తకణాల్లో హిమోగ్లోబిన్ మాత్రమే ఉంటుంది. కేంద్రకం ఇతర కణాంగాలు ఉండవు.
- వానపాములో ఎర్ర రక్తకణాలు ఉండవు.
- ఎర్ర రక్తకణాల ఉత్పత్తిని ఎరిత్రోపోయిసిస్ అంటారు
- ఎరిత్రోసైసిస్ అంటే ఎర్రరక్తకణాల విచ్ఛిత్తి
- ప్రతిరోజు ఉత్పత్తి అయ్యే, అంతరించే ఆర్‌బీసీల సంఖ్య 10×10^{12}.

ఆర్‌బీసీల లక్షణాలు

ఆకారం: బల్లపరుపు లేదా ద్విపుటాకారం (Biconcave) క్షీరదాల్లో మాత్రమే ఉంటుంది.

కేంద్రకం: క్షీరదాల ఆర్‌బీసీల్లో కేంద్రకం ఉండదు. కానీ చేపలు, ఉభయచరాలు, సరీసృపాలు, పక్షుల ఆర్‌బీసీల్లో కేంద్రకం ఉంటుంది.

- ఒంటె, లామా అనే క్షీరదాల ఎర్రరక్తకణాలు ద్వికుంభాకారంలో ఉంటాయి. వీటిలో కేంద్రకం ఉంటుంది.
- ఆర్‌బీసీలు పిండదశలో కాలేయం, ప్లీహం నుంచి ఉత్పత్తి అవుతాయి.
- కాలేయాన్ని ఎర్రరక్తకణాల క్రాడిల్ అంటారు.
- పురుషులలో ఆర్‌బీసీల సంఖ్య.. 4.5 నుంచి 6.5 మిలియన్లు (లేదా) 4.5 నుంచి 6.5×10^6 (క్యూబిక్ మి. లీ. రక్తంలో)
- స్త్రీలలో 3.5 నుంచి 5.5 మిలియన్లు (లేదా) 35 - 55 లక్షల ఆర్‌బీసీలు ఉంటాయి.
- ఆర్‌బీసీల గుంపును రౌలెక్స్ అంటారు.
- హిమోసైటోమీటర్‌తో ఆర్‌బీసీలను లెక్కిస్తారు.
- ఆర్‌బీసీల జీవితకాలం 120 రోజులు
- విటమిన్-ఇ లోపంతో ఆర్‌బీసీల జీవితకాలం తగ్గుతుంది.
- ఆర్‌బీసీలు ప్లీహం, కాలేయంలో విచ్ఛిన్నమవుతాయి.
- ఆర్‌బీసీలు విచ్ఛిన్నం చెందే ప్రక్రియను ఎరిత్రోక్లాసియా అంటారు.
- కాలేయాన్ని హిమోపాయిటిక్ + హిమోలైటిక్ అవయవం అంటారు.
- హిమోలైటిక్ చర్యలో కాలేయ కొపర్ కణాలు ఉపయోగపడుతాయి.

హిమోగ్లోబిన్

- హిమోగ్లోబిన్ ఒక సంయుగ్మ ప్రొటీన్. దీనిలో ఉండే మూలకం ఇనుము.
- పచ్చని ఆకుకూరలు, కూరగాయల్లో ఐరన్ లభిస్తుంది.
- హిమోగ్లోబిన్ తయారీకి ఇనుము, గ్లోబ్యులిన్ ప్రొటీన్ అవసరం.
- రక్తంలో Hbని లెక్కించే పద్ధతిని కంప్లీట్ బ్లడ్ కౌంట్ అంటారు.
- ప్రౌఢ వ్యక్తి రక్తంలో Hb-15 గ్రా./డెసీలీటర్
- హిమోగ్లోబిన్ పోర్ఫైరిన్ నిర్మాణాన్ని కలిగి ఉంటుంది.
- హిమోగ్లోబిన్ నిర్మాణంలో హీమ్, గ్లోబ్యులిన్ అనే భాగాలుంటాయి.

హీమ్

- హిమోగ్లోబిన్‌లోని ఇనుము భాగాన్ని హీమ్ అంటారు.
- ఇది పోర్ఫైరిన్ నిర్మాణం మధ్యలో ఉంటుంది.

గ్లోబ్యులిన్

- ఇది ఒక ప్రొటీన్ భాగం
- గ్లోబ్యులిన్ నిర్మాణంలో 4 అమైనో ఆమ్ల శృంఖలాలు (2 ఆల్ఫా+ 2 బీటా) ఉంటాయి.
- Hbతో అధిక చర్యాశీలత ఉన్న వాయువు కార్బన్ మోనాక్సైడ్
- ఒక Hb అణువు 4 ఆక్సిజన్ పరమాణువులను కణాల వద్దకు తీసుకెళ్తుంది.

తెల్ల రక్త కణాలు (డబ్ల్యూబీసీ)

- డబ్ల్యూబీసీలను ఫాగోసైట్స్, శ్వేత రక్తకణాలు అనికూడా అంటారు.
- తెల్ల రక్తకణాలు రక్తంలోకి వచ్చిన సూక్ష్మజీవులను చంపి దేహానికి రక్షణ కల్పిస్తాయి. కాబట్టి వీటిని శరీర రక్షకభటులు లేదా రక్తంలోని పారిశుధ్య కార్మికులు అని అంటారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. హిమోగ్లోబిన్‌లో ఉండే మూలకం?
   1) మెగ్నీషియం 2) ఇనుము
   3) కోబాల్ట్ 4) మాంగనీసు
2. మానవుడిలో రక్తప్రసరణను కనుగొన్నది?
   1) ఫ్రాయిడ్ 2) అరిస్టాటిల్
   3) విలియం హార్వే 4) డార్విన్
3. ఒక రక్తం చుక్కలోని రక్త కణాల సంఖ్య?
   1) 10,000 2) 1,00,000
   3) అనేకం 4) 2,500 కంటే తక్కువ
4. రక్తం ఒక
   1) ద్రావణం 2) కొల్లాయిడ్
   3) తరల పదార్థం 4) జెల్
5. సీరలాజికల్ పరీక్షలో అత్యంత ముఖ్యమైన ప్రక్రియ?
   1) వర్గీకరణ లక్షణం 2) గుర్తింపు లక్షణం
   3) వైవిధ్య లక్షణం 4) పోలిక లక్షణం
6. కీటకాల్లోని రక్తం రంగు?
   1) ఎరుపు 2) తెలుపు
   3) నలుపు 4) ఆకుపచ్చ
7. ప్రౌఢవ్యక్తుల్లో ఎర్ర రక్తకణాలు ఎక్కడ ఉత్పత్తి అవుతాయి?
   1) మూత్రపిండాలు 2) ప్లీహం
   3) ఎముక మూలుగ 4) కాలేయం
8. మానవుడి రక్తం pH 7.4 అయితే దాని స్వభావం?
   1) ఆమ్ల స్వభావం 2) క్షార స్వభావం
   3) తటస్థ స్వభావం
   4) కొద్దిపాటి క్షార స్వభావం
9. హిమోగ్లోబిన్ ఒక
   1) ఎంజైమ్ 2) చక్కెర పదార్థం
   3) లిపిడ్ 4) ఆర్‌బీసీల్లోని ప్రొటీన్
10. రక్తం ఎరుపు రంగులో ఉండటానికి కారణం?
    1) ప్లాస్మా 2) ఎరిత్రోసైట్స్
    3) హిమోగ్లోబిన్ 4) పైవేవీ కావు

సమాధానాలు

1) 2; 2) 3; 3) 3; 4) 2; 5) 2; 6) 2; 7) 3; 8) 4; 9) 4; 10) 3

తెలుగు భాషా సాహిత్యాలను ఆదరించిన కుతుబ్‌షాహీలు



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

కుతుబ్‌షాహీలు మతసహనాన్ని పాటించారు. ఇక్కడి ప్రజలతో మమేకమయ్యారు. కాకతీయుల మాదిరే అనేక చెరువులు, కాలువలు, బావులు తవ్వించి వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడ్డారు. కుతుబ్‌షాహీల కృషి వల్ల గోల్కొండ రాజ్యం నాటి యూరప్ దేశాల కంటే పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది. 17వ శతాబ్దంలో గోల్కొండను సందర్శించిన పాశ్చాత్య యాత్రికులు గోల్కొండ రాజ్యాన్ని రెండో ఈజిప్టుగా వర్ణించారు. అందమైన, భారీ నిర్మాణాలున్న గోల్కొండ, హైదరాబాద్ నగరాలను యూరప్‌లోని ఆర్లియన్స్‌తో పోల్చారు.

కుతుబ్‌షాహీ యుగ విశేషాలు

పాలనా విధానం

రాజు(సుల్తాన్) సర్వాధికారి. కుతుబ్‌షాహీలు తాము దేవుడి ప్రతినిధులమని(జుల్ అల్లా) చెప్పుకున్నారు. రాజుకు సలహాలు ఇవ్వడానికి మంత్రి పరిషత్ ఉండేది. ప్రధాన మంత్రిని పీష్వా అని పిలిచేవారు. పీష్వా తర్వాతి స్థానం మీర్ జుంలా(ఆర్థిక మంత్రి)ది. వీరే కాకుండా ఐనుల్ ముల్క్(యుద్ధ మంత్రి/సర్వ సైన్యాధ్యక్షుడు), మజుందార్(ఆడిటర్ జనరల్), కొత్వాల్ (పోలీస్ అధికారి) మొదలైన అధికారులుండేవారు.అబుల్‌హసన్ తానీషా కాలంలో గోల్కొండ రాజ్యంలో ఆరు సుబా(రాష్ట్రం)లను ఏర్పాటు చేశారు. సుబాలను 36 సర్కార్లు(జిల్లాలు)గా విభజించారు. సర్కార్లను 517 పరగణా(తాలూకా)లుగా విభజించారు.

కుతుబ్‌షాహీ రాజ్యంలోని సుబాలు

- ఒకటో సుబా - మహ్మద్‌నగర్, మెదక్, కౌలాస్, ముల్కనూరు.
- రెండో సుబా - ఎల్గందల, వరంగల్, ఖమ్మం, దేవరకొండ.
- మూడో సుబా - పానగల్, ముస్తఫానగర్(కొండపల్లి), భువనగిరి, అకర్‌కర్.
- నాలుగో సుబా - కోయిల్ కొండ, ఘన్‌పూర్, ముర్తజానగర్(గుంటూరు), మచిలీపట్టణం.
- అయిదో సుబా - నిజాం పట్టణం, ఏలూరు, రాజమండ్రి, సికాకోల్.
- ఆరో సుబా - కర్ణాటక ప్రాంతం. ఇందులో 16 సర్కార్లు ఉండేవి.

రాష్ట్ర పాలకుడిని తరఫ్‌దార్‌గా, జిల్లా పాలకుడిని ఫౌజుదార్‌గా వ్యవహరించేవారు. పరగణా పాలకుడిని తహసీల్దార్ అని పిలిచేవారు. గ్రామాల్లో పన్నెండు మంది ఆయగార్లు ఉండేవారని నాటి ఫర్మానాలను బట్టి తెలుస్తోంది. వారు.. పటేల్, కులకర్ణి (కరణం), చౌద్రి (వర్తకుల పెద్ద), పోతేదార్ (నాణేల మారకందారు), దేశ్‌పాండే (గణకుడు), నహని (మంగలి), పారిత్ (చాకలి), పూజారి, సుతార్ (వడ్రంగి), కుంభార్ (కుమ్మరి), జోషి (జోతిష్కుడు), వేశహార(మస్కూరి). సారంగు తమ్మయ 'వైజయంతీ విలాసం'అనే గ్రంథాన్ని రచించాడు. ఇందులోని వర్ణనను బట్టి దొంగలను పట్టుకుని, దొంగ సొత్తును కొనుగోలు చేసే కంసాలులను విచారించే అధికారే తలారి(తలవరి) అని తెలుస్తోంది.

కుతుబ్‌షాహీలు హిందూధర్మ సూత్రాల్లో జోక్యం చేసుకోలేదు. గోల్కొండ రాజ్యంలో 84 స్థల, గిరి, వన, జల దుర్గాలు ఉండేవి. వీటిలో ఎక్కువ భాగం తెలంగాణలో ఉండేవి. కేంద్ర సైన్యం, జాగీర్దారీ సైన్యం అని రెండు రకాల సైన్యం ఉండేది.

ఆర్థిక పరిస్థితులు

గోల్కొండ రాజ్యంలో సారవంతమైన తీర భూములు ఉండేవి. ప్రజల ప్రధాన సాంస్కృతిక ధోరణులను సమన్వయ పరచడానికి, సాంఘిక అసమానతలను అదుపు చేయడానికి సూఫీ ఉద్యమం తోడ్పడింది. నాటి ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. గోల్కొండ సుల్తాన్లు, వారి అధికారులు హుస్సేన్‌సాగర్, ఇబ్రహీంపట్నం, బద్వేల్ లాంటి చెరువులను తవ్వించారు. ఇవే కాకుండా అనేక కాలువలు, బావులను తవ్వించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడ్డారు. నీటి వనరులకు మరమ్మతు చేయడానికి, ఆయకట్టు భూములకు నీరు అందించడానికి వడ్డెరలను నియమించి, వారికి మేరలు ఏర్పాటు చేశారు. గోల్కొండ సుల్తాన్ల కృషి వల్ల భూములు విస్తృతంగా సాగులోకి వచ్చాయి. రైతులు వరి, జొన్న, రాగి, పెసర, వేరుశెనగ, కందులతోపాటు పత్తి, పొగాకు, ఆముదం తదితర పంటలను పండించేవారు. అప్పటికే పోర్చుగీసువారు మన దేశంలో పొగాకును ప్రవేశపెట్టారు. పత్తి, పొగాకు పంటల వల్ల ప్రభుత్వ ఖజానాకు అధిక ఆదాయం లభించేది. సంత్రాలు, అంజూర, జామ, నారింజ, మామిడి, అరటి, నిమ్మ, దానిమ్మ లాంటి పండ్ల తోటలను పెంచేవారు. పదిహేడో శతాబ్దంలో గోల్కొండ రాజ్యంలో మేలిరకం ఇనుము, ఉక్కు ఉత్పత్తి అయ్యేవి. వీటితో కత్తులు, బాకులు మొదలైన యుద్ధ పరికరాలను తయారుచేసేవారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన డమాస్కస్ కత్తుల తయారీలో గోల్కొండ ఉక్కును ఉపయోగించారు. నిర్మల్, ఇందూరు పట్టణాలు ఆయుధ పరిశ్రమకు కేంద్రంగా ఉండేవి. గోల్కొండ రాజ్యం వజ్ర పరిశ్రమకు ప్రసిద్ధి చెందింది. గోల్కొండ వజ్రాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి. అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో నూతన వజ్రాల గనులు కనుగొన్నారు. వస్త్ర పరిశ్రమకు ఓరుగల్లు పేరొందింది. ఖమ్మం జిల్లాలోని నాగులపంచలో లభించే నీలిరంగును విదేశాలకు ఎగుమతి చేసేవారు. 17వ శతాబ్దం తొలినాళ్లలో 'మిరప' గురించి తెలంగాణ ప్రజలకు తెలిసింది.

సాంఘిక పరిస్థితులు

కుతుబ్‌షాహీల సంస్కృతి తెలంగాణ సంస్కృతిగా రూపుదిద్దుకుంది. ఇతర తెలుగు ప్రాంతాల కంటే మరింత భిన్నమైన సంస్కృతి తెలంగాణలో రూపొందింది. కులీ కుతుబ్‌షా తెలంగాణ ప్రజల వస్త్రాలంకరణను అనుసరించి, వారి అభిమానం చూరగొన్నాడు. హైదరాబాద్ నగరంలో సుమారు పది లక్షల మంది నివసించేవారు. మొగలులు, ఇరానీలు ఇక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. హైదరాబాద్‌లో వేశ్యావృత్తి ఉండేది. నాట్యకత్తెలకు ఆదరణ పెరిగింది. అబ్దుల్లా కుతుబ్‌షాతో సహజీవనం చేసిన తారామతి, ప్రేమావతి గొప్ప నాట్యకత్తెలుగా పేరొందారు. కుల వ్యవస్థ కొనసాగింది. కుల కట్టుబాట్లు అధికమయ్యాయి. అనేక ఉపకులాలు స్థిరపడ్డాయి. బాల్య వివాహాలు ఎక్కువగా జరిగేవి. సతీసహగమన దురాచారాన్ని రూపుమాపడానికి కుతుబ్‌షాహీలు ప్రయత్నించారు.

మత పరిస్థితులు

ఈ కాలంలో తెలుగు ప్రజలు స్మార్త, శైవ, వైష్ణవ మతాలను అనుసరించేవారు. ఈ మతాల మధ్య విభేదాలు తీవ్రంగా ఉండేవి. కుతుబ్‌షాహీలు ప్రజల మత విశ్వాసాలను, ఆచార వ్యవహారాలను గౌరవించేవారు. దేవాలయాలకు భూములు దానం చేసేవారు. ప్రతిభను బట్టి తెలుగువారికి అనేక ఉన్నత పదవులిచ్చేవారు. అనేక మంది తెలుగు వారు మీరాసిదార్లుగా, జాగీరుదార్లుగా, దేశ్‌ముఖ్‌లుగా, దేశ్‌పాండేలుగా ఉండటమే అందుకు నిదర్శనం. ఈ ఆదరణ వల్ల తెలుగువారు, ముస్లింలు కలిసిపోయి ఒక సహజీవన సంస్కృతి రూపొందింది. తెలుగు- ముస్లిం మిశ్రమ సంస్కృతి ఏర్పడింది. ఒకరి ఆచారాలు, సంప్రదాయాలను మరొకరు అనుసరించారు. మొహర్రం(పీర్ల) పండుగను తెలుగువారు తాదాత్మ్యతతో జరుపుకొనేవారు. దర్గాలకు వెళ్లేవారు. కందూరు చేసుకునేవారు. అదే విధంగా తెలుగు పండుగలు, ఆచార వ్యవహారాలను ముస్లింలు ఆదరించేవారు. షబ్-ఎ రాత్ పండుగలో దీపాలు అలంకరించడం దీపావళి నుంచి వచ్చింది. వసంతోత్సవాల్లో రాజులు, ముస్లిం ప్రజలు పాల్గొనేవారు. తిరుపతికి వెళ్లేవారు. అక్కడి బీబీనాంచారమ్మ అలా వెలిసిందే. ముస్లింలలో మంగ్‌నా(నిశ్చితార్థం), వధూవరులను తలుపు దగ్గర ఆపి పరిహాసాలాడటం, వధూవరుల మధ్య అడ్డంగా తెరకట్టడం, తలంబ్రాలు పోసుకోవడం ఇవన్నీ తెలుగువారి ఆచారాల నుంచి వచ్చినవే. వాస్తు శిల్పాల్లోనూ ఈ మిశ్రమ విధానం కనిపిస్తుంది.

కుతుబ్‌షాహీలు పర్షియా నుంచి వచ్చారు. వీరు షియా తెగకు చెందినవారు. తమ మత సంప్రదాయం ప్రకారం పరమత సహనం పాటించారు. సున్నీలను, తెలుగువారిని చిన్నచూపు చూడలేదు. మతయుద్ధాలు చేయలేదు. కులీకుతుబ్‌షా మొహర్రం పండుగను ప్రవేశపెట్టాడు. ఇతడే పీర్ల చావడులను, హుస్సేనీ ఆలంను నిర్మించాడు. షియాలు, సున్నీల మధ్య వైషమ్యాలు కొంత కాలం కొనసాగాయి. బహమనీల కాలంలో ముస్లింలు, ఉర్దూభాష తెలంగాణకే పరిమితం కాగా, కుతుబ్‌షాహీల కాలంలో ఇతర తెలుగు ప్రాంతాలకు కూడా విస్తరించడం నూతన పరిణామం.

కుతుబ్‌షాహీల చిత్రకళ

కులీకుతుబ్‌షా, ఇతర నవాబులు ఢిల్లీ నుంచి చిత్రకారులను రప్పించి పోషించారు. మొగల్ చిత్రకారుల సాన్నిహిత్యంతో కొత్త శైలి రూపు దిద్దుకుంది. దాన్నే దక్కన్ కలం అంటారు. దక్కనీ శైలి సృష్టికర్త మీర్ హసీం. అబ్దుల్లా, తానీషాల కాలంలో ఈ శైలి మరింత వృది చెందింది.

భాషా సాహిత్యాలు

ఈ కాలంలో ఉర్దూ 'దక్కనీ ఉర్దూ'గా పేరొందింది. దాని ప్రాభవం ఉచ్ఛస్థితికి చేరింది. హైదరాబాద్‌లో 38 వేల పుస్తకాలున్న గ్రంథాలయం ఉండేది.

కుతుబ్‌షాహీలు తెలుగులో శాసనాలు వేయించారు. తెలుగు భాషను, కవులను, సంస్కృతిని ఆదరించారు. ఉర్దూలో కవిత్వం రాశారు. జమ్షీద్ కుతుబ్‌షా (1543–50) స్వయంగా కవి. గజల్‌లు, గేయాలు రాశాడు. ఇబ్రహీం కుతుబ్‌షా (1550–80) విజయనగర రాజుల దగ్గర ఏడేళ్లపాటు ఆశ్రయం పొందాడు. ఆ సమయంలోనే తెలుగు నేర్చుకున్నాడు. తెలుగు సాహిత్యంలో మల్కిభరాముడిగా ప్రసిద్ధి చెందాడు. ఇతడి దర్బారులో ఉమర్ షా మహ్మద్ అంజూ, అమీర్ ఇమాదుద్దీన్, మహమూద్ షిరాజీ, జావీ నవీసుల్, జమాఖాసిం బేగ్ షిరాజీ, హుస్సేన్ కులీమీర్జా మొదలైన పండితులుండేవారు. అద్దంకి గంగాధరుడు, మరింగంటి సింగరాచార్యులు, కందుకూరి రుద్రకవి తదితర తెలుగు కవులను ఇబ్రహీం కుతుబ్‌షా పోషించాడు. తెలుగు వనిత అయిన భాగీరథిని ఇతడు వివాహమాడాడు. తారిఖ్ కుతుబ్‌షాహి గ్రంథ రచయిత కుర్షాబిన్ కబ్బాదుల్ హుసేన్ ఇతడి కాలానికి చెందినవాడే. ఈ యుగంలో కనిపించే తొలి కవి చరిగొండ ధర్మన్న. ఇతడు పెద్దన, సూరన, నందిఘంట కవుల కంటే ముందే రుతువర్ణన, నాయికా వర్ణన, వేటవర్ణన లాంటి అష్టాదశ వర్ణనలు చేశాడు. దీన్ని బట్టి ధర్మన్నను ప్రబంధ కవిత్వ మార్గదర్శకుడిగా చెప్పవచ్చు. కల్పిత కథ ఆధారంగా ఇతడు చిత్రభారతాన్ని రచించాడు. గయోపాఖ్యానం, కృష్ణార్జున యుద్ధం లాంటి యక్షగానాలు రావడానికి చిత్ర భారతమే మూలం. మహబూబ్‌నగర్ (చరిగొండ సీమ)కు చెందిన ధర్మన్న కరీంనగర్ జిల్లాలోని ధర్మపురి వెళ్లి, ఎనుముల పెద్దన దగ్గర ఆశ్రయం పొందాడు. చిత్రభారతాన్ని అతడికే అంకితమిచ్చాడు. ఇందులో నాటి చారిత్రకాంశాలు కనిపిస్తాయి. చరిగొండ ధర్మన్న సోదరుడు చరిగొండ నరసింహకవి. ఇతడు కూడా కవే. పింగళి సూరన కంటే ముందే సూరన అనే మరో కవి కల్పిత కావ్యం (ధనాభిరామం) రాశాడు. పోశెట్టి లింగ కవి నవచోళ చరిత్ర, మల్హణ చరిత్ర, శంకర దాసమయ్య చరిత్ర, వీర సంగమయ్య దేవ చరిత్ర, శిష్య ప్రబోధం అనే ద్విపద కావ్యాలను రాశాడు. పోశెట్టి అనే పేరు ఇప్పటికీ తెలంగాణలో వాడుకలో ఉంది. ఈ కావ్యంలోని కైకిలి(దినసరి కూలి), కొండెంగ, మోటు, ఉరువడి, పుటిక, తునక తదితర పదాలు తెలంగాణాలోనే వాడుకలో ఉన్నాయి. అందువల్ల ఇతడు తెలంగాణకు చెందినవాడే కావచ్చు. ఆసూరి మరింగంటి సింగరాచార్యులు దశరథ రాజనందన చరితను రచించాడు. ఇది తెలుగు సాహిత్యంలో తొలి నిరోష్ఠ్య రచన. ఇతడే తొలిసారిగా అచ్చ తెలుగులో సీతాకల్యాణం అనే నిరోష్ఠ్య రచన చేశాడు. తొలి త్ర్యర్థి, చతురర్థి (నలరాఘవయాదవపాండవీయం) రచన కూడా ఇతడిదే. తిరునామరచనకు కూడా సింగరాచార్యులే ఆద్యుడు. ఇతడు ఇబ్రహీం కుతుబ్‌షా నుంచి అగ్రహారాన్ని పొందాడు. మల్కిభరాముడి (ఇబ్రహీం కుతుబ్‌షా) మరో ఆస్థాన కవి అద్దంకి గంగాధరుడు (1525–80). ఇతడిని రామరాజభూషణుడితో పోల్చవచ్చు. ఇతడు 'తపతీ సంవరణోపాఖ్యానం'ను రచించి, ఇబ్రహీం కుతుబ్‌షాకు అంకితమిచ్చాడు. ఈ కావ్యంలో మల్కిభరాముడి ప్రేమ కథను వర్ణించాడు. ఈ శృంగార కావ్యంలో సమకాలీన సాంఘిక విశేషాలెన్నో కనిపిస్తాయి. సిద్ధరామకవి, గంగాధరుడి సమకాలికుడు. ఇతడు ప్రభుదేవర వాక్యం అనే వేదాంత వచన గ్రంథాన్ని రచించాడు. స్తుతి వచన ప్రక్రియకు ఆద్యుడు కృష్ణమాచార్యుడు. శివస్తుతి వచనాలకు ఆద్యుడు గంగాధరయ్య. వీరిద్దరూ తెలంగాణ వారే. మరింగంటి జగన్నాథాచార్యులు (శ్రీరంగనాథవిలాసం), అప్పలాచార్యులు కూడా మల్కిభరాముడి వద్ద ఆశ్రయం పొందారు. కందుకూరి రుద్రకవి ఈ యుగంలోని అగ్రశ్రేణి కవుల్లో ఒకడు. ఇబ్రహీం కుతుబ్‌షా దేవరకొండ దుర్గపాలకుడిగా ఉన్నప్పుడే ఇతడికి కుతుబ్‌షాతో పరిచయం ఉంది. కుతుబ్‌షా రాజైన తర్వాత అతడి నుంచి రెంటచింతల (ద్వితింత్రిణి)ను అగ్రహారంగా పొందాడు. ఇతడు నల్లగొండ జిల్లా దేవరకొండ సమీపంలోని కందుకూరుకు చెందినవాడని తెలుస్తోంది. ఇతడు 'సుగ్రీవ విజయం'ను రచించాడు. దీన్ని తొలియక్షగానంగా భావిస్తారు. నిరంకుశోపాఖ్యానం, జనార్ధనాష్టకం, బలవదరీ శతకం, జనార్ధనాష్టక స్తోత్రం, గువ్వలచెన్నని శతకం తదితర గ్రంథాలను రుద్రకవి రచించాడు. ఇతడి రచనల్లో నిరంకుశోపాఖ్యానం ముఖ్యమైంది. ఇది శృంగార ప్రధాన సాంఘిక కావ్యం. ఇందులో నాటి సాంఘిక జీవనాన్ని చిత్రీకరించారు. మల్కిభరాముడి అనుచరుడైన అమీన్ ఖాన్ తొలి అచ్చతెలుగు కావ్యకర్త పొన్నిగంటి తెలగనను ఆదరించాడు. అప్పటి వరకు కవులు అచ్చ తెలుగులో పద్యాలు మాత్రమే రాశారు. కావ్యాలను రాయలేదు. తెలగన అచ్చ తెలుగు కావ్యం రాసి, పాల్కురికి దేశిమార్గాన్ని సుసంపన్నం చేశాడు.

What is N's position with respect to K?



BANK EXAMS

REASONING

MODEL QUESTIONS

FDirections (Q. No. 1-2): Study the given information carefully and answer the given questions.

Twenty students are standing in a straight line, facing north. Rina is standing sixth from the left end. There are only three students between Rina and Shweta. Radha is standing exactly between Shweta and Rina. Tina is standing sixth to the right of Radha. Anita is standing fourth from the right end of the line. There are more than four students between Rina and Tina.

1. How many people are standing between Anita and Tina?
   1) One 2) Two 3) Three
   4) None 5) More than three
2. What is Shweta's position with respect to Anita?
   1) Sixth to the left
   2) Eighth to the left
   3) Seventh to the left
   4) Ninth to the left
   5) None of these
3. Which of the following will come in place of the question mark (?) in the following series based on the English alphabetical order?
   ZYW VUS RQO ? JIG
   1) KMN 2) MNK 3) NLK
   4) NMK 5) NML

Directions (Q. No. 4-8): Study the given information carefully and answer the given questions.

Eight people J, K, L, M, N, O, P and Q are sitting around a circular table, facing the centre, not necessarily in the same order. O is sitting third to the right of M. There is only one person sitting between M and J. There are only three people between J and K. P is an immediate neighbour of J. There are only three people between P and L. N is second to the right of P.

4. Which of the following is true regarding the given arrangement?
   1) M is an immediate neighbour of K.
   2) N is an immediate neighbour of J.
   3) P is second to the left of O.
   4) There are four people between N and O.
   5) None is true
5. Who is sitting second to the left of the one who is sitting second to the left of Q?
   1) M 2) K 3) N 4) L 5) J
6. Four of the following five are alike in a certain way based on their seating positions in the above arrangement and so form a group. Which does not belong to the group?
   1) PQ 2) KL 3) MN
   4) QO 5) KO
7. What is N's position with respect to K?
   1) Second to the left
   2) Second to the right
   3) Third to the left
   4) Third to the right
   5) Fourth to the left
8. How many people are sitting between K and P when counted from the right side of K?
   1) One 2) Two 3) Three
   4) None 5) More than three

Directions (Q. No. 9-13): Study the given information carefully and answer the given questions.

Auditions for a show were held in seven different cities of India - Chennai, Bangalore, Cochin, Mumbai, Delhi, Bhopal and Kolkata - not necessarily in the same order during the first seven months of the year 2011 (starting in January and ending in July). The auditions were held only in one city during a month. Auditions in only four cities were held between the Kolkata audition and the Cochin audition. The Kolkata audition was not held in June. Only one audition was held between the Kolkata audition and the Bangalore audition. The Chennai audition was held immediately after the Kolkata audition. The Delhi audition was held immediately before the Bhopal audition. The Bhopal audition was not held in May.

9. How many auditions were held between the Mumbai audition and the Chennai audition?
   1) One 2) Two 3) Three
   4) None 5) More than three
10. Which of the following statements is true according to the given sequence?
    1) Mumbai audition was held in July.
    2) Delhi audition was held in April.
    3) Cochin audition was held before May.
    4) Kolkata audition was held in January.
    5) None is true
11. Four of the following five are alike in a certain way based on the given sequence and hence form a group. Which does not belong to the group?
    1) January - Kolkata
    2) March - Bangalore
    3) June - Cochin
    4) May - Delhi
    5) February - Chennai
12. During March, the audition was held in which of the following cities?
    1) Bangalore 2) Kolkata
    3) Mumbai 4) Chennai
    5) None of these
13. The audition in Mumbai was held in which of the following months?
    1) July 2) May 3) February
    4) March 5) None of these

Directions (Q. No. 14-16): Read the following information carefully and answer the questions that follow.

Saurabh, Raman, Sushant, Shoumya, Anu and Swati are six friends. Each of them has a different weight, Anu's weight is more than Saurabh's but less than Shoumya's. Only one person is heavier than Sushant. The one whose weight is second lowest is 46 kg and Sushant's weight is 58 kg. Shoumya is not the heaviest. Swati is not heavier than Saurabh.

14. Whose weight is the second highest?
    1) Shoumya 2) Raman
    3) Sushant
    4) Can't be determined
    5) None of these
15. If Sushant is 8 kg heavier than Anu, what is the possible weight of Shoumya?
    1) 47 kg 2) 44 kg 3) 55 kg
    4) 60 kg 5) None of these
16. Which of the following statements is true?
    1) Raman's weight is 56 kg.
    2) Swati is heavier than Anu.
    3) Raman is the heaviest.
    4) Shoumya is the heaviest.
    5) None of these


Directions (Q. No. 17-23): Study the following information carefully and answer the given questions.

Eight friends O, P, Q, R, Z, T, U and V are sitting around a circle, facing the centre, but not necessarily in the same order. P is second to the left of U, who is fourth to the right of Q. V is opposite O, who is second to the right of Z. O is not an immediate neighbour of P or U. R is an immediate neighbour of Q.

17. Who among the following is opposite Z?
    1) Q 2) R 3) P 4) T 5) O
18. Starting from O, if all the friends are made to sit in alphabetical order in clockwise direction, the position of how many (excluding O) will remain unchanged?
    1) One 2) Two 3) None
    4) Three 5) None of these
19. Who among the following sits third to the left of U?
    1) O 2) T 3) Q 4) R 5) Z
20. Which of the following pairs are the immediate neighbours of T?
    1) O, Z 2) Q, P 3) Z, V
    4) R, O 5) None of these
21. If the places of O and V are interchanged, who is third to the right of Q?
    1) V 2) O 3) Z 4) T 5) P
22. Which of the following is true, with respect to the given seating arrangement?
    1) O sits on the immediate right of Z.
    2) U sits exactly between V and P.
    3) Z sits second to the right of V.
    4) Q is an immediate neighbour of P.
    5) None of these
23. T is related to P in a certain way. Similarly, Q is related to U, according to the given seating arrangement. Who among the following is related to Z, following the same pattern?
    1) Q 2) P 3) V 4) O 5) R

Answers, Explanations

(1-3):




Anita is 4th from the right end.

Thus, in the row, Anita's position from the left end
(20 + 1- 4) = 17th

1. 2
2. 3
3. 4; Move four letters backwards in the alphabet for the corresponding letter of the next tern.

4 - 8:



Month	City
January	Mumbai
February	Kolkata
March	Chennai
April	Bangalore
May	Delhi
June	Bhopal
July	Cochin

4. 2
5. 1
6. 5
7. 3
8. 2

(9 - 13):

9. 1
10. 5
11. 4
12. 4
13. 5

(14 -16):

Raman > Sushant > Shoumya > Anu > Saurabh > Swati

58 kg 46 kg

14. 3
15. 3;

Anu's weight = 58 - 8 = 50 kg
Shoumya's weight lies between Anu's and Sushant's. Thus, the possible weight of Shoumya is 55 kg.

16. 3

(17-23):

17. 2
18. 3
19. 4
20. 1
21. 2
22. 3
23. 5

